శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము

వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

8వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-8

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

బ్రహ్మణ్యో బ్రహ్మకృద్బ్రహ్మ బ్రహ్మ బ్రహ్మవివర్ధనః |
బ్రహ్మవిద్బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః || (71)

పవిత్రమైన ఈ పుణ్యశ్లోకము దశవిధ బ్రహ్మనామములతో ప్రసిద్ధమగుచున్నది. కొండచరియలనుండి దివ్యనాదములతో జలజల పారు సెలయేటిస్రోతలవలె మనోజ్ఞములగు శబ్దాలంకార శోభలతో వెలుగందుచున్న దివ్యశ్లోకములలో నిదియొకటి. ఉచ్చారణమాత్రము చేతనే వాక్శుద్ధి కలుగును. తద్వారా చిత్తశుద్ధియును కలుగును (శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి).

ఈ శ్లోకంలోని నామముల అర్థాలను తెలుసుకొనేముందుగా 'బ్రహ్మ' అనే పదమును కొంచెం పరిశీలించడం మంచిది. ఈ పదానికి మూలధాతువు 'బ్రహ' – అనగా చాలా పెద్ద, గొప్ప, శక్తివంతమైన, వృద్ధిగల - వంటి అర్థాలున్నాయి. **తపో వేదశ్చ విప్రశ్చ జ్ఞానమ్ చ బ్రహ్మసంజ్ఞితమ్.** బ్రహ్మ అనగా తపస్సు, వేదములు, పండితులైన బ్రాహ్మణులు, జ్ఞానము వంటి అర్థాలున్నాయి. జగత్ప్రభువు, వేదము, ప్రకృతి, ఆత్మ (జీవుడు) వంటి అర్థాలు కూడా ఉన్నాయి. 'జీవుడు' అనే అర్థాన్ని భగవద్రామానుజుల సంప్రదాయంలో విశేషంగా గ్రహిస్తారు. ఎందుకంటే జీవుడు స్వతస్సిద్ధముగా అనంతశక్తిమంతమైన బ్రహ్మముకంటె వేరుకాదు. జీవుడు శరీరంలో బద్ధుడైయున్నందున తాత్కాలికముగా జీవునికి పరిమితులు ఏర్పడుతాయి. ఆత్మ నిజానికి అనంతవ్యాప్తి (infinite extensiveness) గుణమును కలిగిఉంది కాని శరీరబద్ధమైనందున ఆయా పరిమితులు సంక్రమిస్తాయి.

'బ్రహ్మ' అనే పదాన్ని నామవాచకంగా తీసుకుంటే త్రిమూర్తులలో ఒకరైన 'చతుర్ముఖ బ్రహ్మ'ను సూచిస్తుంది. మరియు చతుర్ముఖబ్రహ్మను సృష్టించే విషయంలో శ్రీమహావిష్ణువును సూచిస్తుంది.

ఈ శ్లోకంలోని వేరువేరు నామముల వ్యాఖ్యలు పైన చెప్పిన వివిధ అర్థాలపై ఆధారితమై ఉన్నాయి. భాష్యకారుల దృక్పథాలనుబట్టి వ్యాఖ్యానాలలో భేదాలను గ్రహింపవచ్చును.

667. బ్రహ్మణ్య

- అచేతన, చేతనములకు, అనగా ప్రకృతి, ఆత్మలకు హితము కూర్చువాడు.
- తపమునకు, వేదములకు, విప్రులకు, జ్ఞానమునకు హితము కూర్చువాడు.

ఓం బ్రహ్మణ్యాయ నమః

పాణిని అష్టాధ్యాయి (5-1) సూత్రములు 4 నుండి 7 వరకు – 'యత్' అను ప్రత్యయమువలన 'మంచిచేయుట' అనే అర్థం వస్తుంది. ముఖ్యంగా 5.1.7 సూత్రము – **ఖల యవ మాష తిల వృష బ్రహ్మణః చ (యత్)**. కనుక 'బ్రహ్మణ్య' అనగా 'బ్రహ్మన్'కు మంచి చేయువాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – జీవునకు, ప్రకృతికిని హితము కూర్చువాడు బ్రహ్మణ్యుడు.

జీవాత్మా ప్రకృతిశ్చాపి బ్రహ్మేతి వ్యపదిశ్యతే
తాభ్యాం యస్థితి భోగాదే సర్వావస్థాను కారణమ్
బ్రహ్మణ్య స్స చ విజ్ఞేయః సప్తార్ణో భోగదాయకః

జీవాత్మ, ప్రకృతి రెండూ 'బ్రహ్' అనబడతాయి (చాలా పెద్దవి, విశాలమైనవి, విస్తారమైనవి, శక్తివంతమైనవి). ఆరెండింటియొక్క స్థితికి, భోగానికి కారణమైనవాడు. ఈ నామము సప్తాక్షరీమంత్రము. భోగప్రదము. ఓం బ్రహ్మణ్యాయ నమః.

ప్రకృతి, జీవుడు, పరమాత్మ (అన్నీ బ్రహ్మములే) ఎంత బృహత్తరములైనవో శ్రీ నమ్మాళ్వారు చెప్పారు. తిరువైమొళి 10.10.10 – మహత్తు, అహంకారాదులుగా రూపొంది విశ్వమంతా వ్యాపించిన అనంత మూలప్రకృతికి అంతరాత్మయైనవాడా! మూలప్రకృతికంటే విస్తారమైనదానిని అధిగమించి అవతరించిన మరియు జ్ఞానానంద తేజోమయమైన జీవాత్మకు అంతరాత్మయైనవాడా! ఈ రెండింటిని ఆవరించి ప్రకాశించే సచ్చిదానంద సంకల్ప జ్ఞానస్వరూపుడా! నీలో లీనం అవ్వాలనే నా కోరిక నీ సంకల్పజ్ఞానముకంటే బలీయమైనది. కాని ఇప్పుడు నీవు నన్ను నీలో లీనం చేసుకొంటున్నావు. అనంతామృతసాగరంలో నేనొక బిందువును. నా కోరిక నెరవేరింది.

ఈ పాశురంలో మొదటిపంక్తి ప్రకృతియొక్క బృహద్గుణాన్ని సూచిస్తుంది. రెండవపంక్తి ఆత్మజ్ఞానంయొక్క బృహద్గుణాన్ని సూచిస్తుంది. మూడవపంక్తి ఆత్మయొక్క బృహద్గుణాన్ని సూచిస్తుంది. బ్రహ్మమును పరమాత్మునిగా భావిస్తే గనుక తనకు చిత్, అచిత్ అనే భేదాలున్నాయి (చేతన, అచేతన శరీరాలున్నాయి).

బ్రహ్మమును ప్రకృతిగా భావిస్తే తనకు అచిత్ (insentiency) అనే గుణం మాత్రమే ఉంది. బ్రహ్మమును ఆత్మ (జీవుని)గా భావిస్తే తనకు చిత్ (consciousness) అనే గుణం మాత్రమే ఉంది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'బ్రహ్మ' అనగా తపము, వేదములు, విప్రులు, జ్ఞానము. **తపో వేదాశ్చ విప్రాశ్చ జ్ఞానంచ బ్రహ్మసంజ్ఞితమ్.** వీటన్నింటికీ మేలు కూర్చువాడు బ్రహ్మణ్యుడు. మత్స్యావతారుడై వేదములను రక్షించినవాడు. నారాయణుడై తపోమార్గమును తెలియజేసినవాడు. అనేక అవతారములెత్తి విప్రులను కాచినవాడు. గీతను బోధించి జ్ఞానమును ప్రసాదించినవాడు. బ్రహ్మణ్యుడు. ఇవి శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఇచ్చిన ఉదాహరణలు.

భగవానుని బ్రహ్మణ్యమునకు వివిధ వ్యాఖ్యాతలు మరికొన్ని ఉదాహరణలు ఇచ్చారు.
శ్రీ కృష్ణదత్త భరద్వాజ – భగవానుడు శ్రీకృష్ణుడై రాజసూయసమయంలో బ్రాహ్మణులకు పాదపూజ చేశాడు.
శ్రీ బలదేవ విద్యాభూషణ – భగవానుడు శ్రీకృష్ణుడు తన గురువుయొక్క పుత్రుని యమలోకంనుండి తెచ్చియిచ్చాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుడు పెద్దవాడు (బృహత్). మరియు తన భక్తులను రక్షించి వారికి భోగైశ్వర్యములిచ్చి వారిని గొప్పవారిగా చేస్తాడు. కనుక బ్రహ్మణ్యుడు.

668. బ్రహ్మకృత్ బ్రహ్మ

బ్రహ్మకృత్

బ్రహ్మ

శ్రీ భట్టులు 'బ్రహ్మకృత్ బ్రహ్మ' ఒకే నామముగా పరిగణించారు. శ్రీ శంకరులు 'బ్రహ్మకృత్', 'బ్రహ్మ' అనే రెండు నామములుగా పరిగణించారు.

బ్రహ్మకృత్ బ్రహ్మ

సృష్టికర్తయైన బ్రహ్మను సృష్టించినవాడు.

ఓం బ్రహ్మకృత్ బ్రహ్మణే నమః

శ్రీ భట్టులు ఈ నామవివరణలో 'బ్రహ్మ' అనగా 'పెద్ద' అనే అర్థాన్ని గ్రహించారు. అఖిల జగాలను (అనగా చాలా పెద్దవాటిని) సృష్టించే చతుర్ముఖబ్రహ్మయే 'బ్రహ్మకృత్'. ఆ (చతుర్ముఖ)బ్రహ్మను సృష్టించే భగవానుడు 'బ్రహ్మకృత్ బ్రహ్మ'.

శ్రీ నమ్మాళ్వార్. తిరువైమోళి 2.2.4 – ఈ దేవదేవుడు చతుర్ముఖబ్రహ్మను సృష్టించాడు. ఆ చతుర్ముఖబ్రహ్మ అన్నింటినీ, దేవతలను, చేతనాచేతనములను సృష్టించాడు.

మహదాది తమః కార్యం బ్రహ్మేతి అభిధీయతే
తస్య కర్తా స్వయం బ్రహ్మ నియామ్యే యస్య సర్వదా
సతుస్యాద్బ్రహ్మకృద్బ్రహ్మ నవార్ణః సర్వశక్తిదః
మహదాది వికారాలకు (చాలా పెద్దవాటికి) 'బ్రహ్' అని పేరు. ఆ వికారాలను పుట్టించేవాడుకూడా బ్రహ్మ. అటువంటి చతుర్ముఖబ్రహ్మ తన అధీనమున గలవాడు. ఈ నామము నవాక్షరీ మంత్రము. సర్వశక్తిప్రదము. (శ్రీకైవల్యసారధి నుండి). ఓం బ్రహ్మకృత్ బ్రహ్మణే నమః.

బ్రహ్మకృత్

బ్రహ్మను (తపో వేదాదులను) కలిగించువాడు.

ఓం బ్రహ్మకృతే నమః

'బ్రహ్మ' అనగా తపస్సు, వేదములు, విప్రులు, జ్ఞానము. వీనికి కర్త అయినవాడు 'బ్రహ్మకృత్'.

శ్రీ చిన్మయానంద – బ్రహ్మతపమును ఆచరించేవాడు బ్రహ్మకృత్.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **బ్రహ్మ కరోతి బ్రహ్మచర్యలక్షణమ్ తపశ్చరతి ఇతి బ్రహ్మకృత్**.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుడు తన భక్తులను గొప్పవారిగా (పెద్దగా) చేయును కనుక బ్రహ్మకృత్. మరియు ఆయన చతుర్ముఖబ్రహ్మను, వేదములను, బ్రాహ్మణులను, తపస్సును సృష్టించెను.

బ్రహ్మ

సృష్టికర్తయైన (చతుర్ముఖ) బ్రహ్మ

ఓం బ్రహ్మణే నమః

సృష్టికర్తయైన చతుర్ముఖబ్రహ్మ భగవానుని రూపమే గనుక బ్రహ్మ.

669. బ్రహ్మ

- పరబ్రహ్మ.
- అపరిమిత కళ్యాణగుణవర్ధనుడు.

- అగోచరమయిన జ్ఞానము.

ఓం బ్రహ్మణే నమః

ఇక్కడ 'బ్రహ్మ' అనగా 'చాలా పెద్ద' అన్న అర్థంలో వ్యాఖ్యాతలు ఈ నామమును వివరించారు. భగవంతుడు చాలా పెద్ద. ఆయన చేసేదంతా చాలా పెద్ద. ఆ పెద్ద ఏమిటి? భగవంతుని 'పరత్వము' బ్రహ్మమని శ్రీ శంకరులు, ఆయన మార్గాన్ని అనుసరించిన వ్యాఖ్యాతలు చెప్పారు. భగవంతుని అపరిమిత కళ్యాణ గుణములకు శ్రీ భట్టులు, మరియు ఆయన దృక్పథాన్ని అనుసరించినవారు ప్రత్యేకంగా అద్దం పట్టారు.

ఈ నామమునకు మూలధాతువు 'బృహ్' అనగా పెరుగుట, వృద్ధిచెందుట. **బృహత్వాత్ బ్రహ్మణత్వాచ్చ బ్రహ్మేతి పరికీర్త్యతే.** ఆయన బృహద్రూపుడు. బృహద్గుణుడు. అన్నీ తానైనవాడు. అంతటా తానుండేవాడు. అంతా పెద్దగా చేసేవాడు. సంకల్పమాత్రాన సకల కార్యాలు చేసేవాడు (మరేవిధమైన తోడు, ఉపకరణం లేకుండా).

వ్యక్తావ్యక్త సమష్ట్యాది పురుషాంశ్చైవ నిత్యశః
గుణైశ్చ కళ్యాణతమైః బ్రహ్మ బ్రహ్మయతీతి చ
రూపై స్వరూపేణ గుణైః విభైశ్చ స్వయం ముహుః
బ్రహ్మేతి స తు వా బ్రహ్మ షడర్ణో సంతతిప్రదః.
వృష్టిరూపంగాను, సమిష్టిరూపంగాను ఉండే వ్యక్తావ్యక్త స్వరూపులైన చేతనులను తనయొక్క కళ్యాణ గుణముల చేత వృద్ధి పొందించేవాడు. తాను కూడా స్వరూప గుణ విభవాదులచేత మాటిమాటికీ అభివృద్ధి చెందే వేదాంతవేద్యుడు. ఈ నామము షడక్షరి. సంతానకరము (శ్రీకైవల్యసారధి నుండి). ఓం బ్రహ్మణే నమః.

భగవంతుడు బద్ధజీవులైన సంసారులను ఉద్ధరించి నిత్యసూరులుగా చేసే కరుణామయుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **బ్రహ్మయతి ప్రజాః స్వ దయాదృశా ఇతి బ్రహ్మ.** తన కటాక్షముచే భక్తులను ఉద్ధరించేవాడు బ్రహ్మ.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **బృహత్వాత్ బ్రహ్మ.** పెద్దతనము కారణమున బ్రహ్మ. విష్ణుపురాణం (6.7.53)లో – **సత్తా మాత్రమ్ అగోచరమ్ వచసామ్, ఆత్మసంవేద్యమ్, తద్ జ్ఞానమ్ బ్రహ్మ.** సంపూర్ణముగా సాత్వికమైనది, మాటలకు అందనిది, అనుభవముద్వారా మాత్రమే తెలుసుకొనదగినది అయిన జ్ఞానమే బ్రహ్మ.

అన్నింటికంటె స్థూలమైనది, అంతటా విస్తరించి వ్యాపించియున్నది, సత్యజ్ఞానాది లక్షణాలతో కూడియున్నది బ్రహ్మ.

670. బ్రహ్మవివర్ధనః

- ధర్మమును (తపస్సువంటి బ్రహ్మమును) వృద్ధిచేయువాడు.

- వస్తువులను గొప్పగా వృద్ధిచేయువాడు.

ఓం బ్రహ్మవివర్ధనాయ నమః

శ్రీ భట్టులు 'బ్రహ్మము' అనగా 'తపస్సు' అనే అర్థంలో ఈ నామాన్ని వ్యాఖ్యానించారు. తపస్సు అనగా ధర్మముకూడ. 'తపోబ్రహ్మ' అని శృతివాక్యము. **తపోబ్రహ్మ, తమ్ వివర్ధయతి ఇతి బ్రహ్మవివర్ధనః**. తపస్సు అనగా బ్రహ్మము. దానిని వర్ధిల్లజేయువాడు బ్రహ్మవివర్ధనుడు. శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఐతరేయబ్రాహ్మణము (7.22)నుండి **'బ్రహ్మ వై యజ్ఞః'** అని ఉదాహరించారు.

శ్రీ వి.వి. రామానుజన్ – తపస్సు అనగా ఐహికవ్యామోహమునుండి దూరమగుట. ఈ బంధాలనుండి విడివడినకొలదీ భగవంతుని ఆనంద స్వరూపము అవగతమవుతుంది.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – భగవంతుడు భక్తుల హృదయాలలో బ్రహ్మతత్వమును వృద్ధిపరచును గనుక బ్రహ్మవివర్ధనుడు. **బ్రహ్మతత్వమ్, తత్ విశేషేణ వర్ధయతే స్వజన హృదయేషు ఇతి బ్రహ్మవివర్ధనః.**

శ్రీ చిన్మయానంద – వేదము, సత్యము, జ్ఞానము, సత్కర్మలు, ఇవన్నీ బ్రహ్మమే. భక్తులలో వీటిని వృద్ధిచేయువాడు బ్రహ్మవివర్ధనుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – బ్రహ్మము అనగా చాలాపెద్దదైనది (బృహత్), అంతు చిక్కనిది. భవంతుడు వస్తువులను పెద్దగా వృద్ధిచేయువాడు గనుక బ్రహ్మవివర్ధనుడు. ఉదాహరణకు విత్తనమునుండి వృక్షమును, వృక్షమునుండి విత్తనాలను ఇలా అనంతంగా పెంపొందించువాడు భగవంతుడు. బ్రహ్మవివర్ధనుడు.

వివర్ధనమ్ విశ్వమిదమ్ సమస్తమ్ యతః స్వయమ్ బ్రహ్మవివర్ధనః సః
బీజాచ్చ వృక్షమ్ కురుతే వివృద్ధమ్ వృక్షాచ్చ బీజాన్ కురుతే బహూః సః

ధర్మచక్రము రచయిత వ్యాఖ్య – తపస్సు, దానము, యజ్ఞము కూడ బ్రహ్మస్వరూపములే. తపస్సుద్వారా వ్యక్తి తనను అభివృద్ధి చేసుకొనును. తన సంపదలు సమాజం కొఱకు త్యాగం చేస్తే అది దానము. తాను చేసే కర్మలన్నీ మనోవాక్కాయపూర్వకంగా స్వార్థం లేకుండా భగవంతునికి అర్పించడం యజ్ఞం. అలా చేస్తే భగవంతునిపై ధ్యాస లభిస్తుంది. ఇలా చేసే ప్రతి కర్మ తపస్సు, దానము, యజ్ఞము అవుతాయి. భగవంతుని ధ్యానిస్తే తపస్సు దానము, యజ్ఞము వర్ధిల్లుతాయి. కనుక శ్రీమహావిష్ణువు బ్రహ్మవివర్ధనుడు. భగవద్గీత శ్రద్ధాత్రయయోగములో సాత్విక తపస్సు, సాత్విక దానము, సాత్విక యజ్ఞము వివరించబడ్డాయి.

భగవంతుని శరణాగతి పొందినవారి తపస్సాధన మాత్రమే జయప్రదమగును. వేదవిచారణ సులభమగును. విప్రత్వము సిద్ధించును. ఆత్మజ్ఞానము అలవడును (శ్రీ పెమ్మరాజు రాజారావు).

671. బ్రహ్మవిత్

- వేదములను (బ్రహ్మమును) ఎరిగినవాడు.
- మత్స్యావతారమునెత్తి వేదములను కాపాడినవాడు.
- గొప్ప విషయాలను, దృశ్యాదృశ్యమైనవానిని ఎరిగినవాడు.

ఓం బ్రహ్మవిదే నమః

బ్రహ్మ వేత్తి ఇతి బ్రహ్మవిత్ – బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మవిత్.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు ఈ నామములో 'బ్రహ్మ' అనగా వేదములు అనే అర్థాన్ని గ్రహించారు.
అనంతా వై వేదాః వేదములు అనంతములు.
అనాది నిధనమ్ బ్రహ్మ న దేవా న ఋషయో విదుః
ఏకస్తత్ వేద భగవాన్ ధాతా నారాయణః స్వయమ్ – మహాభారతము. మోక్షపర్వము 380.19
వేదములు ఆది, అంతము లేనివి. దేవతలుగాని, ఋషులుగాని వాటిని పూర్తిగా తెలిసికొనలేరు. సృష్టికర్తయైన భగవన్నారాయణుడు మాత్రమే స్వయముగా వానినెఱిగినవాడు.

వేదములు భగవంతుని తెలియజేయుచున్నవి. కనుక భగవంతుని పూర్తిగా తెలుసుకోవడం ఎలా సాధ్యం కాదో అలాగే వేదాలను పూర్తిగా తెలుసుకోవడం ఇతరులకు సాధ్యం కాదు. భగవంతునికే అది సాధ్యము. కనుక ఆయన వేదవిదుడు.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ
వేదైశ్చ సర్వైరహమేవవేద్యో వేదాన్తకృత్ <u>వేదవిదేవ</u> చాహమ్ – గీత 15.15
సమస్తప్రాణుల హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడను నేనే. నానుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహము తొలగించుట) కలుగుచున్నవి. వేదములద్వారా తెలిసికొనదగినవాడను నేనే. వేదాంతకర్తను, వేదజ్ఞుడను కూడా నేనే.

ఈ గీతాశ్లోక వ్యాఖ్యానంలో శ్రీభగవద్రామానుజులు ఇలా చెప్పారు – 'వేదములను తెలిసికోవడం' అంటే అగ్ని, వాయువువంటి ఇతరదేవతలు కూడా పూజించేది ఆయననే (**అహమ్ హి సర్వయజ్ఞానామ్ భోక్తా చ ప్రభురేవ చ**) అనియు, అన్ని సమర్పణలకు ఫలితాలనిచ్చేది ఆయనే (**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్**) అనియు, వేదములద్వారా తెలిసికొనవలసినది ఆయననే (**వేదైశ్చ సర్వైః అహమేవ వేద్య**) అనియు

తెలిసికోవడం. ఈ విషయాలు గ్రహించకుండా వేదాలను వేరేవిధంగా వివరించడానికి యత్నించేవానికి వేదాలు తెలియవన్నమాట.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – 'విద్'-లాభే - కనుగొనుట – **విశ్రమితాన్ ఉరుభయే సలిలే ముఖాత్ మే ఆదాయ తత్ర విజహార హ వేదమార్గాన్** (మహాభాగవతం 2.7.12). బ్రహ్మ ఇలా అన్నాడు – మహాప్రళయానంతరం నా చుట్టూ ఉన్న జలరాశినిచూచి నేను భయపడ్డాను. నా ముఖంనుండి వెలువడిన వేదాలను ఆ ప్రభువే కాపాడాడు – శ్రీ మత్స్యావతారుడై వేదములను కాపాడిన దేవుడు వేదవిత్. అనగా బ్రహ్మవిదుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'బ్రహ్మ'- చాలా పెద్దది. కనుపించేది లేదా కనుపించనిది. ఇవన్నీ జ్ఞానంద్వారా మాత్రమే తెలియవచ్చును. వాటిని పూర్తిగా తెలిసినవాడు బ్రహ్మవిదుడు. **వివృద్ధమ్ వివర్ధనమ్ వా బ్రహ్మ, దృశ్యమ్ అదృశ్యమ్ జ్ఞానమాత్ర గమ్యమ్ చ యత్, తత్ సర్వమ్ కో వేత్తి ఇతి ప్రశ్నే వక్తుమ్ శక్యతే, స ఏవ సర్వస్య ఆధారో భగవాన్ విష్ణుః వేత్తి ఇతి, తస్మాత్ బ్రహ్మవిత్.**

ధర్మచక్రము రచయిత – ప్రకృతి, జీవుడు, పరమాత్ముడు – వీనిమధ్య భేదములను గురించి తెలుసుకోవడం వేదజ్ఞానానికి అత్యావశ్యకం. ముఖ్యముగా జీవునికి భగవంతునికి తేడా తెలుసుకోవడం. రాముడు, కృష్ణుడు వంటి అవతారపురుషుల జీవితాలను సామాన్యమానవచరిత్రలుగా విశ్లేషించేవారు వేదాలనుగురించి ఏమీ తెలియనివారన్నమాట. ఎందుకంటే వారికి జీవాత్మ, పరమాత్మల మధ్య భేదం తెలియదు. రాముడు, కృష్ణుడు వంటివారు పురుషులు కారు. పురుషోత్తములు. త్రిగుణాతీతులు. వారికి సామాన్యమైన పరిమితులు వర్తించవు. వేదజ్ఞానంలో ఇది తెలిసికొనవలసిన విషయం.

672. బ్రాహ్మణః

వేదములను బోధించువాడు.

ఓం బ్రాహ్మణాయ నమః

బ్రహ్మ నయతి, అణతి ఇతి బ్రాహ్మణః, వేదములను బోధించువాడు, వల్లించువాడు బ్రాహ్మణుడు – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

దత్తాత్రేయాది రూపేణ హ్యుదీర్ణో బ్రాహ్మణ స్మృతః
పఠనాద్వాథ వేదస్య బ్రాహ్మణః పరికీర్తితః.

దత్తాత్రేయుడు మొదలైన బ్రాహ్మణుల రూపంలో అవతరించినవాడు. నిత్యము వేదపారాయణ చేయువాడు బ్రాహ్మణుడు.

అమరకోశము వ్యాఖ్యానము ప్రకారము బ్రాహ్మణునకు ఆరు కర్తవ్యాలున్నాయి. యజనము (యజ్ఞము చేయుట), యాజనము (యజ్ఞము చేయుటకు సహకరించుట),అధ్యాపనము (వేదములను పఠించుట), దానము (ఇచ్చుట), ప్రతిగ్రహణము (స్వీకరించుట).

బ్రాహ్మణుని లక్షణములను ధర్మచక్రము రచయిత ఇలా వివరించారు – బ్రాహ్మణుడు బ్రహ్మతత్వమును ఎరిగియుండవలెను. బ్రహ్మమును సేవించుటకు జీవితమును అంకితము చేయవలెను. శరీరము, సంపదలపై వ్యామోహము కలిగియుండరాదు. భగవంతుని కళ్యాణగుణములపై అచంచలవిశ్వాసము కలిగియుండవలెను. మనస్సును, వాక్కును, కర్మను భగవంతునకు అంకితము చేయవలెను. ప్రతిపని భగవంతుని సేవలోను, భగవంతుని భక్తుల సేవలోను ఆచరించవలెను. మనసును, ఇంద్రియములను నిగ్రహించుకొనవలెను. మనోవాక్కాయకర్మలను సాత్వికతతో నింపుకొనవలెను. కష్టములను సహింపవలయును. ఇతరులకు కీడు చేయరాదు. వేదములపట్ల, శాస్త్రములపట్ల, భగవంతునిపట్ల చెదరని విశ్వాసము కలిగియుండవలెను. వేదములను అభ్యసింపవలెను, ఇతరులకు బోధింపవలెను. ఆ కార్యములందు ఆనందము పొందవలెను. నీతి, ప్రేమ అనే గుణములతో సాత్విక జీవనము సాగింపవలెను.

శమోదమస్తపః శౌచం క్షాంతి రార్జవ మేవచ
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మస్వభావజం – గీత 18.42

(1) శమము (2) దమము (3) తపస్సు (4) శౌచము (5) ఓర్పు (6) ఋజుప్రవర్తనము (7) శాస్త్రజ్ఞానము (8) అనుష్ఠానవేదాంతము (9) భగవద్విశ్వాసము అను ఈ నవవిధ లక్షణములు కలవాడే బ్రాహ్మణుడు.

673. బ్రహ్మీ

- ప్రమాణము, ప్రమేయము అనే సమస్తము తనయందే కలిగియున్నవాడు. ప్రకృతి, పురుష, ఈశ్వర, వేదాది సమన్వితుడు.
- బ్రహ్మముతో కూడినవాడు. వేద తపో జ్ఞాన విప్ర సమన్వితుడు.
- నాభి కమలమున చతుర్ముఖబ్రహ్మను కలిగినవాడు.

ఓం బ్రహ్మిణే నమః

'బ్రహ్మ' పదమునకు 'ఇని' ధాతువు చేర్చుటవలన 'బ్రహ్మను కలిగియుండుట' అనే అర్థం వస్తుంది. పాణిని సూత్రము 'వ్రీహ్యాదిభ్యశ్చ' (5.2.116) మరియు 'నస్తద్ధితే' (6.4.144).

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము సమస్తమైన ప్రమాణము (అనగా జ్ఞానమునకు సాధనము) మరియు ప్రమేయము (జ్ఞానముయొక్క లక్ష్యము) తనయందే కలిగియున్నవాడు 'బ్రహ్మీ'. వేదములు ప్రమాణములు. ప్రకృతి, పురుషుడు, ఈశ్వరుడు మొదలగునవి ప్రమేయములు.

వేదములు, చతుర్ముఖబ్రహ్మ, బ్రాహ్మణులు (విప్రులు), తపస్సు మొదలగునవి భగవత్తత్త్వమును తెలిసికొను మార్గములు. ఇవన్నీ భగవంతునియందే ఉన్నందున ఆయన బ్రహ్మ.

స నాభి కమలే విష్ణోః స్థితో బ్రహ్మ ప్రజాపతిః. అని మార్కండేయపురాణం (7.8.51)లో ఉంది. నాభి కమలంలో చతుర్ముఖబ్రహ్మను కలిగియునందున విష్ణువు బ్రహ్మ.

ధర్మచక్రము రచయిత – పాంచభౌతికమైన ఈ దేహం మనుగడకు పంచభూతముల సహాయం అవుసరం. అలాగే మనలోనున్న పరమాత్ముని తెలిసికొనుటకు ఆయన కలిగియున్న వేదములు, విప్రులు, తపస్సు వంటివాని సహాయం కావాలి. వేదాలను పఠిస్తూ బ్రాహ్మణ ధర్మాన్ని అవలంబిస్తూ యోగసాధన చేస్తే భగవంతుని గురించిన జ్ఞానంవైపు పురోగమింపవచ్చును.

674. బ్రహ్మజ్ఞః

- వేదముల సారము (అంతరార్థము) పూర్తిగా తెలిసినవాడు.
- బ్రహ్మమునెరిగినవాడు.

ఓం బ్రహ్మజ్ఞాయ నమః

'బ్రహ్మ' అంటే వేదము. వేదముల అర్థము పూర్తిగా తెలిసినవాడు బ్రహ్మజ్ఞుడు. **యో వేదానర్థతో వేత్తి సోఽపి బ్రహ్మజ్ఞ విశ్రుతః.**

671వ నామము 'బ్రహ్మవిత్' అంటే కూడా బ్రహ్మమును తెలిసినవాడు అని అర్థము. ఈ రెండు నామాలకూ మధ్యనున్న భేదాన్ని వ్యాఖ్యాతలు సూచించినవిధం గమనించదగినది.

శ్రీ భట్టుల వ్యాఖ్యలు – **అనంతా వై వేదః, తాన్ అవధినా వేత్తి ఇతి బ్రహ్మవిత్.** వేదములు అనంతములు. వాటిని సంపూర్ణముగా (అవధులవరకు) ఎరిగినవాడు బ్రహ్మవిత్; **వేదాన్ అర్థపర్యంతమ్ సాక్షాత్కరోతి ఇతి బ్రహ్మజ్ఞః.** వేదములను, వాని అర్థమును, సారమును తెలిసినవాడు బ్రహ్మజ్ఞుడు. ఈ వివరణల ప్రకారం శ్రీ భట్టులు 'బ్రహ్మవిత్' నామవివరణలో వేదజ్ఞాన విస్తారతను, 'బ్రహ్మజ్ఞ' నామ వివరణలో వేదార్థమును మరింతలోతుగా తెలియుటను ప్రత్యేకంగా సూచించారనుకోవచ్చును.

ఈ రెండు నామములకు శ్రీ శంకరులు చెప్పిన వివరణలు – **వేదమ్ వేదార్థమ్ చ యథావత్ వేత్తి ఇతి బ్రహ్మవిత్; బ్రహ్మ వేదాన్ స్వాత్మభూతాన్ జానాతి ఇతి బ్రహ్మజ్ఞః.** వేదములను, వేదముల అర్థములను తెలిసినవాడు బ్రహ్మవిత్. తననుండే సంభవించినట్టి వేదములను సంపూర్ణముగా తెలిసినవాడు బ్రహ్మజ్ఞుడు.

శ్రీ చిన్మయానంద వ్యాఖ్య – వేదములను, వాని భావములను పూర్తిగా ఎరిగినవాడు బ్రహ్మవిత్. భగవంతుడు స్వయముగా పరబ్రహ్మముగనుక, బ్రహ్మముగురించి ఆయనకు తెలిసినట్లుగా వేరెవరికీ తెలియదుగనుక, ఆయన బ్రహ్మజ్ఞుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **బ్రహ్మవేదః, తత్ విందతి మత్స్యావతారే ఇతి బ్రహ్మవిత్**. మత్స్యావతారుడై వేదములను తెచ్చియిచ్చినవాడు బ్రహ్మవిత్. **బ్రహ్మ శ్రీ విష్ణోర్విభూతిః, తద్ స్వవిభూతిరూపమ్ జానాతి ఇతి బ్రహ్మజ్ఞః**. శ్రీమహావిష్ణువుయొక్క విభూతి బ్రహ్మ. అలా తనవిభూతిని పూర్తిగా తెలిసినవాడు బ్రహ్మజ్ఞుడు.

బ్రహ్మవిత్, బ్రహ్మజ్ఞః – అనే ఈ రెండు నామములు పరస్పరము అనుసంధానితములు అని పరిగణింపవచ్చును. వేదముల సంపూర్ణజ్ఞానము ఒక నామమునందు, వేదముల అంతరార్థము మరొక నామమునందు సూచింపబడినవి.

675. బ్రాహ్మణప్రియః

- బ్రాహ్మణులయందు ప్రీతి కలవాడు.
- బ్రాహ్మణులకు ఇష్టమైనవాడు.

ఓం బ్రాహ్మణప్రియాయ నమః

వేదాధికారిణో విప్రాః ప్రియా యస్యేతి వై సదా
బ్రాహ్మణప్రియః ఇత్యుక్తో నవార్ణో ధర్మదో మనుః
వేదాన్ని చదవడానికి అర్హతగలవారు బ్రాహ్మణులు. అటువంటి బ్రాహ్మణులయందు ప్రీతిగలవాడు. ఈ నామము నవాక్షరీమంత్రము. ధర్మప్రదము. ఓం బ్రాహ్మణప్రియాయ నమః.

శ్రీ భట్టులు భృగుమహర్షి ఉదంతాన్ని ఉదాహరించారు. భృగువు శ్రీహరి వక్షస్థలంపై తన్నినా గాని భగవంతుడు భృగువును ఆదరించాడు. ఇంకా శ్రీ భట్టులు అనేక ఉదాహరణలిచ్చారు.

ఘ్నంతం శపంతం పరుషం వదంతం యో బ్రాహ్మణమ్ న ప్రణయేద్యథాఽహమ్ (ఇతిహాస చూడామణి 30.100). ఒక బ్రాహ్మణుడు కొట్టినా, తిట్టినా, శపించినాగాని సహించి అతనిని పూజించాలి. నేను భృగుమహర్షిని అలానే ఆదరించాను. అలా చేయనివాడు బ్రాహ్మణుని కోపాగ్నిలో నశిస్తాడు. అతడు శిక్షార్హుడు. అటువంటివాడు నావాడు కాడు.

ఇలా భగవంతునికి బ్రాహ్మణులపట్ల విపరీతమైన ఆదరణ ఉండడానికి కారణం వారు ధర్మాన్ని ఆచరిస్తూ భగవంతుని నమ్ముకొని ఉండడమే.

యేతు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే

శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేऽతీవ మే ప్రియా – గీత 12.20
ఉపర్యుక్త ధర్మామృతమును సేవించుచు, నిష్కామ భక్తి శ్రద్ధలతో మత్పరాయణులైన భక్తులు నాకత్యంత ప్రియులు.

విప్ర ప్రసాదాత్ అసురాన్ జయామి (విష్ణుధర్మము 52.23) – బ్రాహ్మణుల అనుగ్రహముచేతనే రాక్షసులను జయించుచున్నాను.

ఈ నామ వ్యాఖ్యానంలోనే బ్రాహ్మణులు ఎలా ప్రవర్తించాలో తెలుపబడింది. శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – బ్రాహ్మణులు వేదాధ్యయనము, వేదబోధనము కొఱకు జీవించుచున్నందున భగవానునకు అత్యంత ప్రియులు. వేదములు భగవత్స్వరూపమే గనుక వారు చేయునది భగవత్సేవయే.
యం దేవం దేవకీదేవి వసుదేవాదజీజనత్
భౌమస్య బ్రహ్మణో గుప్త్యై దీప్తమగ్నిమివారణి
బ్రాహ్మణులను రక్షించడం కోసమే దేవకీవసుదేవులకు శ్రీకృష్ణపరమాత్ముడు జన్మించాడు (మహాభారతం).

శ్రీ శంకరులు రెండు అర్థాలనూ చెప్పారు – **బ్రాహ్మణానామ్ ప్రియః బ్రాహ్మణప్రియః, బ్రాహ్మణాః ప్రియా అస్య ఇతి వై**. బ్రాహ్మణులకు ప్రియమైనవాడు, బ్రాహ్మణులపట్ల ప్రీతి కలిగినవాడు బ్రాహ్మణప్రియుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ అన్ని నామాలను శ్రీకృష్ణచరిత్రము ఆధారంగా వ్యాఖ్యానించారు. చనిపోయిన గురుపుత్రుని పునర్జీవితుని చేసి (యమలోకంనుండి తెచ్చి) గురువుగారికి (సాందీపనికి) ఆనందం కలుగజేసినవాడు బ్రాహ్మణప్రియుడు.

శ్రీ చిన్మయానంద – ఇక్కడ 'బ్రాహ్మణులు' అనగా దివ్యమైన భగవదనుభూతిని పొందినవారు. జ్ఞానులు (కులం కాదు).

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః |

మహాక్రతుర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః || (72)

ఇంతకుముందు శ్లోకము వలెనే ఈ మహాశ్లోకమును జలజల పారుతున్న మహాజలపాతముయొక్క మహాశబ్దజాలమువలె మహానామాష్టకముతో; మహనీయ - మధుర - మహా శబ్దాలంకారములతో, మహత్వపూర్ణమై, మహేశ్వరమూర్తియొక్క మాహాత్మ్యమును మహాశబ్దములతో స్తవము చేయుచున్నది (శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి).

ఇక్కడినుండి కొన్ని నామములను శ్రీభట్టులు వ్యాఖ్యానించిన భావము – భగవంతునికి భక్తులపట్ల గల అపరిమిత వాత్సల్యము, భగవంతునకు భాగవతులకు గల ప్రగాఢ సంబంధము, తనను ఆరాధించడానికి భక్తులకు భగవానుడు ఎలా మార్గం సుగమం చేస్తాడు మొదలైన వివరాలు.

676. మహాక్రమః

- భక్తుల ఉన్నతి కొఱకు క్రమక్రమమైన అర్హతను ప్రసాదించువాడు.
- మూడు గొప్ప అడుగులుగల శ్రీత్రివిక్రమమూర్తి.
- ఆయన అడుగులు ఎంత గొప్పవంటే, ఎక్కడికైనా గాని అందరికంటె ముందుగా చేరుకొనేవాడు.
- శరణాగతి పొందుటకు తగిన ఉత్తమ పాదములు కలవాడు.

ఓం మహాక్రమాయ నమః

'క్రమము' అనగా అడుగు (పద విన్యాసము) అనియు, క్రమబద్ధమైన (నిర్ణీతమైన) విధానము అనియు అర్థములు గలవు. శ్రీ శంకరులు మొదటి అర్థాన్ని తీసికొని శ్రీవామనావతారపరంగా వ్యాఖ్యానించారు. శ్రీ భట్టులు రెండవ అర్థాన్ని తీసికొని, భక్తులు ఒక్కొక్క అడుగు వేసుకొంటూ తనను చేరుకొనే అవకాశం ప్రసాదించేవాడు భగవంతుడు అని వ్యాఖ్యానించారు.

పరమోన్నతిమాత్మానం సోనిమ్నాద్భవ పాతకాత్
జీవస్సమారోహయతో జ్ఞానభక్త్యాది రూపిణీ
సర్వానుపూర్వీ యస్యాస్తి మహాక్రమ ఇతీరితః
పరమేశ్వరుడు సర్వోత్కృష్టుడు. జీవులందరూ తనను పొందేందుకు వీలుగా భక్తి, జ్ఞానము, వైరాగ్యము అనే సోపానక్రమమును ప్రసాదించినవాడు మహాక్రముడు.

ఇందుకు శ్రీభట్టులు చక్కని ఉదాహరణ ఇచ్చారు. బిడ్డకు తల్లి ముందుగా చనుబాలు, తరువాత ఆవుపాలు, తరువాత ఘనాహారము ఇచ్చినట్లుగానే భగవంతుడు కూడా క్రమక్రమముగా భక్తులందరికీ భగవదారాధనను సుగమం చేస్తాడు. ముందుగా భగవంతునిపట్ల విముఖత నశించాలి. ఆపై భగవంతునిపట్ల, శృతులపట్ల విశ్వాసం నెలకొనాలి. వాటిపట్ల మక్కువ కలగాలి. ఇలా భక్తి, జ్ఞానముల ద్వారా భగవంతుడు లభిస్తాడు. ఇందుకు అనేక జన్మలు పట్టవచ్చును. లఘు అత్రిస్మృతి నుండి శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణ –
జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః
నరాణామ్ క్షీణపాపానామ్ కృష్ణే భక్తిః ప్రజాయతే
అనేక జన్మలయందు చేసిన తపస్సు, ధ్యానము, యోగమువలన నరులకు పాపములు క్షీణించి శ్రీకృష్ణునియందు భక్తి ప్రవర్ధిల్లుతుంది.
బహూనామ్ జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభః – గీత 7.19
అనేక జన్మల తరువాత జ్ఞానియైనవాడు సర్వమూ వాసుదేవమయం అని గ్రహించి నన్ను శరణు పొందుతాడు. అటువంటి మహాత్ములు అరుదుగా ఉంటారు.
అభ్యాస యోగేన తతో మామ్ ఇచ్ఛాప్తుమ్ ధనంజయః (గీత 8.8) – నాయందు స్థిరముగా మనసు నిలవనట్లయితే అభ్యాసయోగముద్వారా ప్రయత్నించవలయును.

గీతోపదేశ సమయంలో కూడా భగవానుడు ఒక క్రమంలో అర్జునునికి ఉపదేశం చేశాడు, ఒక్కమారుగా కాదు – అని శ్రీ వి.ఎన్. వేదాంతదేశికన్ తమిళవ్యాఖ్యానంలో వ్రాశారు. ఇలా క్రమమైన అభివృద్ధి కూడా భగవదనుగ్రహంవల్లనే సాధ్యమవుతుంది.

శ్రీ శంకరులు ఈ నామమును త్రివిక్రమపరంగా వ్యాఖ్యానించారు. **మహాన్తః క్రమాః పాదవిక్షేపా అస్య ఇతి మహాక్రమః**. గొప్ప పాదవిక్షేపములు కలవాడు మహాక్రముడు.

శం నో విష్ణుః ఉరుక్రమః – తైత్తరీయోపనిషత్తు 1.1 – గొప్ప పాదవిన్యాసముగల విష్ణుదేవుడు మాకు శుభములు కలిగించునుగాక.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఇక్కడ 'మహా' శబ్దము ద్వారా మనము గ్రహించవలసినది ఏమంటే త్రివిక్రముని అడుగులు ఇంతపెద్దవని మనం చెప్పలేము. అవి మన ఊహాకందనివి.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు మహాక్రముడు అనగా అందరినీ అన్నింటికంటె ముందు చేరగలడు. అంతటా వ్యాపించినవాడు. 'విష్ణు'నామము కూడ ఇదే అర్థమును సూచించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **న చాస్తి కించిత్ భువి వర్తమానమ్ మహాక్రమో యన్నా వశే కరోతి.** ఈ విశ్వంలో మహాక్రముని వశం కానిదేదీ లేదు.

ధర్మచక్రము రచయిత – ఆయన అడుగులు ఎంతపెద్దవంటే ఆ పాదములను ఆశ్రయించి మనం ఈ దుర్భరమైన దురంతమైన సంసారసాగరమును దాటవచ్చును. శ్రీవారి పాదములను సేవించినయెడల అత్యల్పుడు కూడా మహాత్ముడు కావచ్చును.

677. మహాకర్మా

గొప్ప కార్యములు చేయువాడు.

ఓం మహాకర్మణే నమః

ఈ నామము రెండుమార్లు వస్తున్నది.

72వ శ్లోకము. 677వ నామము. మహాకర్మా – **మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః**

84వ శ్లోకము. 793వ నామము. మహాకర్మా – **ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాగమః**

మహాన్తి కర్మాణి యస్య ఇతి మహాకర్మా. మహాకర్మలు అనగా గొప్ప పనులు. శరణాగతులైన భక్తులను ఉద్ధరించడం మహాకర్మ అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. భగవానుని సృష్టి స్థితి లయాది కార్యాలు మహాకర్మలు అని ఇతర వ్యాఖ్యాతలు చెప్పారు.

క్రిమికీటకాదులను కూడా క్రమక్రమముగా ఉద్ధరించి శ్రీహరి తన సన్నిధానమునకు చేర్చుకొనుట అతివిస్మయనీయము, మహదాశ్చర్యకరము అని శ్రీ భట్టుల వ్యాఖ్య.

అత్యంత హీనవాన్ జంతూంశ్చ యోగ్యాన్ స్వానుభవస్య చ

కరోతి మహదాశ్చర్యం కర్మ యస్యాస్తి సర్వదా
మహాకర్మా స విజ్ఞేయో హ్యష్టార్ణో మనురుత్తమః
నీచాతినీచులైనవారిని కూడా తనను పొందడానికి వీలుగా చేయగలవాడు 'మహాకర్మా'. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ఉత్తమమైనది. ఓం మహాకర్మణే నమః.

శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ నమ్మాళ్వార్ తిరువైమొళి (7.5.1)నుండి ఉదాహరించారు – శ్రీరాముడు తన అవతారానంతరం అయోధ్యను వీడి వైకుంఠమునకు వెళ్ళునపుడు అయోధ్యానగరంలోని సకల జీవరాశులను, గడ్డి పోచలను, చీమలను కూడా, తనతోపాటు తీసికొనివెళ్ళి ఉత్తమగతులు ప్రసాధించాడు.

ఆయన మహాకర్మలు భక్తులకు చేయూతనివ్వడానికే పరిమితం కావు. భక్తుల శత్రువులను శిక్షించడమూ, భక్తుల శత్రువులను పెడమార్గంలో పట్టించే లీలావినోదమూ కూడా ఆయన మహాకర్మలే. 84వ శ్లోకంలోని 'మహాకర్మా' నామమును శ్రీభట్టులు ఈ భావంలో వ్యాఖ్యానించారు. (బుద్ధావతారంలో భగవంతుడు ఉద్దేశ్యపూర్వకంగా నాస్తికులను వేదమార్గంనుండి విముఖులుగా చేశాడు.)

ఇంగ్లాండులోని భక్తివేదాంత మందిరంలో శ్రీ సీతా రామ లక్ష్మణ హనుమంతుల మూర్తులు. వికీపీడియా చిత్రం

ఈ నామమునకు శ్రీ శంకరుల వ్యాఖ్య – **మహత్ జగత్ ఉత్పత్త్యాది కర్మా అస్య ఇతి మహాకర్మా**. మహాజగత్తు సృష్టివంటి కార్యక్రమములు చేసేవాడు మహాకర్మ. ప్రళయకాలంలో జగత్తును శ్రీమహావిష్ణువు మ్రింగివేయడాన్ని శ్రీరాధాకృష్ణశాస్త్రి ప్రస్తావించారు. 84వ శ్లోకంలోని 'మహాకర్మా' నామంగురించి వ్యాఖ్యానిస్తూ శ్రీ శంకరులు – పంచభూతములవంటి మహత్తరమైనవానిని సృజించడం మహాకర్మ – అని చెప్పారు. **మహాన్తి వియదాదీని భూతాని కర్మాణి కార్యాణి అస్య ఇతి మహాకర్మా.**

శ్రీ కృష్ణదత్త భరద్వాజ భగవంతుని కార్యములు 'దివ్యములు' గనుక మహాకర్మలని ప్రస్తావించారు. **జన్మ కర్మ చ మే దివ్యమ్** (గీత 4.9).

ధర్మచక్రము రచయిత – జీవుడు కోరినవాటిని ఇవ్వడం భగవంతుని మహాకర్మ. ఐహిక సుఖములకు కావలసిన సాధనాసంపత్తిని, సాధనకు కావలసిన యోగమార్గమును, మోక్షమునకు కావలసిన భక్తి జ్ఞాన వైరాగ్యములను భగవంతుడు ప్రసాదించుచున్నాడు.

శ్రీ చిన్మయానంద – పంచభూతములను, వానినుండి నిర్ణీత విధానములో వర్తించు గ్రహనక్షత్రాదులను సృష్టించుట, వాటిని నిర్దిష్టముగా నడిపించుట, సమయము ఆసన్నమైనపుడు వానిని నాశనము చేయుట – ఇవి మహాకర్మలుగాక మరేమియగును?

678. మహాతేజాః

- గొప్పతేజస్సు కలవాడు.
- అజ్ఞానము తొలగించువాడు.
- శక్తివంతమైన, ఎదురులేని లక్షణములు గలవాడు.
- సూర్యచంద్రాదులకు తేజమునిచ్చువాడు.

ఓం మహాతేజసే నమః

అనాద్యవిద్యాఖ్యతమో హరి తేజో మహద్యతః
మహాతేజాహ్యతఃఖ్యాతః తేజదో వసువర్ణకః

జీవికి అనాదిగా ఉన్న అవిద్యను (అజ్ఞానాంధకారమును) సమూలంగా నాశనం చేయు తేజస్సు గలవాడు 'మహాతేజాః'. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. తేజస్సును ప్రసాదిస్తుంది. ఓం మహాతేజసే నమః.

శ్రీ భట్టుల వ్యాఖ్యకు శ్రీ వి.వి. రామానుజన్ **'నారాయణ పరో జ్యోతిః'** అనే శృతివాక్యమును ఉదాహరించారు. శ్రీ తిరుమంగయాళ్వార్ తిరుచ్చందవిరుత్తము (34)లో కూడా 'నీవు తిరుగులేని జ్యోతివి' అన్నారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుని తేజస్సువల్లనే సూర్యుడు ప్రకాశమును పొందుచున్నాడు. ఇందుకు శ్రీ శంకరులు, ఇతర వ్యాఖ్యాతలు చెప్పిన ప్రమాణములు –

యేన సూర్య స్తపతి తేజసేద్ధః – తైత్తరీయ బ్రాహ్మణము 3.12.9 – ఆయన కాంతివలన సూర్యుడు ప్రకాశించుచున్నాడు.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్

యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్ – గీత 15.12

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సేయని యెఱుంగుము.

న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకమ్

నేమా విద్యుతో భాన్తి కుతోఽయమాగ్నిః

తమేవ భాన్తమనుభాతి సర్వమ్

తస్య భాసా సర్వమిదమ్ విభాతి – ముండకోపనిషత్ 2.10 (11.2.10?)

అక్కడ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, అగ్ని (మెరుపు) ప్రకాశింపలేవు. ఆయన కాంతివలననే అవన్నీ ప్రకాశిస్తున్నాయి.

జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే

జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ – గీత 13.17

ఆ పరబ్రహ్మ అన్ని జ్యోతులకును జ్యోతి (పరంజ్యోతి). మాయాతీతుడును, జ్ఞానస్వరూపుడును, తెలిసికొనదగినవాడును, తత్వజ్ఞానముద్వారా ప్రాప్యుడును అతడే. సర్వప్రాణుల హృదయములందు విశేషముగా ఉండువాడును అతడే.

శ్రీ శంకరులు మరొక అర్థం కూడా చెప్పారు – **క్రౌర్య శౌర్యాదిభిః ధర్మైః మహద్భిః సమలంకృత ఇతి వా మహాతేజః**. శత్రువులపట్ల శౌర్యము, దుష్టులపట్ల క్రౌర్యమువంటి శక్తివంతమైన, ఎదురులేని లక్షణములు గలవాడు మహాతేజస్వి.

ధర్మచక్రము రచయిత – సూర్యుడు బయటి చీకట్లను పారద్రోలినట్లే భగవంతుడు మనలోని చీకట్లను తొలగించును. ఆయన ప్రసాదించిన కాంతివలన మనము మనలను, దేవుని తెలిసికొనవచ్చును.

679. మహోరగః

- గొప్పవాడు మరియు మన హృదయము (ఉరము)నందు ప్రవేశించువాడు.
- గొప్ప హృదయము (ఉరము) కలవాడై మనను దీవించేవాడు.
- అనంతుడు, వాసుకి వంటి గొప్ప ఉరగములు (నాగములు)గా అవతరించినవాడు.
- అనంతుడు అను సర్పముపై శయనించినవాడు.
- గొప్ప ఉరముగల సూర్యునిగా అంతటా పయనించువాడు.

ఓం మహోరగాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **మహా-ఉరః-గః మహోరగః.** ఉరస్సు అనగా మనలోని హృదయము. **ఉరః ప్రదర్శితమ్ హృదయమ్, యద్ ద్వారా తాన్ (అదీయాన్) గచ్ఛతి ఇతి మహోరగః.** భగవంతునితో పోలిస్తే ధూళికంటె అల్పమైన మన హృదయాలలో భగవంతుడు ప్రవేశిస్తాడు గనుక ఆయన 'మహోరగః'. మన హృదయాలలో ఆయన ఎలా ప్రవేశిస్తాడు? ఐహిక సౌఖ్యాలు మనలో ఇంద్రియాలద్వారా ప్రవేశించినట్లే భగవంతుడు కూడా ఇంద్రియాలద్వారా మన హృదయాలలో ప్రవేశిస్తాడు అని శ్రీ భట్టులు చెప్పారు. మన కన్నులతో భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని చూస్తాము. మన చెవులతో ఆయన మధురస్తోత్రాలను వింటాము. ఇలా క్రమంగా మన హృదయాలలోని భోగలాలసతను వెడలగొట్టి శ్రీహరి ప్రవేశిస్తాడు. ఇందుకు శ్రీ వి.వి. రామానుజన్ దివ్య ప్రబంధాలనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు. తిరుమొళి 1.10.9 (శ్రీ తిరుమంగైయాళ్వార్), తిరువైమొళి 6.10.3, తిరుచ్చంద 115, తిరువైమొళి 5.7.7 వంటివి.

ఈ నామములో 'ఉరస్' అంటే మన హృదయం అని పై వ్యాఖ్యలో చెప్పారు. శ్రీ బలదేవ విద్యాభూషణ 'ఉరస్' అనగా భగవంతుని హృదయం అని వ్యాఖ్యానించారు. **మహతా ఉరసా హృదయేన గచ్ఛతి స్వభక్తమ్ ముచుకుందమ్ ఇతి మహోరగః.** అల్పులైన భక్తులపట్ల దయతో వర్తించే హృదయం కలిగినందున భగవంతుడు 'మహోరగః'. కనుకనే ఆయన గుహుని కౌగిలించుకొన్నాడు. జటాయువుకు అంతిమసంస్కారం కావించాడు. శబరి ఇచ్చిన పండ్లను స్వీకరించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఉరసా గచ్ఛతి ఇతి ఉరగః.** రొమ్ముతో కదలునది పాము (ఉరగము). భగవంతుడు తాను సర్పములలో వాసుకిననియు, నాగములలో అనంతుడననియు గీతలో చెప్పియున్నాడు.
సర్పాణామపి వాసుకిః – గీత 10.28; **అనంతశ్చాస్మి నాగానామ్** – గీత 10.29

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **మహాన్-మహనీయః, ఉరగః-అనంతః, శయ్యారూపేణ యస్య ఇతి మహోరగః.** గొప్ప ఉరగమైన అనంతుని శయ్యగా కలిగినవాడు మహోరగుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – మహా-ఉరస్-గ, సూర్యదేవుడై గొప్ప వక్షస్థలము కలిగి నిరంతరము ప్రయాణించువాడు మహోరగుడు. శ్రీ సత్యదేవో వాసిష్ఠ ప్రతి నామమునకు వ్యాకరణ సూత్రాలననుసరించి విశిష్ఠమైన వ్యాఖ్యానం వ్రాశారు. సూర్యుడు, విష్ణువు ఒకరే అన్న భావంలో ఆయన వ్యాఖ్యానించారు.

680. మహాక్రతుః

- గొప్ప యజ్ఞముద్వారా ఆరాధింపబడువాడు.
- సులభముగా పూజింపబడువాడు.
- అనేకవిధములుగా పూజింపబడువాడు.
- ఉత్తమ ఫలములనిచ్చే గొప్ప యజ్ఞము.

- పాంచరాత్ర క్రతువు అనే గొప్ప యజ్ఞము చేసినవాడు.

ఓం మహాక్రతవే నమః

48వ శ్లోకము, 448వ నామముగా 'క్రతుః' అనే నామము వచ్చినది. **యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్రం సతాంగతిః**. 'క్రతువు' అనగా ఒక విధమైన యాగము. అన్ని యాగములు భగవంతుని ఉద్దేశించి చేసేవే గనుక భగవంతునికి 'క్రతుః' అనే పేరు కూడా వర్తిస్తుంది. శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **కరోతి ఇతి క్రతుః, క్రియతే వా క్రతుః**. చేసేవాడు క్రతువు. చేసేది క్రతువు – అని కూడా నిర్వచించారు. 'మహా' అనే శబ్దానికి గొప్ప, అనేక, సులభమైనందున గొప్ప – వంటి అర్థాలు చెప్పవచ్చును.

శ్రీ అణ్ణాంగారాచార్య స్వామి 'మహా' అంటే 'గొప్ప' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. గొప్ప యజ్ఞములు భగవంతుని ఆరాధిస్తూ చేయబడుతాయి. కనుక ఆయన మహాక్రతువు.

శ్రీ భట్టులు 'మహా' అంటే (1) భక్తులకు సులభమైన, సౌకర్యవంతమైన పూజావిధానము (2) అనేకములైన పూజావిధానములు – అనే అర్థాలలో వ్యాఖ్యానించారనిపిస్తుంది. **మహాత్ సర్వ సుకరమ్ ఆరాధనమ్ అస్య ఇతి మహాక్రతుః**. ఎటువంటివారైనా తేలికగా, అనేక రకాలుగా శ్రీహరిని ఆరాధింపవచ్చును. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుధర్మమునుండి, గీతనుండి ఉదాహరించారు.

యో న విత్తై ర్న విభవై ర్న వశోభి న్న భూషణైః
తోష్యతే హృదయేనైవ కస్తమీశమ్ న తోషయేత్ – విష్ణుధర్మము 90.69
ఈశ్వరుడు ధనము, వైభవము, భూషణములకు వశుడు కాడు. కేవలము ప్రేమించే హృదయానికి వశుడౌతాడు. అలాంటి ఈశ్వరుని సంతోషపెట్టకుండా ఎలా ఉండగలరు?

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసియత్
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ – గీత 9.27
ఓ కౌంతేయ! నీవు ఆచరించు కర్మను, భుజించెడి ఆహారమును, హోమము చేయు హవ్యమును, అర్పించు దానమును, ఆచరించు తపస్సును నాకే సమర్పించుము.

శ్రీ బలదేవ విద్యాభూషణ – భగవంతుని అనేక విధములుగా అర్చింపవచ్చును. తులసి ఆకులు సమర్పించి ఆయన అనుగ్రహమును సాధింపవచ్చును.

శ్రీ భట్టులు ఇచ్చిన అదనపు వివరణ – ఆగమ శాస్త్రములు నిర్దేశించినట్లుగా ఆయనను పెక్కు పనులద్వారా పూజింపవచ్చును. అట్టి పనులు ఆయనకు సమర్పణ చేసినంతనే పవిత్రములగును. **సమర్పణ సంస్కార స్వాదు కృతైః ఆగమశాస్త్రకారిత సర్వవ్యాపారైః ఆరాధ్యత్వాత్.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మహాన్ శ్చ క్రతుశ్చ ఇతి మహాక్రతుః**. భగవంతుడు గొప్ప యజ్ఞము. గీతలో భగవంతుడు తానే క్రతువునని చెప్పియుండెను.

అహం క్రతు రహం యజ్ఞః స్వధామహమౌషధమ్

మంత్రోఽహ మహమేవాజ్య మహమగ్ని రహం హుతమ్ – గీత 9.16

నేనే క్రతువును. నేనే యజ్ఞమును. స్వధయును నేనే. ఓషధులు నేనే. నేనే మంత్రమును. నేనే ఘృతమును. నేనే అగ్ని ని. హోమరూపక్రియయును నేనే.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **మహాన్ క్రతుః పాంచరాత్రో యస్య ఇతి మహాక్రతుః**. శతపథబ్రాహ్మణము(13.6.1)లో చెప్పిన ప్రకారం నారాయణుడు పాంచరాత్రక్రతువును ఆచరించి తాను అందరికంటె అధికుడై తానే సర్వము అయ్యాడు

పురుషోహవై నారాయణో కామ్యత అతితిష్టేయమ్

సర్వాణి భూతాని అహమేవ ఇదమ్ సర్వమితి

స ఏతమ్ పురుషమేధమ్ పాంచరాత్రమ్ యజ్ఞ

క్రతుమపశ్యత్ తమాహరత్ తేన జాయత తేనేష్టమ్

అత్యతిష్ట త్సర్వాణి భూతానీదమ్ సర్వమ్ భవాత్.

681. మహాయజ్వా

- గొప్ప యజ్ఞములు చేసేవాడు.
- ఉత్తములు, మహాయజ్వలు అయిన భక్తులు తనవారిగా కలిగినవాడు.

ఓం మహాయజ్వనే నమః

దేవతాంతర యాజిభ్యః స్వయాజ్యుత్కృష్టకారకః

మహాయజ్వా సముద్దిష్టః సత్కర్మఫలదో మనుః

అన్యదేవతలను ఆరాధించేవారికంటే ఉత్కృష్టులైనవారు, ఉత్తమఫలములు పొందేవారు తన భక్తులుగా కలవాడు. ఈ నామము అష్టాక్షరీమంత్రము. పుణ్యకర్మప్రదము. ఓం మహాయజ్వనే నమః.

పాణిని సూత్రము (3.2.103 **సు యజోర్ఙ్వానిప్**) ప్రకారము 'యజ్వా' అనే పదమునకు మూలధాతువు 'యజ్'- త్యాగము చేయుట, బలి ఇచ్చుట. 'యజ్వా' అనగా యజ్ఞము చేసినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మహాన్తమ్ యజ్ఞమ్ కృతవాన్ ఇతి మహాయజ్వా**. గొప్ప యజ్ఞములు చేసినవాడు మహాయజ్వ. రామావతారమునందు అశ్వమేధయాగము చేసినవాడు. అంతేగాక తన భక్తులు చేయు

యజ్ఞములు చక్కగా పరిసమాప్తమగునట్లు కాపాడు భగవానుడే ఆ యజ్ఞములకు యజమాని అని భావింపవచ్చును. ఆ విధంగా కూడా ఆయన మహాయజ్వ.

శ్రీ భట్టుల వ్యాఖ్య – అన్యదేవతలను తలపక శ్రీమహావిష్ణువునే ఆరాధించు భక్తులు ఉత్కృష్టమైనవారు. అట్టి యజ్ఞకర్తలు మహాయజ్వలు. వారికి నాధుడైన భగవంతుడు మహాయజ్వ. మరోవిధంగా, అలాంటి భక్తులు తన ఆత్మగా కలవాడు మహాయజ్వ. అన్యదేవతలను ఆరాధించేవారికంటే తనను ఆరాధించేవారికి అధికమైన ఫలమును ప్రసాదించేవాడు మహాయజ్వ. **స్వయాజినామ్ అన్య యాజిన్యేపి అత్యుత్కృష్టత్వాత్ మహాయజ్వా.**

ఆయన భక్తులు ఉత్కృష్టులు ఎందుకవుతారంటే వారు ఐహిక ఫలములను త్యజించి మోక్షమును కోరుతారు.

682. మహాయజ్ఞః

- పూజింపదగినవారిలో అత్యుత్తముడు.
- యజ్ఞములలో ఉత్తమయజ్ఞస్వరూపము కలవాడు (జపయజ్ఞము).
- జ్ఞానులద్వారా పూజింపబడువాడు. గొప్ప యజ్ఞముద్వారా పూజింపబడువాడు.

ఓం మహాయజ్ఞాయ నమః

అన్యేభ్యో దేవ యాగేభ్యః స్వయాగోత్కృష్టకారకః
మహాయజ్ఞ స్సమాఖ్యాతో హ్యష్టార్ణో హరియాగదః
ఇతర దేవతలకన్నా తన యాగము గొప్పదిగా కలవాడు మహాయజ్ఞము. ఈ నామము అష్టాక్షరీమంత్రము. హరిపూజాఫలాన్నిస్తుంది. ఓ మహాయజ్ఞాయ నమః.

ఇంతకుముందు నామము 'మహాయజ్వా' వలెనే ఈ నామము 'మహాయజ్ఞః'ను కూడా 'యజ్' అనే ధాతువునుండి వివరింపవచ్చును. **దేవపూజా సంగతి కరణా యజన దానేషు.** త్యాగము చేయుట, పూజించుట, ఇచ్చుట, దానము చేయుట, సంబంధము కలిగియుండుట – వంటి అర్థములలో 'యజ్' ధాతువు వినియుక్తము. **యజనమ్ యజ్ఞః, ఇజ్యతే ఇతి వా యజ్ఞః.**

శ్రీ భట్టుల వ్యాఖ్య – పూజింపదగినవారిలో శ్రేష్ఠుడు 'మహాయజ్ఞః'. యజ్ఞమనగా భగవదారాధనము. యజ్ఞము అనగా మనము ఆరాధించునది (భగవంతుడు). మహాయజ్ఞము అనగా ఆరాధించువానిలో ఉత్తమమైనది, అనగా శ్రీమహావిష్ణువు. ఎంపెరుమాన్ సుప్రభాతమును పఠించుట, భక్తితో మెలగుట, రుచిశుచికరమైన నైవేద్యమును సమర్పించుట, సాష్టాంగప్రమాణము చేయుట – ఇవన్నీ యజ్ఞములే. వీనిని ఇతరదేవతలను గాక శ్రీనివాసుని ఉద్దేశించి యొనర్చుట మహాయజ్ఞమగును. ఎందుకంటే ఆయన తన భక్తులను తన స్వంత

శరీరమువలె పరిరక్షించును. **రక్షతే భగవాన్ విష్ణుః భక్తానాత్మశరీరవత్**. మరియు వారు సమర్పించిన దానిని ప్రేమతో స్వీకరించును.

యాః క్రియాః సంప్రయుక్తాః స్యుః ఏకాంతగత
బుద్ధిభిః తాస్సర్వాః శిరసాదేవ ప్రతిగృహ్ణాతివై స్వయమ్ – మహాభారతము.మోక్షపర్వము 17.163.
జ్ఞానులు చేసే పూజాదికములను పరమేశ్వరుడు శిరసుతో (తలవంచి) స్వీకరిస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు యజ్ఞములలో శ్రేష్ఠమైన యజ్ఞము. ఇందుకు ప్రమాణము గీత (10.25)లో ఉన్నది. **యజ్ఞానామ్ జపయజ్ఞోస్మి**. యజ్ఞమలలో నేను జపయజ్ఞమును. జపయజ్ఞమునకు దేశకాల బంధనములు లేవు. ఖర్చుతో కూడిన సంభారములు అక్కరలేదు. శ్రమ ఉండదు. హింస ఉండదు. 'క్రతువు'అనగా ఒ ప్రత్యేకమైన ఫలితమును ఆశించి చేయునది. యజ్ఞము అనగ విద్యుక్తధర్మముగా చేయునది. అట్టి యజ్ఞములలో శ్రేష్ఠమైన జపయజ్ఞము భగవత్స్వరూపము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – గొప్ప యజ్ఞములద్వారా పూజింపబడువాడు, గొప్ప జ్ఞానులద్వారా పూజింపబడువాడు 'మహాయజ్ఞః'. **మహత్ యజనమ్ యస్య, మహద్భిః ఇజ్యత ఇతి వా**.

ధర్మచక్రము రచయిత – శాస్త్రముల ప్రకారము మనమందరము ఐదు విధాలైన యజ్ఞాలను ఆచరించాలి.
(1) భూతయజ్ఞము – పశుపక్ష్యాదులకు ఆహారమిచ్చుట, సేవించుట, వానిని కాపాడుట.
(2) పితృయజ్ఞము – పెద్దలను, పితృదేవతలను సేవించుట.
(3) నరయజ్ఞము – సాటి మనుష్యులకు సేవచేయుట, వారికి కష్టము కలిగించకుండ ఉండుట.
(4) ఋషియజ్ఞము – వేద, మంత్ర, విజ్ఞాన పఠనము.
(5) దేవయజ్ఞము – భక్తితో భగవంతుని సేవించుట.
ఈ ఐదు యజ్ఞాలను కూడా మనము శ్రీహరిని ఉద్దేశ్యించి ఆచరింపవలెను. నిజానికి వాటిని ఆచరించేవాడు కూడా శ్రీహరియేనని గ్రహింపవలెను.

683. మహాహవిః

- గొప్ప హోమద్రవ్యములచే పూజింపబడువాడు.
- పరబ్రహ్మస్వరూపమైన హవిస్సు
- ప్రళయకాలమున జగములన్నింటిని హవిస్సు రూపమున స్వీకరించువాడు.

ఓం మహాహవిసే నమః

అర్పింపబడునది హవిస్సు. అగ్నిహోత్రమునందు హోమము చేయబడు నెయ్యి, తేనె, అన్నము వంటివి హోమద్రవ్యములు. 'మహాహవిః' అనగా గొప్ప హోమద్రవ్యము లేదా ఆ హోమద్రవ్యమును స్వీకరించువాడు

లేదా ఆ ద్రవ్యమును అర్పించువాడు లేదా ఆ ద్రవ్యమును సమర్పించు సాధనము – ఇలా వివిధ అర్ధములను గ్రహింపవచ్చును.

భగంతుడు మహాహవిస్సు ఎలాగవుతాడంటే

(1) ఆయనకు సమర్పించేవి కూడా ప్రపంచంలో ఉన్నతమైనవి (ఉదాహరణకు – ఆత్మ)

(2) మనం సమర్పించే అత్యల్పమైనవానినికూడా దయతో స్వీకరించే మహోన్నతుడాయన.

(3) ప్రతివస్తువూ ఆయన స్వరూపము లేదా అవతారము లేదా విభూతి. అలాగే గొప్ప గొప్ప యజ్ఞములు కూడా ఆయన స్వరూపములే.

శ్రీ భట్టుల వ్యాఖ్య – గొప్ప హోమద్రవ్యములను స్వీకరించువాడు 'మహాహవిః'. మనసు, బుద్ధి, ఇంద్రియములు, అన్నింటిని మించి ఆత్మసమర్పణము. **అహమేవన్ మామ్ జుహోమి** (తైత్తరీయ నారాయణ 41). ఇవి మహాహవిస్సులు. వానిని అర్పించడానికి భూతహింస చేయనక్కరలేదు. **న తత్ర పశుఘాతోఽభూత్** (మహాభారతము. శాంతిపర్వము 337.9). **ప్రత్యగాత్మా హవిష్ట్వాత్, అహింస్రమ్ ఆత్మాది హవిః యస్య స్యాత్ స మహాహవిః**

ఆత్మసమర్పణము గురించి ఆళ్వారుల దివ్యప్రబంధాలలో అనేక ప్రస్తావనలున్నవి. నిజానికి ఈ ఆత్మకూడా భగవంతునిదే అయినా మన స్వంతవస్తువేదో దేవునికిచ్చినట్లుగా దీనిని మనం అర్పించవచ్చును. అదేదో గొప్ప నివేదనగా భావించి భగవంతుడు దానిని స్వీకరిస్తాడు. ఆత్మసమర్పణ అనగా అహంకారభావాన్ని భక్తి అనే అగ్నిలో దహింపజేయడం.

శ్రీ బలదేవ విద్యాభూషణ –

నమస్కార స్వాధ్యాయ ఔషధి రూపత్వేన అతిపవిత్రత్వాత్

అన్య హవిభ్యో మహాన్తి హవింషి యస్య స మహాహవిః

నమస్కారము, వేదపఠనము, ఔషధి (తులసి)వంటి అత్యంత శుద్ధమైన (మలినము లేని) నివేదనలను స్వీకరించేవాడు 'మహాహవిః'.

తులసీదళ మాత్రేన జలస్య చులుకేన

విక్రీణీ తే స్వమాత్మానమ్ భక్తేభ్యో భక్తవత్సలః – విష్ణుధర్మము

ఆ భక్తవత్సలుడు తన భక్తులు సమర్పించే తులసీదళాలు, చారెడు నీళ్ళు వంటివానికి బదులుగా భక్తులకు తనను తానే ఇచ్చివేస్తాడు (భక్తులను తనలో చేర్చుకొంటాడు).

యః క్రియాః సంప్రయుక్తాః స్యుః ఏకాన్తగతబుద్ధిభిః

తాః సర్వాః శిరసాదేవః ప్రతిగృహ్ణాతి వై స్వయమ్ – మోక్షధర్మము

భక్తులు ఏకాగ్రతతో (అన్యమైన ఆలోచన లేకుండా) తనకు సమర్పించేవాటిని భగవంతుడు శిరసువంచి (వినమ్రతతో) స్వీకరించాడు.

జప్యేనైవ సంశుద్ధ్యేత్ బ్రాహ్మణో నాఽత్ర సంశయః
కుర్యాదన్యన్ న కుర్యాత్ మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే – మోక్షధర్మము
శుద్ధమైన భగవన్నామజపం ద్వారానే బ్రాహ్మణుడు బ్రాహ్మణుడనిపించుకుంటాడు. ఇతరకార్యాలవల్ల కాదు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – యజ్ఞములలో సమర్పించు హవిస్సు పరబ్రహ్మస్వరూపమే గనుక భగవానుడు 'మహాహవిః'

బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా – గీత 4.24
యజ్ఞకార్యములందు ఉపయుక్తమగు స్రువాది సాధనములు బ్రహ్మము. హోమము చేయబడు ద్రవ్యము బ్రహ్మము. యజ్ఞమునాచరించు కర్తయు బ్రహ్మము. హవనక్రియయు బ్రహ్మము. ఈ బ్రహ్మకర్మయందు స్థితుడైయుండు యోగిద్వారా పొందదగిన యజ్ఞఫలముకూడ బ్రహ్మమే.

అహం క్రతు రహం యజ్ఞః స్వధామహమౌషధమ్
మంత్రోఽహ మహమేవాజ్య మహమగ్ని రహం హుతమ్ – గీత 9.16
నేనే క్రతువును. నేనే యజ్ఞమును. స్వధయును నేనే. ఓషధులు నేనే. నేనే మంత్రమును. నేనే ఘృతమును. నేనే అగ్నిని. హోమరూపక్రియయును నేనే.

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ – గీత 9.15
మరికొందరు జ్ఞానయోగులు నిర్గుణాకారబ్రహ్మనైన నన్ను జ్ఞానయజ్ఞముద్వారా అభేదభావముతో ఉపాసించుచుందురు. మరికొందరు అనంతరూపములతో ఒప్పెడి నా విరాట్ స్వరూపమును పృథక్ భావముతో ఆరాధించుచుందురు.

ఈ శ్లోకమునకు శ్రీ రామానుజులు వ్రాసిన వ్యాఖ్య ఇలా ఉన్నది – ..... **వివిధ విభక్త నామ రూప స్థూల చిత్ అచిత్ వస్తు శరీరః స్యామ్ ఇతి సంకల్ప్య, స ఏకదేవ ఏక తిర్యగ్ మనుష్య స్థావరాఖ్య విచిత్ర జగచ్ఛరీరః అవతిష్ఠతే ఇతి అనుసంధానాశ్చ మామ్ ఉపాసతే.** భగవంతుని సంకల్పానుసారము ఆయన నామరూపస్థూలమై, సకల వస్తుజీవసముదాయమైన జగత్తే శరీరంగా దాల్చాడు. మహాత్ములు ఆయనను అలా భావించి ధ్యానిస్తారు.

(శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి) ఈ నామవివరణ సందర్భంలో హవిస్సు కూడా భగవంతుడే అని గ్రహించాలి. దీని అర్థం సమస్తం ఆయనలో ఉన్నది. అంతేగాని భగవంతునికి, వానికి తేడాలేదు అనుకోకూడదు. పరబ్రహ్మమను అగ్నిలో, పరబ్రహ్మ స్వరూపములేయగు హవిస్సులను, పరబ్రహ్మస్వరూపుడగు యజమాని, పరబ్రహ్మయొక్క ప్రీతి కొరకు, పరబ్రహ్మర్పణ కావించుచున్నాడను దివ్యభావమును సాధకులు సదా భావింపవలయును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ప్రళయకాళమున సకలజగత్తును భగవంతుడు హవిస్సుగా స్వీకరించును. అలా జగత్తు ఆయనలో లీనమగును. అగ్నిలో ప్రేల్చినది కూడా అగ్ని అయినట్లుగా ప్రళయకాలమున ఆయనలో లీనమైన జగత్తు పరబ్రహ్మమే అగును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః |

పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తిరనామయః || (73)

లేదా

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతః స్తోతా రణప్రియః |

పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తిరనామయః || (73)

684. స్తవ్యః

- స్తవము చేయదగినవాడు. స్తుతించడానికి యోగ్యుడు.
- అందరూ శ్రీహరిని స్తుతించెదరు. శ్రీహరి ఎవరినీ స్తుతించనవసరం లేదు.

ఓం స్తవ్యాయ నమః

చేతశ్శరీరయోర్ధంతో వ్యాపారారాధ్యతే హరేః

ఉక్తం నారాయణస్యాధ నాగారాధ్య త్వముచ్యతే

స్మృతస్తుత్యర్ధనాత్ స్తవ్యః షడర్ణో బంధమోచకః

స్తుతించడానికి తగిన యోగ్యత కలవాడు కాబట్టి నారాయణుడు స్తవ్యుడు అనబడుచున్నాడు. ఈ నామము షడక్షరి. సంసారబంధనాన్ని త్రెంచివేస్తుంది. ఓం స్తవ్యాయ నమః.

'స్తు' అనగా 'పొగడుట' అనే ధాతువునుండి ఈ నామమును వ్యాఖ్యానించారు. 'యత్' అనే ప్రత్యయంవల్ల 'పొగడుటకు తగినవాడు' అనే అర్థం వస్తుంది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్తువమ్ అర్హతి ఇతి స్తవ్యః** శ్రీమహావిష్ణువు శాశ్వత, అపరిమిత, దోషరహిత, అనంత కళ్యాణ సంపన్నుడు. కనుక స్తవము చేయదగినవాడు. ఆయనను స్తుతిస్తే సంసారబంధంనుండి విముక్తి లభిస్తుంది. ఇందుకు శ్రీ భట్టులు బృహస్పతిసంహితనుండి ఉదాహరించారు.

ఆదరేణ యథా స్తౌతి ధనవంతం ధనేచ్ఛయా

తథా చేద్విశ్వకర్తారం కో న ముచ్యేత్ బంధనాత్ – బృహస్పతిసంహిత

ధనంకోసం ధనవంతుడిని పొగడుతాము. అలాగే విశ్వకర్తయైన శ్రీమహావిష్ణువును స్తుతించి బంధనాలనుండి విముక్తిని పొందవచ్చును.

శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రము ఫలశ్రుతిలో భీష్ముడు యుధిష్ఠిరునికి ఇలా చెప్పాడు –

ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః

నామ్నాం సహస్రం దివ్యానాం అశేషేణ ప్రకీర్తితమ్

ఇలా స్తవనీయుడు (కీర్తనీయుడు), మహాత్ముడు అగు భగవంతుడు కేశవుని దివ్యమైన వేయి నామములు సంకీర్తనము చేయబడినవి. ఇక్కడ 'కేశవ'నామ ప్రయోగముద్వారా ఆయనే శివుని, బ్రహ్మను సృజించెనని సూచింపబడినది. మహాత్ముడు అనగా పురుషోత్తముడు. 'దివ్య' పదమువలన ఈ వేయి నామములను భూమిపైనా, పరమపదములోనూ స్తోత్రము చేయవచ్చునని గ్రహించాలి. 'కీర్తనీయుడు' శ్రీమహావిష్ణువే.

శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి (3.9.1)నుండి ఉదాహరించారు – ఈ సంగతి వినడం మీకు కష్టంగా ఉండవచ్చును. అయినా మీ మేలుకోరి చెబుతున్నాను వినండి. నా మధురమైన స్తుతులన్నీ తిరువేంకటాద్రిపై మత్తగజంవలె వేంచేసియున్న నా ప్రభువుకే. ఇతర దేవతలను స్తుతించి నా స్తుతులను వ్యర్థం చేసుకొనలేను.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **స్తోతుమ్ యోగ్యః సర్వోత్తమత్వాత్ ఇతి స్తవ్యః** అన్నివిధాలుగా ఆయన సర్వోత్తముడు. కనుక స్తవనీయుడు. స్తవ్యుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవానుని దివ్యగుణములు అనంతములు. వేలకొలది సంవత్సరములు స్తుతించినాగాని అవి పూర్తికావు.

తమ్ ఈశానామ్ వరదమ్ దేవమీడ్యం (శ్వేతాశ్వరోపనిషత్తు 4.11). ఆయన అందరకు దేవదేవుడు. వరదుడు. స్తుతి చేయదగినవాడు.

తమ్ విశ్వరూపమ్ భవభూతమ్ ఈడ్యం (శ్వేతాశ్వరోపనిషత్తు 6.4). ఆయన విశ్వరూపుడు. జరిగినదానికి, జరుగుతున్నదానికి కారణము. స్తుతింపదగినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వైః స్తూయతే, న స్తోతా కస్య చిత్ ఇతి స్తవ్యః.** అందరూ ఆయనను స్తుతిస్తారు. ఆయన ఎవరినీ స్తుతింపనక్కరలేదు. కనుక స్తవ్యుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **వాగ్వ్యాపారేణైవ సమారాధ్యత్వాత్ నిత్య కళ్యాణ గుణకతయా స్తోతుమ్ అర్హ స్తవ్యః.** ఆయన అనంత కళ్యాణగుణాలను మాటలద్వారా ఆరాధించడం చాలా సులభం. కనుక ఆయన స్తవ్యుడు.

ధర్మచక్రము రచయిత ఆళ్వారుల స్తుతులనుండి ఉదాహరించారు. ఆయనను స్తుతించుట, వానికి అర్థం తెలిసికొనుట, ధ్యానించుట, గానం చేయుట, జపించుట, అంతా ఆయనకు అర్పించుట, ఇవన్నీ ఆయనను స్తుతించే విధములు.

685. స్తవప్రియః

స్తవము (స్తుతి, స్తోత్రము)వలన ఆనందించువాడు.

ఓం స్తవప్రియాయ నమః

యయాకయా చిద్భాషత్యా యేనకేవాపి జంతునా
యథాకథం చిత్కృథితో యస్య ప్రియతమస్తవః
స్తవప్రియ స్స కథితో వస్వర్ణః ప్రీతివర్ధకః

పరమేశ్వరుని ఏ భాషలో స్తుతించాలి? అనే అనుమానం అవసరం లేదు. ఎవరు ఏ భాషలో, ఏ విధంగా స్తుతించినా ఆయనకు అర్థం అవుతుంది. ఆయన ఆ స్తోత్రాన్ని స్వీకరిస్తాడు. కనుక ఆయన స్తవప్రియుడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ప్రేమను వృద్ధిపొందిస్తుంది. ఓం స్తవప్రియాయ నమః.

(శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి) **మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద.** నా భక్తులు నన్ను ఎచ్చట ప్రేమతో గానము చేయుదురో అచ్చట నేనుందునని శ్రీమహావిష్ణువు నారదునితో అన్నాడు. భక్తితో, ప్రేమతో, శ్రద్ధతో, హృదయపూర్వకముగా స్తవము చేసినచో భగవానుడు అత్యంతమోదము పొంది వారికి కామితార్థములను వర్షింపజేయును.

శ్రీ భట్టుల వ్యాఖ్యానము – **యథాకథంచిత్** – ఏ విధంగానైనా (విమర్శిస్తూ కూడా); **యయా కయాచిత్ భాషయా** – ఎలాంటి భాష ఐనా (తప్పులున్నా కూడా); **యేన కేనపి** – ఎవరైనా, దేవుడిని వ్యతిరేకించేవారైనా; **తేజస్కృరః తిరస్కారోపి** – పొగడినా, తెగడినా; **స్తవప్రియతమః అస్య ఇతి స్తవప్రియః** – వాటిని స్తోత్రాలుగా స్వీకరించి సంతోషిస్తాడు గనుక స్తవప్రియుడు. శ్రీ భట్టులు ఘంటాకర్ణుని ఉదంతాన్ని ఉదాహరించారు. ఘంటాకర్ణుడు పిశాచరాజు. విష్ణునామంపట్ల విరక్తుడు. విష్ణునామం వినపడకుండా తన చెవులకు గంటలు కట్టుకొన్నాడు. ఎవరైనా విష్ణునామం ఉచ్చరించినపుడు ఆ గంటలు మ్రోగించుకొనేవాడు. అందునిమిత్తం

ఎప్పుడూ ఎక్కడ విష్ణునామం వినిపిస్తుందోనని అప్రమత్తంగా గమనిస్తూ ఉండేవాడు. ఈ క్రియను భగవన్నామస్మరణగా పరిగణించి భగవానుడు అతనికి మోక్షాన్ని అనుగ్రహించాడు.

శ్రీ వి.వి. రామానుజన్ శిశుపాలుని ఉదంతాన్ని (వైరభక్తిని) ఉదాహరించారు.
శ్రీ నమ్మాళ్వార్. తిరువైమొళి 7.9.11 – అర్థం తెలిసిగాని, తెలియక గాని, శ్రీహరి నామాన్ని స్మరిస్తే రెండువిధాలుగానూ ఫలితం ఒకటే. సత్ఫలమే; తిరువైమొళి 5.1.1 – భగవంతుని పొగడాలనే లేదు. ఆయనను గురించి ఏదో ఒకటి అంటే దానిని ఆయన స్తవంగా స్వీకరించి మనకు సద్గతిమార్గం చూపుతాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – స్తవప్రియుడంటే దేవుడు పొగడ్తలను ఆశిస్తున్నాడని ఆర్థం కాదు. జీవుడు తన ఇంద్రియాలను సద్వినియోగపరచుకొంటున్నందుకు సంతోషిస్తాడు. భగవత్ స్తుతివల్ల జీవుడు భగవంతునికి ఇంకా చేరువ అవుతాడు.

ధర్మచక్రము రచయిత – తల్లిదండ్రులు ఇచ్చిన పుస్తకాలను బాగా చదివి పిల్లలు పరీక్షలో ఉత్తీర్ణులయితే తల్లిదండ్రులు ఆనందిస్తారు. అలాగే భగవంతుడిచ్చిన ఇంద్రియాలను విష్ణుస్తవంలో వినియోగిస్తే భగవంతుడు సంతోషిస్తాడు.

686. స్తోత్రమ్

- స్తోత్రమునకు మూలము. భక్తులకు జ్ఞానము ప్రసాదించి వారిచే తన స్తోత్రమును చేయించుకొనేవాడు.
- స్తోత్ర స్వరూపుడు.
- వేదములచే స్తుతింపబడువాడు.

ఓం స్తోత్రాయ నమః

'స్తు' అనే ధాతువునకు 'పొగడుట' అని అర్థము. దీనికి 'ష్ట్రన్' అనే ప్రత్యయంవల్ల 'ఆధారము, కారణము' అనే భావాలు చేరుతాయి (పాణిని సూత్రము 3.2.182). భగవానుడు స్తోత్రస్వరూపియని ఈ నామమునకు సాధారణ భావము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుని అనుగ్రహంవల్లనే భక్తులు భగవంతుని కీర్తిస్తారు. ఇలా స్తుతికి మూలము, సాధనము కూడా భగవంతుడే. **స్వేనైవ నిష్పాద్యతయా స్వస్తుతే స్తోత్రముచ్యతే**. తనను స్తోత్రం చేసేవారికి జ్ఞానమును ప్రసాదించి తన స్తోత్రము తానే చేయించుకొనేవాడు స్తోత్రము.

శ్రీ భట్టులు ఈ నామవివరణలో ధ్రువుని ఉదంతాన్ని ఉదాహరించారు. భగవద్దర్శనానందాతిశయంతో నోట మాట రాక ధ్రువుడు అప్రతిభుడై నిలబడిపోయాడు. తన భక్తుని కలవపాటును గుర్తించిన భగవానుడు దయగొని నిజహస్తాగ్రమందలి వేదమయశంఖంతో ధ్రువుని కపోతలాన్ని స్పృశించాడు. ఆ స్పర్శ ప్రభావం

వలన ధ్రువునికి అద్భుతమైన వాక్చాతుర్యం లభించింది. అతను వాసుదేవుని స్తుతించాడు. (శ్రీ ఏల్చూరి మురళీధరరావు రచనలోని వాక్యాలు).

యోఽనంతః ప్రవిశ్యమామ్ వాచమిమమ్ ప్రసుప్తామ్
సంజీవయత్యఖిల శక్తిధరః స్వధామ్నా
అన్యాంశ్చ హస్త చరణ శ్రవణ త్వగాదిన్
ప్రాణాన్నమో భగవతే పూరుషాయ తుభ్యమ్
నాలో ప్రవేశించి, సుప్తమైన నా మాటలకు ప్రాణం పోసి, తన విశిష్టశక్తితో నా కర చరణ చర్మాది ఇంద్రియాలను పునరుజ్జీవితం చేసిన భగవత్ పురుషునకు ప్రణామములు.

తిరువైమొళి 10.7.5 – భగవంతుడు శ్రీనమ్మాళ్వారును సాధనంగా చేసుకొని తన స్తుతులు తానే పాడుకొనెనట. అన్నమయ్య – **నా నాలుకపై నిలిచి నానా సంకీర్తనలు పూని నాచే నిన్ను పొగడించితివి**.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడే స్తోత్రము. భక్తితో శ్రీనివాసుని కళ్యాణగుణములను గానముచేయు వ్యక్తి సచ్చిదానందానుభవము పొందును. అప్పుడు నామము (స్తోత్రము), నామి (భగవంతుడు) ఒకటేయగును. కనుక భగవంతుడే స్తోత్రము. (శ్రీ చిన్మయానంద వివరణ).

శ్రీ రాధకృష్ణశాస్త్రి – భగవంతుని స్తుతించే, కీర్తించే మాటలన్నీ మంచిమాటలే. కనుక అవి భగవంతుని స్వరూపములే. (లోకంలో ఉత్తమ స్వభావము కలిగినవన్నీ తన విభూతులేనని గీతలో శ్రీకృష్ణభగవానుడు సెలవిచ్చాడు).

నలమ్ తరుమ్ సొల్లై నాన్ కణ్డు కొండేన్ నారాయణా ఎన్నుమ్ నామమ్ – అని ఆళ్వారుల వచనము. ద్రౌపది భగవంతుని స్తుతింపగానే ఆమెకు రక్షణ లభించెను (భగవంతుడు అక్కడికి రాకముందే).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **స్తూయతే అనేన ఇతి స్తోత్రమ్ వేదః**. భగవంతుని స్తుతించేవి వేదములు. వేదస్తుతులు ఆయనను ఉద్దేశించినవి గనుక ఆయనే స్తోత్రము. **వేదస్య ప్రధాన విషయత్వా బ్రహ్మాపి స్తోత్రమ్**.

ధ్రువుడు చేసిన శ్రీహరిస్తోత్రము. **శ్రీ ఏల్చూరి మురళీధరరావు రచన 'శ్రీమద్భాగవతము'నుండి.**

ఏ అఖిల శక్తిధరుడు నాలో ప్రవేశించి, సుప్తస్థితిలో ఉన్న నా ప్రాణేంద్రియాలను, వాక్కును సంజీవింపజేశాడో, ఆ పరమపూరుషునికి నమస్కారం! దేవా నిత్యైకరూపా! ఆత్మశక్తి అయిన మాయను అధిష్ఠించి, మహదాదులతో కూడిన విశ్వాన్ని సృజించి, చైతన్యరూపంతో అందులోనికి ప్రవేశించి, బహురూప నామాలతో గోచరించే నీకు భక్తిపూర్వక ప్రణామం! .... నీవు ప్రసాదించిన జ్ఞాన ప్రభావాన్ని, పూర్వకల్ప ప్రపంచాన్ని మళ్ళీ రచించడమే బ్రహ్మసృష్టి అనబడుతున్నది.

దేవా! నీ పాదపద్మం భక్తులపాలిటి కల్పవృక్షం. ముముక్షువులకు కూడా అదే శరణ్యం.... లోకేశ్వరా! నీ పాదారవింద పరిచర్యవలన, నీ కళ్యాణకథాసుధారసపానంవలన కలిగే పరమసుఖాన్ని చవిగొన్నవారు మోక్షాన్ని కూడా లెక్కచేయరు. తండ్రీ! నీ భక్తులతోడి నిత్యసంగమ భాగ్యాన్ని నాకు ప్రసాదించు.

ధ్రువునికి దర్శనమిచ్చిన శ్రీవాసుదేవుడు.
రాజారవివర్మ చిత్రం. వికీపీడియానుండి

స్వామీ! కార్యకారణాత్మకమూ, నానారూప ప్రాణివర్గ సంకులమూ అయి కంటికి కానవస్తున్న ఈ ప్రపంచమంతా నీ స్థూలరూపం. ఇది దృశ్యం కనుక, కంటితో చూసి దీని తత్వాన్ని కొంతకు కొంతయినా గ్రహింపగలము. నీ స్వరూపం ఈ దృశ్యప్రపంచానికి పరమైనట్టిది. అది దృశ్యం కాదు గనుక మనోవాక్కులకు అందరానిది. కేవలం బుద్ధిమాత్రగమ్యం.

మహాత్మా! కల్పాంతంలో సర్వ దృశ్యప్రపంచాన్ని నీ కుక్షిలో నిక్షేపించి, ఏకార్ణవ జలమధ్యంలో శేషపర్యంకాన పవ్వళించి, సమయం వచ్చినపుడు నీ నాభినుండి చతురాస్యుని పుట్టించి, పునఃసృష్టిని కావిస్తావు.... నీవు నీ చిచ్ఛక్తివలన సర్వావస్థలకు సాక్షివవుతావు. జీవుడు సర్వావస్థలను తానే అనుభవిస్తున్నట్లు భావిస్తాడు. ...
దేవా! నీవు నిర్వికారుడవైనా లోకస్థితి పరిపాలనార్థం విష్ణురూపాన్ని ధరించావు. అవిద్యాది వివిధశక్తులు విరుద్ధ గతులను కలిగి ఉన్నప్పటికీ కార్యార్థమై అనుపూర్విగా వచ్చి నీయందు చేరుతుంటాయి.

అట్టి బ్రహ్మమునకు, విశ్వకారకునకు, ఏకమూర్తికి, అనంతునకు, ఆద్యునకు, ఆనందమాత్రునకు, అవికారునకు నమస్కరిస్తున్నాను. నీవు పురుషార్థమూర్తివిగనుక నీ పాదపద్మ సేవవలన సర్వార్థాలూ కలుగుతాయి. అందువల్ల సనకాదులు కూడా నిన్ను ఆశ్రయిస్తారు. నిన్ను ఆశ్రయించినవారు దీనులని నీవు ఏనాడూ భావింపవు. అప్పుడే ఈనిన ఆవుదూడను కాపాడినట్లు మమ్మల్ని పరిపాలించు!

687. స్తుతిః (శ్రీ శంకరుల పాఠము)

స్తుతః (శ్రీ భట్టుల పాఠము)

- స్తోత్రము చేయుట, ప్రార్థించుట కూడా భగవత్స్వరూపములే (స్తుతిః).
- స్తోత్రము చేయబడువాడు (స్తుతః)

ఓం స్తుతయే నమః

ఓం స్తుతాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు ఈ నామమును **'స్తుతః'** అని చెప్పారు.

సహస్రఫణ త్రయీమయాదిభిః అనంతైః బ్రహ్మాదిభిః

అస్మదాదిభిశ్చ తత్తదభిలాషసిద్ధయే స్తుత ఇతి

నిత్య సూరులైన ఆదిశేషుడు, గరుడుడు (మూడు వేదముల స్వరూపుడు), అనంతుడు, బ్రహ్మ వంటివారిచేతను, మనచేతను కూడా ఈప్సితార్థసిద్ధికొరకు స్తుతింపబడువాడు స్తుతుడు.

ఇందుకు శ్రీ భట్టులు శ్రుతినుండి ఉదాహరించారు.

ధాతా పురస్తాత్ యముదాజహార

శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చ తస్రః – పురుషసూక్తము

ముందుగా సృష్టికర్తయైన బ్రహ్మ ఆయనను స్తుతించెను. తరువాత విద్వత్తు కలిగిన ఇంద్రుడు, అనంతరము నాలుగు దిక్కులు ఆయనను స్తుతించెను. మనతోసహా అందరూ ఆయననే స్తుతిస్తారని ఇక్కడ నాలుగు దిక్కుల ద్వారా సూచింపబడినది

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ఈ నామమును '**స్తుతిః**' అని చెప్పారు. స్తుతి అనగా స్తోత్రము చేయుట, ప్రార్థించుట. ఇదియును భగవత్స్వరూపమే. వేదగానము, గీతాగానము, విష్ణుసహస్రనామ గానము, భగవన్నామ సంకీర్తనము ఇవన్నియును భగవత్స్వరూపములే.

ధర్మచక్రము రచయిత – మన మనస్సు పరిశుద్ధమైయుంటే భగవంతుడు అందులో ప్రవేశిస్తాడు. అప్పుడే సరైన స్తుతి వాక్కు రూపంలో వెలువడుతుంది.

శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము: (686) **స్తోత్రమ్** – కీర్తించే పదాలు; (687) **స్తుతిః** – కీర్తించే పని.

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము: (686) **స్తోత్రమ్** – కీర్తించడానికి సాధనము, పదాలు, కార్యము; (687) **స్తుతః** – ఆ కీర్తనకు లక్ష్యము.

అన్నమయ్య కీర్తన

ద్వారకా తిరుమలలో అన్నమయ్య విగ్రహం. వికీపీడియా చిత్రం

దాచుకో నీపాదాలకు దగ నే జేసినపూజ లివి
పూచి నీ కీరీతిరూప పుష్పము లివి యయ్యా

వొక్క సంకీర్తనె చాలు వొద్దికై మమ్ము రక్షించగ
తక్కినవి భాండారాన దాచి వుండనీ
వెక్కసమగు నీ నామము వెల సులభము ఫల మధికము
దిక్కై నన్నేలితి విక నవి తీరని నా ధనమయ్యా

నా నాలికపైనుండి నానాసంకీర్తనలు
పూని నాచే నిన్ను బొగడించితివి
వేనామాల వెన్నుడా వినుతించ నెంతవాడ

కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా

యీమాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితిగాని
చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నేమాన బాడే వాడను నేరము లెంచకుమీ
శ్రీమాధవా నే నీదాసుడ శ్రీవేంకటేశుడవయ్యా

688. స్తోతా

- తనను స్తుతించేవారిని ప్రశంసించేవాడు.
- స్తోత్రము చేయువాడు కూడ భగవత్స్వరూపియే.

ఓం స్తోత్రే నమః

స్వ స్తోతారం పరం స్తోతుం శీలం యస్యాస్తి సర్వదా
స్తోతా సస్యాత్పంచవర్ణః సర్వస్తోత్రత్వదో మనుః
తనను స్తుతించేవారిని తానే స్తుతించే (ప్రశంసించే) స్వభావము కలవాడు. ఈ నామము పంచాక్షరి. అందరిచేత స్తుతించబడేట్లు చేస్తుంది. ఓం స్తోత్రే నమః.

శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్య – **స్వ-స్తోతారం స్తోతుం శీలమ్ అస్య ఇతి స్తోత్రా**. తనను స్తుతిచేయువారిని స్తుతించుట ఆయన గుణము. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుధర్మము (75.55)నుండి ఉదాహరించారు. **యం స్తువన్ స్తవ్యతామేతి వందమానశ్చ వంద్యతామ్**. భగవంతుని స్తుతించేవాడు స్వయముగా స్తుతనీయుడు అవుతాడు. భగవంతునికి వందనము చేసేవాడు వందనీయుడు అవుతాడు. శ్రీ భట్టులు శ్రీకృష్ణుని కైలాసయాత్రోదంతాన్ని ఉదాహరించారు. ఆ యాత్రలో శ్రీకృష్ణుడు శంకరుని స్తోత్రం చేశాడు. శంకరుడు సదా తారకమంత్ర ధ్యాననిమగ్నుడై యుండుట వలన కృష్ణుని స్తుతిని పొందినాడు. తనను స్తుతించేవాడు స్తుతనీయుడౌతాడని భగవానుడు చెప్పినట్లు హరివంశములో ఉన్నది.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **స్తౌతి స్వజనాన్ ఇతి స్తోతా**. తనవారిని స్తుతించేవాడు స్తోత.

శ్రీ బలదేవ విద్యాభూషణ – తన భక్తుల ఔన్నత్యాన్ని తెలియబరచేవాడు స్తోత. భగవానుడు తన భక్తుల గొప్పతనమును తెలియబరచేందుకే వారిని స్తుతించును అని చెబుతూ గీతనుండి '**జ్ఞానీత్వాత్మైవ మే మతమ్**' అని ఉదాహరించారు.

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే
ప్రియోऽహి జ్ఞానినోऽత్యర్థమహం స చ మమప్రియః – గీత 7.17

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్

ఆస్థితః స హి యుక్తాత్మా మామేవా నుత్తమాం గతిమ్ – గీత 7.18

ఈ చతుర్విధ భక్తులలో నిరంతరము నాయందే ఏకీభావస్థితుడై, అనన్య భక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన వాస్తవముగ నన్ను తెలిసికొనిన జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు. ఈ చతుర్విధ భక్తులందరును ఉదారులే. కాని జ్ఞానియైనవాడు నా స్వరూపమే. ఏలనన అట్టి భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగానుంచి, నన్నే పరమప్రాప్యునిగా భావించును. ఈ విధముగా అతడు నాయందే స్థితుడు.

శ్రీ చిన్మయానంద గీత (12.14)నుండి ఉదాహరించారు – **మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్తః స మే ప్రియః.**

ధర్మచక్రము రచయిత – గీత 16వ అధ్యాయములో చెప్పినట్లుగా ఇట్టి భక్తులు (భగవంతునిచే ప్రశంసింపబడువారు) అందరిపట్ల దయ కలిగియుందురు. కోపమును త్యజింతురు. సుఖదుఃఖములపట్ల సమభావమును కలిగియుందురు. మనసా వాచా కర్మణా పరిశుద్ధులై, తమ సమస్త కర్మలను భగవానునికి అర్పింతురు. పొగడ్తలకు పొంగరు. నిందలకు క్రుంగరు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్తోతా అపి స ఏవ, సర్వాత్మకత్వాత్.** భగవానుడు సర్వాత్మకుడైనందున, స్తుతి చేయువాడును భగవంతుడే. భక్తితో భగవంతుని కీర్తించేవాడు భగవంతునిలో లీనమగును (శ్రీ చిన్మయానంద వివరణ).

శ్రీ కృష్ణమాచార్య మహాకవి (13-14వ శతాబ్ది) సింహగిరి వచనములు

శ్రీ కె.టి.ఎల్. నరసింహాచార్యులు రచించిన 'ద్వాదశసూరి చరిత్ర'లో ఉదాహరించినవి.

దేవా! విష్ణుభక్తి లేని విద్వాంసునికంటె హరికీర్తనము చేయునతడే కులజుండు. శ్వపచుండైననేమి? ఏ వర్ణంబైన నేమి? ద్విజునికంటె నతడె కులజుండు. దృష్టింజూడగా విద్వజ్జన దివ్యభూషణము. సింహగిరి నరహరిని దలంచిన యాతండె కులజుండు. సంధ్యాది నిత్యకర్మానుష్ఠానంబులు దప్పక నడపిననేమి? చతుర్వేద షట్శాస్త్రములు సదివిన నేమి? శతక్రతువు లాచరించిన నేమి? మా సింహగిరి నరహరి దాసులకు దాసులైనంగాని లేదు గతి! స్వామీ! సింహగిరి నరహరీ! నమో దయానిధీ!

దేవా! అంకిలియనియెడి తెవులింటింటికి ద్రిప్పు. అసత్యకృతమే ముప్పు. తగవు ధర్మము నడిపినదే యొప్పు. అనాథపతీ, నరహరీ! మిమ్ము దలంపనిదే తప్పు. స్వామీ! సింహగిరి నరహరీ! నమో దయానిధీ!

దేవా! శ్రీమన్నారాయణా! పరబ్రహ్మస్వరూపా! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా, వేదవేదాంతవేద్యా! పురాణ పురుషోత్తమా! పురందర వంద్యా, దేవా! కపట నాటక సూత్రధారీ, మాయావినోదా! అగణిత మహిమావతారా! ఆశ్రితజన

మందారా! సకల కళ్యాణగుణోన్నతా! సకల జగదంతర్యామీ, శ్రీమదయోధ్యాపురవరాధీశ్వరా! దశరధరాజ నందనా! కౌసల్యాగర్భ శుక్తిముక్తాఫలా! స్వామీ! సింహగిరి నరహరీ! నమో దయానిధీ!

సింహాచలంలో శ్రీ నృసింహుని మూర్తి. వికీపీడియా చిత్రం.

దేవా! ఏడు రామాయణములు, పదునెనిమిది పురాణములు, భగవద్గీతలు, సహస్రనామములు మొదలయినవి చదివిరేమి? వినిరేమి? వ్రాసిరేమి? మీ సంకీర్తనకు వెయ్యవపాలింటికి సరిరావు. కడమ సంకీర్తన లనేకసార్లు విన్నారు. ఇందుకు తప్పదు. మీ శంఖచక్రంబులాన, మీ పాదపద్మంబులాన, నారాయణ నారాయణయని మంత్రంబనిరేమి? దూదికొండలమీద వటబీజమాత్ర మగ్నిహోత్రుడు ప్రవేశించిన దగ్ధంబైపోదా? స్వామీ! సింహగిరి నరహరీ! నమో దయానిధీ!

దేవా! పెద్దతనంబు జేసి మిమ్ము మెప్పించెదనంటినా, జాంబవంతుడు మీ సన్నిధినే యున్నాడే! దేవా! బుద్ధినే మెప్పించెదనంటినా, విభీషణుండు మీ సన్నిధినే యున్నాడే! దేవా! బంటుతనంబు జేసి మిమ్ము మెప్పించెద నంటినా, అంజనీదేవి సుతుడు హనుమంతుడు మీ సన్నిధినే యున్నాడే! దేవా! తీర్ధంబులాడి మిమ్ము మెప్పించెదనంటినా, సూర్యచంద్రాదులు మీ సన్నిధినేయున్నారే! దేవా! వేదవేద్యుడనై మిమ్ము మెప్పించెద నంటినా, బ్రహ్మ మీ నాభికమలమందు ఉద్భవించియున్నాడే! స్వామీ! సింహగిరి నరహరీ! నమో దయానిధీ!

దేవా! ఇంద్రాది దేవతలు నూరును, హిరణ్యగర్భులిన్నూరును, కాశ్మీరగిరులు మున్నూరును, తిలధాంచన గిరులు నన్నూరును, పతివ్రత లేనూరును, నగ్రహారంబు లారునూరులును, స్త్రీమూర్తు లేడునూరులును, నుభయస్తోమకు లెనిమిది నూర్లును, కపిలధేనువులు వేయిని, కాలచక్రంబులు లక్షయును, తులాపూరుషంబులు కోటియును, కన్యాదానంబులు పదికోట్లును, నివియన్నియు గూడిన మీ దివ్యనామ సంకీర్తన వినినందుకు వేయిలో నొక్కభాగంబును సరిగావు. ఈ సంకీర్తనఫలం బెవరు వ్రాసిరి, యెవరు చదివిరి, యెవరు వినిరి, వారికాయురారోగ్యైశ్వర్యంబులు కృప చేతువు. మా యతిరాజముని వరము. దాతారు. అనాధమతీ, స్వామీ! సింహగిరి నరహరీ! నమో, నమో దయానిధీ!

689. రణప్రియః

- యుద్ధమునందు ప్రీతి కలవాడు.

- పూజాస్థానములందలి మంగళధ్వనులకు ఆనందించువాడు.

- సూర్యాదుల రూపములో సంతోషంగా చరించువాడు.

ఓం రణప్రియాయ నమః

'రణ' శబ్దమునకు రెండు అర్థములున్నవి – చలించుట, శబ్దము (రణ గతౌ, రణ శబ్ద అర్థః). ఈ రెండు అర్థాలు కలిపి 'రణము' అనగా 'యుద్ధము' అనే అర్థం ఉంది. సామాన్యార్థంగా రణప్రియుడు అనగా ధ్వనిప్రదమైన పరిస్థితులలో చలించడానికి ఇష్టపడేవాడు. వీరపురుషుడు యుద్ధంలో విహరించడానికి ఇష్టపడతాడు. శ్రీ శంకరులు, శ్రీ భట్టులు 'రణము' అనగా 'యుద్ధము' అనే అర్థాన్ని గ్రహించారు. శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'చలనము' అనే అర్థాన్నీ, శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'శబ్దము' అనే అర్థాన్నీ తీసుకొన్నారు.

సుహృత్ప్రియం యుద్ధకర్మ యస్యాస్తి స రణప్రియః. తన ఆశ్రితులైన సుహృత్తులను రక్షించడానికి యుద్ధము చేయుటయందు ప్రియము కలవాడు రణప్రియుడు. రామునిగాను, కృష్ణునిగాను భగవానుడు ధర్మసంరక్షణార్థం యుద్ధంలో పాల్గొన్నాడు.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే – గీత 4.8
సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందును.

తతః సకామం సుగ్రీవమంగదంచ మహాబలమ్
చకార రాఘవః ప్రీతో హత్వా రావణమాహవే – రామాయణము. యుద్ధకాండ 11.31
యుద్ధంలో రావణుని హతంచేసి శ్రీరాముడు మహాబలులైన సుగ్రీవ, అంగదులకు ప్రీతి కలిగించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **యతః పంచమహాయుధాని ధత్తే సతతమ్ లోకరక్షణార్థమ్ అతో రణప్రియః**. లోకరక్షణ కొఱకు శ్రీమన్నారాయణుడు శంఖము, చక్రము, గద, శార్ఙ్గము (ధనుస్సు), ఖడ్గము ధరించియుంటాడు గనుక రణప్రియుడు.

శ్రీకృష్ణదత్త భరద్వాజ వైవిధ్యమైన అర్థం చెప్పారు – **రణో రవః మందిరేషు మంగళధ్వనిః, స ప్రియో యస్య ఇతి రణప్రియః**. మందిరాలలో వినవచ్చే మంగళప్రదమైన ధ్వనులు రణము లేదా రవము. అవి ఆయనకు ఆనందకరములు గనుక ఆయన రణప్రియుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – (రణము = చలనము) భగవంతుడు అందరి హృదయాలలోనూ సంచరిస్తూ వారిలోని అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తాడు. సూర్యునిగా సంచరిస్తూ లోకాలకు కాంతినిస్తాడు.

ధర్మచక్రము రచయిత – జీవితంలో యుద్ధం ఒక భాగం. ఒక జీవి మనుగడ మరొక జీవి మనుగడకు వ్యతిరేకం కావచ్చును. మన జీవితంలో అధర్మాన్ని, దుష్ప్రభావాలను ఎదిరించాలంటే యుద్ధం చేయాలి. భగవానుడు అన్ని లోకాలలో అధర్మాన్ని అరికట్టాలి. అందుకే ఆయన పంచాయుధాలు ధరించాడు.

భగవానుని ఈ నామస్మరణద్వారా మనం జీవితం అనే యుద్ధంలో అధర్మాన్ని జయించి ధర్మాన్ని ఆచరింపవచ్చును. ఓం రణప్రియాయ నమః.

690. పూర్ణః

సంపూర్ణమైనవాడు.

- అన్ని కోరికలు తీరినవాడు.
- అన్ని కళ్యాణగుణములు నిండియున్నవాడు.
- అన్ని శక్తులు గలవాడు.
- స్వల్పనివేదనలతో సంతోషించువాడు.
- అంతటా అన్నింటా నిండియున్నవాడు.

ఓం పూర్ణాయ నమః

'పూరీ' – ఆప్యాయనే - నింపుట, సంతోషపెట్టుట – అనే ధాతువునుండి ఈ నామమును వివరింపవచ్చును.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అవాప్త సమస్త కామాన్.** అన్ని కోరికలు తీరినవాడు. ఇంకా ఏమీ అవుసరం లేనివాడు, పూర్ణుడు. అందుకే పెద్దగా శ్రమపడకుండా, ఏమీ ఖర్చుపెట్టకుండా, భారీ సంభారాలు లేకుండా, కేవలం ధ్యాన కీర్తన పూజాదులద్వారా భగవంతుని సంతోషపెట్టవచ్చును.

లక్ష్మీపతియైన భగవంతునికి ఇంకేమి కావాలని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సకలైః కామైః, సకలాభిః శక్తిభిశ్చ సంపన్న ఇతి పూర్ణః.** భగవంతుడు అన్నికోరికలు తీరినవాడు (పూర్ణకాముడు) మరియు అన్ని శక్తులు కలిగినవాడు (కనుక కోరికలు తీర్చుకొనగల శక్తిమంతుడు) కనుక పూర్ణకాముడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు అంతటా వ్యాపించియున్నవాడు. అన్నింటా నిండియున్నాడు. అన్నీ ఆయనలో ఉన్నవి. కనుక ఇంక ఆయనకు కావలసింది ఏమీలేదు. కనుక ఆయన పూర్ణుడు.

ఈశావాస్యోపనిషత్తు (బృహదారణ్యకము 5.1.1) శాంతిమంత్రము ఇలా చెబుతున్నది –

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఆయన అన్ని విధాలా పరిపూర్ణుడు. ఆయననుండి ఉద్భవించునదికూడా పూర్ణమైనది. అలా ఆయననుండి పూర్ణములైనవి అనేకములు వెలువడినా ఆయనమాత్రం ఎన్నటికీ ఎలాగైనా పరిపూర్ణుడే. ఇతర ఉపనిషద్వాక్యాలు: **పూర్ణమ్ అప్రవర్తి** (బృహదారణ్యక 2.1.5); **తదేతత్ పూర్ణమ్ అప్రవర్తి** (ఛాందోగ్య 3.1.2)

శ్రీ బలదేవ విద్యాభూషణ 'పూర్ణః' అనే ఈ నామము అర్థాన్ని ఇంతకుముందు నామమైన 'రణప్రియః'తో అనుసంధానించారు. తన శత్రువులను సంపూర్ణంగా నాశనం చేసేవాడు పూర్ణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **పూర్యతే ఆప్యాయతే స్మకళ్యాణగుణైః ఇతి పూర్ణః.** అనంత కళ్యాణగుణములు కలవాడు గనుక ఆయన పూర్ణుడు. **భక్తార్పితైః ఫల కుసుమాదిభిః తర్పిత ఇతి పూర్ణః.** భక్తులు అర్పించిన పండ్లు, పూలువంటి సామాన్యమైనవానితో సంపూర్ణుడై సంతృప్తిని పొందువాడు పూర్ణుడు.

ధర్మచక్రము రచయిత – లోకంలో కోరికలు తీరినకొద్దీ ఇంకా కావలసినవి పెరుగుతూ ఉంటాయి. ఇప్పటి చదువులు కూడా వ్యామోహము పెంచేవేకాని భగవంతునిదరికి చేర్చేవి కావు. భగవంతునిపట్ల భక్తి, శ్రద్ధ మాత్రమే ఇందుకు మందులు. మనకు నిజంగా కావలసింది మనలోనే ఉంది అని గ్రహించి ఆత్మజ్ఞానంద్వారా సంతృప్తిని పొందవచ్చునని ఈ నామధ్యానంద్వారా తెలుస్తుంది.

691. పూరయితా

తన భక్తుల కోరికలు పూర్తిచేయు (తీర్చు)వాడు.

ఓం పూరయిత్రే నమః

భగవంతుడు భక్తుల అర్హతలనుబట్టి వారుకోరేవానిని (ధర్మార్థకామమోక్షములను) ప్రసాదిస్తుంటాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుని స్తుతించాలనే భక్తుల కోర్కెలను తీరుస్తూ, అనగా తాను స్తవప్రియుడు (685వ నామము) అవుతూ, భగవతుడు పూరయిత అవుతున్నాడు. నిజమైన భక్తుని ఒకేఒక్క కోరిక ఏమంటే భగవంతునికి కైంకర్యము చేయాలని. భగవంతుడు తాను పూర్ణుడు (690వ నామము) అయినా కూడా భక్తులకు ఈ అవకాశం ఇస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు స్వయముగా పూర్ణుడు (690వ నామము) మాత్రమే కాకుండా తగు సమయంలో ఇతరులను పూర్ణులుగా చేస్తాడు గనుక పూరయిత.

ధర్మచక్రము రచయిత – భక్తుని కోరిక తీర్చడానికై భగవంతుడు ఎంతపని చేస్తాడు? తాను ఆయుధం పట్టనని యుద్ధానికి ముందు కృష్ణుడన్నాడు. భగవంతునితో ఆయుధం పట్టిస్తానని భీష్ముడు ప్రతిన పూనాడు. భీష్ముని (భక్తుని)మాట నెగ్గించడంకోసం భగవంతుడు ఆయుధం పట్టి తనమాటను తానే అతిక్రమించాడు.

692. పుణ్యః

- పవిత్రము చేయువాడు.
- పుణ్యకార్యము ఆచరించుటయందు శ్రేష్ఠుడు.

ఓం పుణ్యాయ నమః

ఈ పవిత్రనామము రెండుమార్లు వస్తుంది.

73వ శ్లోకము. 692వ నామము. పుణ్యః – **పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తిః అనామయః**

99వ శ్లోకము. 925వ నామము. పుణ్యః – **ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుస్వప్ననాశనః**

ఈ నామమును రెండు ధాతువుల ఆధారంగా వ్యాఖ్యానించారు:

పు - పావనే - పవిత్రము చేయుట; పుణ్ - శుభకర్మాణి - మంగళ కార్యములందు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **పుణాతి ఇతి పుణ్యః**. పావనము చేయువాడు పుణ్యుడు. అతినీచులైన పాపులుకూడా భగవన్నామస్మరణం చేసి పవిత్రులయ్యేలా చేసేవాడు గనుక భగవంతుడు పుణ్యుడు. 'పుణ్యన్' అనే పదాన్ని ఆళ్వారులు ఎంతో మక్కువతో అనేక సందర్భాలలో భగవంతుని సంబోధిస్తూ వాడారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్మృతిమాత్రేణ కల్మషాణి క్షపయతి ఇతి పుణ్యః**. భగవంతుని స్మరించినంతనే కల్మషాలు నశించును గనుక భగవంతుడు పుణ్యుడు. ఇంద్రియసుఖాలను గురించిన ఆలోచనలు మనల్ని భగవంతునికి దూరం చేస్తాయి. భగవంతుని గురించిన ఆలోచనలు పవిత్రత కలుగజేసి శ్రీహరికి దగ్గరచేస్తాయి.

925వ నామము 'పుణ్యః'కు శ్రీ భట్టులు చెప్పిన అర్థం శ్రీ శంకరులు ఈ (692వ)నామము 'పుణ్యః'కు చెప్పిన వ్యాఖ్యకు సరిపోతుంది. అదేమంటే భగవంతుడు తన భక్తులను ఉద్ధరించిన ఉదంతాలను మననం చేసికోవడం మాత్రాన మనం పరిశుద్ధులమవుతాము. ఉదాహరణకు గజేంద్రమోక్షము పారాయణం, స్మరణం, ధ్యానంవంటి కార్యములు. శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా 925వ నామాన్ని ఇలానే వ్యాఖ్యానించారు.

925వ నామమునకు శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వేషామ్ శ్రుతి స్మృతి లక్షణాయ వాచా పుణ్యమ్ ఆచష్ట ఇతి వా పుణ్యః**. శృతి, స్మృతుల బోధనలద్వారా పుణ్యమార్గములను ఉపదేశించి సాధువులను బ్రోచుచున్నాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ ఈ (692వ) నామమునకు చెప్పిన వ్యాఖ్య – కంసునివంటి దుర్మార్గులను నాశనం చేసినందున భగవంతుడు పుణ్యుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **పూయతే వా అనేన ఇతి పుణ్యః, పవిత్రః పాపానవిద్ధః శుభో వా**. ఏ విధమైన లోపములు, అధర్మములు లేనివాడు మరియు పవిత్రము చేయువాడు పుణ్యుడు. భగవంతుడు సూర్యుని రూపంలో తాను స్వయంగా పవిత్రుడు అగుటయేగాక అన్నింటిని పవిత్రము చేయును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరియు శ్రీ కృష్ణదత్త భరద్వాజ చెప్పిన మరొక అర్థము – **పుణతి శుభకర్మ ఆచరతి ఇతి పుణ్యః**. స్వయముగా శుభకర్మలు ఆచరించేవాడు పుణ్యుడు.

693. పుణ్యకీర్తిః

ఆయనను కీర్తించడంవలన పవిత్రత లభించును.

ఓం పుణ్యకీర్తయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవానుని నామసంకీర్తనమువలన భక్తులు పునీతులవుతారు.

నామసంకీర్తనమ్ పుంసామ్ విలాయనమ్ అనుత్తమమ్

మైత్రేయ! అశేష పాపానామ్ ధాతూనామివ పావకః – విష్ణుపురాణము 6.8.20

మైత్రేయా! లోహమును అగ్ని పరిశుద్ధము చేసినట్లుగానే విశేషమైన నామసంకీర్తనంవల్ల అశేష పాపములు నశించును.

అవశేనాऽపి యన్నామ్ని కీర్తితే సర్వపాతకైః

పుమాన్ విముచ్యతే సద్యః సింహత్రాతైః మృగైరివ – విష్ణుపురాణము 6.8.19

సింహం వచ్చినపుడు మృగాలు పారిపోయినట్లుగా భగవంతుని కీర్తించినపుడు పాపాలు పటాపంచలవుతాయి.

ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞై స్త్రేతాయాన్ ద్వాపరేరర్చయాన్

యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవం – విష్ణుపురాణము 6.2.17

కృతయుగమునందు ధ్యానము (తపస్సు)వలన, త్రేతాయుగమందు యజ్ఞమువలన, ద్వాపరయుగమందు అర్చనవలన కలిగే ఫలము కలియుగమందు కేశవసంకీర్తనవలన లభించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పుణ్యమ్ ఆవహతి అస్య కీర్తిః నృణామ్ ఇతి పుణ్యకీర్తిః**. భగవంతుని కీర్తి భక్తులకు పుణ్యము (పవిత్రత) కలిగించును.

ఇంతకుముందు నామము 'పుణ్యః' అంటే స్మృతిమాత్రాన పవిత్రత కూర్చువాడు. ఈ నామము 'పుణ్యకీర్తిః' అనగా ఆయన కీర్తి కారణంగా ఆయనను స్మరిస్తాము. కనుక పుణ్యం లభిస్తుంది.

అన్నమయ్య కీర్తన

నీకథామృతము నిరతసేవన నాకు
చేకొనుట సకల సంసేవనంబటుగాన

ఇదియే మంత్రరాజము నాకు నే ప్రొద్దు

ఇదియే వేద సంహిత పాఠము
ఇదియె బహుశాస్త్ర మెల్ల చదువుటనాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటుగాన

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహిత మార్గము
ఇదియె భవ రోగరహిత భేషజమునాకు
ఇదియె ఉపనిషద్వాక్య పద్ధతి

ఇదియె దాన ఫలమీ జాలినది నాకు
ఇదియె తలప పరహిత మార్గము
ఇదియె తిరువేంకటేశ నీ సంస్మరణ
మిదియె ఇదియె యిన్నియును నటుగాన

---

694. అనామయః

- సంసారమనే వ్యాధిని తొలగించువాడు.
- అన్ని విధములైన దుఃఖములకు, కష్టములకు అతీతుడు.

ఓం అనామయాయ నమః

ఈ నామమునకు మూలధాతువులు – 'మీ' - హింసాయామ్ – మరణించుట, నశించుట; ఆమయ – వ్యాధి, దుఃఖమునకు సంబంధించినది; అనామయ – రోగరహితము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సంసార మహావ్యాధి విరోధీ.** అన్నింటికంటె పెద్ద వ్యాధి అయిన సంసార బంధమునకు విరోధి. అలా తన భక్తులకు భగవదనుభవాన్ని దగ్గర చేసేవాడు. ఇందుకు శ్రీ భట్టులు ఛాందోగ్యోపనిషత్తు (4.10.3)నుండి ఉదాహరించారు. **వ్యాధిభిః పరిపూర్ణోస్మి** – సంసారము గురించి తెలుసుకొన్నవారు తాము వ్యాధితో నిండియున్నామని చెప్పారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – కర్మవల్ల కలిగే అంతర్, బాహ్య దుఃఖాలన్నింటికీ పూర్తిగా అతీతుడు కనుక భగవంతుడు అనామయుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **న ఆమయో రోగో యస్య ఇతి అనామయః దివ్యమంగళవిగ్రహః.** ఆయన దివ్యమంగళ స్వరూపము ఏ విధమైన వ్యాధికిని అతీతము. ఆయన దివ్యసత్వశుద్ధ స్వరూపుడు. కనుక ఏ విధమైన శారీరిక, మానసిక వ్యాధులును ఆయన దరిచేరవు.

ధర్మచక్రము రచయిత – శరీరము స్థూలము. మనసు సూక్ష్మము. వీనికి కష్టము కలిగించునది వ్యాధి. జీవుడు శరీరము, మనసునకు లోబడియుండుటవలన వానికి శ్రమ, నొప్పి, వ్యాధి కలుగుతాయి. భగవంతునికి ఇవి వర్తింపవు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

మనోజవస్తీర్థకరో వసురేతా వసుప్రదః |

వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః || (74)

695. మనోజవః

మనస్సువంటి వేగము కలవాడు. తన భక్తులకు అతిశీఘ్రముగా సంపదలనిచ్చేవాడు.

ఓం మనోజవాయ నమః

'జంగ్' - గతౌ -వెళ్ళుట – అనే ధాతువునుండి 'జవము' అనగా వేగము అని అర్థము. **'ఏతాని స వేగ - గతి - నామాని'** అని అమరకోశంలో 'జవ'కు సంబంధించిన అనేకపదాలున్నాయి. **మనసో జవ ఇవ జవో యస్య ఇతి మనోజవః.** మనసువంటి వేగము కలవాడు 'మనోజవః'

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు నామాలలో చెప్పిన ఫలము - పావనము చేయుట -కు కావలసిన కార్యాలన్నీ మనసుకంటే వేగంగా చేసేవాడు 'మనోజవః'. ఇందుకు శ్రీ భట్టులు గీతనుండి, విష్ణుధర్మమునుండి ఉదాహరించారు.

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి – గీత 9.31
కౌంతేయా! అతడు (నన్ను అనన్యభక్తితో భజించేవాడు) శీఘ్రముగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును. 'నా భక్తుడెన్నటికిని నష్టపోడు' అని నిశ్చయముగా నెఱుంగుము.

సప్తజన్మకృతం పాపం స్వల్పం వా యది వా బహు
విష్ణోరాలయ విన్యాస ప్రారంభదేవ నశ్యతి – విష్ణుధర్మము 83.20

ఏడు జన్మల పాపాలు, కొంచెమైనా, ఎక్కువైనా గాని - అవి ఒక్కమారు విష్ణువు ఆలయంలో అడుగుపెట్టగానే నశిస్తాయి.

శ్రీ నమ్మాళ్వార్ తిరువైమొళి 1.6.10లో భగవంతుడు ఎంతవేగంగా భక్తుల పాపాలను హరిస్తాడో చెప్పారు. శ్రీమహాలక్ష్మి ఆయనయందే నిత్యం ఉండుటవలన చిటికెకంటె తక్కువ సమయంలో మనం ఎంతోకాలంగా చేసిన పాపాలను నశింపజేయును. శ్రీ వి.వి. రామానుజన్ గజేంద్రమోక్షమునుండి ఉదాహరించారు. గరుడుని వేగంపై కూడా ఆధారపడకుండా, తన వస్త్రాదులను పట్టించుకోకుండా విష్ణువు తన భక్తుని కాపాడడానికి పరుగెట్టాడు.

సిరికిం జెప్పడు శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్కనొత్తడు వివాదప్రోత్థిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై – పోతన భాగవతము. గజేంద్రమోక్షము.

శ్రీ అణ్ణంగారాచార్య స్వామి – భగవంతుడు మనోవేగంతో, సంకల్పమాత్రాన భక్తుల కోరికలను తీరుస్తాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – తనకు శరణాగతులైనవారి సంసారబంధాలను మనోవేగంతో తొలగిస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మనసో జవః, వేగ ఇవ వేగోऽస్య సర్వగతత్వాత్ ఇతి మనోజవః.** భగవంతుడు మనోవేగం కలవాడు. అన్నిచోట్ల ఒకేమారు ఉండువాడు.

అనేజదేకమ్ మనసోజవీయో నైనద్దేవాऽऽప్నువాన్ పూర్వమర్షత్
తద్ధావతోऽన్యాన్ అత్యేతి తిష్ఠత్తస్మిన్నపోమాతరిశ్వదదాతి – ఈశావాస్యోపనిషత్తు 4
భగవంతుడు తన పరంధామంలో ఉన్నప్పటికీ మనసుకంటే వేగంగా ఎక్కడైనా ఉండగలడు.....

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – దేశకాలవస్తువులు వేగానికి ప్రతిబంధకాలు. కాని భగవంతునికి ఇవేవీ అడ్డుకావు. ఆయన అన్నిచోట్లా, అన్ని కాలాలలో అన్నింటా ఉంటాడు.

అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యతి అచక్షుః స శృణోతి అకర్ణః
స వేత్తి వేద్యమ్ న చ తస్య అస్తి వేత్తా తమాహుః అగ్ర్యమ్ పురుషమ్ మహాన్తమ్ – శ్వేతాశ్వరోపనిషత్తు 3.19
ఆయన కాళ్ళు, చేతులు వాడకుండా కదులుతాడు, పట్టుకొంటాడు. కనులు లేకుండా చూస్తాడు. చెవులు లేకుండా వింటాడు. ఆయనకు తెలియనిది లేదు. ఆయనను తెలిసినవారు లేరు. ఆయనను ప్రథముడు అనీ, మహా అనీ అంటారు.

ధర్మచక్రము రచయిత – భగవంతుని ధ్యానించిన కొలదీ మనకు దేశ కాల వస్తు అవరోధాలు తగ్గుతాయి. మనం భగవంతునికి దగ్గర అవుతాము.

696. తీర్థకరః

- పుణ్యజలములకు మూలమైనవాడు.
- మనలను సంసారసాగరం దాటించేవాడు.
- ఆయన కరస్పర్శ పావనం చేస్తుంది.
- తనను చేరడానికి వివిధ అవతారములు, గురువులు వంటి సోపానములను ఏర్పాటు చేసినవాడు.

ఓం తీర్థకరాయ నమః

గంగాదితీర్థ హేతుత్వాత్ శ్రుతిస్మృత్యోః ప్రవర్తనాత్
ఆత్మప్రవేశ సోపాన కృత్వా తీర్థకర స్మృతః
గంగ మొదలైన పుణ్యతీర్థములకు కారణమైనవాడు. శ్రుతులు, స్మృతులు ప్రవర్తింపజేయువాడు. అనితరసాధ్యమైన ఆత్మప్రవేశం చేయడానికి మార్గం వంటివాడు తీర్థకరుడు.

'తీర్థము' అనే పదము 'తౄర్ - ప్లవన తరణయోః - ఈదుట, దాటుట' అనే ధాతువునుండి వచ్చినది. అందునుండే పవిత్రముచేయు జలాలను కూడా తీర్థము అన్నారు. మరోవిధంగా, **తరత్యనేన పాపమ్ అజ్ఞానమ్ ఇతి తీర్థమ్** – అజ్ఞానమును నశింపజేసి, పాపములనుండి తరింపజేయు వేదాదులు కూడా తీర్థములని చెప్పారు. ఇంకోవిధంగా సంసారాన్ని దాటి భగవంతుని చేరడానికి చేయూతనిచ్చే అవతారమూర్తులు (పర, వ్యూహ, విభవ, అర్చా, అంతర్యామి అవతారాలు) తీర్థములని వ్యాఖ్యాతలన్నారు. శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి పాశురము 7.10.1 ప్రకారము మూడు స్థావర తీర్థములున్నాయి (1) పెరుమాళ్ళు (2) పవిత్రమైన ఆళ్వారు పాశురాలు (3) ఆ పాశురాలను గానం చేసే భక్తులు.

'కరః' అనే శబ్దాన్ని వ్యాఖ్యాతలు రెండు విధాలుగా వ్యాఖ్యానించారు. (1) 'కృ - కరణే' ధాతువునుండి - చేయువారు (2) కరము – చేయి.
పైన చెప్పిన అర్థాల ప్రకారం 'తీర్థకరః' నామాన్ని అనేక విధాలుగా వ్యాఖ్యానించారు.
- తీర్థములను సృష్టించు (తయారుచేయు)వాడు (శ్రీ సత్యదేవో వాసిష్ఠ)
- శాస్త్రములను సృష్టించువాడు.
- పవిత్రమొనరించు చేయి కలవాడు (శ్రీ కృష్ణదత్త భరద్వాజ)

శ్రీ భట్టులు మూడు అర్థాలు చెప్పారు –
(1) భగవంతుడు గంగాది పవిత్ర నదులకు, పవిత్ర పుష్కరుణలకు మూలము కనుక ఆయన తీర్థకరుడు. ఆయా నదులు, సరస్సులు, భగవన్నామము కూడా భక్తులను పావనమొనర్చును.

(2) యోగము, జ్ఞానము, సాంఖ్యము (విజ్ఞానము, కళలు, శాస్త్రములు) ఆయననుండి జనించినవి గనుక ఆయన తీర్థకరుడు.
(3) భగవంతుడు సముద్రమువలెనే అందరానివాడు. కాని తన అవతారములనెడు సోపానములద్వారా భక్తులు ఆయనను చేరే వీలు కల్పించిన తీర్థకరుడు.

స్వామిదేశికన్ దయాశతకంలో రెండవ శ్లోకం (**విగాహే తీర్థ బహుళమ్ శీతలామ్ గురు సంతతిమ్**)లో రచయిత – అగాధమైన భగవంతుని చేరడానికి తీర్థములైన గురుపరంపరకు ప్రణమిల్లారు. ఈవిధంగా గురువును, గురుపరంపరను ప్రసాదించిన కారణంగా కూడా భగవంతుని తీర్థకరుడని అనవచ్చును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'తీర్థము' అనగా 'విద్య' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. **చతుర్దశ విద్యానామ్ బాహ్యవిద్యా సమయానామ్ చ ప్రణేతా ప్రవక్తా చ ఇతి తీర్థకరః**. పదునాలుగు విద్యలను, మరియు సంబంధిత బాహ్యవిద్యలను తెలియబరచినవాడు తీర్థకరుడు. 4 వేదాలు, 6 వేదాంగాలు (శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము), 2 దర్శనములు (న్యాయ, మీమాంస), ధర్మశాస్త్రములు, పురాణములు – ఇవి 14 విద్యలు. ఇంకా నాలుగు విద్యలు (ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము) ఉన్నాయి. (ఇవి కాక అసుర (నాస్తిక) స్వభావం కలవారిని (బౌద్ధులు, జైనులు....) పెడమార్గం పట్టించే విద్యలగురించి కూడా ప్రస్తావన ఉంది).

విద్యలు (తీర్థములు) బోధించినవారిలో ఆద్యుడు కనుక భగవానుడు తీర్థకరుడని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **తీర్థః తారకః కరో యస్య ఇతి తీర్థకరః**. ఎవని కరస్పర్శ సకల పాపములను, అజ్ఞానమును నశింపజేసి పావనము చేయునో అతడు తీర్థకరుడు. భగవంతుని స్పర్శమాత్రమున గజేంద్రుడు అజ్ఞానబంధంనుండి విముక్తుడై, పీతాంబరధారియై, చతుర్భుజములు కలిగి హరి పార్షదత్వమును పొందాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – తీర్థము అనగా దాటుట. కరము అనగా చేయుట. సూర్యాది గ్రహముల చలనమునకు కారణమైనవాడు తీర్థకరుడు.

697. వసురేతా

- ప్రకాశమునకు జన్మస్థానము.
- విశ్వసృష్టియందు బంగారమువలె ప్రకాశించువాడు.
- విశ్వమునకు మూలమైనవాడు.

ఓం వసురేతసే నమః

ఈ నామము మొదలుగా, 786వ నామమువరకు, భగవానుని శ్రీకృష్ణావతారమును సూచించునవిగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. 848వ నామమువరకు భగవానుని 'దుష్టనిగ్రహ శిష్టపరిపాలనము'ను సూచించునవిగా శ్రీ వి.వి. రామానుజన్ వర్గీకరించారు.

గోపాలతాపిని ఉపనిషత్తునుండి (డా. క్రోవి పార్థసారథి రచన శ్రీ కైవల్యసారథినుండి)

పూర్వకాలంలో కొందరు మునీశ్వరులు తపోనిష్ఠాగరిష్ఠుడైన ఒక బ్రాహ్మణుని దగ్గరకు పోయి ఇలా అడిగారు – బ్రాహ్మణోత్తమా! గొప్పవాడైన దేవుడెవరు? మృత్యువు ఎవరికి భయపడుతుంది? ఎవరిని తెలుసుకొన్నందువల్ల అన్ని విషయాలు తెలుస్తాయి? ఈ జగత్తు ఎవరివల్ల నడుస్తున్నది? ఈ విషయాలన్నీ దయచేసి మాకు వివరించండి.

దానికి ఆ ద్విజశ్రేష్టుడు ఇలా అన్నాడు – తాపసోత్తములారా! శ్రీకృష్ణుడు పరదేవత. అతని పేరు వింటేనే మృత్యువు కూడా భయపడుతుంది. అతన్ని గురించి తెలుసుకుంటే సర్వమూ తెలుస్తుంది. అతనివల్లనే ఈ జగత్తు నడుస్తున్నది. అతడే పాపములు పోగొట్టే మహానుభావుడు. వేదవిదుడు. అతడే పరబ్రహ్మ. అతన్ని స్మరించినంతమాత్రం చేతనే మృత్యువు తొలగిపోయి, సాధకుడు మృత్యువు లేనివాడు అవుతాడు.

అతడు హిరణ్మయుడు, గోపవేషుడు, మేఘమువంటివాడు, తామరలవంటి కనులు గలవాడు, మెరుపువంటి వస్త్రము కలవాడు. రెండు భుజములవాడు. జ్ఞానముద్ర కలవాడు. వనమాల ధరించినవాడు. దివ్యాలంకార భూషితుడు. రత్నపద్మమధ్యగతుడు. కాళిందీజలకల్లోలమారుతము సేవించేవాడు. అట్టి శ్రీకృష్ణుని సేవించినవాడు సంసార బంధనాలనుండి విడివడి ముక్తుడవుతాడు. అతన్ని సేవించడానికి ఐదు పదముల మంత్రమున్నది. అందులో
క్లీం కృష్ణాయ – మొదటి పదము
గోవిందాయ – రెండవ పదము
గోపీజన – మూడవ పదము
వల్లభాయ – నాల్గవ పదము
స్వాహా – ఐదవ పదము.

ఈ మంత్రాన్ని ఉపాసన చేసినవాడు బ్రహ్మపదము పొందుతాడు. శ్రీకృష్ణుడు ఒక్కడే అయి ఉండి అనేక రకాలుగా ప్రకాశిస్తున్నాడు. అతనిని సేవించినవారికి శాశ్వత సుఖము కలుగుతుంది. అతడే వాసుదేవుడు. సచ్చిదానందుడు. బృందావనంలో కల్పవృక్షము నీడన విశ్రమించినవాడు. విశ్వరూపుడు. సృష్టి స్థితి లయాలకు కారణమైనవాడు. విజ్ఞానరూపి, పరమానందుడు, కమలనేత్రుడు, కమలనాభుడు, కమలాపతి, నెమలి పింఛముతో అలరారేవాడు, కంసుని సంహరించినవాడు, అతడే శ్రీకృష్ణపరమాత్ముడు. దేవాదిదేవుడు, సృష్టి స్థితి లయ కారకుడు, పరబ్రహ్మ.

దేవభేదేఽనలే రశ్మౌ వసూ రత్నే ధనే వసు
విష్ణౌ చ వేధాః స్త్రీత్వాశీర్హితాశంసా హి దంష్ట్రయో – అమరకోశము (3.4.288)

'వసు' శబ్దమునకు ఒక జాతి దేవతలు (దేవభేదము), అగ్ని, కాంతి, కళ్ళెము, రత్నము, ధనము, విష్ణువు, తెలిసినవారు (వేధా) అనే అర్థాలున్నాయి. 'రేత'కు మూలధాతువు 'రీ' - శ్రవణే - ప్రవహించుట. ఈ పదాన్ని రేతస్సు, విత్తనము, కారణమువంటి అర్థాలలో వాడుతారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'వసు' అనగా 'ప్రకాశము' (**వసు ఇతి జ్యోతి పర్యాయః**), 'రేతస్' అనగా 'మూలము' లేదా 'కారణము' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. దివ్యప్రకాశమునకు మూలమైనవాడు, సూర్యాదులకు కాంతినిచ్చేవాడు 'వసురేత'. శ్రీ భట్టుల వ్యాఖ్యను నిరుక్తిలో ఇలా చెప్పారు –

వసుశబ్దో జ్యోతిరర్థో రేతస్తత్కారణమ్ మతమ్
దివ్యజ్యోతిః కారణత్వాత్ వసురేతా ప్రకీర్తితః

శ్రీ అణ్ణాంగారాచార్య స్వామి – తన అవతారములకు తన దివ్యతేజస్సు కారణమైనవాడు వసురేత. ఉదాహరణకు ఆయన దివ్యతేజస్సుగా దేవకి గర్భంలో ప్రవేశించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వసువర్ణమ్ రేతాః అస్య ఇతి వసురేతాః**. బంగారమువంటి వీర్యము కలవాడు వసురేత. ఇందుకు శ్రీ శంకరులు వ్యాసుని రచనను ఉదాహరించారు –

దేవః పూర్వమాపః సృష్ట్వా తాసు వీర్యముపాసృజాత్
తదాండమ్ భవత్ హైమమ్ బ్రహ్మణః కారణమ్ పరమ్

పరమేశ్వరుడు సృష్టి చేయాలని సంకల్పించి, ముందుగా నీటిని సృష్టించి, అందు తన వీర్యాన్ని ఉంచాడు. అది హిరణ్మయాండము (బంగారు గ్రుడ్డు) అయినది. దానినుండి బ్రహ్మ ఉద్భవించాడు అని పురాణాలలో చెప్పబడింది. కనుక పరమేశ్వరుడు హిరణ్యగర్భుడు. వసురేత.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'వస్' - నివసే - నివాసముండుట; 'రేతస్' - కారణము. ఎవనియందు విశ్వము అంతర్గతమై (నివాసం) ఉంటుందో అతడు వసు. విశ్వంలో అన్నింటికీ కారణమైనవాడు వసురేత.

ధర్మచక్రము రచయిత – బంగారంనుండి ఆభరణాలు తయారైనట్లుగా భగవంతునినుండి సకలజీవులు ఉద్భవిస్తాయి. సృష్టి సమయంలో బంగారంలా ప్రకాశించేవాడు దేవుడు. ఆభరణాల తయారీకి బంగారంలో అన్యలోహాలు కలిపినట్లుగా సృష్టికొరకు ఆయన వీర్యానికి పాంచభౌతికమైన మూలప్రకృతి తోడవుతుంది.

కన్నులు గల్గువాడు మఱి కావనివానికి త్రోవజూపగా
జన్న తెఱంగు మూఢునకు సమ్మతి దా గురుడౌట; సూర్యుడే
కన్నులుగాగ భూతముల గాంచుచునుండు రమేశ! మాకు ను
ద్యన్నయమూర్తివై గురువవై సద్గతి జాడ జూపవే – భాగవతము. అష్టమస్కంధము.

698. వసుప్రదః

699. వసుప్రదః

- గొప్ప సంపదలను ఇచ్చువాడు.
- తనను తానే మహాధనంగా ప్రసాదించువాడు.
- కుబేరాదులకు కూడా అనంత సంపదల నిచ్చువాడు.
- అత్యుత్తమమైన మోక్షసంపదనిచ్చువాడు.
- సకల జీవులకు నివాసస్థలం కలిగించేవాడు.
- యశస్సును ఇచ్చువాడు.

ఓం వసుప్రదాయ నమః

ఓం వసుప్రదాయ నమః

హళెబీడులో శ్రీలక్ష్మీనారాయణుల శిల్పాలు. వికీపీడియా చిత్రం.



29వ శ్లోకంలో 270వ నామము '**వసుదః**' అని గమనించాలి. **సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః.**

ఆ 'వసుదః' నామమునకు వ్యాఖ్యానకర్తలు సాధారణంగా 'సంపదలు ఇచ్చేవాడు' అని అర్థం చెప్పారు. ఇప్పుడు ఈ 74వ శ్లోకంలో 'వసుప్రదః' నామము వెంటవెంటనే రెండు సార్లు వచ్చింది.

మనోజవస్తీర్థకరో వసురేతా <u>వసుప్రదః</u>

<u>వసుప్రదో</u> వాసుదేవో వసుః వసుమనా హవిః

270వ నామము '**వసుదః**'కు 'ప్ర' అక్షరం అదనంగా చేరిస్తే 698, 699 నామములు '**వసుప్రదః**' వచ్చును. ఈ నామములకు వ్యాఖ్యాతలు చెప్పిన అర్థాలు – కుబేరసమంగా ప్రత్యేకమైన సంపదలు ఇచ్చువాడు, తనను తానే ప్రసాదించువాడు, మోక్షమునిచ్చువాడు, శాశ్వతమైన యశస్సును ఇచ్చువాడు – ఇలా వ్యాఖ్యానకర్తలు పునరుక్తిదోషం లేదని నిరూపించారు. **వసుధమ్ ప్రకర్షేణ దదాతి ఇతి వసుప్రదః** – వసువును, అనగా ధనమును, విశేషముగా ఇచ్చువాడు వసుప్రదుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

<u>698. వసుప్రదః</u> – పరమనిధియైన తనను తానే ధనముగా భక్తులకు ప్రసాదించేవాడు వసుప్రదుడు.

దేవకీ వసుదేవాభ్యాం ఆత్మరూపం మహద్ధనం
పుత్రత్వేన ప్రకర్షేణ దదాతీతి వసుప్రదః.

దేవకీ వసుదేవులకు తాను అనే మహాధనాన్ని పుత్రరూపంగా ప్రసాదించినవాడు వసుప్రదుడు.

699. వసుప్రదః – గొప్ప యశస్సును, కీర్తిని, తేజమును ప్రసాదించువాడు వసుప్రదుడు.

దేవకీ వసుదేవాభ్యాం స్వపితృత్వం మహద్వసు

తేజో యః ప్రదాతీతి వసుప్రద ఇతీరితః

దేవకీ వసుదేవులకు తన తల్లిదండ్రులుగా ఉండడం అనే గొప్పకీర్తి (వసువు)ను ఇచ్చినవాడు వసుప్రదుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

698. వసుప్రదః – కుబేరాదులకు కూడా నిజంగా సంపదను ప్రసాదించువాడు వసుప్రదుడు. కుబేరునకు ధనాధికారి అనే పేరు ఉందిగాని భగవంతుని కటాక్షమువల్లనే అతనికి ఆ ధనం, ఆ దనాన్నిచ్చే పేరు సంభవించాయి.

699. వసుప్రదః – అన్నింటికంటె అత్యుత్తమమైన సంపద, అనగా మోక్షమును ప్రసాదించేవాడు వసుప్రదుడు.

వసు - మోక్షాఖ్యం ప్రకృష్టం ఫలం భక్తేభ్యః ప్రదదాతి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్య –

698. వసుప్రదః – 'వసు' అనగా నివాసముండుట (వసించుట). **వసత్యస్మిన్ ఇతి వసుః, వాసన్తమ్ ప్రదదాతి ఇతి వసుప్రదః.** సకల జీవులకు తనయందే నివాసముండునట్లు చేసినవాడు వసుప్రదుడు.

699. వసుప్రదః – సంపదలను ఇచ్చువాడు వసుప్రదుడు.

700. వాసుదేవః

- వ్యాపించువాడు, క్రీడించువాడు.
- వసుదేవుని సుతుడు.
- ప్రసిద్ధ వాసుదేవ ద్వాదశాక్షరి మంత్రపు దైవము.
- తన భక్తులచే ఆరాధింపబడే దేవుడు.
- అన్నింటియందు ఉండేవాడు, వానిని చలింపజేయువాడు.

ఓం వాసుదేవాయ నమః

ఈ పరమ పవిత్ర నామము మూడుమార్లు ఈ మహాస్తోత్రమున స్తుతింపబడినది.

36వ శ్లోకము. 334వ నామము. వాసుదేవః – **వాసుదేవో బృహద్భానుః ఆదిదేవః పురందరః**

74వ శ్లోకము. 701వ నామము. వాసుదేవః – **వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః**

76వ శ్లోకము. 714వ నామము. వాసుదేవః – **భూతావాసో వాసుదేవః సర్వాసునిలయోనలః**

ముందుగా 334వ నామము వ్యాఖ్యలో శ్రీభట్టుల ప్రత్యేకవ్యాఖ్యను గమనించనగును – 'నారాయణ' నామము వలెనే 'వాసుదేవ' నామము గుహ్యమంత్రము. సరియైన గురువువద్దనే ఈ నామమునకు అర్థమును తెలిసికొననగును.

వివిధ వ్యాఖ్యాతలు చెప్పిన విషయాలలోని భావాలు ఇక్కడ ఇవ్వడమైనది.

36వ శ్లోకము. 334వ నామము. **వాసుదేవః** – శ్రీ భట్టుల వ్యాఖ్య – 'వాసు' - తల్లి గర్భములోవలె భగవంతునియందు సమస్తము నివసించును. అంతటినీ ఆయన ఆవరించి పక్షి తన రెక్కలతో కప్పియుంచినట్లు కాపాడుతున్నాడు. 'దేవ'-క్రీడించువాడు. సృష్టి, వ్యాప్తి, రక్షణ, లయము ఇవన్నీ ఆయన లీల. వాసు-దేవ – వాసుదేవ. అంతటినీ తనయందు ఉంచుకొని క్రీడించువాడు వాసుదేవుడు.

36వ శ్లోకము. (334వ నామము). **వాసుదేవః** – శ్రీ శంకరుల వ్యాఖ్య – వసతి - ఆచ్ఛాదయతి - కప్పియుంచును. **వసతి వాసయతి ఆచ్ఛాదయతి వా సర్వమ్ ఇతి వాసుః**. సర్వమును తన మాయతో కప్పియుంచి క్రీడించువాడు వాసుదేవుడు. శ్రీ శంకరులుకూడా 'వాసు', 'దేవ' అనే పదాల ఆధారంగానే ఈ నామాన్ని వ్యాఖ్యానించారని గమనించవచ్చును. కాని ఇందులో ఆయన భగవంతుని 'మాయ'ను ప్రస్తావించారు. **జగత్ ఆచ్ఛాదయి మాయయా ఇతి వాసుః స ఏవ దేవ ఇతి వాసుదేవః**. అద్వైతుల సంప్రదాయం ప్రకారం మాయ అనేది అజ్ఞానస్వరూపం (భ్రాంతి). కాని విశిష్టాద్వైతంలో మాయ అనేది ఈశ్వరుని అద్భుతమైన శక్తి (లీల)లో ఒక భాగం.

ఈ 74వ శ్లోకము. 700వ నామము. **వాసుదేవః** – ఈ సందర్భములో శ్రీ భట్టులు, శ్రీ శంకరులు కూడా వసుదేవుని సుతుడు వాసుదేవుడు – అనే అర్థం చెప్పారు. **వసుదేవస్య అపత్యమ్ వాసుదేవః**. శ్రీ కృష్ణదత్త భరద్వాజ భాగవతంనుండి ఉదాహరించారు.

అవతీర్ణో యదుకులే గృహేనక దుందుభేః

వదంతి వాసుదేవేతి వసుదేవ సుతం హి మామ్ – భాగవతము 10.51.41

76వ శ్లోకము. 714వ నామము **వాసుదేవః** – శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీవాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రమునకు అధిదేవతయైన వాసుదేవుడు. శ్రీవైకుంఠములోని పరవాసుదేవుడే పాలసముద్రంలో వ్యూహవాసుదేవునిగా అవతరించాడు. ఆయనే మధురలో దేవకీ వసుదేవులకు సుతునిగా అవతరించాడు (700వ నామమునకు శ్రీ భట్టుల వివరణ). శ్రీవైకుంఠమునుండి దిగివచ్చిన ఆ వ్యూహవాసుదేవుడే గోపికల హృదయాలను అలరింపజేశాడు. యోగులకు పరతత్త్వము అయ్యాడు. కంసాది దుష్టులకు మృత్యుసమానుడయ్యాడు. (శ్రీ వి.వి. రామానుజ్ వివరణ)

శ్రీ కృష్ణదత్త భరద్వాజ మరొక వైవిధ్యమైన అర్థం చెప్పారు. వాస్ - ఉపసేవాయాం - సుగంధభరితము చేయుట. **వాసయతే సేవయతే భక్తైః ఇతి వాసుః, స చాసౌ ఇతి వాసుదేవః.** భక్తులచే అలంకరింపబడేవాడు వాసుదేవుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **దివ్ - క్రీడా విజిగీష వ్యవహార ద్యుతి స్తుతి మోద మద స్వప్న కాంతి గతిషు** – ఇందులో 'గతి'- అనగా కదలుట. అన్నింటియందు ఉండేవాడు, వానిలోని చలనమునకు ఆధారమైనవాడు వాసుదేవుడు. **ఈశావాస్యమిదమ్ సర్వమ్ యద్ కించన జగత్యామ్ జగత్** (ఈశావాస్యోపనిషత్తు).

శ్రీ చిన్మయానంద – సకల జీవులలోని అంతర్యామి వాసుదేవుడు. ఇందుకు గీతాశ్లోకం ప్రమాణంగా భావింపవచ్చును.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా – గీత 18.6
ఈ శ్లోకానికి వివరణ ఇస్తూ శ్రీ భగవద్రామానుజులు తమ గీతాభాష్యంలో 'వాసుదేవ' అనే పదాన్ని వాడారు గనుక పై అర్థాన్ని ఆయన సమర్థిస్తున్నట్లు భావింపవచ్చును. **ఈశ్వరః సర్వ నియమన శీలో వాసుదేవః సర్వభూతానామ్ హృద్దేశే సకల ప్రవృత్తి నివృత్తిమూల జ్ఞానోదయే దేశే తిష్ఠతి.**

701. వసుః

- భక్తుల హృదయాలలో నివసించేవాడు.
- కోరదగినవానిలో అత్యుత్తమమైన సంపద.
- పాలకడలియందు శేషశాయియై వసించేవాడు.
- అష్టవసువులలో నొకడు.
- అన్నింటియందు ఉండేవాడు. అన్నీ ఆయనలో ఉండును.
- (భక్తులు కానివారికి) కానరానివాడు.
- అందరికీ కడపటి నివాస స్థానము.

ఓం వసవే నమః

ఈ నామము మూడుమార్లు చెప్పడమైనది.

12వ శ్లోకము. 105వ నామము. వసుః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

29వ శ్లోకము. 271వ నామము. వసుః – **సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః**

74వ శ్లోకము. 701వ నామము. వసుః – **వసుప్రదో వాసుదేవో వసుః వసుమనా హవిః**

శ్రీ భట్టుల వ్యాఖ్యలు –

12వ శ్లోకము. **వసుః**. కొద్దిపాటి భక్తికి కూడ భగవంతుడు సంతోషిస్తాడు. భక్తుల హృదయాలలో నివాసముంటాడు. శ్రీ రామానుజన్ శ్రీనమ్మాళ్వారు తిరువైమోళి (8.8.1)నుండి ఉదాహరించారు. ఒక్కడే ఐన పరమాత్ముడు నా ఆత్మలో ఆత్మయై ప్రకాశిస్తున్నాడు. భగవంతునకు జీవులను ఉద్ధరించాలనే కోరిక చాలా బలమైనది. కనుక భక్తికి సంబంధించిన ఏ సంకేతం కనుపించినా భగవంతుడు అక్కడికి పరుగున వస్తాడు. ఎవరైనా యధాలాపంగా అంకెలు లెక్కపెడ్తున్నారనుకోండి. 1నుండి 24వరకు వారు తత్త్వాలను, 25వ అంకె ద్వారా ఆత్మను ప్రస్తావిస్తున్నారని భగవంతుడు భావిస్తాడు. 26వ అంకె లెక్కపెట్టగానే తననే తలచుకొంటున్నారని భావించి భగవంతుడు వారిచెంతకు అరుదెంచును. అలాగే ఎవరైనా కొండలపేర్లు వల్లిస్తూ 'తిరుమల' అన్న పేరు పలుకగానే తన ఇంటిని తలుస్తున్నారని భావించి భగవంతుడు వారిప్రక్కకు వేంచేస్తాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ భగవానుడు చెప్పిన ఈ మాటలను ఉదాహరించారు – **మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద**. నా భక్తులు నన్నెక్కడ గానముచేయుదురో అక్కడ నేనుంటాను.

29వ శ్లోకము. **వసుః**. **వాసుదేవస్సర్వమితి ప్రకారేణ గరీయసామ్ స్వయమేవ ధనమ్ ఇతి వసుః**. మహాత్ములు అన్యధనములను ఆశించక భగవంతునే కాంక్షిస్తారు. ఎందుకంటే సర్వసంపదలకంటె ఉత్తమమైన ధనము దేవుడే.

ధర్మచక్రము రచయిత – ఆటవస్తువుల మోజులో పడి బిడ్డ తల్లిని మరచిపోయినట్లుగా మనము అల్పమైన సాంసారిక మోహములలో పడి భగవంతుని మరచిపోతాము. కాని ఒక్కమారు బిడ్డ ఏడువగానే తల్లి తనబిడ్డను దగ్గరకు తీసికొనును. అలాగే మనము ఒక్కమారు భగవంతుడే అసలైన ధనమని గ్రహించి ఆక్రోశించగానే ఆయన మనను హత్తుకొనును.

74వ శ్లోకము. **వసుః**. ఇక్కడ 'వసుః' నామమును శ్రీ భట్టులు శ్రీ కృష్ణావతారపరంగా వ్యాఖ్యానించారు. లోకాలను కాపాడడానికి పాలసముద్రంనుండి శ్రీకృష్ణునిగా అవతరించినవాడు వసువు. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణలు –

స లోకానామ్ హితార్థాయ క్షీరోదే వసతి ప్రభుః – మహాభారతము. శాంతిపర్వము 47.26

ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవనికేతనః

నాగపర్యంకం ఉత్సృజ్యహ్యాగతో మధురాంపురీం – హరివంశము 113.62

శ్రీలక్ష్మీసమేతుడై పాలకడలిలో శయనించియున్న ఆ నారాయణుడే శేషపాన్పును వదలి మధురానగరానికి వేంచేశాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు –

12వ శ్లోకము. **వసుః**. (1) **వసంతి భూతాని తత్ర తేష్వయమపి వసతీతి వసుః**. అన్ని భూతములు అతనియందే ఉంటాయి. ఆయన అన్ని భూతములయందు ఉండును. (2) అష్టవసువులలో ఒకడు. పావకుడు లేదా అగ్ని. వసూనామ్ పావకశ్చాస్మి – గీత 10.23

29వ శ్లోకము. **వసుః**. ఈ నామమునకు శ్రీ శంకరులు అనేక అర్థాలు చెప్పారు. (1) తనను తానే భక్తులకు ఇచ్చుకొనే పరమధనము. (2) వస్-కప్పుట. తనను తానే మాయచే కప్పియుంచేవాడు (3) అంతరిక్షమందు వాయువుగానున్నవాడు. **వసురంతరిక్షాత్** – కఠోపనిషత్తు 2.2.3

శ్రీ చిన్మయానంద – అందరికీ కడపటి నివాసము వసువు.

702. వసుమనాః

- తన భక్తులే తన నిధిగా భావించే మనసు కలవాడు.
- వసుదేవునిపట్ల మనసు లగ్నమైనవాడు.
- ఏ విధైన దోషములేని శుద్ధ సాత్విక మనసు కలవాడు.
- శుద్ధమైన, అన్నింటిపట్ల సమభావమున్న మనసు కలవాడు.
- భక్తులపట్ల వాత్సల్యము నిండిన మనసు కలవాడు.
- తన భక్తుల ఇక్కట్లను తొలగించే తత్వము కలవాడు.
- శరీరము, దాని తత్వము, అవుసరము గురించి పూర్తిగా తెలిసినవాడు.
- అంపశయ్యపై పరుండిన భీష్మునిపట్ల మనసు లగ్నమైనవాడు.

ఓం వసుమనసే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది. 12వ శ్లోకంలోను, ఈ 74వ శ్లోకంలోనూ కూడా **వసుః, వసుమనాః** నామములు ఒకదాని తరువాత మరొకటి వచ్చాయి.

12వ శ్లోకము. 106వ నామము. వసుమనాః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

74వ శ్లోకము. 702వ నామము. వసుమనాః – **వసుప్రదో వాసుదేవో వసుః వసుమనా హవిః**

శ్రీ భట్టుల వ్యాఖ్య –

12వ శ్లోకంలో 'వసుః' (105వ) నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – భక్తుల మనసులలో నివశించేవాడు. తరువాతి (106వ) నామమైన 'వసుమనాః'కు శ్రీ భట్టుల వ్యాఖ్య – తన భక్తులే తన పెన్నిధిగా భావించేవాడు (వసు-సంపద, మనాః-మనస్సు). అనగా భగవంతుడు తన మనసులో భక్తులనే పెద్దనిధిగా భావిస్తాడు. **స మహాత్మా సుదుర్లభః** – అని గీత (7.19)లో ఉన్నది. **అకించన భక్త ధనేషు మనో యస్య స వసుమనాః** – అని శ్రీ బలదేవ విద్యాభూషణ వ్యాఖ్యానించారు.

తిరువైమొళి మొదటి పాశురంలో శ్రీ నమ్మాళ్వారు పెరుమాళ్ళు తిరువడిని **'తూయర్ అఱు సూడర్ అడి'** – భక్తుల కష్టాలను తొలగించే తిరువడి – అని వర్ణించారు. అనగా భక్తుల కష్టాలు తొలగితే పెరుమాళ్ తిరువడి మరింతగా ప్రకాశిస్తుంది (భగవంతుడు ఆనందిస్తాడు) అని శ్రీ వి.వి. రామానుజన్ వివరించారు. అయితే శ్రీ భగవద్రామానుజుల వ్యాఖ్యలో కొంత వ్యత్యాసం ఉంది (అని శ్రీ బి.ఆర్. పురుషోత్తమ నాయుడు తమిళ రచన 'ఈడువ్యాఖ్యానం'లో వివరించారు). తన భక్తుల స్పర్శవలన భగవంతునికి తూయర్ (దుఃఖం) తొలగి ఆయన పాదాలు మరింత ప్రకాశమానమయ్యాయట (అనగా భక్తుల సాంగత్యంకోసం భగవంతుడు ఎదురు చూస్తాడు). రామాయణం అయోధ్యకాండ (2.42)లో చెప్పిన విషయం కూడా గమనించాలి –

వ్యసనేషు మనుష్యాణామ్ భృశమ్ భవతి దుఃఖితః
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి

జనులు బాధపడితే శ్రీరాముడు దుఃఖితుడయ్యాడు. జనులు ఆనందిస్తే శ్రీరాముడు ఆనందించాడు.

ఇక 74వ శ్లోకంలోని **వసుః, వసుమనాః** నామములకు శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్యలు ఒకదాని కొకటి అనుసంధంగా గమనించవచ్చును.

701. **వసుః**. క్షీరసాగరంలో వసిస్తూ, భక్తజనరక్షణ కొరకు అవతారాలకు సిద్ధంగా ఉన్నవాడు.

702. **వసుమనాః**. తాను క్షీరసాగరంలో ఉన్నాగానీ తన మనసు వసుదేవునియందు (బిడ్డగా జన్మించడానికి) లగ్నమైయున్నవాడు. **వసౌ మనః యస్య సః వసుమనాః**.

జన్మభూమ్యర్ణవే లక్ష్మ్యాః వసతో యస్య వై మనః
అస్తీతి వసుదేహీతి సస్యాద్వసుమనాః పరమ్

లక్ష్మీదేవికి పుట్టినిల్లయిన పాలసముద్రంమీద పవళించి ఉన్నప్పటికీ వసుదేవునియందే మనసు లగ్నమైనవాడు. ఇక్కడ 'వసు' అనగా వసుదేవుడు (భామ అనగా సత్యభామ, దత్తుడనగా దేవదత్తుడు అన్నట్లుగా) ఎందుకంటే భగవంతుడు వసుదేవునికి కొడుకుగా పుట్టడానికి సంకల్పించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

12వ శ్లోకంలోని '**వసుమనాః**' – **రాగద్వేషాదిభిః క్లేశైః మదాదిభిః ఉపక్లేశైశ్చ యతో న కలుషితమ్ చిత్తమ్ తతః తన్ మనాః ప్రశస్తమ్; ప్రశస్తమ్ మనో యస్య సః వసుమనాః**. రాగద్వేషాదులచే కలుషితముకాని మనస్సు కలవాడు.

74వ శ్లోకంలోని '**వసుమనాః**' – అందరిపట్ల సమభావంతో, వ్యత్యాసాలు లేకుండా, అందరియందు వసించే శుద్ధ సాత్విక మనస్సు కలవాడు. **అవిశేషేణ సర్వేషు విషయేషు వసతి ఇతి వసుః, తా దృశమ్ మనః అస్య ఇతి వసుమనాః**.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ రెండు అర్థాలు చెప్పారు –

వస్ - స్నేహే – ప్రేమించుట; వస్ - స్నేహ చ్ఛేద అపహరణేషు – ప్రేమించుట, ఖండించుట, అపహరించుట.

వసు స్నేహః వాత్సల్యమ్ తన్ మనః యస్య ఇతి వసుమనాః . తన భక్తులపట్ల వాత్సల్యముతో నిండిన మనస్సు కలవాడు.

వాసయతి అపహరతి విపదః స్వజనానామ్ ఇతి వసుః; తా దృశమ్ మనో యస్య ఇతి వసుమనాః. తన భక్తుల కష్టాలను అపహరించేవాడు (తొలగించేవాడు).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యేన ప్రకారేణ నివసితుమ్ అర్హతి, పృథక్ పృథక్ శరీరకృతే కథమ్ విధస్య ఔష్ణస్య, కిం వా శీతస్య, కిం వా జలస్య, కిం వాయోః ఆవశ్యకతా అస్తీతి సర్వమ్ విష్ణుః జానాతి, తస్మాత్ స వసుమనాః ఉక్తో భవతి.** భగవంతుడు సకల జీవుల శరీరాలగురించి, వానికి కావలసిన శీతోష్ణములు, వాయువు, నీరు వంటివాని గురించి పూర్తిగా తెలిసినవాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – భీష్ముడు వసువులలో నొకడు. శాపవశాన గంగా శంతనులకు జన్మించాడు. అలాంటి భీష్ముడు అంపశయ్యపై వాలి, పురుషోత్తముడైన వాసుదేవుని ధ్యానించాడు. అలా భగవంతుని మనసులో భీష్ముడున్నాడు గనుక భగవంతుడు 'వసుమనాః'

శరతల్పగతో భీష్మః శంయన్నివ హుతాశనః

మామ్ ధ్యాయతి పురుషవ్యాఘ్ర తతో మే తద్గతం మన

ధర్మచక్రము రచయిత – ఎక్కువమంది ఐహిక వాంఛలలోను, స్వలాభాపేక్షలోను చిక్కుకుపోతారు. కాని వేదాంతజ్ఞానులైన కొందరు అంతటా భగవంతుని దర్శిస్తారు. వారికి భగవంతుడు తప్ప అన్యగమ్యం నిస్సారం. వారు అచంచలమైన భక్తితో భగవంతుని ఆరాధిస్తారు. దీనికి ఫలితం అనేక జన్మల అనంతరం వచ్చుగాక. అయినా వారి భక్తి సడలదు. '**వసుమనాః**' నామధ్యానం ద్వారా అలాంటి భక్తికి మనం దగ్గరౌతాము.

శ్రీ జయదయాల్ గోయందకా రచన 'గీతా-తత్త్వవివేచనీ వ్యాఖ్య'నుండి –

దేవతలకు, బ్రహ్మకును జరిగిన సంవాదమును గురించి భీష్ముడు దుర్యోధనునకు చెప్పెను. బ్రహ్మ ఇట్లు పలికెను – సకల లోకేశ్వరుడైన వాసుదేవుడు మీకందఱికిని పూజ్యుడు. శంఖ చక్ర గదాధారియును, మహావీరుడును ఐన వాసుదేవుని సామాన్యమానవునిగా భావించి ఎన్నడును ఆయనను చులకనగా చూడరాదు. అతడే అక్షరుడు. అవ్యక్తమైనవాడు. సనాతనుడు. పరమతేజస్సు. పరమ సుఖము. పరమ సత్యము. ఆ హృషీకేశుని మానవునిగా తలంచు మూఢమతులు నరాధములు.... చరాచర ప్రాణికోటికి ఆత్మస్వరూపుడు, శ్రీవత్సలాంఛనుడు, మహాతేజస్వి ఐన పద్మనాభుని యదార్థముగా తెలియనివారు తామస స్వభావులు. కౌస్తుభమును, కిరీటమును ధరించినవాడు, మిత్రులకు అభయప్రదాత ఐన భగవానుని అవజ్ఞ చేయువారు అతిభయంకరములైన నరకయాతనలకు

గురియగుదురు. ఓ దేవతాశ్రేష్ఠులారా! ఈ విధముగా అయనయొక్క దివ్యస్వరూప తత్వమును తెలిసికొని, జనులెల్లరు లోకేశ్వరులకు ఈశ్వరుడైన ఆ వాసుదేవ భగవానునకు ప్రణమిల్లవలెను.

తన ప్రాణత్యాగమునకు ముందు భీష్ముడు శ్రీకృష్ణుని ఇలా ప్రార్ధించాడు –
హే భగవన్! దేవదేవేశ! సురాసుర వందిత! త్రివిక్రమ! శంఖచక్రగదాధారి! నేను నీకు ప్రణమిల్లుతున్నాను. వాసుదేవ! హిరణ్యాత్మ! పరమపురుష! సవిత! విరాట్ పురుష! నీవే సమస్త జీవరూపుడవు. అణురూప పరమాత్ముడవు. సనాతనుడవు. పుండరీకాక్ష! పురుషోత్తమ! మీరు నన్ను ఉద్ధరింపుడు. ఓ కృష్ణ! వైకుంఠవాస! ఈ తనువును చాలించుటకు నాకు అనుజ్ఞ ఇండు. .... **యతః కృష్ణ స్తతో ధర్మో, యతో ధర్మ స్తతో జయః** – కృష్ణుడున్నచోటనే ధర్మముండును. ధర్మమున్నచోటనే విజయముండును.

నేను నిన్ను ఎఱుగుదును. నీవు పురాణపురుషుడవు. ఈ భూమిపై అవతరించిన ఆదినారాయణుడవు. ఓ కృష్ణ! తనువును త్యజించుటకు నాకు అనుజ్ఞ ఇమ్ము, నీ ఆజ్ఞతో ఈ శరీరమును వీడి, పరమపదము పొందెదను.
(శ్రీ జయదయాల్ గోయందకా రచననుండి)

---

703. హవిః

- యజ్ఞ యాగాదులందు హోమము చేయు హవిస్సు.
- ఇవ్వబడినవాడు, స్వీకరింపబడినవాడు.
- సంతుష్టి చెందువాడు.

ఓం హవిషే నమః

హు - దానాదానయోః – అర్పించుట, త్యాగము చేయుట.
72వ శ్లోకంలోని **'మహాహవిః'** నామముకూడా ఇదే ధాతువునుండి వివరింపబడినది. యజ్ఞయాగాదులలో హోమము చేయు పదార్ధమును 'హవిస్సు' అంటారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు శ్రీకృష్ణావతారపరంగా వ్యాఖ్యలను కొనసాగించారు.
నందగోప యశోదాభ్యాం కంసోపద్రవ శాంతయే
అదీయతే స్వీక్రియతే స హవిః పరికీర్తితః
కంసునివలన కలిగిన ముప్పు తప్పించడానికి దేవకీవసుదేవులు ఇవ్వగా యశోదానందగోపులచే స్వీకరింపబడ్డవాడు. నిజానికి కృష్ణునికి కంసునివలన ఎలాంటి భయమూ లేకున్నాగాని, దేవకీవసుదేవుల మనశ్శాంతికొరకు ఆయన తనను తాను యశోదానందులకు ఇవ్వనిచ్చాడు.

ధర్మచక్రము రచయిత – దానము లేదా అర్పణమువలన ఇచ్చేవారూ పుచ్చుకునేవారూ కూడా ధన్యులవుతారు. ఐతే ఈ పనిని స్వార్ధరహితంగా చేయాలి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **బ్రహ్మ అర్పణమ్ యేన కరణేన బ్రహ్మవిత్ హవిః అగ్నౌ అర్పయతి తత్ బ్రహ్మైవ ఇతి పశ్యతి.** బ్రహ్మను తెలిసినవారికి హవిస్సుకూడా బ్రహ్మమే అని తెలుసు. ఇందుకు ప్రమాణము గీతాశ్లోకము.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్

బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా – గీత 4.24

యజ్ఞయాగాదులలో ఉపయోగించే స్రుక్ స్రువాదులు బ్రహ్మము. హోమము బ్రహ్మము. హోమద్రవ్యము బ్రహ్మము. అగ్ని బ్రహ్మము. హోమము చేసే కర్మ బ్రహ్మము. హవనక్రియ బ్రహ్మము. ఈ బ్రహ్మకర్మయందు స్థితుడై ఉండే యోగిద్వారా పొందదగిన యజ్ఞఫలము కూడా బ్రహ్మమే.

బ్రహ్మమే హవిస్సు. అది బ్రహ్మకే అర్పణము చేయుబడుచున్నది.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ, శ్రీ బలదేవ విద్యాభూషణ –

హు (హిన్స్వ) - ప్రీణనే – సంతోషపరచుట. **హూయతే ప్రీయతే ఇతి హవిః.** సంతోషితుడైనవాడు 'హవిః'. భీష్ముని ప్రార్థనకు సంతోషించి అతనికి మోక్షమునిచ్చినవాడు **'హవిః'** అని శ్రీ విద్యాభూషణ వ్యాఖ్య. ఇంతకుముందు నామము **'వసుమనాః'** అనగా భీష్మునిచే ధ్యానింపబడ్డవాడు అని ఆయన వ్యాఖ్యానించారు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః |
శూరసేనో యదుశ్రేష్ఠః సన్నివాసః సుయామునః || (75)

704. సద్గతిః

- సజ్జనులకు సరైన మార్గము చూపేవాడు.
- సజ్జనులకు సరియగు మార్గము.
- ఉత్కృష్టమైన బుద్ధి కలిగినవాడు.
- సత్కార్యములద్వారా పొందదగినవాడు.

ఓం సద్గతయే నమః

'సత్' అనగా మంచిది, మంచివారు. 'గతి' అనగా మార్గము. **సతామ్ సాత్విక - సజ్జనానామ్ గతిః ఇతి సద్గతిః**. 2వ శ్లోకంలోని 12వ నామము '**ముక్తానామ్ పరమాగతిః**', అనగా ముక్తులైనవారికి పరమగతి, నిధానము, గమ్యము. అలాంటి పరమగతిని అన్వేషించేవారికి మార్గము లేదా మార్గము చూపువాడు భగవంతుడేనని ఈ '**సద్గతిః**' నామము తెలియజేయుచున్నది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – సజ్జనులకు శాశ్వతమైన శాంతి, ఆనందము కలిగించేందుకు కావలసిన మార్గమును చూపేవాడు శ్రీనివాసుడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణంలో శ్రీకృష్ణజన్మమును వర్ణించే శ్లోకాన్ని ఉదాహరించారు.

సంతః సంతోషమధికమ్ ప్రశమమ్ చండమారుతః

ప్రసాదమ్ నిమగ్నయాతా జాయమానే జనార్దనః – విష్ణుపురాణము 5.3.4

జనార్దనుని జననసమయం ఆసన్నమైనందున సజ్జనుల మనస్సులు సంతోషంతో ప్రశాంతంగా ఉన్నాయి. గాలి మెల్లగా వీస్తుంది. నది మెల్లగా జారుతుంది.

శ్రీ వి.వి. రామానుజన్ ఈ ఘట్టాన్ని మరింత ముందుకు తీసికొని వెళ్ళారు. శ్రీకృష్ణుని జననం వెంటనే వసుదేవుని బంధాలు విడిపోయాయి. బాలునిగా ఉన్నప్పుడే కృష్ణుడు నందగోపుని స్థలంలో పెక్కు రాక్షసులను సంహరించాడు. పూతన, ధేనుకాసురుడు, శకటాసురుడు, ప్రలంబాసురుడు, కౌశి, వ్యోమాసురుడు వంటి రాక్షసులు కృష్ణునిచేత హతులయ్యారు. అంతేగాక శిశుపాలాదుల పాపాలను కడతేర్చినందువలన ఆయన **'అసద్గతి'** కూడానని శ్రీ రామానుజన్ వ్యాఖ్యానించారు. శ్రీ నమ్మాళ్వారు తమ తిరువైమొళి (7.2.7)లో– కాకాసురునివంటివారికి కూడా ఆయనే గతి – అని చెప్పారు.

ఉత్పన్న ఏవ కంసాది కృతి బాధాపనోదనాత్
సతాం ప్రాప్యతయా చైవ సద్గతి స్సముదాహృతః
పుట్టినతోడనే కంసాది రాక్షసులను (వారివలన కలిగిన బాధలను) కడతేర్చినందున సాధుజనులకు గతియైనవాడు సద్గతి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సజ్జనులకు గమ్యమైనవాడు సద్గతి. **అస్తి బ్రహ్మేతి చేద్ వేద సన్తమేనమ్ తతో విదుః** (తైత్తరీయోపనిషత్తు 2.6). బ్రహ్మము సద్రూపమని యెరిగినవారు సత్పురుషులు. అట్టి సత్పురుషులకు, అనగా బ్రహ్మవిదులకు గతియగువాడు గనుక పరమాత్ముడు 'సద్గతి'.

శ్రీ శంకరులు మరొక అర్థం కూడా చెప్పారు. 'గతి' అనగా బుద్ధి. **సతి గతిః, బుద్ధిః సముత్కృష్ట అస్య ఇతి వా సద్గతిః**. ఉత్కృష్టమైన బుద్ధి కలిగినవాడు సద్గతి.

శ్రీ బలదేవ విద్యాభూషణ – 'గతి' అనగా అందుబాటులో ఉన్నది. **సతామ్ భీష్మాదీనామ్ ప్రాప్యత్వాత్ సద్గతిః**. భీష్మునివంటి సజ్జనులకు అందేవాడు సద్గతి.

705. సత్కృతి

మనోహరములైన, సత్ఫలితాలనిచ్చే, గొప్ప పనులు చేసేవాడు.

ఓం సత్కృతయే నమః

సతి సత్యా శోభనాచ కృతి రచనా యస్య ఇతి సత్కృతిః. అని శ్రీ కృష్ణదత్త భరద్వాజ నిర్వచనము. మంచివైన, ఆనందము కలుగజేయు కార్యములు అనగా సత్కార్యములు గలవాడు సత్కృతి. బాలగోపాలునిగా ఆయన వెన్న దొంగిలించుట, రోటికి బంధింపబడుట వంటి ఉదాహరణలను శ్రీ భట్టులు పేర్కొన్నారు. **జన్మ కర్మ చ మే దివ్యమ్** – అని గీత (4.9)లో భగవానుడు చెప్పియున్నాడు. ఆయన దివ్య కార్యములు బాల్యలీలలకే పరిమితములు కావు. జగత్ సృష్టి, పాలన, లయము కూడా ఆయన దివ్యకార్యములే. మనసులో ఆయన దివ్యకార్యములను స్మరించినంతనే సంసారబంధనాలనుండి విముక్తి లభిస్తుంది.

శ్రీ నమ్మాళ్వారు తమ 6.4.1 నుండి 6.4.11 వరకు పాశురములలో భగవంతుని దివ్యలీలలను చక్కగా వర్ణించారు. ఇక్కడ ఆయన 'మట్టుమ్ పల' అన్న పదాన్ని పెక్కుమార్లు వాడడంవలన ఇలాంటి అనంతమైన లీలలున్నాయని గ్రహించవచ్చును.

శ్రీ చిన్మయానంద – ఇతరులను శిక్షించినట్లు కనిపించే ఆయన పనులు (కురుక్షేత్ర యుద్ధము, రావణవధ వంటివి) కూడా జగద్రక్షణకు, మరియు వారిని ఉద్ధరించడానికే.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు భగవానుని లోకరక్షణను ప్రత్యేకంగా పేర్కొన్నారు. **సత్ కృతిః జగద్రక్షణాది లక్షణా అస్య యస్మాత్ తేన సత్కృతిః**. జగద్రక్షణ కొరకు చేయు పనులు గలవాడు సత్కృతి.

శ్రీ బలదేవ విద్యాభూషణ –

యది వాతాది దోషేణ మద్భక్తో మామ్ న చ స్మరేత్

అహం స్మరామి మద్భక్తమ్ నయామి పరమాం గతిమ్

శరీర దౌర్బల్యాది కారణాలవలన అంత్యకాలంలో ఎవరైనా భగవంతుని స్మరింపలేకుంటే కూడా, భగవంతుడు వారిని గుర్తుంచుకొని వారికి మోక్షాన్ని ప్రసాదిస్తాడు. కనుక ఆయన సత్కృతి.

706. సత్తా

- 'సత్' అయినవాడు. 'ఉనికి' అన్న భావానికి మూర్తి.
- తానొక్కడే అయినవాడు.

ఓం సత్తాయై నమః

సద్భావే సాధుభావే చ సదిత్యే తత్ప్రయుజ్యతే

ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే – గీత 17.26

యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే

కర్మచైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే – గీత 17.27

ఓ పార్థ! 'సత్' అను పరమాత్మ నామము సత్యభావమునందును, శ్రేష్ఠభావమునందును, అనగా పరమాత్ముడు నిత్యుడు, శ్రేష్ఠుడు అను భావమునందును ప్రయోగింపబడుచుండును. ఉత్తమ కర్మాచరణము నందును 'సత్' అను శబ్దము ప్రయుక్తమగుచుండును. యజ్ఞ దాన తపః క్రియలయందలి నిష్ఠ, ఆస్తిక భావమును 'సత్' అని యందురు. పరమాత్మను ఉద్దేశించి చేయబడు నిశ్చయాత్మక కర్మలను కూడ 'సత్' అని యందురు.

పై భావములనుండి 'సత్' అనగా 'ఉండుట, ఉనికి' అన్న అర్థముపై ఈ నామమును వ్యాఖ్యానించిరి. 'త్వ' లేదా 'తత్' అనే విభక్తులవలన 'గుణము కలిగియుండుట' అనే భావం జత అవుతుంది (పాణిని 5.1.119).

కనుక 'సత్తా' అనగా ఉండుట అనే గుణమున్నవాడు, నిత్యుడు, మూర్తీభవించిన తానొక్కడు, సకల ప్రాణుల ఉత్పత్తికి మూలమైనవాడు – వంటి అర్థాలను చెప్పారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

సత్తాది సతామ్ స్వయమేవ ఇతి సత్తా

నహి తద్ వ్యతిరేకేన కించిత్ స్యాత్

సత్పురుషులకు తానే 'సత్తు'గా ఉండేవాడు. సత్తులకు సత్తుగా ఉండేవాడు. ఆయన లేనిది ఏదీ లేదు. కనుక 'ఉనికి' అన్న పదానికి అర్థం పరమాత్ముడే. ఇందుకు శ్రీ భట్టులు గీతనుండి ఉదాహరించారు.

యచ్చాపి సర్వభూతానామ్ బీజం తదహమర్జున

న తదస్తి వినా యత్స్యాత్ మయా భూతం చరాచరమ్ – గీత 10.39

ఓ అర్జున! సర్వ ప్రాణుల ఉత్పత్తికి కారణమైన బీజమును నేనే. ఏలనన నేను లేని చరాచర ప్రాణి ఏదియును లేదు.

శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ తిరుమళిశయాళ్వారు తిరువంతాడి (7)నుండి ఉదాహరించారు – నీవు లేకుండా మేము లేము. ఇక నీ సంగతి. నీవు రక్షించేది మమ్మల్నే కాకపోతే నీకు రక్షించడానికి వేరేమీ లేదు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'ఉండుట' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **సజాతీయ విజాతీయ స్వగత భేదరహిత అనుభూతిః సత్తా**. తన, పర భేదం లేనివాడు. ఇందుకు శ్రీ శంకరులు ఛాందోగ్యోపనిషత్తు (6.2.1) నుండి ఉదాహరించారు. **ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ.**

ఉద్దాలక మహర్షి తన కుమారుడైన శ్వేతకేతువునకు ఇలా ఆత్మజ్ఞానం బోధించాడు – సృష్టికి పూర్వం ఈ ప్రపంచం నామరూపాలతో కూడిలేదు. అప్పుడు కేవలం అద్వితీయమైన సత్తు మాత్రమే ఉన్నది. నామము, రూపము, పదార్థము ఏమీ లేదు. 'సత్తు' అంటే ఉనికి, సత్యం అని అర్థం. అసత్తు అంటే లేనిది, అసత్యం అని అర్థం. అన్నింటికన్నా పూర్వమైనది, రెండు కానిది, మొదటగా ఉన్నది ఏకైక పరబ్రహ్మ.

శ్రీ శంకరుల వ్యాఖ్యపై ధర్మచక్రము రచయిత మరింత వివరణ ఇచ్చారు: సజాతీయ భేదము – ఒకే జాతికి చెందిన రెండు జీవుల మధ్య భేదము. ఉదాహరణకు ఇద్దరు వ్యక్తుల మధ్య భేదము; ఈ భేదము కారణంగానే మనమంతా భగవంతుని శేషులమని, మనందరికీ భగవానుడు అంతర్యామి అనీ గ్రహించలేకపోతున్నాము. విజాతీయ భేదము – ఉదాహరణకు ఒక మనిషికి, జంతువుకు మధ్య భేదము; ఈ కారణం చేతనే కుక్క పిల్లిపై దాడి చేస్తుంది. నిజమైన జ్ఞానులు అన్ని జీవులూ భగవంతుని సృష్టి అని భావించి అన్నింటినీ ఆదరిస్తారు. స్వగత భేదము – ఒకే జీవికి వివిధ అవయవాలు, ఇంద్రియాలు అనే భేదము. ఈ కారణంచేత ఒక అవయవం అందంగా ఉన్నదనీ, మరొకటి లేదనీ భావిస్తాము. ఈ భేదాలు మనకు సత్యసాధనలో అడ్డంకులు.

భగవానుడు ఈ అన్ని రకాల భేదాలకూ అతీతుడు. అంతే కాకుండా భగవంతుడు అద్వితీయుడు. ఆయనకు 'మరొకడు' లేడు. ఆయనకు భేదభావము, కాలభేదము లేదు. మార్పు లేదు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **సత్తాహి ఆత్మ ధారణమ్.** భగవానుడు ఒకడే అందరినీ రక్షించేవాడైన 'సత్తా'. మరెవరికీ రక్షించే శక్తిగాని, నిలిపే శక్తి గాని ఉడదు.

707. సద్భూతిః

- సజ్జనులకు, సాధువులకు సమస్త బంధువర్గము తానే ఐనవాడు. వారికి సకల ఐశ్వర్యములు ఆయనే.
- గొప్ప యశస్సు, వైభవము కలవాడు.
- సత్యముగా ఉండేవాడొక్కడే.
- అనేక రూపములు (విభూతులు)గా అవతరించువాడు.

ఓం సద్భూతయే నమః

అమరకోశము ప్రకారము 'భూతి' అనగా సంపద, ఐశ్వర్యము, ఉండుట (భవతి). **భవత్యనయా శ్రీమాన్ ఇతి భూతిః, భవతి ఇతి వా.**

స తామ్ మహాత్మనా భూతిః సంపత్తిః ఇతి సద్భూతిః. మహాత్ములకు, సాధువులకు సంపత్తి అగువాడు సద్భూతి. అని శ్రీ కృష్ణదత్త భరద్వాజ నిర్వచనము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – నిజమైన భక్తులకు ఆయన కొడుకు, స్నేహితుడు, దూత, రథసారధి, అన్నీ అవుతాడని శ్రీ భట్టులు వివరించారు. ఆవిధంగా సకలరూపములలోనూ భగవంతుడు తన భక్తులకు సహాయమవుతాడని శ్రీ అణ్ణాంగారాచార్య వివరించారు.

శ్రీ చిన్మయానంద – గొప్ప వైభవము (సంపద, యశస్సు, ఆనందము) కలవాడు సద్భూతి. మరొకవిధంగా, వివిధ అవతారములు దాల్చి పరమాత్ముని వైభవమును ప్రకాశింపజేసినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'భూతి' అనగా భాసమానత్వము (వెలుగుట), 'సత్' అనగా నిజంగా ఉండుట. భగవంతుడొకడే నిజంగా ఉండేవాడు. ఇతర జ్యోతులతో పనిలేకుండా స్వయంగా ప్రకాశించేవాడు. ఆయన లేకుంటే మరేమీ లేదు. ఆయనవల్లనే మిగిలినవన్నీ తెలియవస్తున్నాయి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భూ - సత్తాయామ్, ఉండుట; సతి - శాశ్వతీ; భూతి - భవనమ్, వివిధ భావేన పరిణామః. భగవంతుడొకడే నిత్యము. సత్యము. అనేకరూపములలో (విభూతులలో) ఉండేవాడు. అన్నింటికీ నిమిత్తకారణము, ఉపాదానకారణము భగవంతుడే.

708. సత్పరాయణః

సత్పరాయణమ్

- సజ్జనులకు అండయైనవాడు.
- సజ్జనులకు, తత్వవిదులకు పరమగతియైనవాడు.
- సజ్జనులే తనకు బలము అయినవాడు.

ఓం సత్పరాయణాయ నమః

శ్రీ భట్టులు 'సత్పరాయణమ్', 'సత్పరాయణః' అనే రెండు నామాలనూ గ్రహించి వ్యాఖ్యానించారు. శ్రీ శంకరుల వ్యాఖ్యానాన్ని అనుసరించిన కొందరు 'సత్పరాయణః' అనీ, కొందరు 'సత్పరాయణమ్' అనీ వ్రాశారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

సతాం స్యాదయనం సనో యన్యోత్తమాయనం

స సత్పరాయణం ఖ్యాతో యద్వాస్యాత్సత్పరాయణః

సత్పురుషులకు తను, తనకు సత్పురుషులు ఆయనము (అండ)గా ఉన్నందున ఆయన సత్పరాయణము లేదా సత్పరాయణుడు.

సత్పరాయణమ్ – సత్పురుషులకు అండగా ఉండేవాడు. ఇందుకు శ్రీ భట్టులు మహాభారతము ద్రోణపర్వము (173.24)నుండి చెప్పిన ప్రమాణము – **కృష్ణాశ్రయాః కృష్ణబలాః కృష్ణనాథాశ్చ పాండవాః కృష్ణః పరాయణమ్ తేషామ్** ..... పాండవులకు కృష్ణుడే ఆశ్రయము. కృష్ణుడే బలము. కృష్ణుడే రక్షకుడు. కృష్ణుడే సత్పరాయణము.

సత్పరాయణః – సంతోః అస్య పరాయణమ్. ఆయనకు సాధువులు పరాయణము (అండ). ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణలు – **మమ ప్రాణా హి పాండవాః** (మహాభారతము. ఉత్తర. 90.33). పాండవులు నాకు ప్రాణ(స)ములు. **జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** (గీత 7.8). జ్ఞానులు నాకు ఆత్మ.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సతామ్ తత్వవిదామ్ పరమ్ ప్రకృష్టమ్ అయనమ్ ఇతి సత్పరాయణమ్ (సత్పరాయణః)**. 'సత్' అనబడేవారికి, అంటే తత్వజ్ఞానము కలవారికి ఆ పరమేశ్వరుడే పరమపదము, గమ్యము (అయనము). కనుక శ్రీమన్నారాయణుడు సత్పరాయణుడు (సత్పరాయణము).

అన్నమయ్య కీర్తన

అంతయు నీవే హరి పుండరీకాక్ష - చెంత నాకు నీవే శ్రీరఘురామ

కులమును నీవే గోవిందుడా నా - కలిమియు నీవే కరుణానిధి

తలపును నీవే ధరణీధర నా - నెలవును నీవే నీరజనాభ

తనువును నీవే దామోదర నా - మనికియు నీవే మధుసూదన
వినికియు నీవే విట్ఠలుడా నా - వెనకముందు నీవే విష్ణు దేవుడా

పుట్టుగు నీవే పురుషోత్తమ కొన - నట్టనడుము నీవే నారాయణ
ఇట్టే శ్రీ వెంకటేశ్వరుడా నాకు - నెట్టన గతి ఇంక నీవే నీవే

709. శూరసేనః

- గొప్ప శూరులు తనకు సేనగా కలవాడు.
- కదిలేవాటినన్నింటినీ ఒక క్రమంలో నిలిపి ఉంచేవాడు.

ఓం శూరసేనాయ నమః

శూర - విక్రాంతౌ - విక్రమము, పరాక్రమము చూపుట; సేన - ఇనేన ప్రభుణా సహవర్తతా ఇతి సేనా - గొప్ప, బలమైన నాయకుడిని కలిగియున్నది. **శూరాః సేనాః యస్య ఇతి శూరసేనాః** – గొప్ప శూరులైన సైన్యమును కలిగియున్నవాడు శూరసేనుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

భూభార హరణార్థాయ యాదవాః పాండవాశ్చయే
శూరాస్సహాయా యస్యేతి శూరసేనస్స కథ్యతే

భూభారమును తగ్గించడానికి శూరులైన యాదవులు, పాండవులను తనకు సేనగా కలవాడు శూరసేనుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

హనూమత్ ప్రముఖాః సైనికాః శౌర్యశీలినో యస్యామ్
సేనాయామ్ సా శూరా సేనా యస్య సః శూరసేనః

హనుమంతునివంటి శౌర్యశీలురైన అనేక మహావీరులను తన సైన్యమునందు కలిగియున్నవాడు శూరసేనుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్య – సూ - కదలుట (సు సి చి మీనామ్ దీర్ఘాశ్చ – 185 ఉనాది); శూర - కదులునది; సి - బంధనే - కట్టియుంచుట; సేనా - కలిపియుంచునది. **ఏవమేవ సకలమ్ చరాచర దృశ్యమ్ అదృశ్యమ్ చ చింతయమ్ అచింతయమ్ చ జగత్ తస్య విష్ణోః శూరసేనత్వ లక్షణమ్ గుణమ్ ప్రకాశయన్ శూరసేన అభిధానమ్ లభతే**. నడచినపుడు, పరుగెత్తినపుడు, నాట్యం చేసేటపుడు ఒక వ్యక్తి అవయవాలు కదలుతున్నాగాని అన్నీ ఒకేశరీరంగా ఉంటాయి (విడిపోవు). అలాగే గ్రహనక్షత్రాదులు, చరాచర జగత్తు, కనుపించేవి, కనుపించనివి అన్నీ వేనికవే వేరువేరుగా కదలినట్లున్నా, అన్నింటినీ క్రమవిధానంలో కలిపి

ఉంచేవాడు శూరసేనుడు. జ్ఞానులైనవారు అంతటా భగవంతుని శక్తి ఈ విధంగా విస్తరించియుందని తెలిసికొంటారు. శూరసేనుని స్తుతించి తమ పాపాలను పరిహరింపజేసుకొంటారు.

ధర్మచక్రము రచయిత – మహాభారతయుద్ధంలో కృష్ణుడు తమ పక్షాన ఉండడంవలన పాండవులు విజయులయ్యారు. అసురస్వభావంకల కౌరవులు నశించారు. మనంకూడా మనలోని అసురగుణాలను త్యజించి, భోగలాలసతను విడిచి, భగవంతుని స్తుతించడంద్వారా శూరసేనుడైన భగవంతుని పక్షంలో చేరవచ్చును.

710. యదుశ్రేష్ఠః

- యాదవులలో శ్రేష్ఠుడు.

-(జీవుల ముక్తి కొరకు) యత్నించేవారిలో సర్వోత్తముడు.

ఓం యదుశ్రేష్ఠాయ నమః

ఒరిస్సాకు చెందిన ఒక పటచిత్రం. వికీపీడియానుండి

మగ్నంతు యాదవం వంశం ఉద్ధరిష్యతి యశ్చ సః

యదుశ్రేష్ఠః ఇతి ఖ్యాతః వస్వర్ణో వంశవర్ధనః

క్రుంగిపోయి ఉన్న యదువంశాన్ని ఉద్ధరించినవాడు యదుశ్రేష్ఠుడు.

ఈ నామము అష్టాక్షరీ మంత్రము. వంశమును వర్ధిల్లజేయునది.

ఓం యదుశ్రేష్ఠాయ నమః.

శ్రీ భట్టులు విష్ణుపురాణము (15.20.37)నుండి ఉదాహరించారు.

అయం స కథ్యతే ప్రాజ్ఞైః పురాణార్థావలోకినః

గోపాలో యాదవమ్ వంశమ్ మగ్నమ్ అభ్యుద్ధరిష్యతి

జ్ఞానులైన ఉత్తములు, పురాణములు తెలిసినవారు చెప్పిన విషయమిది – క్షీణిస్తున్న యాదవకులాన్ని ఉద్ధరించే గోపాలుడితడే.

యదూనామ్ ప్రధానత్వాత్ యదుశ్రేష్ఠః. యాదవవంశంలో ముఖ్యుడైనందున యదుశ్రేష్ఠుడు అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – యత్ - ప్రయత్నే - యతే యాతుః ప్రయత్నశీలః; శ్రేష్ఠః - ప్రశశ్యశ్రః – ప్రశంసింపదగిన వారిలో ఉత్తముడు. ఇష్టాన్ యదుశ్రేష్ఠః ప్రయత్నము చేయువారిలో అత్యంత స్తుతనీయుడు యదుశ్రేష్ఠుడు. భగవానుడు సూర్యునిగా సకలజీవులను పోషించును. పరమాత్ముడై అందరియందు వసించును. ఆత్మలను

ముక్తిమార్గమువైపు నడిపించును. ఇందుకొరకు ఆయన వేదములనిచ్చి జ్ఞానమును ప్రసాదించెను. ఇలా భగవంతుడు అనేక ప్రయత్నములు చేయును గనుక యదుశ్రేష్ఠుడు.

ధర్మచక్రము రచయిత – శ్రీకృష్ణుని కారణంగా యదుకులము, గోకులము కూడా పావనమయ్యెను. మనం యదుశ్రేష్ఠుని స్మరిస్తూ మనవంశం అభ్యున్నతికి తోడ్పడవచ్చును.

711. సన్నివాసః

- (సనక సనందనాది) సాధువులకు నివాసము.
- ‘సత్’నకు నివాసము. ‘సత్’యందు నివసించేవాడు.

ఓం సన్నివాసాయ నమః

సనకాది నివాసోహి మానుషత్వేऽపి యస్సదా
సన్నివాస స్స విజ్ఞేయ హ్యష్టార్ణః స్థానదాయకః.
తాను మానవునిగా అవతరించికూడా సనక సనందనాది మహర్షులకు ఎప్పుడూ ఉనికిపట్టు అయి ఉండువాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. స్థానదాయకము. ఓం సన్నివాసాయ నమః.
శ్రీ భట్టులు విష్ణుపురాణమునుండి చెప్పిన ప్రమాణము.
సనందనాద్యైర్మునిభిః సిద్ధయోగైరకల్మషై
సంచింత్యమానమ్ తత్రస్థైః నాసాగ్రన్యస్తలోచనైః – విష్ణుపురాణము 5.18.42
కల్మషరహితులు, యోగసిద్ధులు అయిన సనక సనందనాదులు తమ నాసాగ్రములపై దృష్టినుంచి గోలోకవాసియైన శ్రీకృష్ణుని ధ్యానింతురు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **సత్ - సతామ్, వినాశ రహితామ్ ప్రవాహతో నిత్యానామ్, ఆప్రలయ స్థాయినామ్.** ‘సత్’ అయినవారు ఆయన యందుండెదరు. ‘సత్’ అనగా మార్పు, పతనము లేని జీవులు (నిత్యసూరులు). **నిజ సత్తాయామ్ వాసయంతమ్, తేషు వా వసంతమ్ ఇతి భావః.** అనగా ‘సత్’ ఆయన యందు, ఆయన ‘సత్’యందు వసింతురు.

712. సుయామునః

- యమునానదియందున, తీరమున అనేక మనోహర క్రీడలు సలిపినవాడు.
- సజ్జనులైన యమునాతీరవాసులచే పరివేష్ఠితుడు.
- కనులకు చక్కని అంజనము పెట్టుకొన్నవాడు.
- ప్రళయకాలమున జీవులను ఉద్ధరించువాడు.

ఓం సుయామునాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **శోభనమ్ పావనమ్ మనోహరమ్ యమునా సంబంధి జలక్రీడా పుష్పాచయ రాసక్రీడాది యస్య ఇతి సుయామునః.** యమునానది, తటియందు పావనమైన మనోహరమైన జలక్రీడలు, పుష్పక్రీడలు, రాసక్రీడలు సలిపినవాడు సుయామునుడు.

గోపీభిర్యమునాయాంతు శోభనం పావనం మహత్
జలక్రీడాది యస్మీతి సుయామున ఇతీరితః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'యామునులు' అనగా యమునాతీరమున ఉండేవారు – దేవకి, వసుదేవుడు, నందుడు, యశోద, బలభద్రుడు, సుభద్ర, గోపబాలురు, గోపికలు ఇత్యాదులు. ఉత్తములైన యామునులచే (యమునా సంబంధులచే) పరివేష్టితుడై యున్నవాడు సుయామునుడు.

యామునులు కేవలం పశుపాలకులే కాదు. ఉపనిషత్సార పరిరక్షకులు అని చెబుతూ శ్రీ చిన్మయానంద నారాయణీయము (100.1)నుండి ఉదాహరించారు.

తారుణ్యారమ్యరమ్యమ్ పరమసుఖరసస్వాద రోమాంచితాంగైః
అవీతమ్ నారదాద్యైః విలసత్ ఉపనిషత్సుందరీ మండలైశ్చ.
సుందరుడైన గోపకిశోరబాలుడు నాకు దర్శనమిచ్చాడు. ఆయనను చుట్టుముట్టియున్న నారదాదులు పరమసుఖరసాస్వాదులైనందున రోమాంచితులైయున్నారు. మరియు సుందరులైన ఉపనిషత్కాంతామణులు ఆయనచుట్టూ ప్రకాశిస్తున్నారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సుందరమ్ యామునమ్ నయనాంజనమ్ యస్య ఇతి సు-యామునః.** ఇక్కడ యామునము అనగా కన్నులకు పెట్టుకొనే అంజనము. కనులకు చక్కని అంజనము పెట్టుకొన్నవాడు సుయామునుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – యమ్-ఉపరమే-ఎత్తుట, ఉద్ధరించుట; యామునః-యచ్ఛతి, ఉపరమ్యతి.
శోభనో యామునః సుయామనో విష్ణుః
భగవాన్ విష్ణుః మహాప్రళయే స్వకీయయా వ్యవస్థయా కార్యకారణరూపమ్
రూపమిదమ్ సమస్తమ్ విశ్వమ్ యచ్ఛతి, పరిణతమ్ ఉపరమ్యతి, సమయతి.
మహాప్రళయకాలమున (ఆత్మలను) మంగళకరముగా ఉద్ధరించువాడు సుయామునుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

భూతావాసో వాసుదేవః సర్వాసునిలయోఽనలః |

దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోఽథాపరాజితః || (76)

713. భూతావాసః

- సకలభూతములకు నివాసమైనవాడు.
- తన భక్తుల హృదయములలో నివసించువాడు.
- పంచభూతములకు నిలయమైనవాడు.

ఓం భూతావాసాయనమః

భూ – భవన్ - ఉండుట; భవన్తి ఇతి భూతాని; వస్ - నివాసే - నివసించుట; **సమంతాద్ వసన్తి భూతాని యస్మిన్ సః భూతావాసో విష్ణుః**. ఎవనియందు సమస్తభూతములు నివసించునో అతడు భూతావాసుడు విష్ణువు (శ్రీ సత్యదేవో వాసిష్ఠ నిర్వచనము).

శ్రీ భట్టుల వ్యాఖ్యను నిరుక్తంలో ఇలా చెప్పారు – **యస్మిన్ వసన్తి భూతాని భూతావాస స కథ్యతే**. ఇందుకు శ్రీ వి.వి. రామానుజన్ గీతనుండి, దివ్యప్రబంధములనుండి ఉదాహరించారు.

పశ్యామి దేవాం స్తవ దేవ దేహే సర్వాంస్తథా భూత విశేష సంఘాన్
బ్రహ్మాణమీశం కమలాసనస్థం ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ – గీత 1.15
అర్జునుడు పలికెను – ఓ దేవాది దేవా! నీ విరాట్ రూపమునందు సకల దేవతలను, నానావిధ భూతములను (ప్రాణికోటిని), బ్రహ్మను, మహాదేవుడైన శంకరుని, సమస్త ఋషులను, దివ్యసర్పములను చూచుచున్నాను.

మత్త పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ – గీత 7.7

ఓ ధనంజయ! నాకంటెను పరమకారణమైనది ఏదియును లేదు. ఈ జగత్తునందలి వస్తువులన్నియు సూత్రమున సూత్రమణులవలె నాయందే కూర్చబడియున్నవి.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 3.2.11 – ఆయన అన్ని ఆత్మలకు ఆత్మ.
శ్రీ పెరియాళ్వారు తిరు. 1.1.6 – చిన్నికృష్ణుని నోట సమస్త భువనములను యశోద దర్శించెను.
పోతన భాగవతము – 10.341 నుండి 344
ఆ లలితాంగి కనుంగొనె
బాలుని ముఖమందు జలధి పర్వత వన భూ
గోళ శిఖి తరణి శశి ది
క్పాలకాది కరండమైన బ్రహ్మాండంబున్
కనుగొని,
కలయో వైష్ణవమాయయో యితర సంకల్పార్థమో సత్యమో
తలపన్నేరక యున్నదాననొ యశోదాదేవి గానో పర
స్థలమో బాలకుడెంత యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వలమైయుండుట కేమి హేతువొ మహాశ్చర్యంబు చింతింపగన్

బాలమాత్రుడైన బాలుని ముఖమందు
విశ్వమెల్ల నెట్లు వెలసియుండు?
బాలుభంగి నితడు భాసిల్లుగాని స
ర్వాత్ముడాదివిష్ణుడగుట నిజము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **భూతాని అత్ర అభిముఖ్యేన వసన్తి ఇతి భూతావాసః**. ఎవనియందు ముఖ్యముగా భూతములు వసించునో అతడు భూతావాసుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **భూతేషు భజన పరాయణేషు ప్రాణిషు ఆవాసో యస్య ఇతి భూతావాసః**. తనను సేవించు, భజించు, పూజించు ప్రాణుల (భక్తుల)యందు నివాసముండువాడు భూతావాసుడు.

శ్రీ చిన్మయానంద 'భూతములు' అనగా 'పంచమహాభూతములు' అన్న అర్థం గ్రహించారు. ఈ పంచమహాభూతములకు నివాసస్థలమైనవాడు భూతావాసుడు.
వసన్తి త్వయీ భూతాని భూతావాసస్తతో భవాన్ (హరివంశము 279.52).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అన్ని జీవులూ పాంచభౌతికములైనాగాని, మనుష్యులది ప్రధానంగా పృథ్వీతత్వము. చేపలది జలతత్వము. పక్షులది వాయుతత్వము. ఇలా భగవంతుని సృష్టి వివిధ పంచమహాభూతాలతో

ముడివడి ఉంది. భగవంతుడు భూతావాసుడని చెప్పడానికి ఇది ఒక సూచన. అన్నీ ఆయనయందు, ఆయన అన్నింటియందు ఉండును. **విష్ణోః కర్మాణి పశ్యత** (ఋగ్వేదము 1.22.19). విష్ణువు తన కర్మలు (సృష్టివంటి కార్యక్రమములు) ద్వారా తెలియవచ్చుచున్నాడు.

714. వాసుదేవః

- వ్యాపించువాడు, క్రీడించువాడు.
- వసుదేవుని సుతుడు.
- ప్రసిద్ధ వాసుదేవ ద్వాదశాక్షరి మంత్రపు దైవము.
- తన భక్తులచే ఆరాధింపబడే దేవుడు.
- అన్నింటియందు ఉండేవాడు. వానిని చలింపజేయువాడు.

ఓం వాసుదేవాయ నమః

(700వ నామమువద్ద ఇచ్చిన వివరణ ఇక్కడ మరల వ్రాయబడినది.)

ఈ పరమ పవిత్ర నామము మూడుమార్లు ఈ మహాస్తోత్రమున స్తుతింపబడినది.

36వ శ్లోకము. 334వ నామము. వాసుదేవః – **వాసుదేవో బృహద్భానుః ఆదిదేవః పురందరః**

74వ శ్లోకము. 701వ నామము. వాసుదేవః – **వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః**

76వ శ్లోకము. 714వ నామము. వాసుదేవః – **భూతావాసో వాసుదేవః సర్వాసునిలయోనలః**

ముందుగా 334వ నామము వ్యాఖ్యలో శ్రీభట్టుల ప్రత్యేకవ్యాఖ్యను గమనించాలి – 'నారాయణ' నామము వలెనే 'వాసుదేవ' నామము గుహ్యమంత్రము. సరియైన గురువువద్దనే ఈ నామమునకు అర్థమును తెలిసికొననగును.

వివిధ వ్యాఖ్యాతలు చెప్పిన విషయాలలోని భావాలు ఇక్కడ ఇవ్వడమైనది.

36వ శ్లోకము. 334వ నామము. **వాసుదేవః** – శ్రీ భట్టుల వ్యాఖ్య – 'వాసు' - తల్లి గర్భములోవలె భగవంతునియందు సమస్తము నివసించును. అంతటినీ ఆయన ఆవరించి పక్షి తన రెక్కలతో కప్పియుంచినట్లు కాపాడుతున్నాడు. 'దేవ'-క్రీడించువాడు. సృష్టి, వ్యాప్తి, రక్షణ, లయము ఇవన్నీ ఆయన లీల. వాసు-దేవ – వాసుదేవ. అంతటినీ తనయందు ఉంచుకొని క్రీడించువాడు వాసుదేవుడు.

36వ శ్లోకము. (334వ నామము). **వాసుదేవః** – శ్రీ శంకరుల వ్యాఖ్య – వసతి - ఆచ్ఛాదయతి - కప్పియుంచును. **వసతి వాసయతి ఆచ్ఛాదయతి వా సర్వమ్ ఇతి వాసుః**. సర్వమును తన మాయతో కప్పియుంచి క్రీడించువాడు వాసుదేవుడు. శ్రీ శంకరులుకూడా 'వాసు', 'దేవ' అనే పదాల ఆధారంగానే ఈ నామాన్ని వ్యాఖ్యానించారని గమనించవచ్చును. కాని ఇందులో ఆయన భగవంతుని 'మాయ'ను

ప్రస్తావించారు. **జగత్ ఆచ్ఛాదయి మాయయా ఇతి వాసుః స ఏవ దేవ ఇతి వాసుదేవః.** అద్వైతుల సంప్రదాయం ప్రకారం మాయ అనేది అజ్ఞానస్వరూపం (భ్రాంతి). కాని విశిష్టాద్వైతంలో మాయ అనేది ఈశ్వరుని అద్భుతమైన శక్తి (లీల)లో ఒక భాగం.

74వ శ్లోకము. 700వ నామము. **వాసుదేవః** – ఈ సందర్భములో శ్రీ భట్టులు, శ్రీ శంకరులు కూడా వసుదేవుని సుతుడు వాసుదేవుడు – అనే అర్థం చెప్పారు. **వసుదేవస్య అపత్యమ్ వాసుదేవః.** శ్రీ కృష్ణదత్త భరద్వాజ భాగవతంనుండి ఉదాహరించారు.

అవతీర్ణో యదుకులే గృహానక దుందుభేః

వదంతి వాసుదేవేతి వసుదేవ సుతం హి మామ్ – భాగవతము 10.51.41

76వ శ్లోకము. 714వ నామము **వాసుదేవః** – శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీవాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రమునకు అధిదేవతయైన వాసుదేవుడు. శ్రీవైకుంఠములోని పరవాసుదేవుడే పాలసముద్రంలో వ్యూహవాసుదేవునిగా అవతరించాడు. ఆయనే మధురలో దేవకీ వసుదేవులకు సుతునిగా అవతరించాడు (700వ నామమునకు శ్రీ భట్టుల వివరణ). శ్రీవైకుంఠమునుండి దిగివచ్చిన ఆ వ్యూహవాసుదేవుడే గోపికల హృదయాలను అలరింపజేశాడు. యోగులకు పరతత్వము అయ్యాడు. కంసాది దుష్టులకు మృత్యుసమానుడయ్యాడు. (శ్రీ వి.వి. రామానున్ వివరణ)

శ్రీ కృష్ణదత్త భరద్వాజ మరొక వైవిధ్యమైన అర్థం చెప్పారు. వాస్ - ఉపసేవాయాం - సుగంధభరితము చేయుట. **వాసయతే సేవయతే భక్తైః ఇతి వాసుః, స చాసౌ ఇతి వాసుదేవః.** భక్తులచే అలంకరింపబడేవాడు వాసుదేవుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **దివ్ - క్రీడా విజిగీష వ్యవహార ద్యుతి స్తుతి మోద మద స్వప్న కాంతి గతిషు** – ఇందులో 'గతి'- అనగా కదలుట. అన్నింటియందు ఉండేవాడు, వానిలోని చలనమునకు ఆధారమైనవాడు వాసుదేవుడు. **ఈశావాస్యమిదమ్ సర్వమ్ యద్ కించన జగత్యామ్ జగత్** (ఈశావాస్యోపనిషత్తు).

శ్రీ చిన్మయానంద – సకల జీవులలోని అంతర్యామి వాసుదేవుడు. ఇందుకు గీతాశ్లోకం ప్రమాణంగా భావింపవచ్చును.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేऽర్జున తిష్ఠతి

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా – గీత 18.6

ఈ శ్లోకానికి వివరణ ఇస్తూ శ్రీ భగవద్రామానుజులు తమ గీతాభాష్యంలో 'వాసుదేవ' అనే పదాన్ని వాడారు గనుక పై అర్థాన్ని ఆయన సమర్థిస్తున్నట్లు భావింపవచ్చును. **ఈశ్వరః సర్వ నియమన శీలో వాసుదేవః సర్వభూతానామ్ హృద్దేశే సకల ప్రవృత్తి నివృత్తిమూల జ్ఞానోదయే దేశే తిష్ఠతి.**

క్షీరసాగర మథనం – 1820 కాలపు చిత్రం. వికీపీడియానుండి

715. సర్వాసునిలయః

సకల ప్రాణులకు ఆధారమైనవాడు.

ఓం సర్వాసులయాయ నమః

సర్వ - అన్నీ, సమస్తము; అసు - జీవించునది, ప్రాణి (అస్తి ఇతి అసుః); నిలయః - నివాసము (లీ - శ్లేషణే - అతుకుకొని యుండుట). సకల ప్రాణులకు ఆధారము సర్వాసునిలయుడు. ఈ భావాన్ని మూడు విధాలుగా వెల్లడించవచ్చును.

(1) నిజమైన భక్తులకు ఆలంబనము భగవంతుడే. భగవంతుని తోడువల్లనే అట్టి భక్తులు జీవించియున్నారు. భగవంతుని ధ్యానము లేని జీవనము వారికి వ్యర్థము.

(2) ప్రాణులకు ప్రాణమునిచ్చేది భగవంతుడే. ఆయన కారణమువల్లనే ప్రాణములు నిలిచియుండును.

(3) ప్రళయకాలంలో సకలప్రాణులు భగవంతునియందు లీనమగును.

ఈ మూడు భావాలను కలిపి 'సర్వాసునిలయః' నామమునకు అర్థము చెప్పవచ్చును.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భక్తుల ప్రాణములకు ఆలంబనము భగవంతుడే. **సర్వప్రాణ ఆలంబనమ్ సర్వాసునిలయః.** ఇందుకు శ్రీ భట్టులు మహాభారతమునుండి ఉదాహరించారు-

అసూర్యమివ సూర్యేణ నివాతమివ వాయునా

కృష్ణేన సముపేతేన జహృతే భారతమ్ పురమ్ – మహాభారతము (ఉద్యోగ పర్వము?) 28.22

శ్రీకృష్ణుడు హస్తినాపురానికివచ్చాడు. సూర్యుడు కనుపించని రోజులలో సూర్యోదయమైనట్లుగా, గాలిలేనిచోట గాలి వీచినట్లుగా హస్తినాపుర జనులు సంతసించారు.

శ్రీ అణ్ణంగారాచార్య – భగవంతునిపట్ల జనులు ఎంతగా ఆకర్షితులయ్యారంటే భగవధ్యానం లేకుండా జనుల ప్రాణాలు నిలువవు. అందుకే ఆయన సర్వాసునిలయుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – అసు - ప్రాణము - నాశనము లేని జీవశక్తి. సకల జీవ చైతన్యమునకు ఆధారమైనవాడు, మరియు అంతములేని జీవుడు సర్వాసునిలయుడు. **సర్వ ఏవ అసవః ప్రాణా జీవాత్మకే యస్మిన్ అవ్యయే నిలీయంతే స సర్వాసునిలయః.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఒకవ్యక్తి మెలకువగా ఉన్నపుడు ఆ వ్యక్తి ఇంద్రియాలు స్వతంత్రంగా పనిచేస్తున్న భావన కలుగుతుంది. అదే వ్యక్తి నిదురించినపుడు సర్వేంద్రియాలూ అతనిలో ఒదిగిపోతాయి. అలాగే ప్రళయకాలంలో సమస్తప్రాణులు భగవానునియందు లీనమౌతాయి.

అన్నమయ్య కీర్తన

అందరికాధారమైన ఆది పురుషుడీతడు
విందై మున్నారగించె విదురునికడ నీతుడు

సనకాదులు కొనియాడెడి సర్వాత్మకుడీతడు
వనజ భవాదులకును దైవంబై నతడీతడు
ఇనమండలమున జెలగేటి హితవై భవుడితడు
మునుపుట్టిన దేవతలకు మూలభూతి యీతడు

సిరులొసగి యశోదయింట శిశువైనత డీతడు
ధరనావుల మందలలో తగ జరించె నీతడు
సరసతలను గొల్లెతలకు జనవులొసగె నీతడు
ఆరసి కుచేలుని యడుకులు ఆరగించెనీతడు

పంకజభవునకును బ్రహ్మ పద మొసగెను యీతుడు
సంకీర్తన లాద్యులచే జట్టి గొనియెనీతడు
తెంకిగ నేకాలము పరదేవుడైన యీతడు
వేంకటగిరి మీద ప్రభల వెలసిన ఘనుడీతడు

716. అనలః

(1) తన భక్తులకు తాను చేసినదానితో తృప్తిచెందనివాడు. (అన్-అలః)

(2) తన భక్తులపట్ల జరిగిన దుష్కార్యములను సహింపజాలనివాడు.

(3) ప్రాణశక్తిని తనదానిగా స్వీకరించి జీవాత్మగా వ్యవహరించువాడు.(అన-లః)

(4) వాసనవంటి గుణములకు అతీతుడు. (అ-నలః)

(5) అంతులేని యశోవైభవ విభూతులు కలవాడు (అలమ్ - పర్యాప్తి - చివర).

(6) అగ్ని స్వరూపుడు. (అనల-అగ్ని)

(7) అంతము లేనివాడు (అలమ్ - పర్యాప్తి - చివర).

(8) ఎదురు లేనివాడు (అలమ్ - నిరోధము).

(9) భగవంతునికొరకు తపించే భక్తులను పునరుజ్జీవింపజేయువాడు (అన్ - ప్రాణనే).

ఓం అనలాయ నమః

ఈ నామము రెండుమార్లు వచ్చుచున్నది.

32వ శ్లోకము. 294వ నామము. అనలః – **భూతభవ్యభవన్నాథః పవనః పావనోऽనలః**

76వ శ్లోకము. 716వ నామము. అనలః – **భూతావాసో వాసుదేవః సర్వాసునిలయోऽనలః**

ఈ నామమును 'అన్-అలః', 'అ-నలః', 'అన-లః' ఇలా వివిధా శబ్దాలుగా చూసి వివిధ భావాలను వ్యాఖ్యాతలు చెప్పారు.

(1) అనలుడు – తన భక్తులకు తాను చేసినదానితో తృప్తిచెందనివాడు.

శ్రీ భట్టులు 32వ శ్లోకంలోని 'అనలః' నామమును ఇలా వివరించారు (అన్-అలః)

అపర్యాప్తో హి భక్తేభ్యోప్యుపకృత్య పునఃపునః

అనుగ్రహం యః కరోతి సోऽనలః పరికీర్తితః

భక్తులకు ఎన్నో మార్లు అనేక విధాలుగా ఉపకరించికూడా తృప్తిపొందనివాడు. తరగని అనుగ్రహము కలవాడు అనలుడు. ఇందుకు శ్రీ భట్టులు మహాభారతము (ఉద్యోగపర్వము 28.22)నుండి ఉదాహరించారు – **ఋణమ్ ప్రవృద్ధమివ మే హృదయాత్ నాపసర్పతి**. ఆప్పుడు ద్రౌపది 'గోవిందా'యని ఆక్రోశించిన కేక నా మనసునుండి చెరిగిపోలేదు. రోజురోజుకూ అప్పువలె పెరుగుతూనే ఉన్నది.

ఇక్కడ శ్రీ భట్టులు 'అల్-పర్యాప్తి-తృప్తి' అనే అర్థంలో 'అనలుడు' అనగా 'తృప్తిలేనివాడు' అని అర్థం చెప్పారు. భక్తులకు తాను ఎంత చేసినాగాని భగవంతుడు – **న కించిత్ కృతమ్ ఏషామ్ మయా ఇవి అవి తృప్తః** – నేను ఏమీ చేయలేకపోయానని భావించి తృప్తిలేకుండా ఉంటాడట. శ్రీకృష్ణుడు ద్రౌపది మానాన్ని

సంరక్షించాడు. తన స్వంత ప్రతిజ్ఞను జవదాటి యుద్ధంలో పగటిని రేయిగా చేశాడు. అయినాగాని ఆయనకు తృప్తి లేదు. ద్రౌపదికి తానేమీ చేయలేకపోయానని వగచాడు.

శ్రీ నమ్మాళ్వారు. పెరియ తిరువంతాడి 53 – నీ భక్తులకు ఏమి చేయాలనేదే ఎప్పుడూ నీ ధ్యాస (ఇక్కడ కూడా అగ్నికీ భగవంతునికీ పోలిక ఉన్నది. ఆజ్యం పోసినకొద్దీ అగ్ని ఇంకా విజృంభిస్తుంది).

తృప్తి లేకపోవడానికి శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక అర్థం చెప్పారు. పూజలో అనేక సంభారాలు సమర్పించినంతలో దేవుడు తృప్తి పొందడు. భక్తితో ఏదైనా అర్పిస్తేనే తృప్తుడవుతాడు.

(2) అనలుడు – తన భక్తులపట్ల జరిగిన దుష్కార్యములను సహింపజాలనివాడు.

76వ శ్లోకములోని 716వ నామము 'అనలః'కు శ్రీభట్టులు ఈ అర్థం చెప్పారు. తన భక్తులపట్ల జరిగిన అపచారమును ఏమాత్రము సహింపనివాడు అనలుడు. దీనికి కూడా శ్రీ భట్టులు మహాభారతం (సభాపర్వము 68.26)నుండి ఉదాహరించారు.

ద్వౌతు మే వధకాలేऽస్మిన్ న క్షంతవ్యౌ కథంచ న

యజ్ఞం విఘ్నకరం హన్యామ్ పాండవానామ్ చ దుర్హృదమ్

చంపవలసిన సమయం వచ్చినపుడు ఇద్దరిని ఏమాత్రం వదలను. ఈ యాగాన్ని అడ్డుకొనేవారిని, పాండవులపట్ల శత్రుత్వం కలిగినవానిని.

పాండవులపట్ల శత్రుత్వం కలిగియున్నాడన్న కారణంగా దుర్యోధనుని ఆతిథ్యాన్ని శ్రీకృష్ణుడు తిరస్కరించాడు.

(3) అనలుడు – ప్రాణశక్తిని తనదానిగా స్వీకరించి జీవాత్మగా వ్యవహరించువాడు.

32వ శ్లోకంలోని 'అనలః' నామమును శ్రీ శంకరులు 'అన-లః' అని వ్యాఖ్యానించారు. అన - ప్రాణము; లా - ఆదానే దానే చ - స్వీకరించుట; **అనాన్ ప్రాణాన్ ఆత్మత్వేన లాతి ఇతి అనలః**. దీనికి అనువాదం ఇలా చెప్పవచ్చును – ప్రాణశక్తిని తనదానిగా స్వీకరించి జీవాత్మ స్వరూపునిగా వ్యవహరించువాడు అనలుడు. 'ప్రాణాలను స్వీకరించుట' అనే భావాన్ని శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఇలా వివరించారు – చివరకు భగవంతుడు అందరి ప్రాణాలను తనలో విలీనం చేసుకొంటాడు గనుక అనలుడు.

(4) అనలుడు – వాసన వంటి గుణములకు అతీతుడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము – 'అ-నలః' నల్ - గంధే బంధనేన చ - వాసన, కట్టి ఉంచుట. **న అలమ్ అస్య స అనలః**. వాసనకు అతీతుడు అనలుడు. ఇందుకు శ్రీ శంకరులు బృహదారణ్యోపనిషత్తు (3.8.8)నుండి ప్రమాణం చెప్పారు – **అ స్థూలమ్ అనణ్వహ్రస్వమ్ అదీర్ఘమ్ అలోహితమ్ అస్నేహమ్ అచ్ఛాయమ్** … .. **అమాత్రమ్ అనంతరమ్ అబాహ్యమ్**..... బ్రహ్మము పెద్దది కాదు, చిన్నది కాదు, పొడవు గాదు, పొట్టి కాదు, రంగు లేదు, తడి చేయబడదు, కొలవజాలరానిది.....

(5) అనలుడు – అంతులేని యశోవైభవ విభూతులు కలవాడు.

76వ శ్లోకం వ్యాఖ్యలో శ్రీ శంకరులు 'అలమ్' అనగా 'హద్దు' అనే అర్థం తీసుకొన్నారు. అలమ్ - పర్యాప్తి - చివర, హద్దు. **అలమ్ పర్యాప్తిః శక్తి సంపదామ్ న అస్య విద్యత ఇతి అనలః**. ఎవని శక్తి సంపదలకు పరిమితులు లేవో అతడు అనలుడు. ఇందుకు శ్రీ చిన్మయానంద గీత (12.5)నుండి ఉదాహరించారు. **న అంతోస్తి మమ దివ్యానామ్ విభూతీనామ్ పరంతప**. ఓ అర్జునా! నా దివ్య విభూతులకు అంతము లేదు.

ఇక్కడ గమనించదగ్గ విషయం – 'అల్ - పర్యాప్తి - అనగా పరిమితి' అనే అర్థాన్నే శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడా గ్రహించారు. కాని శ్రీ భట్టుల వ్యాఖ్య – భక్తులకు సహాయపడే భగవానుని సంకల్పానికి పరిమితి లేదు. శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవానుని శక్తిసంపదలకు పరిమితి లేదు. శ్రీ భట్టుల వ్యాఖ్య భగవానుని భక్తవాత్సల్య గుణాన్ని వక్కాణిస్తుంది. శ్రీ శంకరుల వ్యాఖ్య భగవంతుని పరత్వాన్ని తెలియజేస్తుంది.

(6) అనలుడు – అగ్ని స్వరూపుడు.

శ్రీ చిన్మయానంద 'అనలః' అనగా 'అగ్ని' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. భగవంతుడు అగ్నిస్వరూపుడై మన దేహాలలో ఉష్ణతను కాపాడుతూ ప్రాణాలను నిలుపుతున్నాడు.

(7) అనలుడు – అంతము లేనివాడు (అలమ్ - పర్యాప్తి - చివర).

(8) అనలుడు – ఎదురు లేనివాడు (అలమ్ - నిరోధము).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన అర్థాలు:

అలమ్ - పర్యాప్తి - తృప్తి వచన – అంతులేనివాడు అనలుడు.

అలమ్ - వారణా - నిరోధము, ఎదురు – ఆయనను ఎదిరించేవాడు లేడు గనుక ఆయన అనలుడు.

ఇందుకు శృతులనుండి ఉదాహరణలు –

అధర్వ 5.11.4 – **న త్వదన్యః కవితరోన మేధాయా ధీరో వారుణా స్వధావాన్**.

అధర్వ 13.4.16 – **న ద్వితీయో న తృతీయః**.

ఋగ్ 10.48.5 – **అహమ్ ఇంద్రో న పరాజిగ్యే**.

ఋగ్ 8.93.4, అధర్వ 20.11.2.1, యజుర్ 33.35 – **సర్వమ్ తదింద్ర తే వాసే**.

(9) అనలుడు – తన దర్శనం ద్వారా భక్తులను పునరుజ్జీవింపజేయువాడు (అన్ - ప్రాణనే).

శ్రీ కృష్ణదత్త భరద్వాజ పూర్తిగా వేరే అర్థం చెప్పారు.

అన్-ప్రాణనే-జీవించుట; ఉనాది సూత్రము (1.106) **'వృషాది భయశ్చిత్'** ప్రకారము – **ఆనయతి సముజ్జీవయతి తపః కృశాన్ స్వజనాన్ స్వదర్శనేన ఇతి అనలః**. తపస్సువలన కృశించిన స్వజనులకు (భక్తులకు) తన దర్శనం ప్రసాదించి తిరిగి వారిని పునరుజ్జీవింపజేసేవాడు అనలుడు.

717. దర్పహా

గర్వమును అణచువాడు.

ఓం దర్పఘ్నే నమః

దర్ప - దృప్ - హర్ష మోహనయోః - ఆనందించుట, గర్వించుట; హా - హాన్ - చంపుట; గర్వంతో మదించినవారి గర్వాన్ని అణచివేసేవాడు 'దర్పహా'.

శ్రీ భట్టులు ప్రత్యేకంగా, దేవాసుర గర్వాణ్ని అణచివేసేవాడు, అని చెప్పారు.

గోవర్ధనస్యోద్ధరణే పారిజాత పరిగ్రహే

బాణ దోర్దండ షండానాం ఖండనాదౌ తదా

దేవానాం పై దర్పమాత్రం హతవాన్య స దర్పహా

గోవర్ధనోద్ధరణమునందు, పారిజాతాపహరణమునందు, బాణాసురుని భుజాలను ఖండించినపుడు – ఇలా దేవేంద్రాదుల గర్వమును అణచినవాడు దర్పఘ్నుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ధర్మమార్గంనుండి పైదొలగేవారి గర్వాన్ని అణచివేసేవాడు దర్పఘ్నుడు. వ్యక్తులు తమ పరిమితులు తెలిసికొనకుండా ప్రవర్తించినపుడు వారిలో గర్వం పెరుగుతుంది. వారికి అడ్డంకులు కలిగించడం ద్వారా భగవంతుడు వారి గర్వాన్ని అణచివేస్తాడు. అలాగే దేహానికీ, ఆత్మకూ భేదం తెలియకుండా ఉంటే గర్వం పెరుగుతుంది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – జీవులు తాము భగవంతునినుండి వేరుగా తలచినపుడు గర్వితులౌతారు. దుఃఖము, కష్టము కలిగినపుడు కొంచెం గర్వం నశిస్తుంది.

718. దర్పదః

- (తన భక్తులకు) గర్వమును కలిగించువాడు.
- (యాదవులకు) గర్వమును కలిగించినవాడు.
- అన్నింటిలో అందమును, ఆకర్షణను కలిగించువాడు.
- ధర్మమార్గమున నడచువారికి గౌరవ ప్రతిష్టలు కలిగించువాడు.

ఓం దర్పదాయ నమః

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **దర్పో హర్షః, తమ్ సాత్వికేభ్యో దదాతి ఆత్మానమ్ ప్రదర్శ్య ఇతి దర్పదః**. దర్పము అనగా సంతోషము. తన దర్శనము ద్వారా నిజమైన భక్తులకు సంతోషము, గర్వము కలుగజేయువాడు దర్పదుడు. భగవదనుభవము భక్తులకు ఎనలేని గర్వమును కలుగజేయును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – (దర్పో గర్వః) భగవంతుడు తన భక్తులకు గర్వము రూపంలో బలాన్ని ప్రసాదిస్తాడు. అలాంటి గర్వబలంవల్లనే హనుమంతుడు సీతమ్మను వెదకడానికి సాగరాన్ని లంఘించాడు. రావణుని యెదుట నిర్భయంగా మాట్లాడాడు.

మధురాయాం యాదవేభ్యః మధుపానాదినా తతః
దర్పం చ దత్తవా న్యసౌ దర్పదః పరికీర్తితః

మధురానగరంలో యాదవులు మధుపానం చేసి గర్వించేలా చేసినవాడు గనుక దర్పదుడు. శ్రీకృష్ణుడు మధురానగరాన్ని దుర్భేధ్యంగా రూపొందించాడు గనుక దానికి శత్రుభయం లేదు. ఆ నగరంలో సాక్షాత్తూ పరమేశ్వరుడయిన శ్రీమన్నారాయణుడే వాసుదేవుని రూపంలో ఉన్నాడు. అతనితోపాటు శంఖ పద్మ నిధులున్నాయి. పారిజాతము ఇక్కడే ఉన్నది. ఇన్ని కలిగిన యాదవవీరులు మధుపానం చేసి మత్తెక్కి గర్వించారు (డా. క్రోవి పార్థసారధి).

శ్రీ చిన్మయానంద – భక్తులు గర్వంవలన తమ ధర్మమార్గనుండి ఏమాత్రం బెసకరు. ఇలా గర్వమే వారికి రక్షణ అవుతుంది.

ధర్మచక్రము రచయిత – కత్తివలె గర్వముకూడా రెండువైపుల పదునైనది. తాను విష్ణుభక్తుడైనందుకు గర్వించే భక్తుడు తద్వారా మరింత ఆధ్యాత్మిక ప్రగతి సాధిస్తాడు. ఇక్కడ లభించే గర్వము భగవత్సేవ వలన, నిర్మలమైన మనసు వలన, సత్ఫలితాన్నిచ్చే దీక్ష వలన కలుగుచున్నది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – దృప్ - హర్ష మోహనయోః; దర్పము - ఆకర్షణ, అందము. ప్రతివస్తువులోని అందము, ఆకర్షణ విష్ణువు ప్రసాదించినదే. ఈ ఆకర్షణ అనేది చంద్ర శుక్రుల ద్వారా సంభవిస్తుంది. ఆ చంద్ర శుక్రులు భగవత్స్వరూపాలే.

శ్రీ పెమ్మరాజు రాజారావు – ఇచ్చట 'దర్ప' శబ్దమునకు గౌరవము, ప్రతిష్ట అని అర్ధము. ధర్మమార్గమున నడచు సజ్జనులకు గౌరవము, సత్కీర్తి, ప్రతిష్ఠను కలిగించువాడు నారాయణుడే యగుట చేత 'దర్పదః' అను నామమున ధ్యాతవ్యుడగును. ఈ నామమునకు మరొక భావముకూడ చెప్పబడును. సంస్కృత భాషలో 'ద' అనగా ఇచ్చుట, నాశనము చేయుట అను రెండర్థాలు ఉన్నాయి. సజ్జనుల మనసులో అప్పుడప్పుడు కానవచ్చుచుండు అహంకారాది దుర్గుణములను హరించువాడు శ్రీహరియేగాన 'దర్ప-దః' అను నామమున ప్రసిద్ధుడగును.

కొన్ని పుస్తకాలలో 'అదర్పదః' అనే పాఠాంతరం కూడ కానవచ్చుచున్నది.

శ్రీమద్రామాయణము – సుందరకాండము (గీతా ప్రెస్, గోరఖ్ పూర్ వారి ప్రచురణనుండి)

(1-39,40,41,42,43)

వానరాన్ వానరశ్రేష్ఠ ఇదం వచనమబ్రవీత్
యథా రాఘవ నిర్ముక్త శ్శర శ్శ్వసన విక్రమః
గచ్ఛేత్తద్వ ద్గమిష్యామి లంకాం రావణపాలితమ్
న హి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్
అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్
యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యా మ్యకృతశ్రమః
బద్ధ్వా రాక్షసరాజాన మానయిష్యామి రావణమ్
సర్వథా కృతకార్యోఽహ మేష్యామి సహ సీతయా
ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్
ఏవముక్త్వా తు హనుమా న్వానరా న్వానరోత్తమః

సాగర లంఘనమునకు ముందు, వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు అంగదాది వానరులతో ఇట్లనెను – వాయువేగమున సాగిపోవు రామబాణమువలె నేను మిక్కిలి వేగముగా రావణునిచే పాలింపబడుచున్న లంకకు వెళ్ళెదను. అచ్చట జానకీమాతను కాంచజాలనిచో అదే వేగమున సురలోకమునకు పోయెదను. ఆ స్వర్గమున కూడ సీతాదేవిని దర్శింపనిచో రాక్షసరాజైన రావణుని అవలీలగా బంధించి, తీసికొని వచ్చెదను. ఏది ఏమైనను కృతకృత్యుడనై సీతతో సహా తిరిగివచ్చెదను. లేనిచో రావణునితో సహా లంకను పెకిలించికొని తీసికొని రాగలను.

హనుమంతుని ప్రార్థన (13.59)-

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః

(42-33,34,35,36) మరియు (43-8,9, 10,11) – హనుమంతుని జయఘోష

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః

దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః
న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః

అర్ధయిత్వా పురీం లంకాం అభివాద్య చ మైథిలీమ్
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్

మహాబల సంపన్నుడైన శ్రీరామునకు జయము. మిక్కిలి పరాక్రమశాలియైన లక్ష్మణస్వామికి జయము. శ్రీరామునకు విధేయుడు, కిష్కింధకు ప్రభువు అయిన సుగ్రీవునకు జయము. అసహాయ శూరుడు, కోసల దేశపు ప్రభువు అయిన శ్రీరామునకు నేను దాసుడను. వాయుపుత్రుడను. నా పేరు హనుమంతుడు. శత్రుసైన్యములను రూపుమాపువాడను. వేయి మంది రావణులైనా గాని యుద్ధ రంగమున నన్నెదిరించి నిలువలేరు. వేలకొలది శిలలతోడను, వృక్షములతోడను సకల రాక్షసులను, లంకాపురిని నాశనం చేస్తాను. రాక్షసులందరూ ఏమీ చేయలేక చూస్తూ ఉండెదరు గాక. నేను వచ్చిన పనిని ముగించుకొని, సీతాదేవికి నమస్కరించి వెళతాను.

శ్రీ వాసుదాసస్వామి (వావిలికొలను సుబ్బారావు) తెలుగుసేత – మందరము

మ్రొక్కెద రామచంద్రునకు మోడ్చెదఁ గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెదఁ దద్విహాహప తనూజకు శ్రీరఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మ వాసవ మరుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్య చంద్రులకు మ్రొక్కెదఁ దామరసాప్త సూతికిన్

జయము జయంబు రామునకు సార పరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విషద సహ్య తరస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరథి సంపరిపాలితుఁడౌ వలీముఖో
చ్చయ పతి సూర్య పుత్రునకు సాహస విక్రమ కీర్తి శాలికిన్

దాసుఁడ సర్వ సద్గుణ వితాన మనోహర రామమూర్తికిన్
గోసల దేశ వల్లభుకున్ హత శత్రుఁడ వాయుపుత్రుఁడన్
నా సరిగారు సంగరమునన్ దశకంఠులు వేవురేనియున్
వాసి యడంతు రాల ద్రుమపాళుల నే హనుమత్సమాఖ్యుఁడన్

ధ్వంసంబుఁ జేసి లంకను
హింసించి సమస్త రాక్షసేంద్రుల సీతా
హంసీయానకు మ్రొక్కి ప్ర
శంసిత గతిం జనెద మిడుక సకల సురారుల్.

719. అదృప్తః

దృప్తః

- ఏమాత్రము గర్వము లేనివాడు.
- యశోదాదేవి లాలనమువలన గర్వించినవాడు.
- సచ్చిదానందమైన తన స్వరూపము అనే అమృతాన్ని పానం చేయుటచే మిక్కిలి ఆనందించినవాడు.
- ధర్మమును రక్షించినందున గర్వించువాడు.

ఓం అదృప్తాయ నమః

ఓం దృప్తాయ నమః

శ్రీ భట్టులు 'అదృప్తః', 'దృప్తః' అనే రెండు నామములకు వ్యాఖ్యానం చెప్పారు. శ్రీ శంకరులు 'దృప్తః' అనే నామమును మాత్రము గ్రహించి వ్యాఖ్యానించారు.

<u>అదృప్తః</u>

న దృప్తః అదృప్తః. గర్వము పొందనివాడు అదృప్తుడు. ఇందుకు శ్రీ భట్టులు మహాభారతంనుండి ఉదాహరించారు. (సభాపర్వము 51.28)

ఏవం విధాని కర్మాణి కృత్వా గరుడవాహనః
న విస్మయం ఉపాగమత్ పారమేష్ఠ్యేన తేజసా

ఆ గరుడవాహనుడు ఇట్టి పనులు చేసికూడా, తన పరమ తేజస్సు కారణంగా, కొంచెం కూడా గర్వించలేదు.

శ్రీ వాసిష్ఠ – అంతా ఆయన నియంత్రణలో ఉంటుంది. కనుక భగవానుడు ఎప్పుడూ నియమాలను అతిక్రమించని అదృప్తుడు.

<u>దృప్తః</u>

శ్రీ భట్టుల వ్యాఖ్య – **యశోదా నంద లాలన దృప్తః**. యశోదా నందుల లాలనమువలన సంతోషముతో గర్వించినవాడు దృప్తుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్వాత్మామృత రసాస్వాదనాత్ నిత్య ప్రముదితో దృప్తః**. నిజమైన సచ్చిదానంద స్వరూప రసామృతమును ఆస్వాదించి తన్మయుడైనవాడు దృప్తుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **నిత్యం హర్షమయాత్ దృప్తః. గర్వరహితత్వాత్ దృప్తః**. సదా సంతోషంగా ఉన్నందున దృప్తుడు. గర్వము లేనందున దృప్తుడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – పరమేశ్వరుడు దుష్టజనులను అణచి ధర్మమును రక్షించినందున గర్వించినవాడు గనుక దృప్తుడు అయ్యాడు.

శ్రీ వాసిష్ఠ – దృప్ - హర్ష మోహనయోః. **దృపయతి ఇతి దృప్తః**. జగత్సృష్టి, పరమ సత్యము వంటి అద్భుతమైన విషయాలను గురించి మనలను ఆశ్చర్యపరచి, జ్ఞానోన్ముఖులను చేయువాడు దృప్తుడు. ఆలా జ్ఞానంద్వారా మోహం నశిస్తుంది. 'విశోకః', 'శోకనాశనః' నామములవలెనే 'దృప్తః', 'అదృప్తః' నామములను జంటగా పరిగణించవచ్చును. ఈశావాస్యోపనిషత్తులో **'తదేజతి తన్నైజతి ....'** వంటి వాక్యాలు కూడా ఇలా వ్యతిరేకమనిపించే భావాలను సంఘటిత పరుస్తాయి

720. దుర్ధరః

ధరింపజాలనివాడు, పట్టరానివాడు.

- బాలకృష్ణునివలె పట్టరానివాడు.
- దుర్యోధనాది దుష్టులకు బంధింపజాలనివాడు.
- ధారణ చేయుటకు కష్టమైనవాడు. సుశిక్షితమైన మనసునకు మాత్రమే ధ్యానమున నిలిచియుండువాడు.

ఓం దుర్ధరాయ నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడును.

29వ శ్లోకము. 267వ నామము . దుర్ధరః – **సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః**

76వ శ్లోకము. 720వ నామము . దుర్ధరః – **దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోऽథా పరాజితః**

29వ శ్లోకంలోని 'దుర్ధరః' నామమునకు చెప్పిన అర్థాలు –

శ్రీ భట్టులు – ఆపబడని బలము కలవాడు (ఎదురు లేనివాడు).

శ్రీ శంకరులు – ధారణకు కష్టమైనవాడు (గొప్ప యోగులకు మాత్రమే ధారణకు అందువాడు). భరింపరానివాడు (అంతటినీ ఆయనే భరించును).

ఇక ఈ 76వ శ్లోకంలోని 'దుర్ధరః' నామము వివరణ. దుః - దుఃఖేన - చాలా కష్టంగా; ధృ - ధారణే - ధరించుట, పట్టుకొనుట, నిలబెట్టుట. కనుక 'దుర్ధరః' నామమునకు రెండు ప్రధానార్థాలున్నాయి. (1) చాలా కష్టంమీద మనసులో ధారణ చేయబడువాడు. శ్రీ శంకరులు, ఇతర వ్యాఖ్యాతలు ఈ అర్థాన్ని తీసుకొన్నారు. (2) (శారీరకంగా) పట్టరానివాడు (అయిన చిన్నికృష్ణుడు). శ్రీ భట్టులు ఈ అర్థాన్ని గ్రహించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **బాల లీలాది ప్రసంగేషు మత్త మాతంగత్వాత్ తాభ్యామ్ దుర్ధరః దుర్వార చంచల చేష్టితః.** తన బాల్యలీలాచేష్టల సమయమున, చిన్నికృష్ణుడు మదించిన ఏనుగువలె యశోదానందులకు పట్టరానివాడై, దుర్ధరుడై యున్నాడు.

బాలలీలా ప్రసంగేషు యశోదా నంద లాలనాత్

దృప్తో మత్తో భవేత్తాభ్యాం దుర్గ్రహో దుర్ధరోమతః

చిన్నతంలో ఆటలాడేటప్పుడు శ్రీకృష్ణుడు అల్లరి చేసినా యశోదానందులు అతనిని శిక్షింపలేదు. పైపెచ్చు లాలించారు. అందుచేత గర్వించి, దృప్తుడై, పట్టశక్యముకానివాడై, దుర్ధరుడైయున్నాడు.

శ్రీ భట్టులు విష్ణుపురాణం (5.6.15) నుండి ఉదాహరించారు. యశోద చిన్నికష్ణుని రోటికి కట్టివేసి ఇలా అన్నది – ఓ చిలిపివాడా! ఇప్పుడు పారిపోగలవేమో చూపు.

మరొక విధంగా – దుర్యోధనునివంటి దుష్టులకు ఏవిధంగానూ నిగ్రహింపజాలనివాడు దుర్ధరుడు. ఇందుకు శ్రీభట్టులు మహాభారతంనుండి ఉదాహరించారు

ఇమం హి పుండరీకాక్షం జిధృక్షంతి అల్పమేధసః

పటేనాగ్ని ప్రజ్వలితం యథాబాలో యథాఽబలాః – ఉద్యోగపర్వము 129.16

ప్రజ్వలించుచున్న అగ్నిని బాలబాలికలు గుడ్డపేలికలతో పట్టుకోవడం సాధ్యం కాదు. అలాగే ఈ అల్పబుద్ధులు శ్రీకృష్ణుని పట్టుకొనలేరు.

దుర్గ్రహః పాణినా వాయుః దుస్స్పర్శః పాణినా శశౌ

దుర్ధరా పృథ్వీ మూర్ధ్నా దుర్గ్రహః కేశవో బలాత్ – వనపర్వము 309.28

వాయువును చేతులతో బంధింపలేము. చంద్రుని తాకలేము. భూమిని తలపై ధరింపలేము. అలాగే కేశవుని బలంతో పట్టుకొనలేము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు ఎన్నో జన్మల ధ్యానం, సుశిక్షితమైన తపం ద్వారా మాత్రమే మనసులో నిలిచియుంటాడు గనుక దుర్ధరుడు. ఇందుకు గీతనుండి ఉదాహరించారు.

క్లేశోఽధిక తరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్

అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే – గీత 12.5

కాని సచ్చిదానంద ఘన నిరాకార పరబ్రహ్మమునందు ఆసక్తచిత్తులు అయినవారు తత్ప్రాప్తికై చేయు సాధన మిక్కిలి శ్రమతో కూడినది. ఏలనన దేహాభిమానులకు అవ్యక్త పరబ్రహ్మ ప్రాప్తి కష్టమే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **దుఃఖేన ధర్తుమ్ శక్యో దుర్ధరః.** ఎంతో కష్టంచే ధారణ చేయబడువాడు దుర్ధరుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **దుఃఖేన ఆయాసేన ధ్రియతే అ-సమాహిత-మానసైః ఇతి దుర్ధరః**. ఎంతో నిగ్రహము, ప్రశాంతత, శిక్షణ ఉన్నవారికే అతికష్టంపై ధారణ చేయబడువాడు దుర్ధరుడు.

అథః

దుర్ధరోఽథాపరాజితః – ఇక్కడ 'దుర్ధరః' నామము తరువాత 'అథ' శబ్దము వచ్చినది. ఇలా వాక్యం మధ్యలో 'అథ' శబ్దం రావడం జరగితే అది మంగళవాక్యం అవుతుంది. **అథేతి గ్రంథమధ్యే మంగళమ్** – అని శ్రీ బలదేవ విద్యాభూషణ అన్నారు. ఆప్టే సంస్కృత నిఘంటువు ప్రకారము 'అథ', 'ప్రణవము' ఒకేమారు సృష్టి ఆదిలో బ్రహ్మముఖంనుండి వెలువడ్డాయి. కనుక 'అథ'శబ్దము మంగళసూచకము.

ఓంకారశ్చ అథ శబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణాః పురా
కంఠం భిత్వా వినిర్యాతౌ తేన మంగళికావుభౌ

721. అపరాజితః

- అపజయమెరుగనివాడు. జయింపరానివాడు. పరాజయము రానీయనివాడు.
- దేవుని రక్షణలో ఉన్నవారికి అపజయం లేదు.

ఓం అపరాజితాయ నమః

ఈ నామం రెండుమార్లు వస్తుంది.

76వ శ్లోకము. 721వ నామము. అపరాజితః – **దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోఽథాపరాజితః**

92వ శ్లోకము. 866వ నామము. అపరాజితః – **అపరాజితస్సర్వసహో నియన్తాఽనియమోఽయమః**

జీ- జయతే- జయించుట; **న పరాజితః కదాపి కేనాపి ఇతి అపరాజితః**. ఎవరిచేతను, ఎప్పుడూ, ఎలాగూ పరాజితుడు కానివాడు అపరాజితుడు. శ్రీ భట్టులు అనేక ఉదాహరణలు ఇచ్చారు –

ఏకమ్ హనిష్యసి రిపుమ్ గర్జంతమ్ తం మహామృధే
న తు తమ్ ప్రార్థయస్యేకమ్ రక్ష్యతే స మహాత్మనా
యమ్ అహుర్వేద విదుషో వారాహమ్ అజితమ్ హరిమ్
నారాయణమ్ అచింత్యమ్ చ తేన కృష్ణేన రక్ష్యతే – మహాభారతము. ఉద్యోగపర్వము 129.40

ఇంద్రుడు కర్ణునితో అన్నాడు – జరుగబోయే మహాయుద్ధంలో గర్జించే ఒక మహావీరుని హతం చేయడానికి కావలసిన శక్తిని ఇస్తున్నాను. కాని ఆ మహావీరుడు అర్జునుడు కాడు. ఎందుకంటే అర్జునుని మహాత్ముడైన శ్రీకృష్ణుడు రక్షిస్తున్నాడు. ఆ కృష్ణుడే శ్రీవరాహావతారం ధరించిన, అజితుడైన, నారాయణుడని విజ్ఞులు చెప్పే శ్రీహరియే.

అజయ్యాన్ శ్చాపి అవధ్యాన్ శ్చ వారయిష్యసి తాన్ యుధీ
ఋతే అర్జునమ్ మహాబాహుమ్ దేవైరపి దురాసదమ్
యమ్ ఆహుః అమితమ్ దేవమ్ శంఖ చక్ర గధాధరమ్
ప్రధానః సోऽస్త్రవిదుషామ్ తేన కృష్ణేన రక్ష్యతే – మహాభారతము. వనపర్వము 260.75
రుద్రుడు జయద్రధునితో అన్నాడు – యుద్ధంలో నీవు మహాబాహుడైన అర్జునుని తక్క ఇతర మహావీరులను నిరోధింపగలవు. శంఖ చక్ర గధాధారియైన, తెలియజాలని భగవంతుడైన కృష్ణుడే స్వయంగా అర్జునుని కాపాడుతున్నాడు.

భీష్మద్రోణాదులు కూడా ఇదే విషయాన్ని చెప్పారు. విష్ణువు గనుక పాండవులకు రక్షకునిగా లేకపోతే పాండవులను సులభంగా నిర్జింపవచ్చునట.
ధ్రువం వై బ్రాహ్మణే సత్యం ధ్రువా సాధు సన్నతిః
శ్రీర్-ధ్రువా చాపి దక్షేషు ధ్రువో నారాయణే జయః
బ్రాహ్మణులచెంత సత్యము, సాధువులచెంత వినయము, దక్షులవద్ద సంపద ఉన్నట్లుగానే తప్పక నారాయణుని చెంత విజయం ఉంటుంది.

యస్య త్వం పురుషవ్యాఘ్ర ముపజగ్మివాన్
ధ్రువ ఏవ జయస్తస్య న తస్యాస్తి పరాజయః
అర్జునుడు అన్నాడు – కృష్ణా! నువ్వు ఎవరికి సారధిగా ఉంటావో వారికి విజయము నిశ్చయముగా కలుగుతుంది. పరాజయము కలుగదు.

శక్తోऽహం ధనుషైకేన నిహంతుం సర్వపాండవాన్
యద్యేషాం భవేద్గోప్తా విష్ణుః కారణపూరుషః
కర్ణుడు అన్నాడు – కారణ పురుషుడైన శ్రీకృష్ణుడు పాండవులకు రక్షణగా ఉన్నాడు. అలా కాకుంటే పాండవులను ఒకేఒక్క బాణంతో చంపుతాను.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్-విజయో భూతిర్-ధ్రువా నీతి ర్మతిర్మమ – గీత 18.78 & శ్రీ విష్ణు సహస్రనామము ఉత్తర పీఠిక.
సంజయుడు అన్నాడు – ఓ రాజా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు, గాండీవ ధనుర్ధారియైన అర్జునుడును ఉండుచోట సంపదలును, సర్వవిజయములును, సకలైశ్వర్యములును, సుస్థిరమైన నీతియును ఉండును. ఇది నా నిశ్చితమైన అభిప్రాయము.

శ్రీ భట్టులు ఆయుర్వేద చరకసంహితమునుండి కూడా ఉదాహరించారు –

యథాऽహమ్ నాభిజానామి వాసుదేవ పరాజయమ్

మాతుశ్చ పాణిగ్రహణమ్ సముద్రస్య చ శోషణమ్

ఏతేన సత్యవాక్యేన సిధ్యతామ్ అగదోహ్యయమ్

వాసుదేవునకు పరాజయము లేదు. నా తల్లి వివాహము నేను చూడలేదు. సముద్రము ఎండిపోదు – ఈ వాక్యములు ఎంత నిజమో ఈ ఆయుర్వేద శాస్త్రము కూడ అంతే నిజము, సత్ఫలదాయకము అగుగాక.

వైతరణంలో విషహరణమైన మంత్రంలో భాగం –

రత్నాకర ఇవ అక్షోభ్యో హిమవానివ అచలః

జాతవేదా ఇవ అధృష్యో నారాయణ ఇవ అజేయః

సముద్రము క్షోభింపరానిది, హిమవత్పర్వతము నిశ్చలమైనది. అగ్ని సమీపింపరానిది. నారాయణడు అజేయుడు. అయినట్లే ఈ మంత్రము విషమును హరించును గాక.

శ్రీ భట్టులు ఇంకా రామాయణ మహాభారతాలనుండి ఉదాహరించారు –

యుద్ధకాండ 114.15 – **అజయ్యః శాశ్వతో ధ్రువః.**

యుద్ధకాండ 120.14 – **అజితః ఖడ్గధృక్**

భారత. ఉద్యోగ. 6.79 – **యతో కృష్ణ స్తతో జయః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – అంతః శత్రువులైన కామాది అరిషడ్వర్గాలు గాని, బాహ్యశత్రువులైన రాక్షసాదులుగాని భగవంతుని జయింపలేరు. కనుక శ్రీహరి అపరాజితుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **పర ఏవ కశ్చిన్నాస్తి - న ద్వితీయో న తృతీయః ఇతి అధర్వ వచనాత్ - తస్మాత్ పరాజిత్వస్య అసంభవాత్ భగవతః అపరాజిత ఇతి నామ్నా సంకీర్తనమ్ ఉపపద్యతే** – భగవంతునికంటె 'పర' లేదు. ఆయనవంటి మరొకరు లేరు. కనుక ఆయనను మరొకరు జయించే ప్రసక్తే లేదు. కనుక ఆయన అపరాజితుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – న పరాజితః కదాపి కేనాపి ఇతి అపరాజితః.

శ్రీ సత్యసంధతీర్థ యతిరాజ ఈ నామమును 'అ-పరః-అజితః' అని అభివర్ణించారు.

న విద్యతే పర-ఉత్తమో యస్మాత్ ఇతి అపరః

అపరశ్చ అసౌ అజితశ్చ ఇతి అపరాజితః

ఆయనకంటె గొప్పవాడు లేనందున ఆయన 'అపరః'. మరియు ఆయనను జయించేవాడు లేనందున ఆయన 'అజితః'. ఇలా భగవంతుడు అపరాజితుడు.

శ్రీ చిన్మయానంద – ఈశావాస్యోపనిషత్తు – **నైనద్ దేవా ఆప్నువాన్.** దేవతలు కూడా దానిని అధిగమించలేరు. ఆశా మోహముల బలం దేవతలకు కూడా బలమైనది. కాని నారాయణునికి అలాంటి సమస్యలు లేవు. (దేవతలకు కూడా వశం కాని పనులు ఆయనకు సులభం?).

866వ నామము – అపరాజితః – భగవంతుని రక్షణలో ఉన్నవారికి పరాజయం ఉండదు. మహాభారతంలో కౌరవులనెదుర్కొన్న పాండవులు కృష్ణుని రక్షణలో ఉన్నారు. కనుక అంతిమ విజయం వారినే వరించింది. ఈ వివరణకూ శ్రీ భట్టులు మహాభారతంనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు.

యస్య మంత్రీ చ గోప్తా చ సుహృచ్చైవ జనార్దనః
హరిః త్రైలోక్యనాథః సన్ కిమ్ ను తస్య నిర్జితమ్
ఎవరికైతే భగవానుడైన శ్రీహరి మంత్రిగాను, మిత్రునిగాను, రక్షకునిగాను ఉన్నాడో అలాంటివారు జగత్తులో జయింపలేనిది ఏముంది?

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

విశ్వమూర్తిర్మహామూర్తిర్దీప్తమూర్తిరమూర్తిమాన్ |
అనేకమూర్తిరవ్యక్తః శతమూర్తిః శతాననః || (77)

722. విశ్వమూర్తిః

- విశ్వమే తన శరీరంగా కలవాడు.
- భక్తుల మనసులు, కన్నులలో ప్రవేశించే సుందరరూపుడు.
- విశ్వము రూపంలో మాయాశక్తి కలవాడు.
- అంతటా మాయను కలిగించే రూపము కలవాడు.

ఓం విశ్వమూర్తయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు అన్ని జీవులయందు ఆత్మగానున్నవాడు గనుక విశ్వమూర్తి. **అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః** (గీత 10.19). ఈ కారణం చేతనే పోరాటాలలో బలవంతుడే ఎప్పుడూ గెలవాలని లేదు. ఒకోమారు బలహీనుడు గెలుస్తాడు.

తిరుపైమొళి 6.9.7 – నీవే సమస్త కర్మలు. నీవే సమస్త కర్మలను ఆచరించే లోకము. నీవే సకల జీవులకు ఆత్మవు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **విశ్వమ్ మూర్తిః అస్య సర్వాత్మకత్వాత్ ఇతి విశ్వమూర్తిః**. భగవంతునికి విశ్వమే స్వరూపము. ఆయనే అందరికి ఆత్మ. కనుక ఆయన విశ్వమూర్తి.

తైత్తరీయారణ్యకము 10.13 – **విశ్వాత్మానమ్ పరాయణమ్.**

తైత్తరీయారణ్యకము 10.14 – **ఊర్ధ్వరేతమ్ విరూపాక్షం విశ్వరూపాయ వై నమోనమః.**

ధర్మచక్రము రచయిత – భగవంతుని విశ్వరూపము గురించి తెలిసికోవడానికి అర్హత, స్థాయి కావాలి. భగవద్ధ్యానంతో దానిని సాధించవచ్చును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – 'విశ్'-ప్రవేశించుట. **విశతి మనో నయనాని సతామ్ ఇతి విశ్వా, తద్వశీ కమనీయ మూర్తిః యస్య ఇతి విశ్వమూర్తిః.** సజ్జనుల మనసునందు, కన్నులయందు ప్రవేశించే (ఆకర్షించే) కమనీయమైన మూర్తి విశ్వమూర్తి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – మూర్ఛా - మోహ సముచ్ఛ్రాయయో - నిలకడ కోల్పోవుట; మూర్తి - మాయారూప విమోహికాశక్తిః - మోహింపజేయు మాయ.

విశ్వమేవ మూర్తిః ఆకారో యస్య సః విశ్వమూర్తిః.

విశ్వమేవ మాయా విమోహికాశక్తి యస్య సః విశ్వమూర్తిః.

విశ్వస్య మోహికా శక్తిః యస్య సః విశ్వమూర్తిః

అనగా – విశ్వమే రూపముగా (ఆకారముగా) కలవాడు విశ్వమూర్తి. విశ్వం రూపంలో ఉన్న మాయాశక్తి కలవాడు విశ్వమూర్తి. తన మాయతో విశ్వాన్ని కట్టి ఉంచేవాడు విశ్వమూర్తి.

శ్రీ బలదేవ విద్యాభూషణ – భగవంతుడు విశ్వమూర్తియై దేవ గంధర్వ మానవాది సకలజీవులలో ఉంటాడు గనుక అపరాజితుడు. ఇలా శ్రీ విద్యాభూషణ 'అపరాజితః' నామంతో 'విశ్వమూర్తిః' నామాన్ని అనుసంధానించారు.

723. మహామూర్తిః

- గొప్పదైన, పెద్దదైన శరీరము కలవాడు.
- గొప్పగా పూజనీయమైన ఆకృతి కలవాడు.

ఓం మహామూర్తయే నమః

విశ్వైకాశ్రయ మూర్తిత్వాత్ మహామూర్తిరితి స్మృతః. జగత్తు అంతా ఒకటేయైన తన శరీరముగా కలవాడు మహామూర్తి. శ్రీ భట్టులు భగవద్గీత (11.7) శ్లోకాన్ని ఉదాహరించారు.

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య స చరాచరమ్
మమదేహే గుడాకేశ! యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి – గీత 11.7

నా యీ రూపమునందు ఒకేచోట స్థితమైయున్న సమస్త చరాచర జగత్తును చూడుము. ఓ అర్జున! అంతేగాక ఇంకను నీవు చూడదలచుకొనిన వాటినన్నింటనీ చూడుము.

తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా

అపశ్య ద్దేవదేవస్య శరీరే పాండవస్తదా – గీత 11.3
ఆ సమయమున అర్జునుడు ఆ దేవదేవుని శరీరమునందు అసంఖ్యాకములైన వివిధ బ్రహ్మాండములును, వేర్వేరుగా ఒకేచోట కేంద్రీకృతములై యున్నట్లు చూచెను.

శ్రీ తిరుమంగైయాళ్వారు. పెరియతిరుమొళి – ఈ విశ్వమంతా భగవంతుని శరీరంలో చిన్న భాగం. ఇంక ఆయన మహామూర్తి గురించి ఊహించుకొనండి.

శ్రీ కష్ణదత్త భరద్వాజ 'మహ' అంటే ('పెద్ద' అని కాకుండా) 'పూజనీయ' అనే అర్థాన్ని వాడారు. **మహతీ పూజనీయ మూర్తిః ఆకృతిః యస్య ఇతిమహామూర్తిః.** గొప్ప పూజనీయమైన ఆకృతి కలవాడు మహామూర్తి.

ధర్మచక్రము రచయిత – (1) జీవులకు వేరువేరు శరీరాలు ఉన్నట్లు అనిపించినాగాని నిజానికి అన్ని ఆత్మలు, అన్ని శరీరాలు మహామూర్తి శరీరంలోని భాగాలే. (2) సృష్టి, స్థితి, సంహారము అనే ప్రక్రియలు కూడా మహామూర్తి శరీరంలో భాగాలే. (3) మనకు సాధన కొరకు ఒక శరీరం అవుసరం గనుక భగవంతుడు శరీరాన్ని ప్రసాదించాడు. అనేక జన్మలలో సాధన ద్వారా మనసును పరిశుద్ధం చేసుకొని మహామూర్తిని దర్శించే అవకాశానికి దగ్గర కావచ్చును.

724. దీప్తమూర్తిః

ప్రకాశవంతమైన స్వరూపము కలవాడు.

ఓం దీప్తమూర్తయే నమః

దీప్తా అప్రాకృత తేజోమయీ మూర్తిః ఆకారః యస్య ఇతి దీప్తమూర్తిః. అప్రాకృతమైన (అసాధారణ, అద్భుతమైన) తేజస్సుతో ప్రకాశించే మూర్తి దీప్తమూర్తి.

యత్కించిత్కేన చిద్దీప్త గుణేనాత్ర విశేషతః యత్సర్వం మూర్తి రస్యేతి దీప్తమూర్తిరసౌ స్మృతః. ఏయే వస్తువు ఏయే గుణముతో ప్రకాశిస్తున్నదో, ఆ గుణములన్నీ తన రూపమే అయినవాడు దీప్తమూర్తి. సృష్టిలో ప్రకాశించేవన్నీ భగవానునివల్లనే అని చెబుతూ శ్రీ భట్టులు గీత (10.4)నుండి ఉదాహరించారు –
యద్యద్విభూతిమత్సత్వం శ్రీమదూర్జితమేవ వా
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్
విభూతియుక్తమైన, అనగా ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము అయిన వస్తువేదైనను నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము.

కఠోపనిషత్తు 2.2.15 – **తమేవ భాన్తమ్ అనుభాతి సర్వమ్.** అది స్వయముగా ప్రకాశించును మరియు అంతటిని ప్రకాశింపజేయును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – (1) **దీప్తా జ్ఞానమయీ మూర్తిః యస్య దీప్తమూర్తిః**. జ్ఞానముతో ప్రకాశించు మూర్తి దీప్తమూర్తి. (2) **స్వేచ్ఛయా గృహీత తేజసీ మూర్తిః అస్య ఇతి వా దీప్తమూర్తిః**. తన సంకల్పము చేతనే తేజోమయ రూపము ధరించినవాడు దీప్తమూర్తి.

శ్రీ చిన్మయానంద గీత (11.12)నుండి ఉదాహరించారు –

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా

యది భాః సదృశీ సా స్యాత్, భాసస్తస్య మహాత్మనః

ఆకాశమున వేలకొలది సూర్యులు ఒక్కుమ్మడిగా ఉదయించినచో వచ్చు కాంతిపుంజములును ఆ విరాట్-రూప తేజస్సునకు సాటి రావు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'దీప్త' పదానికి 'ప్రకాశము' అని మాత్రమే కాక, 'స్పష్టము' (దాయనిది) అన్న అర్థం కూడా తీసుకొన్నారు. భగవంతుడు ఏదీ దాయవలసిన అవుసరం లేదు గనుక దీప్తమూర్తి. ఇందుకు ఆయన చెప్పిన ఉదాహరణ – ఒక స్త్రీ గర్భిణి అయినపుడు ఆ చిహ్నములు స్పష్టముగా కానవచ్చును.

ధర్మచక్రము రచయిత – ప్రకాశములు రెండు విధాలు. (1) బయటి కాంతిద్వారా కలిగే ప్రకాశము (2) జ్ఞానము వలన మనసులో కలిగే ప్రకాశము. ఈ రెండూ భగవంతునివల్లనే కలుగుతాయి. బయటి ప్రకాశం లేనపుడు నేరములు జరిగినట్లే, లోపలి ప్రకాశం లోపించినపుడు మనసు చెడుదారులలో వెళుతుంది. అంతః ప్రకాశం కలిగించడానికి భగవంతుడు ఇచ్చిన సాధనాలలో గాయత్రీ మంత్రము ఒకటి. ఈ 'దీప్తమూర్తి' నామమువలన మనం తెలుసుకొనవలసినది ఏమంటే భగవంతుడు బయటా, లోపలా కూడా అంతటినీ నియంత్రిస్తున్నాడు. మనస్సును సాధన ద్వారా ప్రకాశవంతము చేసి భగవంతునివైపుకు మళ్ళించవచ్చును.

725. అమూర్తిమాన్

- ప్రత్యేకమైన ఆకృతి లేనివాటిని (భూమి, గాలి, అగ్ని, ప్రకృతి వంటివి) కూడ తనవిగా కలిగినవాడు.
- భగవంతుని రూపము కర్మవలన సంభవించదు.
- కఠినము కాని, క్రూరము కాని, మృదువైన, స్వభావము కలవాడు.
- వర్ణించరాని, స్థిరము కాని ఆకృతి కలవాడు.
- తన ఇచ్ఛానుసారము రూపు ధరించును గనుక ప్రత్యేకమైన ఆకృతి లేనివాడు.

ఓం అమూర్తిమతే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – అమూర్తులైనవాటిని, అనగా ప్రత్యేకమైన ఆకృతి లేని గాలి, భూమి, అగ్ని, నీరు వంటివాటిని తనవిగా కలిగినవాడు 'అమూర్తిమాన్'.

అమూర్తి శబ్దేనోచ్యంతే హ్యవ్యక్త పురుషాదయః

త ఏవ యస్య స్వమితి స స్మృతస్యాదమూర్తిమాన్

అమూర్తి అంటే శరీరం లేని ప్రకృతి, పురుషాదులు. వీటిని తనవిగా కలవాడు అమూర్తిమంతుడు. ఇందుకు శ్రీ భట్టులు అనేక ప్రమాణాలను ఉదాహరించారు.

భూమి రాపోనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ

అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా – గీత 7.4

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అని నా ప్రకృతి ఎనిమిది విధములుగా కలదు.

సుబాలోపనిషత్తు 7 – **యస్య అవ్యక్తమ్ శరీరమ్.**

శతపథ బ్రాహ్మణము 14.6.30 – **యస్య ఆత్మా శరీరమ్.**

'అమూర్తిమాన్' అనగా 'రూపము లేనివాడు' అనే అర్థం ముందు స్ఫురిస్తుంది. కాని పాణిని సూత్రము 5.2.94 **తత్ అస్య అస్తి అస్మిన్ ఇతి మాతుప్** – ప్రకారము 'మాతుప్' ప్రత్యయమువలన 'కలిగియున్నది', 'అక్కడ, అందు ఉన్నది' అనే అర్థాలు వస్తాయి. కనుక 'అమూర్తిమాన్' అనగా (1) 'ఆకృతి లేనివాడు' అనేది సరైన అర్థం కాదు. (2) 'అమూర్తులను తనవానిగా కలవాడు' అనేది సరైన అర్థం. అంతే కాకుండా విశ్వమూర్తి, మహామూర్తి, దీప్తమూర్తి, అనేకమూర్తి వంటి అనేక నామములకు 'ఆకృతి లేనివాడు' అనే అర్థానికి పొసగదు.

శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళినుండి అనేక ఉదాహరణలు చెప్పారు. వాని భావం భగవంతుని రూపాలు అర్థం కానివని. 6.9.7 – శ్రీవైకుంఠం అంతటా ఉన్న ముక్తజీవుల ఆత్మవు నీవే; 7.8.9 – సుందరమైన, మనోహరమైన రూపము కలవాడవు నీవే, మరియు అందరికిని కానరాని, రూపము లేని ఆత్మవు నీవే; 5.10.6 – నీవు అనంత స్వరూపుడవు. మరియు సర్వులకు (రూపము లేని) ఆత్మవు నీవే. నీ సృష్టిలోని అద్భుతాలకు అంతం లేదు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఉపనిషత్తులనుండి ఉదాహరించారు.

ముండకోపనిషత్తు 2.2 – **దివ్యో హ్యమూర్తః.**

బృహదారణ్యకోపనిషత్తు 3.1 – **ద్వేవావ బ్రహ్మణో రూపే మూర్తమ్ చ అమూర్తమ్ చ.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కర్మనిబంధనా మూర్తిః అస్య న విద్యత ఇతి అమూర్తిమాన్**. భగవంతునికి కర్మల కారణంగా మూర్తి (ఆకృతి) సంభవించదు కనుక ఆయన అమూర్తిమతి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – 'మూర్తి' అనగా ఒక అర్థము 'ఆకృతి'. మరొక అర్థము 'కఠినమైనది' (అమరకోశములో 'మూర్తిః కాఠిన్యమ్' అని ఉన్నది). ఈ ప్రకారంగా చూస్తే – భగవంతునిలో కాఠిన్యత, కఠోరత వంటి గుణాలు లేవు. ఆయన మృదుస్వభావుడు. కనుక 'అమూర్తిమాన్'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతునికి ఒక ప్రత్యేకమైన ఆకృతి లేదు. అనంతమైన, వర్ణనాతీతమైన, స్థిరము కాని ఆకృతులున్నవాడు గనుక 'అమూర్తిమాన్'. శ్రీ చిన్మయానంద వ్యాఖ్య కూడా ఇలాగే ఉంటుంది. పరిమితులున్నదానికే ఆకృతి ఉంటుంది. అపరిమితుడైన భగవంతునికి ఆకృతి ఇది అని చెప్పజాలము.

ధర్మచక్రము రచయిత – భగవంతుడు సంకల్పానుసారము వివిధ స్వరూపములలో అవతరించును కాని ఆ స్వరూపములు ఆయన పరిమితులు కావు. ధర్మరక్షణార్థము ఆయన ఆయా రూపములను ధరించును.

726. అనేకమూర్తిః

పెక్కు రూపములు కలిగినవాడు.

ఓం అనేకమూర్తయే నమః

అనేకా బహవో మూర్తయః ఆకారాః స్వేచ్ఛా పరిగృహీతా యస్య ఇతి అనేకమూర్తిః. తన ఇచ్ఛానుసారము పెక్కు విధములైన ఆకారములు గైకొనువాడు అనేకమూర్తి. శ్రీ భట్టులు విష్ణుపురాణము (5.31.18)నుండి ఉదాహరించారు.

షోడశ స్త్రీ సహస్రాణి శతమేకమ్ తతోఽధికమ్

తావంతి చక్రే రూపాణి భగవాన్ దేవకీసుతః

దేవకీసుతుడైన భగవనుడు పదహారువేల ఒక మంది రాణులకు తగినట్లుగా అన్ని రూపములు ధరించినాడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 2.5.6 – ఆయన అన్నింటిలోను వైవిధ్యము కలవాడు. పేర్లలోగాని, శౌర్యములో గాని, గుణములలోగాని, దివ్యత్వములో గాని, అన్నింటిలోను అనేకమూర్తిమంతుడు.

శ్రీ అన్నమయ్య – **అన్ని మంత్రములు హరినామములు, అన్ని దేవతలు హరియవతారములె**.

ఋగ్వేదము 1.664.46 – **ఏకమ్ సద్ విప్రా బహుధా వదంత్యగ్నిమ్ యమమ్ మాతరిశ్వానమ్ అహుః**.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ధర్మసంరక్షణార్థము శ్రీహరి అనేక అవతారములు ఎత్తును గనుక అనేకమూర్తి.

727. అవ్యక్తః

వ్యక్తుడు కానివాడు. తెలియరానివాడు. ఇంద్రియములకు గోచరింపనివాడు.

ఓం అవ్యక్తాయ నమః

'వ్యక్తము' అనగా ఇంద్రియములకు తెలియవచ్చునది. వానికి అతీతమైనవాడు అవ్యక్తుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

మనుష్యత్వేన సర్వత్ర పరభావా ప్రకాశనాత్
బుద్ధె రవ్యక్త ఇతి చ కథిత స్తత్వపారగైః
మనుష్యునిగా అవతరించినప్పటికీ, తన తత్వాన్ని మరుగుపరచి ప్రవర్తించాడు గనుక తత్వవేత్తలు అతనిని 'అవ్యక్తుడు' అన్నారు. శ్రీ భట్టులు భగవద్గీతనుండి ఉదాహరించారు.
నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ – గీత 7.25
నా యోగమాయయందు దాగియున్న నేను అందరికిని గోచరింపను. కనుక అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలిసికొనలేరు (అనగా జనన మరణములకు లోనగువానినిగా తలంతురు.)

నాహం వేదై ర్న తపసా న దానేన న చేజ్యయా
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా – గత 11.53
నీవు కాంచిన నా చతుర్భుజ రూపమును దర్శించుటకు వేదపఠనములచే గాని, తపశ్చర్యలచే గాని, దానములచే గాని, యజ్ఞకర్మలచే గాని శక్యము కాదు.
శ్వేతాశ్వరోపనిషత్తు 4.20 – **న సందృశే తిష్ఠతి రూపమస్య న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్**. ఆయన స్వరూపము చూపులకు అందనిది. ఆయనను ఎవరూ కంటితో చూడలేదు.
అంతి సంతి న పశ్యతి అంతి సంతమ్ న జహాతి
దేవస్య పశ్య కావ్యం న మమార న జీర్యతి – అధర్వ వేదము 10.8.32
భగవంతుడు సమీపంలో ఉన్నాడుకాని ఎవరికీ కనుపించడు. ఆయన వయసు పెరగదు, క్షీణించదు. ఇది ఆశ్చర్యము.
శ్వేతాశ్వరోపనిషత్తు 6.11 – **ఏకో దేవః సర్వభూతేషు గూఢాః**

తిరువైమొళి 1.9.6, 1.3.4 – ఆయన తర్కముద్వారా ఎవరికీ తెలియరాడు. భక్తులకు తప్ప మిగిలినవారికి ఆయన స్వరూపము కానరాదు. భక్తులకు కనుపించినా అది వెంటనే మాయమవుతుంది. వెంటనే మళ్ళీ అవ్యక్తుడు అయిపోతాడు. యశోదకు కృష్ణుని విశ్వరూపం కనుపించినాగాని, తరువాత మళ్ళీ ఆమెను మాయ అవరించిందట.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **యద్యాపి అనేకమూర్తిత్వం అస్య, తథాపి అయమ్ ఈదృశ ఏవ ఇతి న వ్యజ్యతా ఇతి అవ్యక్తః**. భగవంతుడు (క్రిందటి నామము) అనేకమూర్తి అయినప్పటికీ ఆయనను గురించి 'ఇది, ఇలా, ఈ విధంగా' వంటి మాటలతో చెప్పడం సాధ్యం కాదు. కనుక ఆయన అవ్యక్తుడు.

728. శతమూర్తిః

నూరు (అనేక) రూపములు ధరించినవాడు.

ఓం శతమూర్తయే నమః

ఇక్కడ 'శత' అనగా 'నూరు' అనిగాక, 'అనేక, అసంఖ్యాక' అన్న అర్థం తీసుకోవడం ఉచితం, అలంకారికంగా చూస్తే 'లెక్క లేనన్ని' అని చెప్పడానికి 'శత, సహస్ర' శబ్దాలను వాడడం జరుగుతుంది. ఆ విధంగా చూస్తే శతమూర్తి, సహస్రమూర్తి, అనేకమూర్తి, బహుమూర్తి – ఈ నామములకు అన్నింటికీ ఒకేభావం వస్తుంది. అయితే పునరుక్తిదోషం లేకుండా వ్యాఖ్యాతలు చెప్పిన అర్థాలు ఆసక్తికరంగా ఉంటాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్యలు –

అనేకమూర్తి – వివిధ సమయాలలో భగవంతుడు వివిధ అవతారాలు ధరించాడు.

శతమూర్తి – ఒకే సమయంలో భక్తులకు అనేక రూపాలలో దర్శనమిచ్చాడు.

అర్జునాయ వ్యక్తాయా చ విశ్వరూప ప్రదర్శనాత్
శతమూర్తిరితి ఖ్యాతః శతశోऽథ సహస్రశః

అర్జునునికి తన విశ్వరూపాన్ని చూపుతూ వందలు, వేలు గల తన రూపాన్ని చూపాడు గనుక శతమూర్తి.

పశ్య మే పార్థ రూపాణి శతశోऽథ సహస్రశః
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ – గీత 11.4

ఓ అర్జున! అసంఖ్యాకములైన, బహువిధములైన, పెక్కు వర్ణములు, ఆకృతులు గల నా అలౌకిక రూపమును చూడుము.

శ్రీ భట్టుల వ్యాఖ్యప్రకారం అర్జునుడు (ఒకేవ్యక్తి) ఒకేమారు భగవంతుని అనేక రూపములు దర్శించాడు. శ్రీ రాధాకృష్ణశాస్త్రి చెప్పిన మరొక విలక్షణ అనుభవం – వివిధ వ్యక్తులు, భగవంతుని వివిధ రూపాలలో దర్శించడం భగవంతుని 'శతమూర్తిత్వము'ను తెలియజేయును.

మల్లానామ్ అశనిః నృణాం నరవరః స్త్రీణామ్ స్మరో మూర్తిమాన్
గోపానామ్ స్వజనః అసతామ్ క్షితిభుజామ్ శాస్తా స్వపిత్రో శిశుః
మృత్యుః భోహపతేః విరాట్ అవిదుషామ్ తత్త్వం పరం యోగినామ్
వృష్ణీనామ్ పరదేవతా ఇతి విదితః ... –భాగవతము 10.43.17

బలరామునితోపాటు వేదికపైకి ప్రవేశించిన కృష్ణుడు మల్లురకు పిడుగువలె కనుపించాడు. పురుషులకు పురుషోత్తమునివలెను, స్త్రీలకు మన్మధునివలెను, గోపకులకు మిత్రునివలెను భాసించాడు. కంసుని

మిత్రులకు తమను శిక్షింపవచ్చే శత్రువుగా కానవచ్చాడు. దేవకీవసుదేవులకు తమ బిడ్డవలెను, కంసునికి మృత్యువువలెను, పామరులకు రాజువలెను, యోగులకు పరతత్వమువలెను, యాదవులకు తమ యశస్సు నిలిపే దివ్యమూర్తివలెను ప్రకాశించాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి కల్పవృక్షమును కూడా ఉదాహరించారు. ఎవరు ఏమి కోరితే అది ఇచ్చే కల్పవృక్షంలాగా భగవంతుడు భక్తులు తనను ఎలా ధ్యానిస్తారో అలా దర్శనమిస్తాడు గనుక ఆయన శతమూర్తి.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు –

అనేకమూర్తి – ధర్మరక్షణ కొరకు వివిధ అవతారములను ధరించినవాడు.

శతమూర్తి – నానా వికల్పజా మూర్తయః సంవిద కృతేః సన్తి ఇతి శతమూర్తిః. శ్రీమహావిష్ణువు శుద్ధసత్వమూర్తి అయికూడా సంకల్పానుసారం వివిధ రూపాలలో వ్యక్తము అవుతాడు గనుక శతమూర్తి.

శ్రీ పెమ్మరాజు రాజారావు – కోటానుకోట్ల రూపములలో గలవాడు పరబ్రహ్మమని ఈ నామముయొక్క భావము. అన్ని రూపములు ఆయన రూపములే. అన్ని నామములు ఆయన నామములే. అయినను ఆయన నామరహితుడు. రూపరహితుడు. హిందూవేదాంత సాహిత్యమునందు గల ఈ అద్భుత సమన్వయము ఈ శ్లోకములోని వివిధ నామములలో వ్యక్తమగుచుండుటను విజ్ఞులు గ్రహింపగలరు.

అన్నమయ్య కీర్తన

ఏ రీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను - వారి వారి పాలికి వరదుడ వౌదువు

చేరి కొల్చినవారికి జేపట్టు గుంచమవు - కోరి నుతించువారి కొంగుపైడివి
మేరతో దలచువారి మేటినిధానమవు - సారపు వివేకులకు సచ్చిదానందుడవు

కావలెనన్నవారికి కామధేనువు మరి - సేవ చేసేవారికి చింతామణివి
నీవే గతన్నవారికి నిఖిల రక్షకుడవు - వావిరి శరణు వేడే వారికి భాగ్యరాశివి

నిన్ను బూజించేవారి నిజ పరతత్త్వమవు - యిన్నిటా నీదాసులకు నేలికవు
యెన్నగ శ్రీవేంకటేశ యిహపరములకును - పన్ని కాచుకున్నవారి ఫలదాయకుడవు

---

729. శతాననః

- అనేక ముఖములు కలిగినవాడు.
- జీవుల మనుగడ కొరకు అనేక ఉపకరణములు (నోరు, ముక్కు వంటివి) సమకూర్చినవాడు.
- అనేక విధములైన జీవులను సృష్టించి, వాని మనుగడ కొరకు కావలసిన వసతులను ఏర్పరచినవాడు.
- వివిధ మతములలో వివిధములుగా తెలియబడువాడు.

ఓం శతాననాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అనేకానన సంపత్త్యా తానన ఇతీరితః**. అనేక ముఖములు కలిగియున్నందున భగవంతుడు శతాననుడు. ఇక్కడ కూడ 'శత' అనగా 'అసంఖ్యాక' అన్న అర్థం ఉచితం. శ్రీ భట్టులు గీత (11.10)నుండి ఉదాహరించారు. భగవంతుని విశ్వరూప వర్ణనను సంజయుడు ఇలా ఆరంభించాడు.

అనేక వక్త్ర నయనమ్ అనేకాద్భుత దర్శనమ్
అనేక దివ్యాభరణమ్ దివ్యానేకోద్యతాయుధమ్ – గీత 11.10
అర్జునుడు చూచిన ఆ పరమేశ్వరుని విరాట్ (విశ్వ) రూపమునందలి ముఖములు అనంతములు. నేత్రములు అసంఖ్యాకములు. అందలి దృశ్యములు అద్భుతములైనవి. ఆ రూపము అనేక దివ్యాభరణ శోభితము. ఆ పరమేశ్వరుడు పెక్కు దివ్యాయుధములు చేపట్టియుండెను.

శ్రీ చిన్మయానంద కూడా గీతనుండి ఉదాహరించారు –

సర్వతః పాణిపాదమ్ తత్ సర్వతోఽక్షి శిరోముఖమ్
సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి – గీత 13.13
ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములై యున్నవి. అతడు సర్వమును ఆవరించియున్నాడు.

(ఈ రచన మొత్తంలో భగవద్గీత శ్లోకాలకు తెలుగు అనువాదం గీతాప్రెస్, గోరఖ్ పూర్ వారి ప్రచురణ **"శ్రీ మద్భగవద్గీత – తత్త్వవివేచనీ వ్యాఖ్య"** నుండి ఉన్నదున్నట్లుగా తీసుకొన్నాను. హిందీ రచయిత – **శ్రీ జయదయాల్ గోయందకా** – అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకటరామయ్య)

శ్వేతాశ్వరోపనిషత్తు 3.11 – **సర్వానన శిరోగ్రీవ సర్వభూత గుహాశయః**. బ్రహ్మమునకు అన్ని (అనేక) విధములైన ముఖములు, తలలు, మెడలు ఉన్నాయి. సర్వభూతముల హృదయములందును వసించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'ఆన' - ప్రాణనే - శ్వాసించుట; పాణిని సూత్రము (3.3.117) ప్రకారము 'అన' ప్రత్యయము చేరి నపుడు – **కరణా అధికరణయోశ్చ** – ఆ ప్రత్యయమునకు 'చేయుట, పనిముట్టు, స్థలము' వంటి అర్థములు వచ్చును. 'ఆన, అన, ఆనన' లకు అర్థాలు ఇలా ఉంటాయి.

ఆన – ప్రాణము, శ్వాసించుట; **అన** – ఉపకరణము; **ఆనన** – ప్రాణములు నిలుపు విధానము.
శతానన – అనేక ప్రాణములు నిలుపుటకు తగు ఉపకరణములను సమకూర్చినవాడు.
జీవన ఉపాయానామ్ చ బాహువిద్యమ్, తథా చ యద్యద్ జీవనే శిల్ప వైశిష్ట్యమ్ తత్తత్ తస్యైవ భాగవత ఇత్యాఖ్యాతుమ్ శతానన నామా భగవాన్ విష్ణుః స్తూయతే. జీవుల మనుగడ కొరకు అనేక ఉపకరణములు (నోరు, ముక్కు వంటివి) సమకూర్చినవాడైన విష్ణుభగవానుడు శతాననుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారే పాణిని సూత్రము (3.1.26 'హేతుమతి చ') ఆధారంగా మరొక అర్థం చెప్పారు – **ఆనయతి ఇతి ఆననః.** ప్రాణములు మనుటకు కారణమైనది ఆననము అనగా జీవనదాత. అసంఖ్యాకమైన ప్రాణుల మనుగడకు ఆధారమైనవాడు శతాననుడు. **చతుర్విధ సృష్టి ఉద్భవాన్వినః అనంతాన్ జీవాన్ తత్తత్ జీవనైః ఉపకరణైః ఆనయతి ఇతి జీవయతీతి శతాననః.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – జైన, బౌద్ధాది మతములకు వివిధ రూపములలో కనుపించేవాడు శతాననుడు. ఇంకా ద్వైతులు, అద్వైతులు ఇలా వేరువారువారిచే వివిధరూపాలలో భావింపబడేవాడు శతాననుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు రచించిన శ్రీ వేంకటేశ్వర వచనములనుండి –

శ్రీ వేంకటగిరిదేవా! నా దేహంబు నీవుండెడి నిత్యనివాసంబు; నా జ్ఞాన విజ్ఞానంబులు నీ యుభయ పార్శ్వంబుల దీపంబులు; నా ముకుఁజెఱముల యూర్పులు నీ యిరుదెసలం బట్టెడి యాలవట్టంబులు; నా మనోరాగంబు నీకుఁ జెంద్రకావి వలువ; నీకు మ్రొక్కనెత్తిన నా చేతులు రెండును మకరతోరణంబులు; నా భక్తియె నీకు సింహాసనంబు; నా మేనం బొడమిన పులకలు నీకు గుదులు గ్రుచ్చి యర్పించిన పూదండలు; నే నిన్ను నుతియించిన నుతులు యక్షరవంబులు నీకు భేరీ భాంకార ఘంటా నినాదంబులు; నా పుణ్య పరిపాకంబులు నీకు నైవేద్య తాంబూలాదులు; మదీయ నిత్యసేవా సమయ నిరీక్షణంబు నీకు సర్వాంగంబుల నలందిన తట్టుపునుంగు; నా సాత్విక గుణంబు నీకు ధూపపరిమళంబు; నీవు దేవుండవు; నేనర్చకుండను. ఈ రీతి నిత్యోత్సవంబు నాయందు నవధరింపవే శ్రీవేంకటేశ్వరా! మఱియును;

పెద్దశేష వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీ మలయప్ప స్వామి – వికీపీడియా చిత్రం

నందకాయుధధరా! నీ యూధంబులకు జయజయః నీ వాహనంబులకు శుభమస్తు; నీ పరివారంబులకు క్షేమంబు గోరెద; నీ కళ్యాణ గుణంబులకు నిరంతరాభివృద్ధి యగుగాక! నీ సత్త్వంబులకు శోభన పరంపరావాప్తి యొసగవలయు; నీ దేవులకు మంగళ మహాశ్రీలగు; నీ మహిమకు ననంతవిధార్చనము. నీ భుజాబలమునకు అపరిమిత స్తోత్రము; నీ చక్కదనంబునకు పుష్పాంజలి; నీ యుదారతకు శరణంబు; నీ శ్రీవత్స కౌస్తుభాది చిహ్నంబులకు సంతత ప్రార్థన; నీ పాదంబులకు సాష్టాంగ నమస్కారంబు చేసెద; ఏమి నిమిత్తంబు చేసెదనంటివా? నాలుగు యుగంబుల ధర్మంబులు, సకల జంతువుల పరిణామంబులు, కమలాసనాది దేవతల బ్రదుకులు, నీ మూలంబు గావున నీవు శుభంబున నుండుటే మేలు; శ్రీ వేంకటేశ్వరా!

హయగ్రీవా! కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్దన, ఉపేంద్ర, హరి, శ్రీకృష్ణ యనియెడి చతుర్వింశతి నామంబులు పాపహరంబులు; పుణ్యంబుల కునికిపట్లు; నుతించువారికి వచన భూషణములు; కోరినవారికి కొంగుబంగారము! జ్ఞానులకు సిద్ధమంత్రము; ఇహపరంబులకు కామధేను కల్పవృక్ష చింతామణులివి; శ్రీవేంకటేశ్వరా!

ఏకో నైకః స వః కః కిం యత్తత్పదమనుత్తమం |
లోకబంధుర్లోకనాథో మాధవో భక్తవత్సలః || (78)

730. ఏకః

అద్వితీయుడు. ఏ విధంగానైనా భగవంతునితో సమమైన మరొకడు (మరొకటి) లేదు.

ఓం ఏకాయ నమః

ఓం ఏకస్మై నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఉక్తే మహిమ్ని సజాతీయ సంఖ్యేయ అసంభవాత్ అద్వైతమ్ గచ్ఛతి ఇతి ఏకః**. ఇలా మహాత్మ్యం విషయంలో ఆయనతో పోల్చదగినది ఉండడం అసంభవం. కనుక ఆయన 'ఏకః'. ఇందుకు ప్రమాణముగా శ్రీ భట్టులు తైత్తరీయ యజుర్వేదము (4.1.8)నుండి ఉదాహరించారు – **ఏక ఇద్ రాజా జగతో బభూవ**. జగత్తునకు ఆయనొక్కడే రాజు.

ఋగ్వేదము 10.81.3 – **ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః**. అంతరిక్షమును, భూమిని సృష్టించిన ఒకే ఒక దేవుడు.

భాగవతము 9.5.11 – **యది నో భగవాన్ ప్రీత ఏకః సర్వగుణాశ్రయః**. అందరికి అంతర్యామి, సకల కళ్యాణ గుణములకు నిలయుడు ఒక్కడే అయిన భగవంతుడు మాయెడల ప్రీతుడైతే ఈ బ్రాహ్మణుడు బాధలనుండి విముక్తుడగుగాక.

శ్రీ నమ్మాళ్వారు భగవంతుని 'ఒరువన్' అని పెక్కుచోట్ల ప్రస్తావించారు. అనగా ఒకే ఒక్కడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పరమార్థతః సజాతీయ విజాతీయ స్వ-గత భేద వినిర్ముక్తత్వాత్ ఏకః**. స్వజాతీయము (తన జాతి), విజాతీయము (పరజాతి), స్వ-గత (తనది, పరాయిది) వంటి భేదములు అసలు లేని ఒకే ఒక్కడు

గనుక భగవంతుడు 'ఏకః'. ఇందుకు శ్రీ శంకరులు ఛాందోగ్యోపనిషత్తు (6.2)నుండి ఉదాహరించారు – **ఏకమేవా అద్వితీయం బ్రహ్మః**. పరబ్రహ్మము ఒక్కటే. మరొకటి లేదు.

శ్రీ బలదేవ విద్యాభూషణ ఈ నామమును ఇంతకు ముందు శ్లోకములోని 'శతమూర్తిః', 'శతాననః' నామములతో అనుసంధించారు. భగవంతునికి అనేక రూపములు, అనేక ముఖములు ఉన్నాగాని నిజానికి ఆయనొక్కడే. అందువలన 'ఏకః' అనబడ్డాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **ఏతి - గచ్ఛతి సర్వత్ర ఇతి ఏకః**. అన్నిచోట్ల ఉండేవాడు 'ఏకః'. ఏదైనా జాతికి సంబంధించినవి అనేకం ఉంటే వానికి సంఖ్యలను ఉపయోగిస్తాము. ఉదాహరణకు ఒక వ్యక్తి, ఐదు ఆవులు, పదిమంది విద్యార్థులు – ఇలా. అయితే భగవంతుని విషయంలో ఇందుకు ఆస్కారం లేదు. మరొకరు ఉండడం సాధ్యం కాదు. కనుక ఆయన **'ఏకః'**. మరియు ఎందరో బిడ్డలకు ఒకే తండ్రి ఉన్నట్లే జగజ్జనకుడు ఒకే దేవుడు.

సహస్ర నామావళిలో 'ఏకః' నామమునకు సంబంధించిన మంత్రము –
విశిష్టాద్వైతం, ద్వైతం సంప్రదాయాలలో – **ఓం ఏకాయ నమః**.
అద్వైత సంప్రదాయంలో – **ఓం ఏకస్మై నమః**.
ఇలాగే మరొకొన్ని మంత్రపాఠాలు. **విశ్వాయ నమః – విశ్వస్మై నమః; నైకాయ నమః – నైకస్మై నమః** ఇలా నామ, మంత్ర పాఠాలలో భేదాలు ఆయా సంప్రదాయ ప్రవక్తలు బోధించిన తత్వాలలోని భేదాలను ప్రతిబింబిస్తాయి. విశిష్టాద్వైత సంప్రదాయంలో ఒక్కో నామము భగవంతుని విశిష్టమైన నామవాచకము (Noun)గా భావిస్తారు. అద్వైత సంప్రదాయములో ఒక్కో నామము పరబ్రహ్మయొక్క గుణమును తెలిపే సర్వనామము (Pronoun)గా భావిస్తారు. ఉదాహరణకు 'రాముడు' – విశిష్టాద్వైతం ప్రకారము రామావతారమును తెలుపును. అద్వైతం ప్రకారం పరబ్రహ్మమునకు మరొకపేరు.

731. నైకః

ఒక్కడు కానివాడు. అనేకుడు.

ఓం నైకాయ నమః

ఓం నైకస్మై నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **విభూతితయా విజాతీయేన సర్వేణ ద్వితీయవానేవ ఇతి నైకః**. భగవంతుడు తన స్వరూపమునకు భిన్నముగా అగుపించే అనేక విభూతులు తనవిగా కలిగియున్నాడు గనుక 'నైకః'. జగత్తులో సమస్తము తనవిగా కలిగియున్నందున ఆయన 'ఏకః' (ముందటి నామము), కాని ఇలా ఆయనకంటే భిన్నమనిపించే అనేక విభూతులు కలిగియున్నందున ఆయన 'నైకః'. ఇందుకు శ్రీ భట్టులు

గీతనుండి ఉదాహరించారు – **నాంతోऽస్తి మమ దివ్యానామ్ విభూతీనామ్ పరంతప** – గీత 11.40. అర్జునా! నా దివ్య విభూతులకు అంతము లేదు.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి 7.8.1 – నీవే అగ్ని, నీరు, భూమి, ఆకాశము, గాలి. మాకు నీవే తల్లి, తండ్రి, పిల్లలు, బంధువులు. ఇంతే కాదు. సకల జగత్తు నీవే. అయినా నీ సుందరరూపపు తలపు మాధుర్యాన్ని నేను గ్రోలుచున్నాను. (నిన్ను సాకారునిగా ధ్యానిస్తున్నాను). దీనికి కారణమేమిటి? లోతైన తత్వజ్ఞానం నాకు అవగతం కాదు.

తిరువైమొళి 6.9.1 – నీవే నీరు, నిప్పు, నేల, గాలి, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, శివుడు, బ్రహ్మ. నీవే వీటన్నింటికీ అంతర్యామివి. అన్ని రూపాలు ధరించినవాడివి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మాయయా బహురూపత్వాత్ నైకః**. తన మాయద్వారా బహురూపములు కలిగినవాడు 'నైకః'.

శ్రీ చిన్మయానంద – 'ఏకః' నామం జ్ఞానదృష్టితోనూ, 'నైకః' నామం ఉనికి దృష్టితోనూ అర్థం చేసికొనదగును. అన్నింటా భగవంతుడున్నాడు. భగవంతుడు లేనిది లేదు. ఈ విధంగా ఆయన 'నైకః'. ఇలా అన్నింటా, అంతటా ఉండి, అన్నింటినీ నడిపేవాడు ఆయనొక్కడే గనుక ఆయన 'నైకః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **న తస్య ప్రతిమా అస్తి** (యజుర్వేదము 32.3). **న ఏకో యస్మాత్ ఇతి నైకః**. భగవంతుని సృష్టిలో ఉన్న వైవిధ్యం ఆయన నైకత్వాన్ని సూచిస్తుంది.

శ్రీ పెమ్మరాజు రాజారావు – **ఇన్ద్రోమా యాభిః పురురూప ఈయతే** (ఛాందోగ్యోపనిషత్తు). సూర్యుడొక్కడే అయ్యును వివిధ భాండములలో అనేకములుగా గోచరించునట్లు ఏకమును, అద్వితీయమును అగు పరబ్రహ్మము అనేకములుగా గోచరించుచున్నది. కనుక ఆయనను 'నైకః' అని కీర్తించుచున్నాము. సర్వత్ర ఆత్మ దర్శనమునకు ఇది సాధనము.

732. సః జ్ఞానమును వ్యాపింపజేయువాడు.

733. వః వసించువాడు

సవః సోమయాగం రూపంలో ఉండేవాడు.

శ్రీ భట్టులు 'సః', 'వః' అనే రెండు నామములుగా పరిగణించారు.

శ్రీ శంకరులు 'సవః అనే ఒకే నామముగా పరిగణించారు.

732. సః

- తనను గురించిన జ్ఞానమును అందరికీ తెలియజేయువాడు.
- జ్ఞానమును నిశ్చయింపజేయువాడు. అనగా ఆయన నిర్ణయమే అన్నింటికీ కడపటి నిర్ణయము.
- తన భక్తుల కష్టములను నశింపజేయువాడు.
- భక్త సులభుడు. గోపకులంలో బాలురచేత 'వీడు' అని పిలుచుకునేంత చనువు ఇచ్చినవాడు.

ఓం సాయి నమః

'సో' - అంత కర్మాణి – కడతేర్చుట

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వ-విషయ జ్ఞానమ్ స్యాతి ఇతి సః**. తనను గురించిన జ్ఞానమును వ్యాపింపజేయువాడు 'సః'.

సర్వేషు కృష్ణరూపేషు అకుమార ప్రసిద్ధతః
అజ్ఞానం యస్య విషయం న్యత్యసా స ఇతీరితః

కృష్ణుని రూపంలో అనేకవిధాలుగా తన మహాత్మ్యాన్ని తెలియజేసినవాడు 'సః'. కాళీయుని చంపినవాడు. గోవర్ధనగిరి నెత్తినవాడు. కంసుని చంపినవాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఏదైనా జ్ఞానము, తత్వము, పని, ఏ విషయంలో అయినా తుదినిర్ణయం భగవంతునిదే.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **స్యాతి వినాశయతి స్వజన విపదా ఇతి సః**. తన భక్తుల విపత్తులను వినాశనం చేసేవాడు గనుక 'సః'.

శ్రీ అణ్ణాంగారాచార్య స్వామి – 'సః' అనగా 'వాడు'. అలా అలా అని స్తుతింపదగినవాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – గోపబాలకులు 'వీడు కృష్ణుడు' అని వేలెత్తి చూపేంత చనువు ఇచ్చిన భక్తసులభుడు 'సః'.

శ్రీ అన్నమయ్య కీర్తన

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు

అంత నింత గొల్లెతల అరచేతి **మాణికము**
పంత మాడే కంసుని పాలి **వజ్రము**
కాంతుల మూడు లోకాల గరుడ **పచ్చ బూస**
చెంతల మాలో నున్న చిన్ని కృష్ణుడు

రతికేళి రుక్మిణికి రంగు మోవి **పగడము**

మితి గోవర్ధనపు **గోమేధికము**

సతమై శంఖ చక్రాల సందుల **వైడూర్యము**

గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు

కాళింగుని తలలపై గప్పిన **పుష్యరాగము**

యేలేటి శ్రీ వేంకటాద్రి **యింద్రనీలము**

పాల జలనిధి లోన బాయని దివ్య **రత్నము**

బాలునివలె దిరిగీ బద్మ నాభుడు

సవః

శ్రీ భట్టులు 'సః', 'వః' అనే రెండు నామాలను చెప్పగా, శ్రీ శంకరులు 'సవః' అనే ఒకే నామముగా చెప్పారు.

- సోమయాగము రూపంలో ఉండేవాడు.

- తనను గురించి భక్తులకు సంపూర్ణ జ్ఞానం ఇచ్చువాడు, మరియు అంతటా వసించువాడు.

ఓం సవాయ నమః

సవః - సూయతే అభిషూయతే సోమః అత్ర ఇతి సవః. సోమరసమును సమర్పించే క్రతువు 'సవః'. సోమయాగము విష్ణురూపమే గనుక విష్ణువు 'సవః' అనబడెనని శ్రీ శంకరుల వ్యాఖ్య. **అహం క్రతురహం యజ్ఞః** (గీత 9.16)

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్య – **సవః - యో హి స్యాతి - అంతయతి - నిశ్చయతి - స్వవిషయమ్ జ్ఞానమ్, వసతి చ సర్వత్ర, ఇతి సవః.** తనను గురించిన అంతిమ జ్ఞానమును భక్తులకు ఇచ్చేవాడు మరియు అంతటా ఉండేవాడు 'సవః'.

733. వః

వసించేవాడు. సర్వాంతర్యామి.

ఓం వాయ నమః

వస్ - నివాసే - వసతి ఇతి వః. వసించేవాడు 'వః'. అంతకూ అంతర్యామి.

శ్రీ భట్టులు విష్ణుపురాణము (6.5.76)నుండి ఉదాహరించారు –

వసంతి తత్ర భూతాని భూతాత్మన్యఖిలాత్మని

స చ భూతేష్వశేషేషు వకారార్థస్తతో మునే

సకల భూతములు ఆయనయందుండును. మరియు అన్ని భూతములు ఆయనే. మరియు అన్నింటికి ఆత్మ ఆయనే. ఇంకా ఆయన అన్ని భూతములందు వసించును. కనుక మునులు ఆయనను 'వ'కారముతో స్తుతించారు. (విష్ణుపురాణంలో 'భ-గ-వ' పదంలోని అక్షరాలకు అర్థం చెప్పే సందర్భంలో ఈ స్తోత్రం వస్తుంది.)

తిరుపైమొళి 1.1.10 – ఆయన అంతటా వ్యాపించిన నీటిలోని ప్రతి కణంలోనూ ఉన్నాడు. భూమి, ఆకాశం, విశ్వం అంతటా వ్యాపించాడు. సూక్ష్మాతిసూక్ష్మమైన వస్తువులలోనూ ఉన్నాడు. మరియు అన్నింటి ఆత్మ ఆయనే. అంతటినీ మ్రింగి తన కడుపులో ఉంచుకొన్న ఆయన అన్నింటిలోనూ దాగిఉన్నాడు.

కలడంబోధి కలండు గాలి గలడాకాశంబునన్ గుంభినిన్
గలడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలడోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగ వ్యక్తులం దంతటన్
గలడీశుండు గలండు తండ్రి! వెదుకంగా నేల యీ యా యెడన్ – పోతన భాగవతము

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – వాతి - గచ్ఛతి - వెళ్ళువాడు. **వాతి గచ్ఛతి స్వజనాయోజిత భజన భవనం ఇతి వః.** తనను భజించేవారి నివాసమునకు వెళ్ళువాడు 'వః'.

734. కః

- ఆనంద స్వరూపుడు.
- ప్రకాశించువాడు.
- భక్తులచే స్మరింపబడువాడు, స్తుతింపబడువాడు.
- మేధస్సుద్వారా ప్రయత్నిస్తే ప్రశ్నార్థకంగా ఉండిపోయేవాడు.

ఓం కాయ నమః

కాన్ - దీప్తి కాంతి గతిషు; కః - కనతి - ప్రకాశించునది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **మలీమశేషు వసన్నపి కనతి ఇతి కః.** భగవంతుడు సర్వాంతర్యామి. అపరిశుద్ధము, పాపమయము అయినవాని ఆత్మలలో కూడా ఉన్నాగాని భగవంతుని ప్రకాశము పరమపవిత్రము.

శ్రీ వి.వి. రామానుజన్ – భగవంతుని ప్రకాశము సహజమైనది. వస్త్రాభరణాలతో నిమిత్తం లేనిది.

శ్రీ వాసిష్ఠ – 'కన్' - దీప్తి, కాంతి, గతౌ. భగవంతుడు ప్రతిచోటా ప్రకాశించును (కాంతి). అన్నిచోట్లా ఉండును (గతి). అన్నింటినీ ప్రకాశింపజేయును, అనగా చైతన్యపరచును (దీప్తి). కనుక భగవంతుడు 'కః'. జీవి ఆత్మకు

ఆత్మయై దేహంలో దేవుడున్నంతవరకే జీవికి ప్రకాశం ఉంటుంది. ఆత్మ లేకుంటే ప్రకాశం ఉండదు. భగవంతుడు అంతటా, అన్నింటా ఉండి వెలిగిస్తున్నాడు గనుకనే జగత్తు ప్రకాశిస్తున్నది.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **కై - శబ్దే, కాయతే శబ్ద్యతే ఆహూయతే భక్తైః ఇతి కః.** భక్తుల శబ్దములు (జపములు, తపములు, కీర్తనలు, మంత్రములు) వలన కీర్తింపబడువాడు, పిలువబడువాడు 'కః'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కమ్ - సుఖేऽపి విజానీయాత్.** భగవంతుడు ఆనందస్వరూపుడు గనుక 'కః'. ఛాందోగ్యోపనిషత్తు 4.10 – **కమ్ బ్రహ్మ** – ఆనందము బ్రహ్మము.

గీత 9.33 – **అనిత్యమసుఖమ్ లోకం, ఇమం ప్రాప్య భజస్వ మాం.** ఈ లోకము సుఖరహితమైనది. అనిత్యమైనది. కనుక నన్ను భజించి పరమానంద సుఖములను పొందుము.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – అహంకార మమకారములను త్యజించుట ఆనందమునకు హద్దు. భగవంతునకు అహంకార మమకారములు లేనందున ఆయన ఆనంద స్వరూపుడు.

ధర్మచక్రము రచయిత – ఎక్కువమంది ఆశించే భౌతిక ఆనందము దుఃఖానికి దారి తీస్తుంది. భౌతిక సుఖాలను త్యజిస్తే ఆత్మానందం లభిస్తుంది. ఈ నామమును ధ్యానించుట ద్వారా ఆత్మానందమును పొందవచ్చును.

శ్రీ చిన్మయానంద – 'కః' అనగా 'ఎవరు?'. భగవంతుడు ఎవరో తెలిసికోవాలని మేధస్సు, తర్కము ద్వారా ప్రయత్నిస్తే మిగిలేది ప్రశ్న మాత్రమే. (భక్తి ద్వారానే భగవంతుని తెలిసికొనవచ్చును.)

735. కిమ్

- సత్యాన్వేషకులు ఎవరిని గురించి సకల ప్రశ్నలు వేస్తారో అతను.
- భక్తులు ఎవరిని కీర్తిస్తారో అతను.
- తెలిసికొనబడదగినవాడు, కోరబడదగినవాడు.

ఓం కిమే నమః

ఓం కస్మై నమః (శ్రీ శంకరుల పాఠము)

'కిం' అనగా 'ఏమిటి?' అన్న ప్రశ్న. ప్రచ్ఛ - జ్ఞీప్సాయామ్ - అడుగుట, తెలిసికొనుట. ఇక్కడ 'కిం' అనే ప్రశ్నవాచక పదము పరమాత్మకు నామవాచకముగా చెప్పబడుట విశేషము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **పృచ్ఛతి ఇతి కిమ్, పృచ్ఛయతా ఇతి కిమ్.** అడిగేవాడు ‘కిమ్’. ఎవరిని గురించి అడగడం జరుగుతుందో అతను కూడా ‘కిమ్’. పరమాత్మ ఏమిటి? ఎలా ఉంటుంది? ఎక్కడ ఉంటుంది? వంటి అనేక ప్రశ్నలు అన్నీ ఆ దేవుని గురించే. అన్నింటికీ జవాబు ఆ దేవుడే.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తత్ తత్ సర్వేప్సితుః బుభుత్సూనామ్ నిరుపాధిక పృష్టవ్యత్వాత్ కిమ్.** కామరహితులైనవారు తమ పరమార్థము కొరకు ఎవరిని గురించి అన్ని ప్రశ్నలూ అడుగుతారో ఆయనే ‘కిం’. ఇందుకు శ్రీభట్టులు ఛాందోగ్యోపనిషత్తు (8.7.1)నుండి ఉదాహరించారు. **స అన్వేష్టవ్యః స విజింజాసితవ్యః.** అతడే వెదుకదగినవాడు, గాఢంగా కోరదగినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వ పురుషార్థ రూపత్వాత్ బ్రహ్మైవ విచార్యమ్ ఇతి బ్రహ్మ కిమ్.** సకల పురుషార్థములకు (జీవిత గమ్యములకు) రూపము బ్రహ్మమే. కనుక బ్రహ్మమును గురించి విచారింపవలసి యున్నది గాన బ్రహ్మము ‘కిమ్’. ఇందుకు శ్రీ శంకరులు గీత (8.1)నుండి ఉదాహరించారు.

కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కిముచ్యతే

ఓ పురుషోత్తమా! ‘బ్రహ్మ’ అనగా ఏమి? (కిం?), అధ్యాత్మము అనగానేమి? కర్మ అనగానేమి? అధిభూతము అని దేనికి పేరు? అధిదైవము అని దేనిని అందురు?

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఋగ్వేదమునుండి కొన్ని ఉదాహరణలు ఇచ్చారు –

10.29.1 – **అంబుః కిం ఆసీత్ గహనమ్ గంభీరమ్.** లోతైన, గంభీరమైన నీరు అక్కడ ఉన్నదా?

1.129.6 – **కుతః ఆజాతా కుత ఇయమ్ విసృష్టిః.** అది ఎప్పుడు జన్మించినది? ఈ సృష్టి ఎప్పుడు ఆరంభమైనది?

10.129.7 – **యోऽస్యాధ్యక్షః పరమే వ్యోమమ్.** ఎవరి కనుసన్నలలో ఈ అత్యుత్తమ స్వర్గము మెదులుతుంది?

ఇలాంటి ప్రశ్నలన్నింటికీ కడపటి జవాబు గనుక పరమేశ్వరుడు ‘కం’.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – కూంగ్-శబ్దే-శబ్దము చేయుట. **కూయతే - ఆహూయతే స్వజనైః భజమానైః ఇతి కిం.** భక్తులు ఎవరిని స్తుతిస్తారో ఆయన ‘కిం’.

శ్రీ అణ్ణాంగారాచార్య స్వామి – ఉపనిషత్తులు ఆయనను ‘అన్వేష్టవ్యుడు’ అని వర్ణించాయి. ఎవరిని గురించి అన్వేషింపదగునో ఆన ‘కిం’.

ధర్మచక్రము రచయిత – సత్యము నెరుగదలచినవారు భగవంతుని ధ్యానింతురు. కాల, దేశాతీతమైనది, ఎన్నడూ మారనిది, శాశ్వతమైనది, ఇంద్రియాలకు అందనిది, నిజమైన భక్తి మరియు ధ్యానము వల్లనే పొందదగునది, అన్నింటా అంతటా ఉండునది అయినది మాత్రమే అన్ని ప్రశ్నలకు చివరి జవాబు.

736. యత్

- (భక్తుల పరిరక్షణకు) అన్ని యత్నములు చేయువాడు.

- అప్పటికే ఉండినది ఏదైతే అది (బ్రహ్మము).

- దేనినుండి సృష్టిలో అంతా ఉద్భవించిందో...

ఓం యతే నమః

ఓం యస్మై నమః (శంకర పాఠము. ఇక్కడ 'యత్' అను పదము సర్వనామముగా చూడడమైనది)

శ్రీ భట్టుల వ్యాఖ్య – యత్ - ప్రయత్నే - ప్రయత్నించుట, కష్టించుట. **తేషామ్ రక్షాయై యతతే ఇతి యత్. రక్షాయై పుచ్ఛకానామ్ సః యతతే యత్ ఇతి స్మృతః.** తనను వేడుకున్న భక్తుల రక్షణ కొరకు సకల యత్నములు చేసేవాడు 'యత్'.

కృష్ణ కృష్ణేతి యో మాం స్మరతి నిత్యశః
జలం భిత్వా యథా పద్మం నరకాత్ ఉద్ధరామ్యహమ్
కృష్ణ, కృష్ణ, కృష్ణ అని నన్ను ఎవరైతే స్మరిస్తారో వారిని, నీటినుండి తామరపూవును తీసినట్లుగా, నరకమునుండి ఉద్ధరిస్తాను.

వరాహ చరమశ్లోకము – **అహం స్మరామి మద్భక్తమ్ నయామి పరమామ్ గతిమ్.** నా భక్తుని నేను గుర్తు ఉంచుకొని పరమపదమునకు తీసికొని వెళతాను. (భక్తుడు తన అంతిమ సమయంలో భగవంతుని తలచుకొనలేకపోయినాగాని, భగవానుడు అతనిని గుర్తుంచుకొని తన ధామమునకు తీసికొని వెళతాడు.)

శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి 5.8.9 – తనలాంటి ఇంద్రియలోలునికి, అల్పునికి, అహంకారికి కూడా భగవంతుడు ఆత్మజ్ఞానము ప్రసాదించాడని శ్రీ నమ్మాళ్వారు స్తుతించారు. (ఇక్కడ శ్రీ నమ్మాళ్వారువారి నైచ్యభావం తెలియవస్తున్నది.)

శ్రీ శంకరుల వ్యాఖ్య – యత్ - ఏదైతే; తనంతట తానుగానే సిద్ధించియున్నది పరబ్రహ్మమగుటచేత 'యత్' (ఏదో) అనే నామముతో ఉపనిషత్తులు ఈశ్వరుని వర్ణించినవి. **యత్ శబ్దేన స్వతః సిద్ధ వస్తు ఉద్దేశ వాచినా బ్రహ్మ నిర్దిశ్యత ఇతి బ్రహ్మయత్.** 'యత్' అను పదము స్వయంసిద్ధమైన వస్తువును ఉద్దేశించినది. కనుక ఇది బ్రహ్మమే అవుతుంది. ఎందుకంటే బ్రహ్మము ఎప్పుడూ ఉంటుంది. ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన ప్రమాణము. తైత్తరీయోపనిషత్తు 3.1 – **యతో వా ఇమాని భూతాని జాయంతే**. దేనినుండి అయితే అన్ని భూతములు ఉద్భవించినవో.....

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – పైన చెప్పిన శ్రుతి వాక్యం ఆధారంగానే శ్రీ రాధాకృష్ణశాస్త్రి వేరొక అర్థం చెప్పారు. సృష్టిలో దేనినుండి సకలము ఉద్భవించినదో అది 'యత్'.

శ్రీ చిన్మయానంద ఉదాహరించినది – తైత్తరీయోపనిత్తు 2.9.1 – **యతో వాచే నివర్తంతే అప్రాప్య మనసా సః.** దేనిని గురించి చెప్పడానికి మాటలు, మనసు చాలవో.....

737. తత్

- తన భక్తులకు జ్ఞానమును, భక్తిని పెంపొందించువాడు.
- తన భక్తుల కీర్తిని అధికము చేయువాడు.
- జగత్తును సూక్ష్మరూపమునుండి స్థూలరూపమునకు విస్తరింపజేయువాడు.
- ఇంద్రియములకు అందనివాడు.

ఓం తతే నమః

ఓం తస్మై నమః (శ్రీ శంకరుల పాఠము)

శ్రీ భట్టుల వ్యాఖ్య – తను - విస్తారే - విస్తరించుట (తనోతి - విస్తృణతి). **స్వజ్ఞానం భక్తిం భక్తానామ్ తనోతి ఇతి తత్.** భక్తితో తనను అర్చించేవారికి ఆ భక్తిని పెంపొందింపజేసి, తనను తెలిసికొనే జ్ఞానాన్ని ప్రసాదించేవాడు 'తత్'. శ్రీ భట్టులు తన వ్యాఖ్యకు ప్రమాణముగా చెప్పిన ఉదాహరణ. తైత్తరీయ నారాయణీయము 27 – **తత్ సవితుర్ వరేణియమ్.** ఆ పరమాత్ముని అద్భుత ప్రకాశమే సృష్టికి మూలము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **తనోతి ఇతి తత్.** అది పరబ్రహ్మము.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – 'తత్' అనగా 'అది' అని శబ్దార్థము. తత్ శబ్దవాచ్యుడు పరమాత్మ. 'తత్-త్వం-అసి' – 'తత్వమసి' అను మహావాక్యములో 'తత్' అనగా పరబ్రహ్మము అని అర్థము. శ్రవణ, మనన, చింతనల చేత, పరమార్థసాధకుడు 'తత్' శబ్దవాచ్యుడగు ఆ పరమాత్మనే అనుభవపూర్వకముగా తెలియును.

ఓం <u>తత్</u>సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా – గీత 17.23
ఓం, తత్, సత్ – అని ఈ మూడు విధములగు పేర్లు సచ్చిదానంద ఘనపరబ్రహ్మకు నిర్దేశించబడినవి. ఆ పరమాత్మనుండియే సృష్ట్యాదియందు బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములు ఏర్పడుట జరిగినది.

<u>తద</u>ిత్యభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియా

దాన క్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః – గీత 17.25
మోక్షకాంక్ష గలవారు స్వలాభాపేక్ష లేశమైనను లేకుండ లోకహితార్థమై యజ్ఞ దాన తపః చర్యలను 'ఇది యంతయు (తత్ - ఇత్ - అభిసంధాయ) పరమాత్మదే' అను భావముతో 'తత్' అను నామమును ఉచ్చరించుచు చేయుదురు.
అనేక పూజాది కార్యక్రమములను 'హరిః ఓమ్ తత్' అనుచు ప్రారంభిస్తారు (సంకల్పము).

గీతాశ్లోకము (17.25)పై శ్రీ భగవద్రామానుజుల వ్యాఖ్యలో 'తత్' అనగా బ్రహ్మము అని చెప్పారు. వేదపఠనము, యజ్ఞములు, దానములు చేసేవారు లౌకిక ఫలములను కోరకుండా మోక్షమును మాత్రమే కోరుతూ ఆ పనులు చేసేట్లయితే వాటిని 'తత్' అనగా 'బ్రహ్మము' అని అనుకోవాలి. ఎందుకంటే అవి బ్రహ్మమును పొందే సాధనాలు కనుక. ఈ సందర్భంలో శ్రీ రామానుజులు విష్ణుసహస్రనామములోని ఈ (78వ) శ్లోకాన్ని ప్రస్తావించి, 'తత్' అనగా 'బ్రహ్మము' అని చెప్పారు. సః **వః కః కిం యత్ తత్ పదమనుత్తమమ్ – ఇతి శబ్దో హి బ్రహ్మవాచీ ప్రసిద్ధః.**

శ్రీ వి.వి. రామానుజన్ ఇంతకుముందటి నామము 'యత్' (యతతే – రక్షించ యత్నించును), ఈ నామము 'తత్' (తనోతి – భక్తిని పెంపొందించును) కలిపి ఇలా వ్యాఖ్యానించారు – రక్షించడానికి భక్తిని పెంపొందించును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **తనోతి - విస్తారయతి స్వజనానామ్ కీర్తిమ్ ఇతి తత్.** తన భక్తుల కీర్తిని పెంపొందించేవాడు 'తత్'.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవానుని తత్-గుణము వలన ఆయన అంతటా విస్తరించి ప్రవేశించును. అలా జీవులను చైతన్యపరచి భగవంతుని చేరుకొనే అవకాశము కల్పించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **తనోతి విశ్వమ్ ఇతి తత్.** భగవంతుడు విశ్వమును సూక్ష్మరూపమునుండి స్థూలరూపమునకు (కనుపించే రూపమునకు) విస్తరింపజేయును గనుక 'తత్'. అలాగే భగవంతుడు జ్ఞానమును, భక్తిని విస్తరింపజేయును. అందరిలోనూ అంతర్యామియై వర్తించును.

శ్రీ సత్యసంధ యతిరాజ – ఈయన మాధ్వసంప్రదాయానికి చెందిన ఆచార్యులు. ఏదైతే కంటికి కానరాదో అది 'తత్'. అలాంటిదానిని గురించి పరోక్షశబ్దవాచ్యము ద్వారానే చెబుతాము. ప్రత్యక్షముగా హరిని తెలియజాలము. వేదము ద్వారానే ఆయన తెలియవచ్చును. కనుక ఆయనను 'తత్' తత్వము ద్వారా చెప్పనగును. **పరోక్షమ్ వస్తు తత్ శబ్ద వాచ్యమ్, హరిస్తు ప్రత్యక్షాత్ అవేద్యత్వేన ముఖ్యైతో వేదైక గమ్యత్వాత్ గుణైః తత్తత్వాద్-వా ఇతి ఉచ్యతే.**

738. పదమనుత్తమమ్

- అత్యుత్తమమైన గమ్యము. పరమపదము. ప్రపన్నులకు పరమప్రాప్యము.
- భక్తులకు అత్యుత్తమమైన రక్షకుడు.
- అత్యుత్తమమైన మార్గము, గమ్యము, స్థానము.

ఓం అనుత్తమాయ పదాయ నమః

ఓం పదాయ అనుత్తమాయ నమః

పద్ - గతౌ - వెళ్ళుట; **పద్యతే - గమ్యతే, జ్ఞాయతే, ప్రాప్యతే, యత్యతే తత్ పదమ్, న ఉత్తమమ్ తస్మాత్ ఇతి అనుత్తమమ్** – వెళ్ళవలసినది, తెలియవలసినది, పొందవలసినది, ప్రయత్నింపవలసినది పదము. దానికంటె ఉత్తమమైనది మరిలేదు గనుక అది అనుత్తమము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తేషామ్ పరమ ప్రాప్యత్వాత్ పదమ్ అనుత్తమమ్**. ప్రపన్నులైన తన భక్తులకు పొందదగినవానిలో అత్యుత్తముడు. వారికి అంతకంటే కావలసింది మరొకటి లేదు.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి 5.9.1 – నాకు శ్రీవైకుంఠం కూడా అవుసరం లేదు. కేవలం నీ పాదపద్మాలను నా తలపై ఉంచితే చాలును; తిరువైమొళి 3.7.6 – భగవంతుడు సాటిలేని రక్షకుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – అమరకోశము (3.3.93) ప్రకారము – **పదమ్ వ్యవసితి త్రాణ స్థాన లక్ష్మాంఘ్రి వస్తుః**. ఇక్కడ పదము అనగా 'రక్షణ'. **పదమ్ త్రాణమ్ – అనుత్తమమ్ సర్వోత్తమమ్ – ఇతి పదమనుత్తమమ్ అర్థాత్ సర్వోత్తమో రక్షకః శ్రీ భగవానేవ సర్వోత్తమః త్రాతా స్వజనానామ్**. తన భక్తులకు సర్వోత్తముడైన రక్షకుడు గనుక శ్రీ భగవానుడు 'పదమనుత్తమమ్'.

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాంగతిమ్ – గీత 7.18
ఈ చతుర్విధ భక్తులందరును ఉదారులే (అనగా భగవంతునియందు విశ్వాసమునుంచి అతనినే సేవించుచు ఉండువారు). కాని జ్ఞానియైనవాడు నా స్వరూపమే. ఇది నా అభిప్రాయము. ఏలనన అట్టి భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగానుంచి, నన్నే పరమప్రాప్యునిగా (ఉత్తమాం గతిం) భావించును. ఈ విధముగా అతడు నాయందే స్థితుడు. ఈ శ్లోకాన్ని ఉదాహరిస్తూ శ్రీ చిన్మయానంద ఇలా చెప్పారు – శ్రీమహావిష్ణువు మార్గము (పదము), గమ్యము (పదము), స్థానము (పదము) అయినందున ఆయన 'అనుత్తమమ్ పదమ్'.

739. లోకబంధుః

- సకల లోకములకును బంధువు.
- అంతటికినీ ఆయన ఆధారము గనుక అంతా ఆయనతో బంధింపబడియున్నది.
- అందరికీ ఆయన నెచ్చెలి, తండ్రి, బంధువు.
- శాస్త్రములద్వారా మంచిచెడులను ఒక బంధువులా తెలియజెప్పేవాడు.
- జీవితంలో అన్నింటికీ పరిమితులు విధించేవాడు.

ఓం లోకబంధవే నమః

మనకు, భగవంతునికి ఉన్న విడదీయరాని పరస్పర బాంధవ్యము ఈ నామములో తెలుపబడినది.

నీవే తల్లివి తండ్రివి

నీవే నా తోడు నీడ నీవే సఖుడా

నీవే గురుడవు దైవము

నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఏవమ్ అవిశేషేణ అశేష అనుగ్రహ అవర్జనీయమ్ బాంధవమ్ నిబంధనమ్ ఆహ - లోకబంధుః**. ఈ లోకంలో అందరికీ ఆయన బంధువే. భేదం లేకుండా అందరినీ ఆశీర్వదిస్తాడు గనుక ఆయన లోకబంధువు. ఇందుకు శ్రీ భట్టులు సుబాలోపనిషత్తు (6)నుండి ఉదాహరించారు. **మాతా పితా భ్రాతా నివాసః శరణం సుహృత్ గతిః నారాయణః**. తల్లి, తండ్రి, సోదరుడు, నివాసము, ఆశ్రయము, మిత్రుడు, గమ్యము అన్నీ నారాయణుడే. ఈ జగత్తులోని ఆదిత్యులు, రుద్రులు, మరుత్తులు, వసువులు, అశ్వినీ దేవతలు, ఋక్కులు, సామములు, అగ్ని, ఆజ్యము – ఒకటేమిటి, అన్నీ నారాయణుడే. అందుకే ఆయన అందరికీ కావలసినవాడు.

పితామహస్య జగతో మాతా ధాతా పితామహః

వేద్యం పవిత్ర మోంకార ఋక్సామయజురేవ చ – గీత 9.17

ఈ సమస్త జగత్తునకు ధాతను, అనగా ధరించువాడను, అట్లే కర్మఫలము ఇచ్చువాడను నేనే. తల్లియును, తండ్రియును, తాతయును నేనే. తెలిసికొనదగినవాడను కూడా నేనే. పవిత్రుడను, ఓంకారమును నేనే. ఋక్, సామ, యజుర్వేదములును నేనే.

సమోఽహం సర్వభూతేషు న మేద్వేష్యోఽసి న ప్రియః

యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ – గీత 9.29

నేను సకల భూతముల (ప్రాణుల)యందును సమభావముతో వ్యాపించియుందును. నాకు అప్రియుడు గాని, ప్రియుడుగాని ఎవ్వడును లేడు. కాని నన్ను భక్తితో భజించువారు నాయందే యుందురు. నేనును వారియందు ప్రత్యక్షముగా ఉందును.

శ్రీ ఆండాళ్ తిరుప్పావై 28 – **ఉన్దన్నోడు ఉఱవేల్ నమక్కింగొళిక్కి వొళియాదు**. ఇది వద్దంటే వీడిపోయే బంధంకాదు. ఈ పాశురానికి చిత్రకవి శ్రీ ఆత్రేయ అనువాదము –

ఆలమందలతోడి అడవులలో పడి తినెడి

కుడియడమ తెలియని గోప కులజులము

నీవు తోడ పుట్టిన పుణ్యమే మా పుణ్యము

కొరత కొంచెము లేని గోవిందా! నీ తోడి

సంబంధము కాదన్న పోవునది కాదురా!

లోక మర్యాదల లోతెరుంగని లేమలము

చిన్న పేరున నిన్ను ప్రేమతో పిలిచేము

కోపగించక స్వామీ! కరుణించి పర నిమ్ము!

జగతికే మంగళము కూర్చు మన శ్రీవ్రతము.

నాన్ముగమ్ తిరు. 7 – నీవు తప్ప నాకు వేరు శరణు లేదు. నీవు కాచవలసిన వారిలో మొదటిస్థానం నాదే. తిరువైమొళి 7.8.1 – నీవే నా తల్లివి, తండ్రివి, బిడ్డవు, సకల బంధుడవు. అంతకంటే ఎక్కువగా సకల లోకమూ నీవే. ఐనా నీ సుందరమైన రూపంపైనే నాకు మక్కువ ఎక్కువ. ఇందులో అద్భుతం ఏమిటి? నాకు విపరీతమైన తర్కాలు అర్థం కావు గదా!

శ్రీ శంకరులు మూడు విధాలైన అర్థాలు చెప్పారు.

(1) **ఆధారభూతేऽస్మిన్ సకల లోకా బధ్యంతా ఇతి లోకానాం బంధుః లోకబంధుః**. భగవంతుడు సకల లోకాలకు ఆధారము. కనుక అన్ని లోకాలు ఆయనచే బంధింపబడి ఉన్నాయి. అందువలన ఆయన లోకబంధువు.

(2) భగవంతుడు సకల లోకాలను సృష్టించాడు. కనుక ఆయన సకల లోకాలకూ తండ్రి. తండ్రికంటె దగ్గరి బంధువెవరు? అందుచే ఆయన లోకబంధువు. **లోకానామ్ జనకత్వాత్ జనకోపమో బంధుర్నాస్తీతి వా.**

(3) **లోకానామ్ బంధుకృత్యమ్ హితాహితుపదేశమ్ శృతి స్మృతి లక్షణమ్ కృతవాన్ ఇతి వా**. శృతులు, స్మృతుల ద్వారా ఏది మంచో, ఏది చెడో ఒక దగ్గరి బంధువులా భగవంతుడు లోకానికి తెలియజేస్తున్నాడు గనుక ఆయన లోకబంధువు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – బంధ్ - కట్టివేయుట; **బధ్నాతి ప్రేమపాశేన ఇతి బంధుః, లోకానామ్ బంధుః ఇతి లోకబంధుః**. తన ప్రేమతో లోకాలను బంధించి ఉంచేవాడు లోకబంధువు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – లోక్-దర్శనే-చూచుట, తెలిసికొనుట; బంధ్-బంధించుట, ఆకర్షించుట; **బధ్నాతి ఇతి బంధుః**. (1) లోకంలో అన్నింటికీ భగవంతుడు బంధాలను (మితులను) ఏర్పరచాడు. ఉదాహరణకు మనిషి

ఆయుర్దాయానికి ఒక పరిమితి ఉంది. ఇలా భగవంతుడు లోకబంధువు. (2) ఏదైనా తాడువంటిది లేకుండానే కర్మతో జీవులన్నింటినీ బంధించినవాడు లోకబంధువు. (3) భగవంతుడు వేదములలోని నియమాలద్వారా మనుష్యుల వ్యవహారాలను బంధించాడు గనుక లోకబంధువు.

ధర్మచక్రము రచయిత – మన కోరికలు రెండు విధాలు (1) ఐహికమైన సౌఖ్యము (ప్రేయస్సు) (2) నిజమైన జ్ఞానము (శ్రేయస్సు). భగవంతుడు తల్లి, తండ్రి, భార్య, బిడ్డలు, సహోదరుల రూపాలలో ప్రేయస్సును సమకూరుస్తాడు. గురువుగా శ్రేయస్సును అనుగ్రహిస్తాడు. రెండు విధాలుగానూ ఆయన లోకబంధువే.

శ్రీ అన్నమయ్య కీర్తన

వాడల వాడల వెంట వాడెవో - నీడ నుండి చీరలమ్మే నేత బేహారి.

పంచ భూతములనెడి పలు వన్నె నూలు - చంచలపు గంజి తోడ చరి నేసి,
కొంచపు కండెల నూలి గుణముల నేసి - మంచి మంచి చీర లమ్మే మారు బేహారి.

మటుమాయముల దన మగువ పసిడి నీరు - చిటిపోటి యలుకల చిలికించగా,
కుటిలంపు చేతలు కుచ్చులుగా గట్టి - పటవాళి చీర లమ్మే బలు బేహారి.

మచ్చిక జీవుల పెద్ద మైల సంతల లోన - వెచ్చపు కర్మ ధనము విలువ చేసి,
పచ్చడాలుగా కుట్టి బలు వెంకటపతి - ఇచ్చ కొలదుల అమ్మే ఇంటి బేహారి.

---

740. లోకనాథః

- లోకములను రక్షించేవాడు.
- అనంత ఐశ్వర్యవంతుడు కావడంచేత అందరికీ ఐశ్వర్యం ప్రసాదించేవాడు.
- లోకాలచేత ప్రార్థింపబడేవాడు, కోరబడేవాడు.
- లోకములను ప్రకాశింపజేసేవాడు. శక్తిమంతం చేసేవాడు.
- లోకములను శాంతిపరచి ఆశీర్వదించేవాడు.
- లోకములను శాసించేవాడు.
- ధర్మం తప్పినవారిని కష్టాలపాలు చేసి శిక్షించేవాడు.

ఓం లోకనాథాయ నమః

లోక్ - దర్శనే - చూచుట, అనుభవించుట;

లోక్ - భాషాయామ్ దీప్తౌ చ - వెలిగించుట, తెలిసికొనుట, కోరుట;

నాథ్ -యాచ్, ఉపతాపైః, ఐశ్వర్యాశీఃషు - అడుగుట, శ్రమపెట్టుట, శాసించుట, పాలించుట

లోకము - చూపులకందేది, జగత్తు

పైని వివిధ భావాలనుబట్టి వివిధ వ్యాఖ్యలు లభిస్తున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తన్మూలమ్ అసాధారణమ్ స్వాభావికమ్ చ సంబంధమ్ ఆహ - లోకనాథః**. భగవంతునికి, సకల జీవులకు అసాధారణమైన, స్వభావసిద్ధమైన సంబంధం ఉన్నది. సకల లోకాలకు భగవంతుడు ప్రభువు, రక్షకుడు ఐనందున లోకనాథుడు. కనుక సహజంగానే భగవంతునికి సకల లోకాలతోనూ విడదీయరాని సంబంధం ఉంది.

లోకబంధుత్వ మూలార్థి లోకస్వామిత్వమిత్యతః
స్వాభావికాచ్చ సంబంధాత్ లోకనాథ ఇతీరితః.

శ్రీ వి.వి. రామానుజన్ దివ్య ప్రబంధాలనుండి ఉదాహరించారు –

తిరువైమొళి 7.10.1 – ఈ ఏడు లోకాలూ క్షేమంగా ఉండడం కోసమై భగవంతుడు శ్రీ అమ్మవారితో కూడి దివ్యదేశాలలో ఆసీనుడై యున్నాడు.

తిరువైమొళి 6.9.3 – నీ సృష్టిలోని జీవులను రక్షించడానికే నీవు అనేకమార్లు వివిధ రూపాలలో అవతరించావు.

తిరువైమొళి 6.10.10 – నా స్వామీ! ఈ మూడు లోకాలూ నీవే (మూడు చేతనములు – బద్ధ, నిత్య, ముక్త; మూడు అచేతనములు – కాలము, ప్రకృతి, శుద్ధసత్వము)

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **లోకమ్ నాథతి - స్వ ఐశ్వర్య యోగేన ఐశ్వర్యవంతమ్ కరోతి ఇతి లోకనాథః**. ఆయన అనంత ఐశ్వర్య సంపన్నుడు అవడం చేత అందరికీ ఐశ్వర్యమును ప్రసాదించేవాడు. లోకనాథుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు నాలుగు రకాల అర్థాలు చెప్పారు.

(1) **లోకైః నాథ్యతే యాచ్యతే** – కామితార్థముల కొరకు లోకములచే ప్రార్థింపబడువాడు, యాచింపబడువాడు లోకనాథుడు.

(2) **లోకానామ్ ఉపతపతి**. లోకములను ప్రకాశింపజేయువాడు (తపింపజేయువాడు), శక్తినిచ్చువాడు లోకనాథుడు.

(3) **ఆశాస్తే**. లోకములను నెమ్మదింపజేసి (శమింపజేసి) దీవించువాడు లోకనాథుడు.

(4) **లోకానామ్ ఈష్టే**. లోకములను శాసించువాడు, దీవించువాడు లోకనాథుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి 'ఉపతపతి' అన్న పదాన్ని తీసికొని ఇలా వ్యాఖ్యానించారు – అవుసరమైనట్లుగా శిక్షించి లోకాలను అదుపులో ఉంచేవాడు లోకనాథుడు.

ధర్మచక్రము రచయిత పై వ్యాఖ్యలను ఇలా సమన్వయపరచారు – భగవంతుడు లోకములకు ప్రభువు గనుక అందరినీ రక్షించేవాడు, శాసించేవాడు, అవుసరమైనపుడు శిక్షించేవాడు ఆ లోకనాథుడే. ధర్మాన్ని ఆచరించేవారు శాంతిగా జీవిస్తారు. అధర్మాన్ని ఆచరించేవారు అశాంతిలో మగ్గుతారు. లోకనాథుని పాలనలో ఇది సత్యము.

శ్రీ నరసింహస్వామి. 18వ శతాబ్దపు చిత్రం. వికీపీడియానుండి

741. మాధవః

- 'మా' అనగా శ్రీలక్ష్మీదేవికి పతియైనవాడు.
- తనను గురించిన జ్ఞానమును ప్రసాదించువాడు.
- మధువిద్యద్వారా తెలియవచ్చువాడు.
- మౌనము, ధ్యానము, యోగము ద్వారా తెలియవచ్చువాడు.
- మధు (యాదవ) వంశములో జన్మించినవాడు.
- ఈ నామముద్వారా జగన్మాతాపితరులకు విశ్వముతో ఉన్న సంబంధం సూచింపబడింది.
- ఆయనకంటె పై ప్రభువు లేడు.

ఓం మాధవాయ నమః

ఈ నామము 73, 169, 741వ నామములుగా మూడుమార్లు స్తుతింపబడినది.

8వ శ్లోకము. 73వ నామము. మాధవః – **హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః**

18వ శ్లోకము. 169వ నామము. మాధవః – **వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః**

78వ శ్లోకము. 741వ నామము. మాధవః – **లోకబంధుః లోకనాథో మాధవో భక్తవత్సలః**

లోకనాథత్వ సంబంధః శ్రీమతశ్చేతి మాధవః

మధోర్వంశోద్భవత్వాచ్చ మాధవః పరికీర్తితః

ఈతడు లక్ష్మీపతి కాబట్టి లోకనాథుడయ్యాడు. మధువంశంలో ఉద్భవించాడు. కనుక మాధవునిగా కీర్తింపబడుచున్నాడు.

మాయా ధవః మాధవః. 'మా'కు భర్త మాధవుడు.

'శ్రీ' మరియు 'హరి' సదా కలసి ఉంటారు. ఆయమ్మ నిత్యానపాయిని. ఈ విషయాన్ని నొక్కి వక్కాణించడం కొఱకు శ్రీ భట్టులు ఈ నామవివరణలో భగవంతుని గుణాలను గురించి ఎక్కువగా ప్రస్తావించకుండా శ్రీమహాలక్ష్మి గుణాలను విశేషంగా వర్ణించారు. మరియు వర్ణనను ఇలా ముగించారు – శ్రీమహావిష్ణువు లక్ష్మీవల్లభుడైనందున జగత్ప్రభువయ్యాడు. ఇదే శ్రీమహాలక్ష్మి తత్వరహస్యము. ఈ వివరణ అంతా 8వ శ్లోకంలోని 73వ నామము వ్యాఖ్యలో శ్రీ భట్టులు చెప్పారు. శ్రీ భట్టులు తమ వ్యాఖ్య వివరణను ఈ శ్రుతివాక్యాలతో ఆరంభించారు.

హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్నౌ – పురుష సూక్తము. భూమి మరియు లక్ష్మి నీ పత్నులు.

అస్యేశానా జగతో విష్ణుపత్నీ – నీలా సూక్తము. ఈమె (లక్ష్మి) జగత్తునకు అధినేత్రి. విష్ణుపత్ని.

తరువాత శ్రీ భట్టులు లక్ష్మీదేవి గుణగణాలను వర్ణించారు. **అస్యాః స్వరూపత్వాత్ నిత్య - నిర్మల - రూపత్వమ్, నిరుపాధిక పరమైశ్వర్యాది జగన్మాతృత్వమ్, ఔత్పత్తికో భగవత్ సంబంధో నిత్య అనపాయశ్చ ఇత్యాది తత్త్వపరేషు శాస్త్రేషు అమర్యాదమ్, వేదేషు తావత్ శ్రీసూక్తమ్, మేధాసూక్తమ్, ఉత్తర నారాయణమ్, కౌషీతకీ బ్రాహ్మణమ్ ఇత్యాదౌ.** శ్రీలక్ష్మీదేవి పరతత్వము శాస్త్రాలలో చెప్పబడినది. ఆమె నిత్య నిర్మల స్వరూపిణి. జగములనేలే తల్లి. సాటిలేని జగదధినేత్రి. సదా శ్రీవారితో కూడియుండే నిత్యానపాయిని. ఈ గుణాలు వేదాలలోను, శ్రీసూక్తము, మేధాసూక్తము, ఉత్తర నారాయణము, కౌషీతకీ బ్రాహ్మణము వంటి గ్రంధాలలో చెప్పబడినవి.

తరువాత శ్రీ భట్టులు పురాణాలనుండి ఉదాహరించారు –

విష్ణుపురాణము 1.8.17 – **నిత్యైవ ఏష విష్ణోః శ్రీరనపాయినీ యథా సర్వగతో విష్ణుః తథైవేఽయమ్ ద్విజోత్తమ.** ఓ బ్రాహ్మణోత్తమా! ఆ లక్ష్మీదేవి నిత్యమైనది (సదా ఉండునది). జగన్మాత. సదా విష్ణువుతో కూడియుండును. విష్ణువులాగానే ఆమె కూడా అంతటా వ్యాపించియున్నది.

బ్రహ్మ పురాణము – **తత్ శక్తిః దుర్జయా భీమా విష్ణుశక్తిః ఇతి స్మృతా సర్వభూత హృదబ్జస్థా నానారూపధరా పరా ప్రాణాఖ్యా మంత్రమాతా చ విశ్వస్య జననీ ధ్రువా దేవీ భిన్నాంజన శ్యామా నిర్గుణా వ్యోమ ఏవ హి.** ఆ శక్తి

జయింపరానిది. భీకరమైనది. ఆమెయే విష్ణువునకు శక్తిగా చెప్పబడినది. ఆ పరాశక్తియే అందరి హృదయకమలములందును స్థితమైయున్నది. నానారూపములు ధరించినది. ఆమె పేరే ప్రాణము. ఆమె అన్ని మంత్రములకును తల్లి. జగన్మాత.

తథైవైక పరాశక్తిః శ్రీః తస్య కరుణాశ్రయా
జ్ఞానాది షడ్గుణ్య మయీ ప్రోక్తా ప్రకృతిః పరా
ఏకైవ శక్తిః శ్రీః తస్య ద్వితీయా పరివర్తతే .....
పరావరేణ రూపేన సర్వాకారా సనాతనీ
అనంత నామధేయా చ శక్తి చక్రస్య నాయికా
జగత్ చరాచరమ్ ఇదమ్ సర్వమ్ వ్యాప్య వ్యవస్థితా

ఇంకా,లక్ష్మియే పరాశక్తి. కరుణామయి. ఆమెయే షడ్గుణ్యమయమైన పరాప్రకృతి అని పిలువబడినది. ఆ శక్తియే భగవతుని శాశ్వతమైన ఏకైక శక్తి. ఆ శ్రీశక్తియే భగవంతుని ద్వితీయరూపము మరియు అనేక రూపములు దాల్చునది. అనేకములైన పేర్లు కలిగినది. శక్తిచక్రమునకు నాయిక. సకల చరాచర జగత్తునందు వ్యాపించియున్నది.

శ్రీ లక్ష్మీసహస్ర నామము –

మహావిభూతేః సంపూర్ణ షడ్గుణ్య వపుషః ప్రభోః
భగవద్వాసుదేవస్య నిత్యైవ ఏష అనపాయినీ
ఏకైవ వర్తతే భిన్నా జ్యోత్స్నేవ హిమదీధితేః
సర్వ శక్త్యాత్మికా చైవ విశ్వమ్ వ్యాప్య వ్యవస్థితా
సర్వైశ్వర్య గుణోపేతా నిత్యమ్ తద్ధర్మ ధర్మిణీ
ప్రాణశక్తిః పరాహ్యేషా సర్వేషామ్ ప్రాణినామ్ భువి
శక్తీనామ్ చైవ సర్వాసామ్ యోనిభూతా పరాకళా

ఆమె సంపూర్ణ షడ్గుణ్య పరిపూర్ణుడైన వాసుదేవ భగవానునకు నిత్యానపాయిని. చల్లని వెన్నెలవలె ప్రకాశించునది. భగవంతునితో ఐక్యమైకూడా వేరుగా కనుపిస్తుంది. జగత్తంతా వ్యాపించినది. సకలశక్తి స్వరూపిణి. సర్వైశ్వర్య గుణోపేత. భగవద్ధర్మమే ఆమె ధర్మము. సకల జీవులకును ప్రాణశక్తి ఆమెయే. పరాకళ.

యస్మాత్ లక్ష్మ్యంశ సంభూతాః శక్తయో విశ్వగః సదా
కారణ్యత్వేన తిష్ఠంతి జగత్యస్మిన్ తదాజ్ఞయా
తస్మాత్ ప్రీతా జగన్మాతా శ్రీః యస్య అచ్యుతవల్లభా
సుప్రీతాః శక్తయః తస్య సిద్ధిమ్ ఇష్టామ్ దిశంతి చ

శ్రీలక్ష్మి అంశనుండి ఉద్భవించిన శక్తులు విశ్వమంతా వ్యాపించియున్నవి. ఆమె ఆజ్ఞానుసారం వర్తిస్తున్నాయి. అచ్యుతవల్లభయైన జగన్మాత శ్రీలక్ష్మి గనుక ప్రీతినొందితే ఆ శక్తులు కూడా ప్రీతినంది మనకు ఇష్టమైన సిద్ధులను ప్రాదించును.

ఇలా శ్రీలక్ష్మి గుణాలను గురించి వివరంగా వ్రాసిన తరువాత శ్రీ భట్టులు మరింత సమాచారం వైష్ణవస్మృతిలోనూ, ఇతర ధర్మశాస్త్రాలలోనూ ఉన్నదని వ్రాశారు.

రామాయణం. బాలకాండ 4.7 – **రామాయణమ్ కావ్యమ్ కృత్స్నమ్ సీతాయాః చరితమ్ మహత్.** రామాయణ కావ్యము సీతాదేవియొక్క మహత్తర చరితమును తెలుపుచున్నది.

ఇలా శ్రీ భట్టులు తమ 73వ నామము (8వ శ్లోకము) వ్యాఖ్యలో శ్రీమహాలక్ష్మి గుణాలను విపులంగా వర్ణించారు. తమ వ్యాఖ్య ముగింపులో 'మాధవ' నామము గురించి ఒక్క వాక్యం మాత్రం వ్రాశారు.

శ్రద్ధయా దేవో దేవతమ్ అశ్నుతే. లక్ష్మీదేవితో కూడియున్నందున భగవంతునికి జగత్పతిత్వము లభించినది. ఇదే 'శ్రీ' తత్వము యొక్క రహస్యము.

8వ శ్లోకంలోని 73వ నామమునకు ఇలా శ్రీ భట్టులు విస్తారమైన వ్యాఖ్యను వ్రాశారు. అయితే 169వ, 741వ నామములకు చాలా క్లుప్తంగా వ్యాఖ్యానించారు. 'మాధవ' నామంలో శ్రీమహాలక్ష్మి తత్వానికి శ్రీ భట్టులు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

మా – హరిని గురించిన విద్య.
ధవ – ప్రభువు, ప్రసాదించేవాడు.
మాధవుడు – తనను గురించిన జ్ఞానాన్ని ప్రసాదించేవాడు.
18వ శ్లోకంలోని 169వ నామమునకు శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడా 'హరిని గురించిన విద్యను అనుగ్రహించేవాడు మాధవుడు' అన్న అర్థం చెప్పారు. ఇద్దరూ హరివంశము (3.69.4)నుండి ఉదాహరించారు.
మా విద్యా చ హరేః ప్రోక్తా తస్యా ఈశో యతో భవాన్
తస్మాత్ మాధవ నామాసి ధవః స్వామీతి శబ్దితః

శ్రీ చిన్మయానంద – ముముక్షువులలో ఆత్మవివేచన, ధ్యానములను పెంపొందించేవాడు మాధవుడు.

శ్రీ భట్టులు మహాభారతం (3.69.4)నుండి కూడా ఉదాహరించారు,

మధువిద్యా అవబోధత్వాత్ ధావత్వాత్-వా శ్రియోఽనిశమ్
మౌనాత్ ధ్యానాచ్చ యోగాచ్చ విద్ధి భారత మాధవమ్

ఈ శ్లోకంలో 'మాధవ' నామమునకు మూడు అర్థాలు చెప్పబడ్డాయి. (1) మధువిద్యద్వారా తెలియవచ్చువాడు మాధవుడు. (2) శ్రీని ధరించినవాడు మాధవుడు. (3) ధ్యానము, మౌనము, యోగములద్వారా తెలియవచ్చువాడు మాధవుడు.

(1) మధువిద్యద్వారా తెలియవచ్చువాడు మాధవుడు. ఛాందోగ్యోపనిషత్తు (3.1), బృహదారణ్యకోపనిషత్తు (2.51)లలో మధువిద్యగురించి ఉన్నది.

(డా. క్రోవి పార్థసారథి రచించిన 'శ్రీకైవల్యసారథి' నుండి) ఆదిత్యునియందు మధువును ఆరోపించి, ఆవిధంగా ఆదిత్యుని ఉపాసించడమే మధువిద్య. ఈ విద్య హిరణ్యగర్భునినుండి ప్రజాపతికి, అతను మనువునకు, మనువు ఇక్ష్వాకునికి చెప్పారు. అరుణుని జ్యేష్ఠపుత్రుడైన ఉద్దాలకుడికి అతని తండ్రి ఈ బ్రహ్మ విజ్ఞానాన్ని చెప్పాడు.

సూర్యుడు దేవతలకు మధువువలె తృప్తిపరచేవాడు స్వర్గలోకం తేనెపట్టుకు కర్రలాంటిది. అంతరిక్షం తేనెపట్టులా వ్రేలాడుతుంది. ఋక్కులే తేనెటీగలు. ఆదిత్యుని మధ్య చలిస్తున్నట్లు కనిపించే భాగమే మధువు. వేదాదులే అమృతాలు. మొదటి అమృతాన్ని అగ్నిదేవునిద్వారా వసువులు అనుభవిస్తారు. రెండవ అమృతం ఇంద్రుడు ప్రధానంగాగల రుద్రగణం చేత అనుభవింపబడుతుంది. మూడవ అమృతం వరుణుడు ప్రధానుడుగా ఆదిత్యగణంచేత అనుభవింపబడుతుంది. నాల్గవ అమృతం సోముడు ప్రధానంగా మరుద్గణం చేత అనభవింపబడుతుంది. ఐదవ అమృతం బ్రహ్మ ప్రధానుడుగా సాధ్యులచే అనుభవింపబడుతుంది.

సూర్యుడు ఉదయాస్తమయాలద్వారా జీవులకు వాటి కర్మఫలాలు అందిస్తూ, ఆ కర్మలు క్షయం అయిన తరువాత తనలో లీనం చేసుకుంటాడు. జ్ఞానులైనవారు పైన చెప్పిన వసు, రుద్ర, ఆదిత్య, మరుత్ గణాలులాగా అమృతాన్ని అనుభవించి సూర్యునితో అభేదాన్ని పొందుతారు.

(2) శ్రీని ధరించినవాడు మాధవుడు. ఈ అర్థానికి వివరణ ముందుగా చెప్పడమైనది.

(3) ధ్యానము, మౌనము, యోగము ద్వారా తెలియవచ్చువాడు మాధవుడు. ధర్మచక్రము రచయిత ఈ విషయాన్ని మరింత వివరించారు. మౌనమువలన ఇంద్రియాలు అదుపులో ఉంటాయి. ధ్యానమువలన ఆత్మతత్వముపై మనసు కేంద్రీకృతమౌతుంది. యోగమువలన ఈ నిగ్రహము స్థిరపడుతుంది.

ఈ 741వ నామమునకు శ్రీ భట్టులు, శ్రీ శంకరులు కూడా 'మధువంశములో పుట్టినవాడు మాధవుడు' అని వ్యాఖ్యానించారు. **మధుకులోద్భవత్వాత్ మాధవః**. లేదా, **మధుకులే జాతత్వాత్ మాధవః**.

శ్రీ భట్టులు చెప్పిన మరొక వివరణ ప్రకారం లక్ష్మీనారాయణులు లోకములకు తల్లిదండ్రులు అనీ, లోకాలను రక్షించేవారు అనీ ఈ నామము సూచిస్తున్నది. వారికి ఈ లోకాలతో ఉన్న ప్రత్యేకమైన అనుబంధం ఈ అర్థం

ద్వారా వ్యక్తమౌతున్నది. అమ్మవారు తోడుగా ఉండడంవల్లనే బద్ధచేతనులు ఒనరించే అనేకములైన అపచారములను శ్రీదేవుడు మన్నిస్తుంటాడు.

శ్రీ తిరుక్కళ్ళమ్ నృసింహరాఘవాచార్య గీతాభాష్యములో – **మా ధవః యస్య స మాధవః** – అని చెప్పారు. ఆయనకు ప్రభువు లేడు గనుక మాధవుడు. ఎందుకంటే అందరికీ ఆయనే ప్రభువు.

742. భక్తవత్సలః

- భక్తులపట్ల విశేషముగా ప్రేమ కలిగినవాడు.
- యజ్ఞములో భక్తులు సమర్పించినవాని కొఱకు తానై వారివద్దకు వెళ్ళేవాడు.
- భక్తులను తనవద్దకు కొనిపోయేవాడు. ఆవుకు దూడవలె భగవంతునికి భక్తులు ప్రియమైనవారు.

ఓం భక్తవత్సలాయ నమః

భజ్ - సేవాయామ్ - సేవించుట, గౌరవించుట.

భజతి భజతే సేవతే ఇతి భక్తః (కాశకృత్స్న ధాతువ్యాఖ్యానము 1.695)

వత్స - లేగదూడ; వత్సల - **వత్స అంశాభ్యామ్ కామబలే** (పాణిని 5.2.98)

వత్సల - కామవత్, స్నేహవత్ - ప్రేమ, స్నేహ సూచకము; భక్తవత్సల - భక్తులయెడల ప్రేమకలవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతునికి భక్తులపట్ల ఉన్న వాత్సల్యము అనన్యము. ఈ నామముద్వారా భగవంతునికి భక్తులయెడ ఉన్న విశేష భావము తెలియవస్తున్నది. భక్తులు లభించినపుడు భగవానుడు ఎంతగా సంతోషిస్తాడంటే ఆయనకు వేరేమీ గుర్తు రావు (**తల్లాభ సంభ్రమ విస్మృత అన్య కామః**). కనుక ఆయన భక్తవత్సలుడు.

శ్రీ వి.వి. రామానుజన్ ఈ భావాన్ని ఉదాహరణలతో మరింత వివరించారు – 'వత్సము' అనగా లేగదూడ. దూడపై ఉన్న మాలిన్యాన్ని ఆవు నాలుకతో నాకి శుభ్రం చేస్తుంది. అంటే ఆ మాలిన్యముకూడా భోగ్యముగా భావిస్తుంది. అలాగే భగవంతునికి భక్తులపై ఉన్న ప్రేమ ఎలాంటిదంటే భక్తుల అపరాధాలను నిరంతరం భగవంతుడు మన్నిస్తూనే ఉంటాడు. విదురుని ఆతిథ్యాన్ని శ్రీకృష్ణుడు స్వీకరించినపుడు, భక్తపారవశ్యంలో విదురుడు చూచుకొనకుండా అరటిపండి తొక్కనే నైవేద్యంగా సమర్పించాడట. స్వామి కూడా వేరాలోచించకుండా ఆ తొక్కనే స్వీకరించాడు. ఎందుకంటే అది భక్తితో సమర్పించినది. తినదగినదా కాదా అని భగవంతునికి భేదం లేదు. భీష్ముడు అంపశయ్యపై ఉన్నప్పటి సంగతి. ఒకమారు శ్రీకృష్ణుడు పాండవులతో, పురుషసింహమైన భీష్ముడు నన్ను తలచుచున్నాడు – అని ఒక్కసారి మైమరచిపోయాడట.

భక్తులపట్ల వాత్సల్యం కలవాడు – అనే ఈ అర్థానికి తోడుగా శ్రీ సత్యసంధ యతిరాజ మరో రెండు అర్థాలను చెప్పారు –

(1) భక్త - ఉడికిన అన్నము, యజ్ఞములో సమర్పించినది; సలతి - వెళ్ళుట, అందుకొనుట; భక్తవత్-సలః - యజ్ఞములో సమర్పించినదాని కొరకు వెళ్ళేవాడు. **భక్తమ్ అన్నమ్ యేషామ్ అస్తి ఇతి భక్తవంతో యజ్ఞకర్తారో బ్రాహ్మణాన్, తన్ ప్రతి సలతి గచ్ఛతి ఇతి భక్తవత్సలః**. యజ్ఞముద్వారా భక్తులు తనకు అర్పించినదానిని అందుకోవడానికి భగవంతుడు స్వయంగా భక్తులవద్దకు వెళతాడు గనుక భక్తవత్సలుడు.

(2) **భక్త ఏవ వత్సః, తాన్ లాతి ఇతి భక్తవత్స-లః**; లా - ఆదానే దానేచ - తీసికొనుట, లాగుట. ఆవునకు దూడవలె భగవంతునకు భక్తులు ప్రియమైనవారు. వారిని భగవంతుడు తనవద్దకు తీసికొనును. కనుక ఆయన భక్తవత్సలుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సువర్ణవర్ణో హేమాంగో వరాంగశ్చందనాంగదీ |
వీరహా విషమః శూన్యో ఘృతాశీరచలశ్చలః || (79)

743. సువర్ణవర్ణః

బంగారు రంగు కలవాడు.

ఓం సువర్ణవర్ణాయ నమః

గుణవత్స్వర్ణ నికష నిర్దోషోజ్వల వర్ణతః
సువర్ణవర్ణ ఇత్యుక్తః నవార్ణో భక్తకామదః.
గుణాలకు తగినట్లుగానే బంగారములాగా మెరిసే దేహము కలవాడు. ఈ నామము నవాక్షరీ మంత్రము. అభీష్టప్రదము. ఓం సువర్ణవర్ణాయ నమః.

శోభన వర్ణ సువర్ణ, సువర్ణమివ వర్ణమ్ యస్య స సువర్ణవర్ణః. స్వచ్ఛత, కాంతి, ఇతరులచే కోరబడుట – ఇవన్నీ బంగారపు లక్షణాలు. ఈ నామము ద్వారా భగవంతుని శుద్ధ సాత్వికత, ఆయన కాంతిమత్వము, భక్తులచే కోరబడుట వంటి గుణాలు తెలుపబడినవి.
తమ పారవశ్యంలో భగవంతుని వర్ణించడానికి ఆళ్వారులు ఈ నామమువంటి వర్ణనలు ఎన్నో వాడారు –
శ్రీ తిరుమంగైయాళ్వారు. తిరుక్కుమ్ దండకము (6) – మధురమైన గీతం, క్రొత్త తేనె, మెరిసే బంగారము, నిత్యసూరులు తమ తలపై ధరించే పూవు .....
శ్రీ నమ్మాళ్వారు. తిరువిరుత్తమ్ (85) – మూడులోకాలను కొలిచిన మాణిక్యము! నా ప్రియమైన మరకతము. సాటిలేని స్వచ్ఛమైన పసిడి!.

శ్రీ తిరుమంగైయాళ్వారు. పెరియతిరుమొళి (4.9.8) – (త్రేతాయుగంలో) నీది బంగారురంగు! (ద్వాపర యుగంలో) నీలం!.

శ్రీ భట్టులు శ్రుతులు, స్మృతులనుండి ఆధారాలు చెప్పారు –
యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణమ్ కర్తారమ్
ఈశమ్ పురుషమ్ బ్రహ్మయోనిమ్ – ముండకోపనిషత్తు 3.3
ద్రష్టయగు ఏ జీవుడు తనయందున్న బంగారువర్ణముగల నిజరూపమును దర్శించుచున్నాడో అప్పుడాతడు పుణ్యపాపవర్జితుడై అద్వైతసిద్ధిని పొందుచున్నాడు.

ప్రశసితారమ్ సర్వేషామ్ అణీయాంసమ్ అణోరపి
రుక్మాభమ్ స్వపన ధీగమ్యమ్ విద్యాత్తమ్ పురుషమ్ పరమ్ – మనుస్మృతి 12.122
అందరినీ శాసించే పరమపురుషుడు సూక్ష్మాతిసూక్ష్మరూపుడై బంగారురంగులో ప్రకాశించుచున్నాడు. ధ్యానమగ్నులైన విజ్ఞులు మాత్రమే ఆ పరమపురుషుని ధ్యానించగలరు.

ఆదిత్యవర్ణమ్ – పురుషసూక్తము 20

య ఏషోన్తరాదియే హిరణ్మయః పురుషోదృశ్యతే
హిరణ్యస్మశ్రుః హిరణ్యకేశ ఆ ప్రణకాత్ సర్వ ఏవ సువర్ణః – ఛాందోగ్యోపనిషత్తు 1.6.6
సూర్యమండలము మధ్య దర్శనమిచ్చే సువర్ణపురుషుడు బంగారురంగు గడ్డము, బంగారు కేశములు, మొత్తం గోళ్లవరకూ కూడా బంగారురంగు కలిగియున్నాడు.

శ్రీ చిన్మయానంద – ఈ ప్రకాశవంతమైన పరమపురుషుని దర్శించిన ముని అన్ని విధములైన మాలిన్యములనుండి విముక్తుడై సమభావత్వమును పొందును.

శ్రీసూక్తంలో అమ్మవారినికూడా **'హిరణ్యవర్ణాం హరిణీం'** అని ప్రస్తుతించారు. సుందరకాండము (36.28)లో సీతమ్మవారు శ్రీరాముని ముఖాన్ని ఇలా వర్ణించారు – **కచ్చిన్న తద్-హేమ సమాన వర్ణమ్ తస్యాననమ్ పద్మసమానగంధి...** బంగారువన్నెతో పద్మపరిమళములతో ఆహ్లాదకరమైన ఆ శ్రీరాముని ఆననము...

744. హేమాంగః

బంగారురంగు గల అవయవములతో శోభిల్లువాడు.

ఓం హేమాంగాయ నమః

వర్ణాశ్రయం తు యస్యాంగం దివ్యసత్వమయం యతః

తతో హేమాంగ ఇత్యుక్తః సప్తార్ణో హేమవర్ణతః

బంగారు వర్ణానికి ఆధారమై, దివ్యమైన శుద్ధసత్వమయమై ప్రకాశించే శరీరము కలవాడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. బంగారురంగు నిస్తుంది. ఓం హేమాంగాయ నమః.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ చెప్పిన నిర్వచనము –

హిన్వన్తి వర్ధయన్తి శోభామితి హేమాని

తదృశాని అంగాని యస్య ఇతి హేమాంగః

బంగారు రంగుతో ఉండి తన అందాన్ని, తిరుమేణి శోభను వర్ధిల్లజేసే శరీరావయవములు కలవాడు హేమాంగుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారం ఈ నామము భగవంతునియొక్క శాశ్వత, దివ్య, శుద్ధ సత్వదేహమును సూచిస్తుంది. **నిత్యమ్, దివ్యమ్, సత్త్వమయమ్ అంగమ్ అస్య ఇతి హేమాంగః.**

ఇంతకు ముందటి నామము **'సువర్ణవర్ణః'** మరియు ఈ నామము **'హేమాంగః'** అనుబంధ నామములు అనుకొనవచ్చును. కనుక ప్రమాణములు కూడా రెండింటికీ వర్తిస్తాయి. ఇంతకుముందు చెప్పినవే కాక మరొక ప్రమాణం సంధ్యావందనమంత్రంలో ఉంది – **ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ ... హిరణ్మయవపుః ధృతశంఖచక్రః.**

య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయవపుః – ఛాందోగ్యోపనిషత్తు – సూర్యమండలం మధ్యవర్తియై భాసించుచున్న సువర్ణమయ దివ్యపురుషుడే పరమాత్మ.

745. వరాంగః

- దేవకీ వసుదేవుల కోరికను తీర్చడానికి తన దివ్యమంగళ విగ్రహముగా సాక్షాత్కరించినవాడు.
- శ్రేష్ఠమైన, సుందరమైన ఉత్తమ సాముద్రికములైన అంగములు కలవాడు.
- తనను ధ్యానించేవారికి ఆనందం కలిగించే రమణీయమైన రూపం కలిగినవాడు.

ఓం వరాంగాయ నమః

వర = ఉత్తమమైన, శ్రేష్ఠమైన, అతి సుందరమైన

వర = వరము (ఇచ్చుట)

వర = కోరిక (కోరుట), ప్రార్ధన

ఈ అర్థాలనుబట్టి వ్యాఖ్యలలోని వైవిధ్యాన్ని చూడవచ్చును.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'వర' అనగా 'ప్రార్థన' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **తదేతత్ ఔపనిషదమ్ దేవక్యా ప్రియమానమ్ అతినిహ్నుత దివ్యచిహ్నమ్ ఆవిష్కృతమ్ ఇతి వరాంగః.** దేవకీదేవి ప్రార్థనలను కరుణించి, సామాన్యచక్షువులకు కనిపించని దివ్యచిహ్నలతో సాక్షాత్కరించినవాడు వరాంగుడు.

దేవతా ప్రీతయే గుప్త దివ్య లాంఛన మంగళమ్

ఆవిష్కృతమ్ స్వతో యేన వరాంగ స్స తు కథ్యతే

దేవతలయందలి ప్రీతిచేత వారి కోరికలు తీర్చడంకోసం, తన దివ్యలక్షణాలతో కూడిన దివ్యమంగళ విగ్రహముగా దేవకీవసుదేవులకు సాక్షాత్కరించినవాడు వరాంగుడు.

ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణము (5.3.8)నుండి ఉదాహరించారు –

ఫుల్లేందీవర పత్రాభం చతుర్బాహుమ్ ఉదీక్ష్య తమ్

శ్రీవత్స వక్షసమ్ జాతమ్ తుష్టావ ఆనక దుందుభిః

వికసించిన నల్లకలువవంటి వర్ణము కలవాడై, చతుర్బాహువులతోను, శ్రీవత్సముతోను అవతరించిన ఆ బిడ్డను చూచి దేవకీవసుదేవులు పరిపరివిధాల స్తోత్రం చేశారు (ఆనక దుందుభి = వసుదేవుడు?).

నీలమేఘచ్ఛాయతో, చతుర్భుజాలతో, గదా శంఖ చక్ర పద్మాలు గల హస్తాలతో, కౌస్తుభమణితో, కమనీయమైన సూత్రంతో శ్రీవత్సలాంఛనంతో శ్రీహరి జన్మించాడు.

(పోతన భాగవతము)

బాలు బూర్ణేందు రుచిజాలు భక్తలోక

పాలు సుగుణాలవాలు గృపావిశాలు

జూచి తిలకించి పులకించి చోద్యమంది

యుబ్బి చెలరేగి వసుదేవుడుత్సహించె

అపుడు దేవకీదేవి స్వామిని ఇలా స్తుతించింది –

ఒంటి నిల్చి పురాణయోగులు యోగమార్గ నిరూఢులై

కంటిమందురు గాని నిక్కము గానరీ భవదాకృతిన్

గంటి భద్రముగంటి మాంపు గన్నులు గనబోలదీ

తొంటిరూపు దొలంగబెట్టుము తోయజేక్షణ మ్రొక్కెదన్

వసుదేవుని స్తుతి –

సర్వము నీలోనిదిగా

సర్వాత్ముడవాది వస్తు సంపన్నుడవై

సర్వమయుడవగు నీకును

సర్వేశ్వర! లేవు లోను సంధులు వెలియున్

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ‘వర’ అనగా ‘అందమైన, శ్రేష్ఠమైన’ అనే అర్థాన్ని బట్టి వ్యాఖ్యానించారు. **వరాణి శోభనాని అంగాని అస్య ఇతి వరాంగః.** సుందరమైన అంగములు కలవాడు వరాంగుడు.

శ్రీ చిన్మయానంద – (వర = ఆనందము కలిగించే) తనను ధ్యానించేవారికి ఆనందము కలిగించే రూపు కలవాడు వరాంగుడు.

అన్నమయ్య కీర్తన –

కంటి శుక్రవారము గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండ నుండే స్వామిని || కంటి ||

సొమ్ములన్నీ కడబెట్టి సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు రొమ్ముతల మొలచుట్టి
తుమ్మెద మైచాయతోన నెమ్మది నుండే స్వామిని || కంటి ||

పచ్చకప్పురమె నూఱి పసిడి గిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగనలది
అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై
నిచ్చెమల్లెపూవు నలె నిటు తానుండే స్వామిని || కంటి ||

తట్టు పునుగే కూరిచి చట్టలు చేరిచినిప్పు
పట్టి కరగించి వెండి పళ్యాల నించి
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియు చుండే బిత్తరి స్వామిని || కంటి ||

భగవానుని సౌందర్యాన్ని వర్ణించే మూడు నామములు ఇక్కడ వరుసగా వచ్చాయి – **సువర్ణవర్ణః, హేమాంగః, వరాంగః.** ఈ మూడు నామాలలోని సున్నితమైన భేదాలను శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఇలా వివరించారు.

సువర్ణవర్ణః – సహజంగా నిర్మల దీప్తిమంతమైన రూపం కలిగినవాడు.
హేమాంగః – అందరినీ ఆకర్షించే సుందరమైన అవయవములు కలవాడు.
వరాంగః – శ్రేష్ఠమైన సాముద్రిక లక్షణాలు అన్ని ఒకేరూపంలో కలిగినవాడు.

ధర్మచక్రము రచయిత – సామాన్యమైన సౌందర్యమువలన కామం కలుగుతుంది. భగవానుని దివ్యసౌందర్యంవలన భక్తి కలుగుతుంది. శ్రీమహావిష్ణువు దివ్యసౌందర్యాన్ని వర్ణించే ఈ మూడు దివ్యనామములు స్మరించి భక్తితో ఆయనను ధ్యానింపనగును.

746. చందనాంగదీ

- ఆహ్లాదకరమైన, సుందరమైన కేయూరమును ధరించినవాడు.
- ఆహ్లాదకరమైన చందనమును పూసికొనియున్నవాడు.
- మనందరికీ సంతోషమును కలిగించే మార్గాలు ప్రసాదించేవాడు.
- తనకు సంతోషం కలిగంచే 'అంగదుడు' అనే భక్తుని కలిగినవాడు.

ఓం చందనాంగదినే నమః

చంద్ – ఆహ్లాదే, దీప్తౌచ – సంతోషం కలిగించు, ప్రకాశించు

చందన – చందత్యే అనేన, చందయతి వా యత్ తత్ చందనమితి – ఆనందం కలిగించేది

అంగద – అంగం దయతే, దాయతి, ద్యాతి వా – అంగమును రక్షించేది, శుద్ధి పరచేది, విభజించేది

పైచేయి (భుజము, మోచేయి మధ్యభాగము)ను రక్షించుకోవడానికి వాడే ఆభరణవిశేషమును 'అంగదము' లేదా 'కేయూరము' అంటారు.

చందన - అంగది – ఆనందం కలిగించే ఆంగదమును ధరించినవాడు.

భూషణాన్యంగదాదీని సదాహ్లాదకరాణి చ
సంతి యస్య చ నిత్యస్తు స స్మృత శ్చందనాంగదీ
ఆనందప్రదమైన అంగదాధి ఆభరణములు ధరించినవాడు చందనాంగది.

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము భగవంతుని శరీరమే అనంతసౌందర్యము కలిగిన ఆభరణము. భగవంతుని శరీరమును అలంకరించిన కారణముగా అంగదము (కేయూరము)వంటి ఆభరణాలు ఆహ్లాదకరమైన గుణాన్ని సంతరించుకుంటాయి. ఇక్కడ అంగదము (కేయూరము) ఒక ఉదాహరణ మాత్రమే. శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 2.5.6 – భగవంతుని శరీరంపైనున్న ఆభరణాలను లెక్కించలేము. ఇంకా శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి పాశురము 8.8.1లో భగవానుని ఆభరణాల అనంతసౌందర్యమును ఎంతో చక్కగా వర్ణించారు.

శ్రీ వైకుంఠగద్యములో శ్రీ భగవద్రామానుజులు భగవంతుని తిరుమేణిని ఇలా వర్ణించారు – **అతి మనోహర కిరీట చూడావతంసక మకరకుండల గ్రైవేయక హార కేయూర కటక శ్రీవత్స కౌస్తుభ ముక్తాదామ ఉదరబంధన పీతాంబర కాంచీగుణ నూపురాదిభిః అత్యంత సుఖస్పర్శైః దివ్యగంధైః భూషితమ్.**

శ్రీ అనంతరామకృష్ణ శాస్త్రి – చందనము = గోపీచందనము, గంధము. భగవంతుడు తన శరీరముపై ఆహ్లాదకరమైన చందనమును ధరించియున్నాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – చందన - సంతోషము కలిగించే; అంగద - (అంగ్) వెళ్ళుట; **ఆహ్లాదకరీమ్ గతిమ్ యో దదాతి.** సంతోషంగా ఉండే అవకాశాలను కలిగించేవాడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – చందన = సంతోషము కలిగించే, భక్తి కలిగిన; అంగదుడు = వాలికొడుకు; సంతోషము కలిగించే అంగదుడు తన భక్తునిగా కలిగినవాడు చందనాంగది.

ధర్మచక్రము రచయిత – భగవంతుని ధ్యానించడంవల్ల మానసికశాంతి లభిస్తుంది.

అన్నమయ్య కీర్తన –

చూడ జూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి
యాడులేని కన్నులెన్నులవె యిన చంద్రులు ||చూడ జూడ||

కంటి గంటి వాడె వాడె ఘనమైనముత్యాల
కంఠమాలలవే పదకములు నవె
మింటి పొడవైనట్టి మించు గిరీటం బదె
జంటల వెలుగు శంఖచక్రాలవె ||చూడ జూడ||

మొక్కు మొక్కు వాడె వాడె ముందరనే వున్నాడు
చెక్కులవే నగవుతో జిగిమోమదె
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె ||చూడ జూడ||

ముంగై మురాలును నవె మొల కఠారును నదె
బంగారునిగ్గులవన్నె పచ్చబట్టదె
ఇంగితమెరిగి వేంకటేశుడిదె కన్నులకు
ముంగిట నిధానమైన మూలభూత మదే ||చూడ చూడ||

747. వీరహా

- బలవంతులైన రాక్షసులను సంహరించినవాడు.
- వ్యర్థవాదాలు చేసి భక్తుల ధ్యానాన్ని కలతపరచేవారిని నశింపజేయువాడు.
- యమపాశములను నాశనము చేయువాడు.
- జీవులను మోక్షంవైపు నడిపించువాడు.

- రాక్షస సంహారంలో గరుడుడు, వాయువు తనకు తోడుగా కలిగినవాడు.

- పునర్జన్మను హరింపజేయువాడు.

ఓం వీరఘ్నే నమః

ఈ నామము 168, 747, 927వ నామములుగా మూడుమార్లు వస్తుంది.

18వ శ్లోకము. 168వ నామము. వీరహా – **వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః**

79వ శ్లోకము. 747వ నామము. వీరహా – **వీరహా విషమః శూన్యో ఘృతాశీరచలశ్చలః**

99వ శ్లోకము. 927వ నామము. వీరహా – **వీరహా రక్షణస్సంతో జీవనః పర్యవస్థితః**

వీరయతి ఇతి వా వీరః. శత్రువులపై యుద్ధంలో బలాన్ని, పరాక్రమాన్ని ప్రదర్శించేవాడు వీరుడు. అమరకోశం ప్రకారం – **విరుద్ధాని రాతి హన్తి ఇతి వీరః**. శత్రువులను నాశనం చేసేవాడు వీరుడు. అయితే వీరులంతా ధర్మపరులు కారు. అధర్మాన్ని ఆచరించే వీరులను సంహరించే వీరఘ్నుడు భగవంతుడు. బలంకలిగి, అమాయకులను బాధించేవాడు అపరాధి. అటువంటి అపరాధి భగవంతునిచేత హతం అవుతాడు. వ్యాకరణపరంగా 'వీరహా'. 'కామహా' వంటి పదాలలో 'హా' భూతకాలాన్ని సూచిస్తుంది. నాశనం చేసినవాడు అని (పాణిని సూత్రం 3.2.87).

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సమూలం పూతనాదీన్వై యో జఘాన వీరహా.** పూతన, శకటాసురుడు వంటి రాక్షసులను సంహరించినవాడు. బాలకృష్ణుడు. వీరఘ్నుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 5.3.8 – పూతన, శకటాసురుడు, జంటవృక్షాలు, బకాసురుడు, కువలయాపీడము వంటివానిని సంహరించి, ఆపై బాలకృష్ణుడు తన ఎర్రని పెదాలమధ్య తెల్లని పలువరుస చూపుతూ చిద్విలాసంగా నవ్వాడు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన నిర్వచనము – **విరుద్ధ గతీన్ హన్తి ఇతి వీరహా**.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **విశేషేణ ఈరయన్తి క్షిపన్తి ధర్మమార్గమ్ ఇతి వీరాః కంస రావణ ప్రభృతయః; తాన్ వీరాన్ హన్తి ఇతి వీరహా.** ధర్మమార్గాన్ని విడచి చరించే కంస రావణాదులను సంహరించేవాడు 'వీరహా'.

శ్రీ భట్టులు చెప్పిన మరొక వ్యాఖ్య – **స్వవేదన విహంత్యాన్ హైతుక - వీరాన్ హతవాన్ ఇతి వీరహా**. భాషలో ప్రావీణ్యం కలిగి ఉండి, తమ పాండిత్యాన్ని వ్యర్థవాదాలకు వినియోగిస్తూ, భక్తుల ధ్యానక్రియను భంగపరచేటటువంటి శుష్కపండితులను నాశనం చేసేవాడు 'వీరహా'.

శ్రీ భట్టులు చెప్పిన మరొక వ్యాఖ్య (927వ నామమునకు) – గజేంద్రునకు యమపాశములను తొలగించినవాడు 'వీరహా'. **మోక్షయామాస నాగేంద్రమ్ పాశేభ్యః శరణాగతమ్** (విష్ణుధర్మము 69).

నిరుక్తి – **వీరమ్ తద్బాధకమ్ మృత్యుమ్ హతవాన్ వీరహా మతః.**

శ్రీ శంకరులు చెప్పిన ఒక వ్యాఖ్య ప్రకారం భగవంతుడు అసురవీరులను సంహరించేవాడు గనుక 'వీరహా'. ఇది ఇంతకుముందు వ్రాసిన శ్రీ భట్టుల వ్యాఖ్యకు సరిపోతుంది.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – **వివిధాః సంసారిణామ్ గతీః ముక్తిప్రదానేన హన్తి ఇతి వీరహా** (హన్-వెళ్ళుట). సంసారులు అధర్మమార్గము పట్టకుండా వారిని మోక్షగాములు చేసేవాడు 'వీరహా'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఈర్-గతౌ-వెళ్ళుట; హమ్-గతౌ-వెళ్ళుట. **వివిధమ్ ఈరతి ఇతి వీరః.** వివిధరకాలుగా చలించే జీవులు 'ఈర'. **తాన్ శ్చ హన్తి గమయతి వీరహా.** వాటికి చలించే సదుపాయం కల్గించినవాడు 'వీరహా'. **సర్వేషామ్ బహుధా ఈరాణామ్ జంతూనామ్ గమయితా విష్ణుః.** అన్ని జంతువులకు చలనం ఇచ్చేవాడు విష్ణువు.

శ్రీ చిన్మయానంద – వీ-వివిధమార్గములు; జనన మరణ మార్గమును అంతం చేసేవాడు 'వీరహా'.

ధర్మచక్రము రచయిత – ఈ నామమును ధ్యానించుటవలన కామక్రోధాది బలమైన అంతఃశత్రువులు నశించును.

748. విషమః

- భక్తులపట్ల ఒకవిధమైన, శత్రువులపట్ల మరొకవిధమై భావము (భేద భావము, వైషమ్యము) కలవాడు.
-తనతో సములైనవారు వేరెవరూ లేరు. విలక్షణుడు.
-క్షీరసాగరమధన సమయంలో రుద్రుడు సేవించిన విషంవలన రుద్రునికి హాని కలుగకుండా చేసినవాడు.

ఓం విషమాయ నమః

వి-సమః, విషమః – **విగతో సమో యస్య ఇతి విషమః.**సమమైనవాడు లేనివాడు విషముడు.
పాణిని అష్టాధ్యాయి సూత్రము 8.3.88 ప్రకారం 'సు, వి, నిర్, దుర్' ప్రత్యయాలు చేరినపుడు 'స్వప్, సూతి, సమ' పదాలలోని 'స'కారం 'ష'కారం అవుతుంది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – మంచివారిపట్ల, చెడువారిపట్ల తన ప్రవర్తనలో వైషమ్యము (భేదభావము) కనబరచేవాడు విషముడు. **భీతి క్షేమ కరత్వాది కుటిలా కుటిలాత్మసు విషమస్సతు ఖ్యాతా.** దుష్టులకు భయము, శిష్టులకు ప్రేమ   కలిగించేవాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ ఈ విధంగా భేదభావం కలిగి ఉండేవాడు. సమమైన భావము లేనివాడు 'వి-సమ' లేదా 'విషమః'. భక్తులపట్ల కారుణ్యవరదుడు. దుర్మార్గులపట్ల భీతావహుడు. భక్తపక్షపాతి.

భగవానుని విషమగుణాన్ని (విడమన్గళ్) శ్రీ నమ్మాళ్వారు తమ తిరువైమోళి పాశురములు 2.6.1 మరియు 78.3లలో వర్ణించారని శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించారు . భీష్మునితో అర్జునుడు యుద్ధం చేసేటపుడు అర్జునుని సారథిగా భగవానుడు తమ రథాన్ని కొంచెం కొంచెం పైకి లేపేవాడు లేదా క్రిందికి అణచేవాడట. ఈ విధంగా భీష్ముని బాణాలు గురి తప్పడానికీ, అర్జునుని బాణాలు గురి తప్పకుండా ఉండడానికి సాధ్యం చేశాడట. అలాగే అర్జునుడు జయద్రథునితో యుద్ధం చేసేటపుడు భగవానుడు తన చక్రాన్ని ప్రయోగించి, సూర్యాస్తమయం అని భ్రమ కలిగించి, జయద్రథుడు బయటకువచ్చి అర్జునుని బాణాలకు బలి అయ్యేలా చేశాడట.

ఇదే భావాన్ని, అనగా భగవానుడు భక్తపక్షపాతి గనుక విషముడు అని, శ్రీ బలదేవ విద్యాభూషణ వివరించారు. **భక్త పక్షపాతిత్వాత్ విషమః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సమో న అస్య విద్యతే సర్వ-విలక్షణాత్ ఇతి విషమః.** భగవంతునికి సమమైనవారెవరూ లేరు. అన్ని విధాలా ఆయన విలక్షణుడు. అధికుడు. శ్రీ శంకరులు గీత (11.43)నుండి ఉదాహరించారు.

పితాऽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చగురుర్ గరీయాన్

న త్వత్ సమోऽస్తి అభ్యధికః కుతోऽన్యో లోకత్రయేऽపి అప్రతిమప్రభావ – గీత 11.43

ఓ సర్వేశ్వరా! ఈ చరాచర జగత్తుకూ నీవే తండ్రివి. నీవు పూజ్యుడవు. నీవే గురుడవు. సర్వశ్రేష్ఠుడవు. ముల్లోకాలలోనూ నీతో సమానులెవరూ లేరు. ఇంకా నీకన్న అధికులు ఎలా ఉంటారు?

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుని సృష్టిలో ఈ విషమగుణము స్పష్టంగా కానవస్తుంది. ప్రతిజీవిలోనూ వైవిధ్యమున్నది. ప్రవర్తనలో విలక్షణత ఉన్నది.

శ్రీ వాసిష్ఠ ప్రతినామానికీ విపులమైన వ్యాకరణ విశ్లేషణ ఇవ్వడమే కాకుండా ఒక్కో నామమునకూ ఒక్కో శ్లోకం రచించారు. ఈ 'విషమః' నామమునకు ఆయన చెప్పిన శ్లోకము –

స విష్ణురేకో విషమః పురాణః కరోతి విశ్వం విషమం స్వభావాత్

తమానుకుర్వన్ విషమం ప్రవృత్తా సంపత్ విపచ్చాపి జగత్ ప్రసృష్టా

పూర్ణపురుషుడైన విష్ణువు ఒక్కడే అందరికంటె విలక్షణుడు. మరియు తన స్వభావం ప్రకారం సృష్టిలో ప్రతిఒక్కదానినీ విలక్షణంగా చేస్తాడు. వివిధజాతుల మధ్యనే కాదు. ఒకేజాతికి చెందిన వివిధ జీవులు కూడా విలక్షణమైనవి.

శ్రీ సత్యసంధ యతిరాజ – **విషమ్ రుద్ర పీతమ్ మీనాతి హన్తి స్వ-నామ-స్మరణేన ఇతి విషమః.** (మీ - హింసాయామ్ - తొలగించుట, చంపుట). క్షీరసాగర మథన సమయంలో రుద్రుడు మ్రింగిన విషంయొక్క ప్రభావాన్ని హరించినవాడు విషముడు.

ధర్మచక్రము రచయిత భగవంతుని అసమానత్వము, విలక్షణతగురించి అనేక ఉదాహరణలు ఇచ్చారు –

(1) **హృషీకేశుడు** – ఇంద్రియాలను నిగ్రహించుటలో సాటిలేనివాడు. మరియు మన ఇంద్రియములు ఆయన అధీనంలోనే ఉంటాయి.

(2) **కేశవుడు, మధుసూదనుడు** – అసురులబారినుండి దేవతలను రక్షించుటలో సాటిలేనివాడు.

(3) **గోవిందుడు** – జీవుల స్వభావాన్ని ఎరగడంలో సాటిలేనివాడు.

(4) **జనార్దనుడు** – దుష్టులను శిక్షించడంలో సాటిలేనివాడు.

(5) **విష్ణువు** – అంతటా వ్యాపించినవాడు. ఆయన లేకుండా మరేదీ ఉండదు, పని చేయదు.

(6) **యోగీశుడు, యోగవిదాంనేత** – యోగులలోను, యోగము తెలిసినవారిలోను సాటిలేనివాడు.

(7) **భగవంతుడు** – షడ్గుణ్యపరిపూర్ణుడు గనుక ఆయనకు సాటి వేరెవరూ లేరు.

(8) **అచ్యుతుడు** – తన మాటను వృధా కానీయడు మరియు భక్తులను చేజారనీయనివాడు గనుక ఆయనకు వేరెవరూ సాటి లేరు

ఇవన్నీ శ్రీమన్నారాయణుని విషమత్వానికి ఉదాహరణలు. కనుక ఆయన విషముడు.

769. శూన్యః

- మానవుల మధ్య అవతరించినాగాని ఏ విధమైన దోషములు లేనివాడు.
- నిర్గుణుడు (అద్వైత వ్యాఖ్య).
- అన్ని చోట్లకూ వెళ్ళేవాడు. అంతటా ఉండేవాడు.
- ప్రళయకాలంలో అంతటినీ తుడిచివేసేవాడు.
- ఇంద్రియముల ద్వారా యత్నిస్తే అందనివాడు.

ఓం శూన్యాయ నమః

శూన్యము (సున్నా) అంటే ఏమీ లేకపోవడం (ఖాళీ). దోషములు లేనివాడనీ, గుణములు లేనివాడనీ, ప్రళయంలో అంతా ఖాళీ చేసేవాడని, శత్రువులను తుడిచిపేస్తాడనీ – ఇలా ఈ నామానికి వివిధ వ్యాఖ్యలు మనకు లభిస్తున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు మనిషిగా అవతరించినాగానీ ఏ విధమైన దోషములు లేదా అవగుణములు ఆయన అవతారంలో ఉండవు. శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి పాశురం (3.10.6)ను ప్రస్తావించారు. భగవంతుడు సర్వ సద్గుణ పరిపూర్ణుడు, దోషరహితుడు అనేది అంతా అంగీకరించే విషయమే. అయితే కర్మదోషబద్ధులైన మానవులమధ్య మానవునిగా అవతరించినప్పటికీ ఆయన సంపూర్ణ పరత్వము ఆయనతోనే ఉంటుంది. ఏ విధమైన దోషగుణాలూ ఆయన దరిచేరవు. ప్రజలకు అందుబాటులో ఉండడానికే ఆయన అవతరిస్తాడు. తాను విధించే శిక్షలద్వారా శత్రువులను, తన స్వల్పవియోగంద్వారా భక్తులను

పీడిస్తూనే ఉంటాడు. అయితే శ్రీ నమ్మాళ్వారుకు ఎలాంటి వియోగక్లేశమూ లేదు. ఎందుకంటే ఆయన మనసుకు నిరంతరాయంగా భగవదనుభవం లభిస్తూనే ఉంది.

శ్రీ స్వామిదేశికన్ శరణాగతి దీపిక 17వ శ్లోకంలో భగవదవతారాలకు సంబంధించి ఆరు రహస్యగుణాలను వర్ణించారు –

(1) **నానావిధైః** – భగవదవతారములు అనేక విధములు. ఉదాహరణకు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, రామ, రామ, రామ, కృష్ణ, కల్కి అవతారములు .

(2) **అకపటైః** – భగవదవతారములు భగవంతుని నిజమైన దర్శనములు. మాయ లేదా భ్రాంతివల్ల కన్పించేవి కాదు.

(3) **అజహత్ స్వభావైః** – సంపూర్ణ స్వభావము కలిగినవి. అవతార సమయంలో కూడా భగవంతుని పరత్వము సంపూర్ణంగా ఉండును.

(4) **అప్రాకృతైః** – ఇతరజీవుల శరీరములు పాంచభౌతికములు. కాని భగవంతుని అవతార తిరుమేణి శుద్ధసత్వమయము.

(5) **నిజ విహార వసేన సిద్ధైః** – ఇర జీవుల జననం వాని పూర్వకర్మల మూలంగా జరుగుతుంది. కాని భగవంతుడు కర్మరహితుడు. ఆయన లీల, సంకల్పానుసారంగా అవతరిస్తాడు.

(6) **ఆత్మీయ రక్షక, విపక్ష వినాశనార్థైః** – భగవదవతారములు తన భక్తులను రక్షించడానికి, వారి శత్రువులను శిక్షించడానికి సంభవించును.

ఇలా భగవంతుడు మనుష్యరూపంలో అవతరించినాగాని, మానవులకుండే దోషాల విషయంలో ఆయన శూన్యుడని పైన చెప్పిన అవతార లక్షణాలవల్ల తెలుస్తుంది.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **ప్రకృత గుణ విరహితత్వాత్ శూన్యః**. ఈ వివరణ పైన చెప్పిన 4వ అంశానికి సరిపోతుంది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వ విశేష రహితత్వాత్ శూన్యవత్ శూన్యః**. భగవంతుడు గుణరహితుడు కనుక శూన్యుడు. ఈ వ్యాఖ్య అద్వైత సిద్ధాంతానికి సరిపోతుంది.

శ్రీ పెమ్మరాజు రాజారావు వివరణ – శారీరిక, మానసిక, బుద్ధి, అహంకారములు లేనివాడు, కర్తృత్వ భోక్తృత్వములు లేనివాడు, గుణములు కాని, ఆకారములుగాని లేనివాడు అగుటచే పరబ్రహ్మము 'శూన్యః' అను సుందర నామమున ప్రసిద్ధుడగుచున్నాడు. పరబ్రహ్మము నిర్మలము, నిష్కళంకము, స్వప్రకాశము అయియున్నందున 'శూన్యః' అని చెప్పబడెను. ఇది బౌద్ధులు వచించునట్టి సర్వశూన్యము కాదనియు, మనోబుద్ధుల కతీతమైన తేజోమయ స్వప్రకాశ పరిపూర్ణమయమనియు భావింపదగును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – శూన్ - గతౌ - వెళ్ళుట; **శునతి ప్రాప్తో భవతి సర్వత్ర ఇతి శూన్యో విష్ణుః**. అన్ని చోట్లకు వెళ్ళేవాడు, అంతటా ఉండేవాడు శూన్యుడు. 'ఖాళీ' అనే అర్థాన్ని తెలిపే మరొక పదము 'ఖం' అనగా ఆకాశము, ఖాళీ, వార్తాహరుడు. ఖాళీ, కదలిక – ఈ రెండింటికీ అవినాభావ సంబంధము ఉన్నది. ఖాళీ ఉంటేనే కదలిక సాధ్యము. కదలికవల్లనే క్రొత్తఖాళీ ఏర్పడుతుంది.

శ్రీ సత్యసంధ యతిరాజ – **ప్రళయకాలే సర్వపదార్థ శూన్యత్వాత్ శూన్యః**. ప్రళయకాలంలో అన్నింటినీ ఖాళీచేసేవాడు (తనలో ఇముడ్చుకునేవాడు), అంతం చేసేవాడు 'శూన్యః'.

ధర్మచక్రము రచయిత – మనకు ఇంద్రియాలద్వారా గోచరమైనది మాత్రమే నిజమని మనం భావిస్తాము. ఇంద్రియాలకు అందనివాడు కనుక 'శూన్యః'.

750. ఘృతాశీ

- లోకాలలో ఐశ్వర్యాన్ని వెదజల్లేవాడు.
- వ్రేపల్లెలోని గోపికల ఇండ్లలోని నేతిని ఆశించినవాడు.
- అన్ని కోర్కెలను త్యజించినవాడు. ఆశారహితుడు.
- హోమంలో అర్పించిన నేతిని కోరువాడు.

ఓం ఘృతాశినే నమః

ఘృతమ్ – సేచనమ్, క్షరణమ్, దీపనమ్ వా ఘృతమ్ – చల్లుట, ప్రవహించుట, వెలుగుట.
ఘృతమ్ – నేయి, వెన్న.
ఆశీః – శాసు - ఇచ్ఛాయామ్, కోరుట, ఆశీర్వదించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఘృ - సేచనే - వెదజల్లుట; **ఘృతమ్ - సేచనమ్, స్వ-గుణైః జగత్ ఆప్యాయనమ్**. తన కరుణను లోకాలపై వెదజల్లి దీవించేవాడు ఘృతాశి.

శ్రీ భట్టుల మరొక వ్యాఖ్య – ఘృతమ్ - నేయి, ఆశీ - కోరినవాడు; **గోప గృహ గవ్యే ఆశాస్తిః అస్య ఘృతాశీ**. గోపికల ఇండ్లలో నేతిని ఆశించినవాడు ఘృతాశి.

గోపానామ్ సద్మ గవ్యే వా జగదాప్యాయనేన వా
ఘృతేత్యా శ్యాహి యస్యాస్తి ఘృతాశీః పరికీర్తితః
గొల్లభామల ఇండ్లలో దూరి పాలు, వెన్న, నెయ్యి ఆశించినవాడు ఘృతాశి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఘృతాః విగలితాః ఆసీషః ప్రార్థనాః అస్య ఇతి ఘృతాశీ**. ఏ విధమైన కోరికలు లేనివాడు. వెన్న కరిగి నేతిలా మారి కారిపోయినట్లే అన్ని కోరికలు భగవానునినుండి జారిపోయాయి. భగవంతుడు తృష్ణారహితుడు, పూర్ణకాముడు, పరిపూర్ణుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – హోమంలో అర్పించిన నేతిని ఆశించేవాడు ఘృతాశి. దీపంలో ఉంచిన నేతిని ఆశించేవాడు.

751. అచలః

- శత్రువుల యత్నాలకు చలించనివాడు.
- తన స్వరూప సామర్ధ్యములనుండి చలనము పొందనివాడు.
- అంతటా ఉన్నందున ఇంక కదలనివాడు.

ఓం అచలాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **దుర్యోధనాదిభిః దురాత్మభిః అభేద్యః అచలః**. దుర్యోధనాదులు ఎంత యత్నించినాగాని చలించనివాడు అచలుడు. (పాండవుల పక్షము వీడనివాడు).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **న స్వరూపాత్ న సామర్ధ్యాత్ న చ జ్ఞానాదికాత్ గుణాత్ చలనం న విద్యతే అస్య ఇతి అచలః**. పరమేశ్వరుడు స్థిరమైనవాడు. ఆయన శక్తి, స్వరూపము, జ్ఞానమువంటివి ఎన్నడూ తరగవు. కనుక ఆయన అచలుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్యలో భగవంతుని సౌశీల్య సౌలభ్యత్వాలు, శ్రీ శంకరుల వ్యాఖ్యలో భగవంతుని పరత్వ అనంతత్వాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయనడానికి పై వ్యాఖ్యలు మరొక ఉదాహరణ.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు అంతటా ఉన్నాడు. ఆయన లేని చోటు లేదు. కనుక ఆయన ఒక చోటునుండి మరొక చోటుకు వెళ్ళడం అనేది జరగదు. ఇలా ఆయన అచలుడు. **స్థాణు రచలోऽయమ్** (గీత 2.24).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అచలుడైన భగవానుడు ఈ అచలత్వ గుణమును సృష్టిలో చాలా చోట్ల అమర్చాడు. ఉదాహరణకు ఒక జాతి విత్తనంలోనుండి అదే జాతి మొక్క వస్తుంది. నిప్పు పైకి ఎగుస్తుంది. ఇలా చాలా గుణాలు అచలాలు అని మనం గమనింపవచ్చును.

ధర్మచక్రము రచయిత – చిన్న గాలికి మొక్క కదులుతుంది కాని పెద్ద చెట్టు కదలదు. పెద్ద గాలికి చెట్టు కదులుతుంది కాని పర్వతం కదలదు. ఇలా శక్తినిబట్టి అచలత్వం వర్తిస్తుంది. అర్జునుడంతటివాడే కురుక్షేత్రంలో వ్యాకుల చిత్తుడయ్యాడు. కాని అనంత శక్తి సంపన్నుడైన భగవానుడు సదా అచలుడు.

ఇంద్రియాల అధీనంలో ఉన్న వ్యక్తులు తరచు చలిస్తూ ఉంటారు. భగవంతుని ధ్యానించి మనస్సును, ఇంద్రియాలను నిగ్రహిస్తే శాంతి, స్థిరత్వము లభిస్తాయి.

752. చలః

- చలించినవాడు. తన ప్రతినను భంగపరచుకొన్నవాడు.
- వాయురూపంలో చలించువాడు.
- గజేంద్రుని కాపాడడానికి పరుగులు తీసినవాడు.
- అనేక లీలలు కలిగినవాడు.

ఓం చలాయ నమః

ఇంతకుముందు నామము '**అచలః**' అనగా చలించనివాడు భగవంతుడు. అంతే కాకుండా చలించేవాడు కూడా భగవంతుడేనని ప్రస్తుతనామము '**చలః**' తెలుపుతుంది. శత్రువులపట్ల అచలత్వము, భక్తులపట్ల చలత్వము ప్రదర్శిస్తాడు భగవంతుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సత్యాద్యః పాండవార్థేపి చలతీతి చల స్మృతః.** మహాభారత యుద్ధంలో తాను ఆయుధం ధరించనని కృష్ణుడు చెప్పియున్నాడు. కాని మూడవనాటి యుద్ధంలో భీష్ముని రణధాటికి పాండవులు తాళలేకున్నారు. అప్పుడు కృష్ణుడు రోషంతో, పగ్గములను వదలి, సూర్యప్రభాభాసమానమైన చక్రమును త్రిప్పుచు ముందుకు దుమికెను. ఇందుకు రెండు కారణాలు చెబుతారు (1) పాండవులను రక్షించడానికి (2) కృష్ణునితో రేపు ఆయుధం పట్టిస్తానని అంతకుముందురోజు భీష్ముడు ప్రతిన పూనియుండడం. అంటే భక్తుని (భీష్ముని) మాట చెల్లించడంకోసం భగవానుడు తనమాటను స్వయంగా జవదాటాడన్నమాట. ఇలా ఆయన చలుడు.

భీష్మునిపై కృష్ణుడు విజృంభించిన విధానాన్ని శ్రీ పోతన ఇలా వర్ణించాడు (భాగవతము 1.222) –

కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి
గగన భాగంబెల్ల గప్పి కొనగ
ఉఱికిన నోర్వక ఉదరంబులోనున్న
జగముల వ్రేగున జగతి కదల
చక్రంబు చేపట్టి చనుదెంచు రయమున

పైనున్న పచ్చని పుటము జార
నమ్మితి నా లావు నగుబాటు సేయక
మన్నింపుమని క్రీడి మఱల దిగువ

కరికి లంఘించు సింగంబు కరణి మెఱసి,
"నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున"యంచు మద్విశిఖ వృష్టి
తెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వాయురూపేణ చలతి ఇతి చలః**. వాయురూపంలో చలించేవాడు చలుడు.

శ్రీ అనంతకృష్ణ శాస్త్రి – గజేంద్రుని కాచడానికి ఒక్క ఉదుటున పరుగులు తీసినవాడు చలుడు.
ఈ ఘట్టాన్ని శ్రీ పోతన ఇలా వర్ణించాడు (ఆంధ్రమహాభాగవతము. 8వ స్కంధము) –
సిరికిం జెప్పడు శంఖ చక్రయుగముం జేదోయి సంధింప డే
పరివారంబు జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణి కాం
తర ధమ్మిల్లము జక్కనొత్తడు వివాదప్రోత్థిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – చల్ - విలాసనే - క్రీడించుట, ఆనందించుట. **చలతి విలసతి ఇతి చలః విలాసలీలా సంపన్నః** లీలామానుషమూర్తి యైనందున భగవంతుడు చలుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ వేంకటేశ్వర వచనములు – శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు.

గోపికా వల్లభా! నేఁదలపోయంగా ఫలియించిన మేలు, మఱియు నే వెదకంగా దొరకెడు పదార్థంబులు, నేఁగోరంగా వచ్చు లాభంబు, నేఁజదువంగా దెలిసిన యర్థంబు, నే గడియించుకొనంగా సిద్ధించిన ధనంబు, నా నేర్పువలనఁ దెచ్చుకొనియెడి సుఖంబు, నా చేతులఁ జేసిన పుణ్యంబు, నా తపోబలిమిం గైకొను లోకంబు, నా పురాకృతఫలంబు, నా మనోరథంబు, నీవే. నా నుదుట బ్రహ్మదేవుండు వ్రాసిన వ్రాలు, నే జన్మించిన జన్మకారణము, నా యంతరంగంబులో నున్న మూర్తి నీవే సుమీ! నా కలిమి విన్నవించితి శ్రీ వేంకటేశ్వరా!.

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృత్ |
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః || (80)

753. అమానీ

- అహంకారము, గర్వము లేనివాడు.
- శరీరమును ఆత్మ అని భ్రమింపకుండువాడు.
- ఎలాగైనా కొలువజాలనివాడు. కొలతలకు అతీతుడు.

ఓం అమానినే నమః

మాన్ – పూజాయామ్ – గౌరవించుట, పూజించుట

మానము – గర్వము, అహంకారము (గర్వో అభిమానో అహంకారః – అమరకోశము 1.7.22)

న మానో గర్వో యస్య ఇతి అమానః. గర్వము, అహంకారము లేనివాడు అమాని.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భక్తుల విషయంలో ఏమాత్రమూ అహంకారము లేనివాడు అమాని. భగవంతుడు బ్రహ్మాదులచేత కూడా పూజలందుకుంటాడు. కాని పాండవులకు రాయబారిగా వెళ్ళి దుర్యోధనాదులచే మాటలు పడినవాడు. అర్జునునికి సారథియై పగ్గములు పట్టినవాడు. లోకరక్షణార్థమై పందిగాను, చేపగాను, సింహం ముఖంతోను అవతరించినవాడు. అమాని.

అండాళ్. నాచియార్ తిరుమొళి 11.8 – మురికితోనిండి, నీరుకారే వరాహావతారం ధరించి నీటి అడుగున బాధపడుతున్న భూదేవిని రక్షించినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అనాత్మ వస్తుషు ఆత్మాభిమానో న అస్తి ఇతి అమానీ.** ఆత్మ కానివానిని ఆత్మగా భ్రమింపనివాడు అమాని.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – (1) **ఆత్మ సమ్మాన భావరహితః.** అహంకారం లేనివాడు (2) మా-మానే-కొలుచుట. బలము, శక్తి అన్ని మంగళగుణాలలోను భగవంతుని కొలవడం సాధ్యం కాదు. ఎందుకంటే ఆయన అప్రమేయుడు. ఇంతింతని చెప్పరానివాడు.

754. మానదః

- తన భక్తులకు గౌరవమిచ్చేవాడు.
- భక్తులకు సన్మానము లభించేలాగును, అధర్మపరులకు సన్మానము లభింపకుండాను చేసేవాడు.
- తన మాయవలన నిజమైన ముముక్షువులకు ఆత్మజ్ఞానం కలిగేలాగును, కపటులకు ఆత్మేతర పదార్ధములయందు ఆత్మభావం కలిగేలాగును చేసేవాడు.
- తన భక్తులకు ఆధ్యాత్మిక జ్ఞానం కలిగించేవాడు.
- జగత్తులో అన్నింటికీ ప్రమాణములు ఏర్పరచినవాడు.

ఓం మానదాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య –

అర్జున, ఉగ్రసేన, యుధిష్ఠిరాదిభ్యో రథిత్వ,

అధిరాజ్య, బహుమానమ్ దత్తవాన్ మానదః

భగవానుడు సారధిగా ఉంటే అర్జునుడు రధికుడయ్యాడు. భగవానుడు పౌరునిగా ఉంటే ఉగ్రసేనుడు రాజయ్యాడు. భగవంతుని దయవలన యుధిష్ఠిరుడు కూడా రాజ్యాన్ని పొంది సన్మానాలందుకొన్నాడు. ఇలా భగవంతుడు తన భక్తులకు గౌరవ మర్యాదలు కలిగించాడు గనుక మానదుడు (మాన=గౌరవము).

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు నాలుగు రకాల అర్ధాలు చెప్పారు.

(1) మానము - ఆత్మాభిమానము, ఆత్మభావము; **స్వమాయయా సర్వేషామ్ అనాత్మసు మానమ్ ఆత్మాభిమానమ్ దదాతి ఇతి మానదః.** తన మాయవలన భగవంతుడు అందరిలోను ఆత్మ కానివానిపట్ల ఆత్మ అనే అభిమానము కలిగిస్తాడు గనుక మానదుడు.

(2) మానము - సత్కారము, ద - ఇచ్చుట; **భక్తానామ్ మానమ్ సత్కారమ్ దదాతి ఇతి వా.** భక్తులకు గౌరవ సత్కారములు కలిగించువాడు మానదుడు.

(3) మానము - సత్కారము, ద - నాశనము చేయుట (ద్యాతి); **అధర్మిష్ఠానామ్ మానమ్ సత్కారమ్ ద్యాతి ఇతి వా.** అధర్మపరులకు గౌరవము దక్కకుండా చేసేవాడు మానదుడు.

(4) మానము - (ఆత్మేతరముల పట్ల) ఆత్మ భావము, ద - ద్యాతి - నాశనము చేయుట; **తత్త్వవిదామ్ అనాత్మసు మానమ్ ఆత్మాభిమానమ్ ద్యాతి ఖండయతి ఇతి వా మానదః.** తత్త్వవిదులైనవారికి అనాత్మలపట్ల ఆత్మభావమును నాశనము చేసి ఆత్మజ్ఞానము కలిగించువాడు మానదుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – (అమరకోశము ప్రకారము) మానము - చిత్త సమున్నతి, బుద్ధి వృద్ధి చెందుట. **మానమ్ చిత్త సమున్నతమ్ దదాతి ఇతి మానదః.** తన భక్తుల బుద్ధిని పెంపొందించువాడు మానదుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – మానము - పరిమాణము, దద్ - దానే - ఇచ్చుట, దొ - అవఖండనే - ముక్కలు చేయుట. **మాన దదాతి ఆకర్షణేన, మాన ద్యాతి ఖండయతి వికర్షణేన.** ఆకర్షణ, వికర్షణల ద్వారా జగత్తులో ప్రతిదానికీ ఒక పరిమాణము ఏర్పరచేవాడు మానదుడు. ఇలా అన్నింటికీ రూపము, గుణము ఇత్యాదులు ఏర్పడినాయి. సంబంధాలు నెలకొన్నాయి. ఇందుకు శ్రీ వాసిష్ఠ అనేక ఉదాహరణలు చెప్పారు. భగవంతుడు ఏర్పరచిన ప్రమాణమువల్లనే గ్రహ నక్షత్రాదులు, వివిధ వస్తువులు తమ తమ ఆకారములను, పరిమాణములను, గుణములను కలిగి ఉన్నాయి. ప్రతివస్తువునకూ నిర్దిష్టమైన ఆకారం ఉంది. ఈ విధంగా పక్షుల రూపంనుండి ఎగిరే విమానాలకూ, చేపల రూపంనుండి నీటిలో పయనించే పడవలకూ రూపకల్పనచేసే అవకాశం మనకు లభించింది. అలాగే నీరు నిప్పును ఆర్పడంవంటి అనేక గుణాలు భగవంతుడు ఏర్పరచిన మానములు (ప్రమాణముల)వలన సంభవిస్తున్నది.

ధర్మచక్రము రచయిత – భగవంతుడు భక్తులకు గౌరవము కలిగిస్తాడు. మనం కూడా ఈ నామము ద్వారా భగవంతుని గౌరవించడం, భగవద్భక్తులను గౌరవించడం నేర్చుకోవాలి. జీవితాన్ని వ్యర్థం చేయకుండా, నీచ విషయాలజోలికి పోకుండా, ఆత్మ విషయంపై లగ్నం చేయాలి.

75. మాన్యః

గౌరవింపదగినవాడు, పూజనీయుడు.

ఓం మాన్యాయ నమః

మాన్-పూజాయామ్-గౌరవించుట, పూజించుట; **మానయితుమ్ యోగ్యో మాన్యః పూజనీయః ఇతి మాన్యః.** పూజించుటకు, గౌరవించుటకు అర్హుడైనవాడు మాన్యుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తదీయత్వేన సన్మానితవ్యో మాన్యః.** భక్తులకు, భగవంతునికి ఉన్న బంధం ఎలాంటిదంటే ఆ భక్తులు తనవారిగా ఉండడం తనకు గౌరవంగా భగవంతుడు భావిస్తాడు. ఇందుకు శ్రీ భట్టులు మహాభారతంలోని – **న సారథేః సాత్వత కౌరవాణాం కృద్ధస్య ముచ్యతే రణేऽద్య కశ్చిత్** – అనే శ్లోకాన్ని

ఉదాహరించారు. రథికుడైన అర్జునుడు కృద్ధుడై ఉన్నందున కౌరవులలోగాని, సాత్త్వతులలోగాని ఎవరూ మరణంనుండి తప్పించుకోలేరని కృష్ణుడన్నాడట.

శ్రీ నమ్మాళ్వారు. పెరియ తిరువంతాడి 53 – భక్తులకోసం ఏమి చేయాలన్నదే నిరంతరం నీ ఆలోచన.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వైః మాననీయః పూజనీయః సర్వేశ్వరత్వాత్ ఇతి మాన్యః**. భగవంతుడు సర్వేశ్వరుడైనందున అందరిచేత పూజింపదగినవాడు, గౌరవింపదగినవాడు గనుక మాన్యుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుని కారణంగా సకలం ఉంది, నడుస్తుంది. కనుక భగవంతుని పూజించాలి. ఈశావాస్యోపనిషత్తు 1 – **ఈశావాస్యమిదమ్ సర్వం యత్కించ జగత్యామ్ జగత్**. ఆ ఈశ్వరుడే సకల జగత్తునకు సృష్టికర్త, రక్షకుడు.

శ్రీ చిన్మయానంద శ్రీ శంకరాచార్యుల వివేకచూడామణినుండి ఉదాహరించారు – **ధన్యః స మాన్యో భువి.** ఇక్కడ పరమాత్మను తెలిసికొన్నవారే భూమిపై ధన్యులు, మాన్యులు అని చెప్పబడినది. ఇలా పరమాత్ముని గురించి తెలిసికొన్నవారు మాన్యులైతే ఇంక సాక్షాత్తు పరమాత్ముని గురించి ఏమి చెప్పాలి?

ఈ నామం వ్యాఖ్యానంలో శ్రీ భట్టుల మరియు శ్రీ శంకరుల వ్యాఖ్యానాలలో తేడాను ఇంకోమారు గ్రంహింపవచ్చును. శ్రీ భట్టులు భగవంతుని భక్తవాత్సల్యాన్ని ప్రస్తుతించారు. శ్రీ శంకరులు భగవంతుని పరత్వమును, పరమేశ్వరత్వాన్ని కొనియాడారు.

శ్రీ శాస్త్రి – **అమానీ, మానదః, మాన్యః** - ఈ మూడు నామముల ద్వారా భగవంతుడు అందరికంటే గౌరవనీయుడు అని కాదు చెప్పబడింది. భగవంతుడు తన భక్తులకు గౌరవ సత్కారాలు లభించేలా చూస్తాడని (**మానదః**), మరియు భగవంతునికి భక్తుల గౌరవం ఎంతో ప్రియమైనదని (**మాన్యః**).

ధర్మచక్రము రచయిత – భగవంతుడు మాన్యుడు (పూజనీయుడు) అయినప్పటికీ ఆ సంగతి ఆయన నిజమైన భక్తులకే తెలుస్తుంది. వారే తమ ఐహికవాంఛలను అధిగమించి భగవంతుని అన్వేషించగలరు.

ఈ నామము వ్యాఖ్యానంలో మరొక విషయం కూడా గమనించవచ్చును. విష్ణు సహస్ర నామమునకు వివిధ వ్యాఖ్యానాలు ఉండడానికి రెండు కారణాలు గోచరిస్తున్నాయి (1) ఆయా వ్యాఖ్యానకర్తలు మహా భక్తులు, జ్ఞానులు. కనుక తమ తమ భగవదనుభవాలను తమ వ్యాఖ్యానాలద్వారా మనకు ప్రసాదించారు (2) వారు శ్రుతి, స్మృతి, ఇతిహాస, పురాణాదులను తమదైన దృక్పథంలో వివరించి తమ తమ సిద్ధాంతాలకు ఆధారములు, విశ్వసనీయత సమకూర్చుకున్నారు.

ఈ నామమునకు ద్వైత వ్యాఖ్యానంలో ఈ విషయం అర్థమవుతుంది. ద్వైత సంప్రదాయం ప్రకారం శ్రీ అమ్మవారి గురించి ఇలా చెబుతారు. (1) ఆమె జీవుడు. కాని తక్కిన అందరు జీవులకంటె అధికురాలు (2) ఆమె విభువు, కాని విష్ణువుకంటె పరత్వములో తక్కువ. ద్వైతాచార్యులైన శ్రీ సత్యసంధ యతిరాజ ఈ **'మాన్యః'** నామమును 'మా+అన్య'గా పరిగణించి రెండు భావాలు చెప్పారు. (1) **మాయా రమాయా అన్యా చేష్టనీయా అస్య ఇతి మాన్యః** (2) **మాయా రమా ఉపలక్షిత జీవరాశేః అన్యే భిన్న ఇతి మాన్యః**. ఈ రెండు వివరణలూ ద్వైత సిద్ధాంతాలకు సరిపోతాయి.

శ్రీ శంకరులూ, శ్రీ భట్టులూ **'మాన్యః'** నామమును 'మాన్' అనే ధాతువు ఆధారంగా వివరించారు. అనగా గౌరవింపదగినవాడు అని. ద్వైతాచార్యులు మాత్రము ఈ నామమును 'మా-అన్య' అని గ్రహించారు.

రిచ్మండ్ మందిరంలో శ్రీ ఆళ్వారుల సన్నిధి – వికీపీడియానుండి

756. లోకస్వామీ

లోకములకు ప్రభువు. లోకమలే ఆయనవి.

ఓం లోకస్వామినే నమః

స్వామ్ - ఐశ్వర్యము; **స్వామ్ ఐశ్వర్యమ్ అస్య అస్తి ఇతి స్వామీ** (అమరకోశము) – అనగా ఐశ్వర్యము కలిగినవాడు స్వామి; **స్వామిన్ ఐశ్వర్యే** (పాణిని సూత్రము 5.2.126) కూడా ఇదే అర్థం చెబుతున్నది. ఇలా లోకస్వామి అనగా లోకములకు ప్రభువు అని అర్థము

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు భక్తసులభుడైనందున లోకస్వామి. ఇక్కడ నాలుగు వరుస నామములకు శ్రీ భట్టుల వ్యాఖ్యానాలు ఇలా ఉన్నాయి.

753 – **అమానీ** – అహంకారము, గర్వము లేనివాడు.

754 – **మానదః** – తన భక్తులకు గౌరవమునిచ్చేవాడు.

755 – **మాన్యః** – భక్తులు తనవారిగా ఉండడం తనకు గౌరవంగా తలచేవాడు.

756 – **లోకస్వామీ** – ఆయన అమాని, మానదుడు, మాన్యుడు అయినందున, తన సౌలభ్యం కారణంగా, లోకస్వామి. **క ఏవం కర్మకరః లోకస్వామీ.**

భగవంతునికి భక్తులపై ఉన్న ప్రేమ శ్రీ భట్టుల వ్యాఖ్యానంలో ప్రముఖంగా కనిపించే అంశము. అంటే భగవంతుని పరత్వం కారణంగా కాదు, ఆయ సౌలభ్యం కారణంగా లోకస్వామి. ఆయన మానుష రూపావతారాలలో కూడా ఆయన పరత్వము పూర్తిగా ఆయనతో ఉంటుంది. కాని ఆయన ఒక మానవునిగా కనుపించి ప్రవర్తిస్తాడు. ఎందుకంటే ఆయన భక్తులకు అందుబాటులో ఉడడానికి. **అహమ్ మానుషమ్ మన్యే**.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **చతుర్దశానామ్ లోకానామ్ ఈశ్వరత్వాత్ లోకస్వామీ**. పదునాలుగు లోకములకు ప్రభువైనందున లోకస్వామి.

కౌషీతకి ఉపనిషత్తు 3.9 – **ఏష లోకాధిపః.**

శ్రీ చిన్మయానంద – భగవంతుడే లోకాలకు అన్నింటికీ సృష్టికర్త, ప్రవర్తకుడు, నిర్దేశకుడు. జీవులలోని అన్ని విధాలైన అనుభవాలకు సదా అధిపతి. వస్తువులలో చైతన్యము. కనుక ఆయన లోకస్వామి.

శ్రీ వాసిష్ఠ – లోకములే తనకు ఐశ్వర్యముగా కలవాడు లోకస్వామి.

757. త్రిలోకధృత్

- మూడు లోకములను ధారణ చేసినవాడు.
- అవస్థాత్రయమునకు అధినేత.

ఓం త్రిలోకధృతే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అశేషాణామపి ధారణ పోషకయోః భారకత్వాత్ త్రిలోకధృత్**. (ధృ - ధారణే - భరించుట, ఆధారము అగుట). మూడు లోకములకు ఆధారమైనవాడు త్రిలోకధృత్. మూడు లోకములను సృజించినవాడే వానిని పోషించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **త్రీన్ లోకాన్ ధారయతి ఇతి త్రిలోకధృత్**. మూడు లోకములను ధరించువాడు త్రిలోకధృత్.

శ్రీ చిన్మయానంద – త్రిలోకములనగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి అను మూడు అవస్థలు. జీవులలో చైతన్యరూపుడైన భగవంతుడు ఈ మూడు అవస్థలకును అధిపతి. ఎందుకంటే మూలమైన ప్రాణము లేకుండా ఈ మూడు అవస్థలూ ఉండవు.

త్రిలోకధృక్

ఓం త్రిలోకధృజే నమః

కొందరు వ్యాఖ్యాతలు ఈ నామమునకు 'త్రిలోక ధృక్' అనే పాఠాన్ని గ్రహించారు. ఈ పాఠానికి కూడా ఇంచుమించుగా 'త్రిలోక ధృత్' నామానికి చెప్పిన అర్థమే చెప్పారు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **త్రిలోక ధృగ్ ఇతి ధారకతయా పాలకతయాశ్చ త్రిలోకీమ్ ధర్షతి గచ్ఛతి ఇతి తస్య స్వాభావికోఽయమ్ ధర్మః.** మూడు లోకములనూ నడపడం ఆయన స్వభావము (ధృజ్-గతౌ-వెళ్ళుట).

శ్రీ సత్యసంధ యతిరాజ – **త్రి లోకాన్ ద్యు పృథ్వీ అంతరిక్షాన్ ధరతి ఇతి త్రిలోక ధృత్.**

శ్రీ శంకరులు, శ్రీ భట్టులు 'త్రిలోక ధృత్' అనే పాఠాన్ని, శ్రీ సత్యసంధ యతిరాజ 'త్రిలోక ధృక్' అనే పాఠాన్ని తమ తమ వ్యాఖ్యానాలలో చెప్పారు.

758. సుమేధాః

మంచి తలంపు, బుద్ధి, జ్ఞాపకశక్తి కలవాడు.

ఓం సుమేధసే నమః

మేధ = జ్ఞాపకశక్తి, తెలివి; సు-మేధ = గొప్ప, మంచి జ్ఞాపకశక్తి, తెలివి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఆరాధక సుసాధు బుద్ధిః సుమేధా.** భగవంతుడు సదా తన భక్తుల క్షేమము గురించి తలుస్తూ ఉంటాడు గనుక ఆయన 'సుమేధాః'

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **శోభనా మేధా ధారణవతీ ధీః అస్య ఇతి సుమేధాః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శోభనా మేధా ప్రజ్ఞా అస్య ఇతి సుమేధాః.** గొప్ప బుద్ధి, తెలివి కలవాడు 'సుమేధాః'

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – 'గొప్ప తెలివి' అనగా జరుగబోయేవి అన్నీ తెలిసి ఉండడంచేత ఏ ఘటనవల్లా కూడా కలత చెందకుండుట.

శ్రీ చిన్మయానంద – మనుషుల విషయంలో 'సుమేధస్సు' అనగా ఆత్మను గురించిన జ్ఞానమును సాధించే ప్రజ్ఞ. ఇది క్రొత్త విషయం కాదుగాని ప్రస్తుతం మనకు అందుబాటులో లేనిది. కనుక 'సుమేధస్సు' అనగా దివ్యమైన జ్ఞాపకశక్తి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – మేధ - రక్షణ, ఆధారము కలిగించగలిగే తెలివి. భగవంతునికి మూడు కాలాలలోను జరిగే విషయాలు తెలుసు. కనుక ఆయనది సుమేధస్సు. ఈ విషయం తెలుసుకొన్న మానవుల మేధ ఉత్తమమైనది అవుతుంది.

ధర్మచక్రము రచయిత – జ్ఞానం సాధించే శక్తి మనలో ఉంది కాని శ్రద్ధాభక్తులు లేక అది మరుగున పడింది. భగవద్ధ్యానంతో దానిని మేల్కొలిపి, మనస్సును, మాటను, చేతలను నియంత్రించడం సాధ్యమౌతుంది.

759. మేధజః

- యాగఫలముగా జన్మించినవాడు.
- యాగఫలముగా తెలియవచ్చువాడు.
- భక్తుల సత్సంగములో ఉండేవాడు.

ఓం మేధజాయ నమః

దేవకీ కృత పుత్రీయవ్రత యజ్ఞేచ యస్య వై
జనిత్సు మేధజ స్స స్యాత్ సప్తార్ణః పుత్రదాయకః
ఈ నామమునందు 'మేధ' అనగా యజ్ఞము. గత జన్మలలో కుమారులకోసం దేవకి చేసిన వ్రతముల ఫలంగా జన్మించినవాడు. ఈ నామము సప్తాక్షరి. పుత్ర సంతానమునిచ్చును. ఓం మేధజాయ నమః.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అతో మేధే దేవకీ పుత్రీయవ్రతరూపే యజ్ఞే జాతః ఇతి మేధజః**. దేవకి ఒనరించిన పుత్రవ్రతముల ఫలితంగా జన్మించినవాడు మేధజుడు. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణము –
స్తుతోऽహమ్ యత్ త్వయా పూర్వమ్ పుత్రార్థిన్యా తదద్యతే
సఫలమ్ దేవీ! సంజాతమ్ జాతోऽహమ్ యత్తవోదరాత్
దేవీ! నన్ను కొడుకుగా కోరి పూర్వము నీవు నన్ను స్తుతించావు. అందుకు ఫలముగా నేను నీ గర్భమున జన్మించాను – అని భగవానుడు దేవకీదేవితో అన్నాడు.

విష్ణుధర్మము 33.9 – **సద్యాగార్థితేశోక్తమ్ యత్ ప్రసన్నేన తే శుభే! తత్కృతమ్ సఫలమ్ దేవీ......**
మంగళప్రదమైన దేవీ! నీవు ఇదివరకు నన్ను అర్చించినపుడు నేనొసగిన వరము ఫలముగా జన్మించాను.

శ్రీ వి.వి. రామానుజన్ మరికొన్ని ఉదాహరణలు చెప్పారు. అదితి ఆచరించిన పయోవ్రతం ఫలితంగా ఆమె గర్భమున శ్రీనివాసుడు వామనావతారుడై జన్మించాడు. దశరథుడు పుత్రకామేష్టియాగం చేయగా శ్రీరాముడు జన్మించాడు. తాము చేసిన తపస్సుమూలంగా యశోదా నందగోపులకు శ్రీకృష్ణుని పెంచే భాగ్యం కలిగింది. శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఉదాహరించిన విషయం – కంచిలో బ్రహ్మ చేసిన తపస్సు కారణంగా శ్రీ వరదరాజస్వామి వెలిశాడు.

శ్రీ చిన్మయానంద – ప్రతియజ్ఞంలోనూ భగవానుడు దర్శనమిస్తాడు గనుక ఆయన మేధజుడు. గీత ప్రకారం ఏదైనా సత్కార్యం కొరకు భగవంతుని పూజిస్తూ సమిష్టిగా నిర్వహించేది యజ్ఞము. భగవంతుడిచ్చే వరమే ఆ యజ్ఞఫలము. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా భగవంతునికి సమర్పిస్తే ఆత్మజ్ఞానం లభిస్తుంది. వేదాంతాన్ని అభ్యసించేవారికి దీనిలో అనేక అంతరార్థాలు స్ఫురిస్తాయి.

ధర్మచక్రము రచయిత – భూత యజ్ఞము, పితృయజ్ఞము, నరయజ్ఞము, ఋషియజ్ఞము, దేవయజ్ఞము అనే పంచమహాయజ్ఞాలను ఆచరిస్తే భగవంతుని సాన్నిధ్యం, ఆత్మసాక్షాత్కారం లభిస్తాయి.

శ్రీ బలదేవ విద్యాభూషణ – మేధ్ - సంగమే - కలియుట; **మేధ - భక్త సంగమే జాయతే ప్రాదుర్భవతి ఇతి మేధజః**. భక్తుల సమావేశములలోని ఏతెంచువాడు మేధజుడు.

760. ధన్యః

ధన్యుడు, అదృష్టము కలిసివచ్చినవాడు.

ఓం ధన్యాయ నమః

ధనము - సంపద; **ధన ధర్మ సాధుః ధన్యః** (అమరకోశము); **ధన గణం లబ్ధా, యత్** - పొందినవాడు, **ధన్యః** - ధనము పొందినవాడు (పాణిని 4.4.84)

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ధన్యస్తు దేవకీ జన్మ ధన లాభాది స్మృతః**. దేవకీ గర్భాన జన్మించడమే తన అదృష్టంగా భావించినవాడు ధన్యుడు.

శ్రీ వి.వి. రామానుజన్ – భగవంతుడు జన్మ లేనివాడు. అజుడు. కనుక ఒక తల్లి కడుపున పుట్టడం ఆయనకు ఆనందం కలిగించింది. (కంచి పూర్వమఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి తన పదవ యేటనే మఠాధిపతి అయ్యారు. కనుక తాను పెద్దల కాళ్ళకు సాష్టాంగప్రమాణం చేసే అదృష్టానికి దూరమయ్యానని ఒకమారు అన్నారట).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కృతార్థో ధన్యః**. భగవంతుడు పూర్ణకాముడు. కృతార్థుడు. పరిపూర్ణుడు. ఆయనకు ఇంక తీరవలసిన కోరికలు లేవు. కనుక ఆయన ధన్యుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సుకృతి పుణ్యవాన్ ధన్యః**. భగవంతుడు తన భక్తులు సమర్పించే పుష్పాదులను స్వీకరిస్తూ భక్తుల యోగక్షేమములను వహించును. ఇది ఆయన సుకృతి, పుణ్యకార్యము. కనుక ధన్యుడు.

ధర్మచక్రము రచయిత – ధన్యుడనగా క్రిందటి జన్మల పుణ్యఫలాన్ని అనుభవించేవాడు. అంతిమస్మృతి వలన తరువాతి జన్మ నిర్ణయమౌతుంది. జీవితమంతా సత్కార్యాలు ఆచరిస్తే ఉత్తమ అంతిమస్మృతి కలుగుతుంది. అపుడు వచ్చే జన్మలో మనం ధన్యులము అవుతాము. ఈ నామాన్ని ధ్యానించి ఆ విషయాన్ని గ్రహించాలి.

761. సత్యమేధాః

- సత్యమైన వర్తన (నటన కానిది, వాస్తవమైనది) కలిగినవాడు.
- సత్యమైన జ్ఞానము (అనంతము) కలిగినవాడు.
- వేదములకు నిజమైన అర్థము తెలిసినవాడు.

ఓం సత్యమేధసే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **మేధా సత్య అస్య, న నటనామాత్రమ్ ఇతి సత్యమేధాః**. ఆయన చేష్టలు నటన కావు. అవన్నీ దాపరికంలేని నిజాలు. ఈ భగవద్గుణాన్ని 'ఆర్జవము' అని శ్రీ వి.వి. రామానుజన్ వర్ణించారు.

పల్లవీ వసుదేవాది పాజాత్య స్వాభిమానినీ

మేధా యస్యాపి సత్యా సః సత్యమేధాః ప్రకీర్తితః

గోపికలతోను, వసుదేవుడు మొదలయినవారితోను నటన కాకుండా నిజంగానే స్వజాతీయుడై చరించే వాస్తవబుద్ధి కలవాడు. అవతారమునందలి చేష్టలు సత్యముగా ఉండేవాడు 'సత్యమేధాః'. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణలు –

విష్ణుపురాణము 5.13.11, 12 –

యదివోఽస్తి మయి ప్రీతిః శ్లాఘ్యోఽహమ్ భవతామ్ యది

తదాదమ్ బుద్ధిః సదృశీ బుద్ధిర్వః క్రియతామ మయి

నాఽహం దేవో న గంధర్వో న యక్షో న చ దానవః

అహం వో బాంధవో జాతః నవశ్చింత్యమ్ అతోఽన్యతా

నేనంటే మీకు నిజమైన ప్రేమ ఉంటే గనుక, నన్ను మీరు పొగడాలనుకుంటే గనుక, నన్ను మీలో ఒక గోపబాలునిగా భావించండి. నేను దేవుడిని కాను, యక్షుడను కాను, దానవుడిని కాను. మీ బంధువుగా జన్మించినవాడను. మరేమీ కాను.

రామాయణం. యుద్ధకాండ. రాముడు ఇలా అన్నాడు – **ఆత్మానమ్ మానుషమ్ మన్యే రామమ్ దశరథాత్మజమ్**. దశరథుని కుమారుడను, మానవుని అయిన రాముడిని అని నన్ను నేను భావిస్తాను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్యా అవితథా మేధా యస్య ఇతి సత్యమేధాః**. ఎన్నడూ విఫలముకాని నిజమైన మేధస్సు కలిగినవాడు. అకుంఠితము, అద్భుతము అయిన తెలివి కలవాడు. భగవానుని మేధాశక్తిని ఎవరు వర్ణింపగలరు?

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – వేదములు, వేదాంగముల గురించి నిజమైన జ్ఞానము భగవానునకు మాత్రమే ఉన్నది. కనుక ఆయన 'సత్యమేధాః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – కల్పాదినుండి కల్పాంతమువరకు సకల చరాచరముల గురించిన జ్ఞానము, వానిని సృష్టించి, జీవము నిలిపే శక్తి ఉన్నందున భగానుడు 'సత్యమేధాః'.

ధర్మచక్రము రచయిత – భగవానుడు ధర్మము ఆచరించేవారికి నిజమైన జ్ఞానమును కలుగజేయును.

762. ధరాధరః

- కొండనెత్తినవాడు (గోవర్ధనగిరిధారి).
- భూమిని ధరించినవాడు.

ఓం ధరాధరాయ నమః

ధర - కొండ; ధరా - భూమి; ధర+ఆధారః, ధరా+ధరః, ధరా+ఆధారః – అని ఈ నామమును మూడు విధములుగా భావింపవచ్చును.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'ధరమ్' అనగా కొండ అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **ధరమ్ ధృతవాన్ ధరాధరః** – అని నిరుక్తిలో ఉన్నది. గోపకులపై కోపంతో ఇంద్రుడు రాళ్ళ(వడగళ్ళ) వాన కురిపించాడు. అప్పుడు గోకులాన్ని రక్షించడానికి కృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తిపట్టాడు. అలా ఆయన ధరాధరుడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణంనుండి ఉదాహరించారు –

తదేతద్ అఖిలమ్ గోష్ఠం త్రాతవ్యమ్ అధునా మయా

ఇమమ్ అద్రిమ్ అహం ధైర్యాత్ ఉత్పాట్యాऽऽసు శిలామయమ్

ధారయిష్యామి గోష్ఠస్య పృథుచ్ఛత్రమివాపరమ్

ఈ గోశాలను, గోవులను కాపాడవలసిన బాధ్యత నాపై యున్నది. పెద్ద శిలలతో కూడి ఈ కొండను గొడుగువలె ఎత్తిపట్టగలను – అని కృష్ణుడన్నాడు.

శ్రీ అన్నమయ్య – **కొండ గొడుగుగా గోవుల గాచిన కొండొక శిశువుకు గొబ్బిళ్ళో.**
శ్రీ వి.వి. రామానుజన్ ఆళ్వారుల రచనలనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'ధరా' అనగా 'భూమి' (ధరామ్ ధారయన్ ధరాధరః) అన్న అర్థంలో వ్యాఖ్యానించారు., **అంశైః అశేషైః శేషాద్యైః అశేషామ్ ధరామ్ ధారయన్ ధరాధరః**. తన విభూతులైన అష్టదిగ్గజములు, ఆదిశేషుడు మొదలగువానిద్వారా సమస్త ధారుణీమండలమును ధరించిన శ్రీహరియే ధరాధరుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి శృతినుండి ఉదాహరించారు – **యే నే మే విధృతే ఉభే, విష్ణునా విధృతే భూమి, దాధర్తమ్ పృథ్వీమభితో మయూఖైః**

శ్రీ చిన్మయానంద 'భూమిని ధరించేవాడు ధరాధరుడు' అనే భావాన్నే మరొక కోణంలో వివరించారు. 'భూమి' అంటే పదార్థము అనుకోవచ్చును. ఈ పదార్థము తన సూక్ష్మ, మరియు స్థూల రూపాలలో కూడా భగవంతునిద్వారానే వ్యక్తమవుతుంది. భౌగోళికంగా చూచినట్లయితే భూమికి నీరు ఆధారము. నీటికి వాతావరణము, వాతావరణానికి అంతరిక్షము ఆధారములు. అంతరిక్షము అనే భావమును మన మనసుద్వారా అర్థం చేసుకోవాలి. మనసుకు అర్థమవ్వడం అంటే చేతనవల్ల కలుగుతుంది. ఇలా సకలజగత్తుకూ నారాయణుడే ఆధారము.

ధర్మచక్రము రచయిత – సూక్ష్మరూపంలో ఉన్న పంచభూతాలు స్థూలరూపంలో దృశ్యమైన జగత్తును ఏర్పరుస్తాయి. పంచభూతాలకు సృష్టికర్త, ఆధారము భగవంతుడే. ఆయన ధరాధరుడు.
'ఓం ధరాధరాయనమః' అనే మంత్రంలో అనేక అంతరార్థాలు నిబిడీకృతమై ఉన్నాయి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ వేంకటేశ్వర వచనములు – శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్య

శ్రీ పురుషోత్తమా! కరిరాజుం గాచితివి. కొలువు లోపల ద్రౌపది మానంబు నిల్పితివి. ప్రహ్లాదుని మాటలాలించితివి. శరణనొచ్చిన విభీషణుని రక్షించితివి. రావణ కుంభకర్ణాదుల వధియించి లంక నేలించితివి. పాతాళంబు బలికి నొసగితివి. ధ్రువునికి ధ్రువంబుగాఁ బట్టంబు గృపచేసితివి. నిన్నెవ్వరెఱింగి నుతింతురు వారికి నీ పదవులిచ్చి రక్షింతువు. శ్రీ వేంకటేశ్వరా!